డా॥ కేతవరపు రాజ్యశ్రీ సాహిత్య విశ్లేషణ

# వంద ప్రశ్నలు

## వేల భావాలు

విశ్లేషణ – ఇంటర్వ్యూ

**నియోగి**

ప్రచురణ - 2015

డా॥ కేతవరపు రాజ్యశ్రీ సాహిత్య విశ్లేషణ

**వంద ప్రశ్నలు - వేల భావాలు**

నియోగి

**ప్రథమ ముద్రణ : డిసెంబర్ 2015**

**ప్రతులు : 500**

**మూల్యం : రూ. 101/-**

**ప్రతులకు :**

**డా॥ కె. రాజ్యశ్రీ**

ప్లాట్ నెం. 301, గోకుల్ అపార్ట్‌మెంట్స్,

స్ట్రీట్ నెం. 4, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

ఫోన్ : 040-2767 0267, సెల్ : 85001 21990

ఇ-మెయిల్ : rketavarapu@gmail.com

డి.టి.పి. :

**శ్రీమతి దేవయాని,**

**టి. రాజేంద్రప్రసాద్**

ముద్రణ :

**అక్షయ గ్రాఫిక్స్**

చిక్కడపల్లి, హైదరాబాద్.

సెల్ : **9989890588**

ఇ-మెయిల్ : akshayatammisetty@gmail.com

# వంద ప్రశ్నలు

# వేల భావాలు

ఒక వ్యక్తిలో అనేకానేక భావ సంచలనాలు కలుగుతుంటాయి. ఆ సంచలనాలకు అక్షరరూపం ఇవ్వగలిగినవాడు కవికాగలడు. నిత్యం సమకాలీన ప్రపంచంలోని అవకతవకలు, విధ్వంసకర దృశ్యాలు అన్నీ అతనిలో సంచల నాలకు కారకాలవుతుంటాయి. కవైనవాడు వాటి నుండి దూరంగా జరిగిపోలేడు. అతడు స్పందిస్తాడు. ఆ స్పందన అక్షరరూపం తీసుకుంటుంది. అది సాహిత్యంగా ప్రవహిస్తుంది. కాలం గడుస్తున్న కొద్దీ అనుభవాలు, అనుభూతులు అన్నీ విస్తరిస్తూ అతని లోపల ప్రపంచం విశాలంగా పరుచుకుంటుంది. ఆ విశాల ప్రపంచపు అనుభవాలు కవిత్వంగా వెలువడినప్పుడే ఆ కవిత్వం ప్రపంచాన్ని ఆలోచింపజేస్తుంది. ఆ లోపలి ప్రపంచం ఎంతగా విస్తరించి కనిపిస్తుందంటే, నిర్దుష్టంగా ఒక అంశానికో లేక ఒక కోణంలోనే ఆలోచించే విధంగా ఉండ దు. అతని ఆలోచనలు అనేక కోణాల్లో సాగుతుంటాయి. అలాంటి కవి నుండి వెలువడిన కవిత్వం వైవిధ్యభరితంగా అలరిస్తూ ఆలోచింపజేస్తుంది. ఇది కవులలోనైనా, కవయిత్రులలోనైనా, రచయితలలోనైనా, రచయిత్రులలోనైనా సహజం. ఇదే సహజత్వం ఆలోచింప జేసే గుణం గల కవిత్వంతో ముందుకు వడివడిగా నడిచిపోతున్న కవయిత్రి, రచయిత్రి శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీగారు

**వయసా! పరుగు తీయకు**

**ఈజీవితం ఆస్వాదించడం**

**ఇంకా మొదలుపెట్టలేదు**
**అమాయకత్వంతో**
**గడిచిపోయింది బాల్యం**
**యవ్వనపు తుళ్లింతలకు కళ్ళెం వేసింది**
**మూడుముళ్ళబంధం**
**ఆ బంధ మాధుర్యాన్ని చవిచూసేలోపు**
**ఒడిలో అమ్మతనం**
**బాధ్యతల బరువులో**
**కాలంతో పరుగులు**
**నానమ్మగా అమ్మమ్మగా**
**అవతారాలు పర్వం**
**నా మీద నాకు హక్కు లేకుండా**
**ఇతరులు శాసించినట్టు**
**గడిచిపోయింది జీవితం**

జీవితంలో ఒక మనిషి అనేక పాత్రలను పోషించవలసి ఉంటుంది. ఇది ఏ మనిషికైనా తప్పనిది. ఇక కాలం వేగంగా కదిలిపోతుంటుంది. నిన్నటితో కలిసిపోతుంటుంది. కొన్ని జ్ఞాపకాలనూ మిగిల్చిపోతుంటుంది. జీవితాన్ని ఆస్వాదించడంలోని తియ్యదనాన్ని తెలుసుకునే లోపునే వెళ్ళిపోతుంటుంది. కాలపు రుతువులే కాదు జీవన రుతువులు మారిపోతుంటాయి. ఒక్కో సందర్భంలో మనం మనలాగా కాకుండా మరెవరిలానో బ్రతకవలసిన పరిస్థితులు ఎదురౌతుంటాయి. కాని కాలం మన చేతుల్లో కాక మరెవరి, చేతుల్లోనే ఉంటుంది. మనకిష్టమైనట్టుగా మనం బ్రతకలేని పరిస్థితులూ ఉంటాయి. ఇవి అప్పుడప్పుడు వేదనకు గురిచేస్తుంటాయి. గతంలోకి తొంగిచూస్తే మధురానుభూతులే కాకుండా విలపించిన దు:ఖ సందర్భాలూ ఉంటాయి. నడిచి వచ్చిన దారిలో ఎన్నో ఎన్నెన్నో జ్ఞాపకాలు. ఆ జ్ఞాపకాలను తవ్వుకుంటూ పోతుంటే అవి అక్షర రూపమెత్తి దర్శనమిస్తుంటాయి రాజ్యశ్రీ గారికి. ఒక విషయాన్ని సంపూర్ణంగా అనుభవిస్తూ ఆస్వాదిస్తూ గడుపుదామనుకునేలోపునే ఆ విషయపు అనుభవకాలం గడిచిపోతుందనే

భావం పై కవితలో కనిపిస్తుంది. తను తనుగా జీవితాన్ని ఆస్వాదించలేనితనమొకటి ఆమెను వెంటాడుతూ వస్తుందనే వేదన ఒకటి ఆమెలో మనకు కనిపిస్తుంది. ఇది ఒక స్త్రీగా, స్త్రీల పట్ల చూపుతున్న సానుభూతి. దీన్ని వ్యక్తం చేయడంలో రాజ్యశ్రీ గారు ఒక పరిపక్వతను సాధించారు.

**'తమకేదికావాలో**
**స్పష్టమైన అవగాహనతో**
**నచ్చిన రీతిలో**
**జీవితం గడుపుతున్న నేటితరాన్ని చూస్తే**
**అబ్బురమనిపిస్తుంది**
**నేనేమిటో**
**వ్యక్తిత్వమంటే ఏమిటో తెలియకుండానే**
**కాలప్రవాహంలో కొట్టుకుపోయా'**

కాలం గడిచిన కొద్దీ మార్పులు సహజం. నిన్న గట్టిగా నమ్మినవి నేడు మూఢంగా కనిపిస్తాయి. ఒకనాడు స్త్రీలకు విద్య దాదాపు నిషేధంగా కనిపించింది. నేడు అది తప్పనిసరి అయినది. ఒకనాడు స్త్రీలు ఇంటికే పరిమితమైతే నేడు అన్ని రంగాలలో స్త్రీలు దూసుకుపోతున్నారు. ఇది కంప్యూటర్ యుగం. ఈ యుగంలో ఎవరు ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చు. ఒక నిర్దుష్ట ప్రణాళికతో నేటి యువత ముందుకు అడుగులు వేస్తుంటే యాభై, అరవై వయసుల వారికి ఎంతో అబ్బురంగా ఉండటం సహజం. ఈ మార్పులను గమనిస్తే మనం అంతా నిర్దుష్టంగా ఒక ప్రణాళికాబద్ధంగా జీవితాన్ని అనుభవించలేదేమో, అనిపించడమూ సహజమే. అయితే నలభై, యాభై సంవత్సరాల క్రితం ఒక స్త్రీ ఉద్యోగస్తురాలైతే ఎంతో అబ్బురంగా చూసేవారు. వారు ఎంతో గొప్పవారని చెప్పుకునేవారు. అటువంటివారికి నేటిని చూస్తే అబ్బురమనిపిస్తుంది. ఇదంతా జరుగుతున్న కాలంలో వస్తున్న మార్పులను సూచిస్తుంది. నాడైనా,నేడైనా, ఏనాడైనా,ఎవరైనా కాలప్రవాహంలో కొట్టుకుపోవాల్సిందే. అయితే తమకాలంలో తాము ఏం చేశారన్నది ముఖ్యం. అలా ఆలోచించినప్పుడు రాజ్యశ్రీ తన కాలంలో తాను కవిత్వమై ప్రవహిస్తూ, బాధ్యతల్ని మోస్తూ తనదైన రీతిలో, తనదైన ఒక వినూత్న శైలిలో ముందుకు సాగిపోతున్నారు. ఆమె జీవితపు

మధురిమల్ని ప్రోది చేసుకుంటూ సాహిత్యాన్ని తనలోకి వంపుకుంటూ, హృదయభాషను విస్తరించుకుంటూ ఒక సందేశాన్ని కూడా మనకిస్తారు.

**“బెటర్ లేట్ దాన్ నెవర్’**
**ఇప్పటికైనా మించిపోయింది లేదు**
**నీకిష్టమైన రీతిలో అర్థవంతంగా**
**జీవించడం మొదలుపెట్టు”** అని అంటారు. గతాన్ని తలచి వగచే కన్నా ఇప్పటి క్షణాల్ని సంపూర్ణంగా అనుభవించాలి. కవిత్వం అంతిమంగా ఆనందాన్ని అందించాలి. ఒక చక్కటి కవిత రాసినప్పుడు పొందే ఆనందం అంతులేనిది. ఆ అంతులేని ఆనందాన్ని ఆమె తన కవిత్వంలో పొందుతుంది. మనం కూడా పొందేట్లు ఆమె చేయగలుగుతుంది. తన అంతరాత్మ ఏదైతే ప్రభోదిస్తుందో దాని ప్రకారం నడుచుకుంటుందామె. అందుకే ఇలా అంటుంది.

**“అంతరాత్మ రొద పెడుతుంది**
**దాని మాట కూడా వినాలి కదా మరి**
**అందుకే!**
**అర్థిస్తున్నా!**
**వయసా! పరుగుదీయకు**
**ఈ జీవితాన్ని ఆస్వాదించడం**
**మొదలుపెట్టాలని ఉంది”** అని అంటారు రాజ్యశ్రీ. తన జీవితం తాను ఎంతగానో ప్రేమిస్తే తప్ప ఇతరులను ప్రేమించలేం. ముందు మనని మనం ప్రేమించుకోగలిగితేనే ఇతరులకు ప్రేమను పంచగలం. ఇక్కడ మనకు రాజ్యశ్రీ లోని ఒక గొప్ప గుణం గోచరిస్తుంది. ఆమెను ఆమె అమితంగా ప్రేమించగలరు. అలాగే మనుషుల్ని ప్రేమించగలరు. కవయిత్రి గాబట్టి దానికి అక్షరరూపం ఇవ్వగలరు. అటువంటి కవిత్వ భాషొకటి ఆమెకు అబ్బింది. ఒక కవితను ఎక్కడ ప్రారంభించాలో ఎక్కడ ముగింపునివ్వాలో ఆమెకు బాగా తెలుసు. ఏ కవితనైనా ఒక నిర్దుష్ట ప్రణాళికతో రాసినట్లుగా ఉంటుంది. ఆమె హృదయం లోని భావపరంపరలు కవిత్వమై అబ్బురపరుస్తాయి. దీని వెనుక అవిరళ కృషి, అధ్యయనం, లోకానుభవాలు, జీవితానుభవాలు అన్నీ కలిసి కవిత్వమై ప్రవహిస్తాయి.

“అలతి అలతి తునియల కాహల సంధించిన లలిత పద హృద్య
పద్యాలలో కవిత్వం ఉండాలన్నారు, ప్రాచీన మహాకవి తిక్కన.

వడలు, పలుకుబడులు, నుడికారాలతో కవిలో “కారయిత్రి” ఉంటేనే అది కవితగా నిలుస్తుంది అన్నారు, ఆధునిక మహాకవి డా॥ నండూరి రామకృష్ణాచార్య.

తిక్కన అన్నట్లుగా అలతి అలతి పదాలలో అందమైన భావాలను పొదగడం కొందరికే సాధ్యం.

వడలు, పలుకుబడులు, నుడికారాలతో ‘కారయిత్రి’ ప్రతిభ కొందరికే ఉంటుంది. అది గద్యమైనా హృద్యంగా రాసే శిల్పాన్ని సొంతం చేసుకున్న కవయిత్రి కేతవరపు రాజ్యశ్రీ” అని అంటారు భారత భాషా భూషణ్, కవి తిలక డా॥తిరునగరి. ఇది అక్షరాల నిజమైన మాట.

చాలాకాలం తరువాత/ఊరుని పలుకరిద్దామని వచ్చా/కనుచూపుమేర ఎక్కడా పొలాలు/కానరాలేదు/పొలాలన్నీ/ఇళ్ళ స్థలాలుగా మారాయి/ రాంబాబు గాడి పచ్చని పొలాల్లో/నల్లని పొగబారిన మెకానిక్ షెడ్డులు/అవతారమెత్తాయి/ మా పంట పొలాల కోసం/ ఆతృతగా చూశా/ ఆత్మీయంగా పలుకరిద్దామని/ ఎండిన ‘బోరు’వైపు/బీటలు వారిన నేల వైపు చూసి/ భోరు భోరున విలపిస్తూ/కన్నీటికి మానవరూపంగా రైతన్న, అని ఎంతో ఆవేదనగా పలుకుతారు రాజ్యశ్రీ. రైతన్నల పక్షం వహించి ఆ రైతు బాధను గుండెకెత్తుకొని వాస్తవ చిత్రాన్ని చూపిస్తారామె. ఇది కవుల కనీస బాధ్యత. నేటి పరిస్థితులను నిత్యం చూస్తూ మనకెందుకులే అని తొలగిపోవడం కవులకు సరి అయినది కాదు కదా! రాజ్యశ్రీగారు ఎన్నటికీ అటువంటి కవయిత్రి కాదని, కవయిత్రిగా సామాజిక బాధ్యతల నుండి ఆమె తప్పుకు పోయే కవయిత్రి కాదని మనకు ఆమె కవితలు చదివినప్పుడు తెలుస్తుంది.

**‘తూరుపు పురుడు పోసుకొని**
**ఎర్రని సూర్యుడు**
**ఉదయించాడు**
**చీకటిని ఊడ్చి**

**లే కిరణాలతో**

**ముగ్గులు వేశాడు'** అంటూ ఒక అద్భుత దృశ్యాన్ని మన కళ్ళ ముందు ఆవిష్కరిస్తారు రాజ్యశ్రీ. ఆమె భావ విస్తృతి ఇటువంటి కవితా పాదాల్లో విస్తృతంగా ప్రస్ఫుటమవడం గమనించగలం. ఇది ఒక పరిణితి చెందిన కవయిత్రిగా మనముందు రాజ్యశ్రీ నిలబడతారు.

సాయంసంధ్యలో/పరిమళము మోసుకొచ్చాడు/మలయపవనుడు/ఆకస మున పొడసూపిన/వెలుగుచుక్కలు/చుక్కల నడుమ/చక్కనైన వెన్నెల రేడు/ కలువ కొలనులో/ కనువిందు చేసెడి/వెన్నెల వెలుగులు/ ఎంత చక్కనిదోయి/ ఈ ప్రకృతి

ఎంతో చక్కటి భావాన్ని పలికించి ప్రకృతి సౌందర్యాన్ని మన కళ్ళ ముందు ఆవిష్కరిస్తారు రాజ్యశ్రీ. ప్రకృతిలో లీనమయ్యే మధురభావ కవుల కవిత్వ సౌందర్యాన్ని వొడిసి పట్టుకున్నారామె.

**"సాహిత్యమంటే**
**అక్షరసముదాయం కాదు**
**మనిషి మస్తిష్కంలో**
**చొచ్చుకుపోయి**
**మమతానురాగాలు**
**పలికిస్తుంది**
**రాలిన స్వప్నాలకు**
**కొత్త చిగుళ్లు తొడిగిస్తుంది"**

సాహిత్యం యొక్క ప్రయోజనమేమిటో ఎరిగినవారు, దాని విలువ తెలిసిన వారు రాజ్యశ్రీగారు. ఆమె అంతరాంతరాళాల్లో దాగి ఉన్న భావాల్ని వెల్లడించే క్రమంలో చాలా లోతైన, చిక్కనైన, సౌందర్యవంతమైన పద సముదాయాన్ని ఉపయోగిస్తారు. ఆ నేర్పు ఆమె కవితల్లో మనకు అడుగడుగునా కనిపిస్తుంది. కవిత్వమంటే కేవలం అక్షరసముదాయం కాదు అంటారు. మస్తిష్కం లోకి కవిత్వం ప్రవేశించి మమతానురాగాలను పలికిస్తుందంటారామె. ఒక నిశ్చలమైన స్థితికి ఆమె చేరుకుంటారు.

మనల్ని కూడా ఆమె కవిత్వంతో నడిపించుకుపోతారు. కవిత్వం ఎప్పుడైతే ఆమె మనసులోకి ప్రవేశిస్తుందో అప్పుడు ఆమెలోని మమతలు, అనురాగాలు అన్ని పెల్లుబికి వస్తాయి. సమస్త మానవుల్ని ప్రేమించే తత్వమది. కవిత్వంతో కలిసి జీవించే వారికి ఇది సహజంగా అబ్బే గుణం.

కవిత్వం రాజ్యశ్రీలో కొత్త ఉత్సాహాలను నింపుతుంది. "కవిత్వం" రాలిన స్వప్నాలకు కొత్త చిగుళ్ళు తొడిగిస్తుందని అంటారు. ఇది ఒక అద్భుత భావన. ఆకులు రాలిన కాలం గడిచిపోయాక వసంతం వస్తుంది. వసంతంలో కొత్త చిగుళ్ళతో ప్రకృతి ఆకుపచ్చదనంతో శోభాయమానంగా, సుందరంగా కొత్త పెళ్లికూతురిలా తయారవుతుంది. అలాంటిదే రాలిన స్వప్నాలకు కొత్త చిగుళ్లు తొడుక్కోవడం. కవిత్వం కొత్త చిగుళ్ళు తొడుక్కోవడమంటే, అక్షరాలకు ఇంత అందాలు అద్ది ఆవిష్కరించే నేర్పును మనం ఈ కవయిత్రిలో అడుగడుగునా గమనించగలం.

ఆమెకు కవిత్వ భాష తెలుసు. పచ్చదనాలతో పరవశించే ప్రకృతికాంత అంత అందంగా కవిత్వాన్ని చెప్పడం అందరివల్లా సాధ్యపడదు. ప్రకృతిలో పరవశించి, ఆ పరవశాన్ని అక్షరాలుగా మార్చి అందించినప్పుడు రాజ్యశ్రీ కవిత్వంలా కవిత్వముంటుంది. నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే ఆడపిల్లలం టాడు దేవరకొండ బాలగంగాధర తిలక్ అమృతం కురిసిన రాత్రిలో. ఈ భావం కవిత్వంలోకి మనల్ని నడిపించుకుపోవడమే కాక ఒక మధురానుభూతికి లోనవుతాం. అలాంటి భావాలెన్నో మనకు రాజ్యశ్రీ కవిత్వంలో కనిపిస్తాయి.

ఇక ఎవరికైనా బాల్యపు మధురానుభూతులు జీవితమంతా వెంట నడుస్తూనే ఉంటాయి. అలాంటి అనుభూతుల్లో అమ్మ ఒక మధురానుభూతి. దాన్ని మరిచిపోతే కవి కాలేడు కదా కనీసం మంచి మనిషి కూడా కాలేడు. దాదాపుగా అందరు కవులూ ఏదో ఒక సందర్భంలో అమ్మ గురించి రాసే ఉంటారు. అమ్మను తలచుకోవడమంటే బాల్యానికి చేరుకోవడమే. అమ్మంటేనే ఒక అనిర్వ చనీయ ప్రేమభావం. అలాంటి అమ్మ గురించి చెపుతూ రాజ్యశ్రీ ఇలా అంటారు.

**"మా అమ్మ తినిపించిన**
**గోరుముద్దలు**
**నాకిప్పటికీ తీయని జ్ఞాపకాలు**
**ప్రేమతో ఆమె తినిపించిన**
**ఒక్కొక్క ముద్ద**
**జీవితంలో నేనెక్కిన మెట్లకు**
**పునాదిరాళ్ళు"**

కొన్ని అనుబంధాలకు మాటలు చాలవు. ఇక అమ్మతోటి అనుబంధానికి ఎంత చెప్పినా ఇంకా మిగిలే ఉంటుంది. ఆ అనుభవం ఎప్పటికీ తీయని జ్ఞాపకమే కదా! అందరి జీవితాలలో అమ్మ తినిపించిన గోరుముద్దల జ్ఞాపకం జీవితమంతా నిలిచే ఉంటుంది. అయితే దాన్ని వ్యక్తం చేయడానికి భాష తెలిసుండాలి. ఆ భాష తెలిసిన కవయిత్రి కాబట్టి గొప్పగా వ్యక్తం చేశారు. పై వాక్యాలలో అమ్మ గురించి అమ్మ తినిపించిన ఒక్కో ముద్ద జీవితంలో నేనెక్కిన మెట్లకు పునాది రాళ్ళంటారు.

ఎంత ఎత్తు ఎదిగినా అమ్మ ముందు పసిపాపలమే. అది ఏ కల్మషాలు అంటనిది. మనం ఎత్తు ఎదిగి అమ్మని మరిచిపోతే మనిషితనమనిపించుకోదు. నడిచి వచ్చిన దారంతా అమ్మ తినిపించిన గోరుముద్దల వల్లేనని, ఎక్కిన ప్రతి మెట్టు అమ్మ తినిపించిన గోరుముద్దల వల్లేనని తెలపటమంటే అమ్మ పట్ల గొప్ప ప్రేమని వ్యక్తం చేయడమే, అదే చేశారు రాజ్యశ్రీ. అంతేకాకుండా

**"విజ్ఞానశాస్త్రం అవపోసన పట్టిన అమ్మకు**
**ఏ డిగ్రీలు, డాక్టరేట్‌లు**
**కొలమానం కాలేవు**
**నా స్మృతిపథంలో నిత్యనూతనమైన**
**ఆమె బుజ్జగింపు మాటలు**
**రింగుమంటూనే ఉన్నాయి"**

అమ్మకు పిల్లలను ఎలా పెంచాలో, పిల్ల ఎందుకు ఏడుస్తుందో తెలుస్తుంది. ఒక పసిపాప ఏడుపు వెనుక ఏముందో అమ్మకు తెలుసు. అది ఒక విజ్ఞానశాస్త్రం. దానికి డిగ్రీలతో పనిలేదు. చదువురాకున్నా అమ్మకు బిడ్డల విషయం తెలుసు. ఇది భారతీయ తల్లులకు తెలుసు. దాన్నే తెలుపుతారు రాజ్యశ్రీ. మానవీయత పట్ల, మానవ సంబంధాల పట్ల అమితమైన ప్రేమ మనకు రాజ్యశ్రీలో కనిపిస్తుంది. అయితే లోకమంతా అలా ప్రేమమయంగా ఉందా? అంటే కాలంతో పాటు మానవ సంబంధాల్లో ఎంతో వాంఛనీయం కాని మార్పులు చోటు చేసుకోవడం బాధాకరం. మానవ సంబంధాలన్నీ ఆర్థికసంబంధాలుగా మారిపోవడం శోచనీయం. అయితే స్వచ్ఛమైన మనసు కలిగిన వారికి ఇది వేదనకు గురిచేసే అంశం. అలాంటి వేదననే చెందుతారు రాజ్యశ్రీ.

**"పూరేకు లాంటి<br>
మనసు మీద<br>
ఒక్కొక్క చితుకు పేర్చి<br>
కొద్ది కొద్దిగా<br>
మంట రగిల్చి<br>
సంసారమనే<br>
రంగుపూలద్దిన<br>
కపటనాటకం<br>
పరువు ప్రతిష్టల<br>
పాకులాటలో<br>
మౌనంగా<br>
కాలిపోతూ<br>
ఆశచావక<br>
ఎదురుచూస్తున్నది<br>
చినుకంత ప్రేమ చూపిస్తే<br>
మళ్లీ చిగురిద్దామని"**

స్త్రీ హృదయం సున్నితంగా ఉంటుంది. అందునా రచయిత్రులైన స్త్రీల హృదయం మరీ సున్నితం. అందుకు రాజ్యశ్రీ మినహాయింపు కాదు. ఎన్నో ఆశలతో సంసార జీవితంలోకి అడుగుపెడుతుంది. ఎన్నో కలలు కంటుంది. అయితే జీవితం ఊహించినదానికి భిన్నంగా ఉంటుంది. అయినా రాజీపడి జీవితాన్ని కొనసాగిస్తుంటుంది. ఇది భారతీయ సమాజంలో సహజమైనది. అనుకున్న విధంగా జీవితం ఉన్నా లేకున్నా జీవితం కొనసాగిస్తూ పోతూనే ఉంటుంది. స్త్రీ స్వేచ్ఛను కోల్పోయి ఎవరి అదుపాజ్ఞలలోనో జీవితం గడిచిపోతుండటం స్త్రీని బాధించే విషయం. ఎదురుతిరగలేదు. పరువు ప్రతిష్టల పాకులాటలో కాలిపోతూ సంసారం సాగిస్తుంది. అయినా ఏదో ఒక చిన్న ఆశ. ఆ ఆశే, ఆమెను నడిపిస్తుంది. అదే చెపుతారు రాజ్యశ్రీ భారతీయ స్త్రీల పక్షాన నిలబడి. ఇది స్త్రీ వాద రచయిత్రులకు తీసిపోని విధంగా వెల్లడిస్తారు.

చలం స్త్రీలు వంటింటికే పరిమితమై, తమ మనస్సులోని భావాలను అణిచిపెట్టుకొని జీవితాన్ని నిస్సారంగా గడిపేస్తుంటారనేది తన రచనల్లో చూపి స్తాడు. ఎప్పుడో స్త్రీ వాదమనే భావనే లేని రోజుల్లో తమ అస్తిత్వాన్ని కాపాడు కోవడానికి ఎంతకైనా తెగించమంటాడు. అయితే ఇక్కడ చలం భావాల్ని ఆమె వ్యక్తం చేయకపోయినా స్త్రీ పడే బాధల్ని చూపించడంలో రాజ్యశ్రీ పూర్తి సఫలతే చెందారు. ఇది ఆకాశంలో సగభాగమైన స్త్రీల పక్షాన నిలబడి వినిపించిన స్వరం. స్త్రీలు రేపు బాగుంటుందని ఒక చిన్న ఆశతో జీవిస్తారు. ఆ ఆశని పై కవితలో ఆమె చూపిస్తారు.

జీవితానుభవాలు కవిత్వమై ప్రవహిస్తాయి. కవులలో ఉన్న ప్రతిభకు పదునుపెడతాయి పుస్తకాలు. కొత్త విషయాలను తెలియజేస్తాయి. నిరంతర, అధ్యయనం వల్ల సాహిత్యం పరిపక్వమవుతుంది. అలాంటి అధ్యయనం మనం రాజ్యశ్రీలో గమనించగలం. ఆ అధ్యయనం వల్ల కలిగిన అనుభవంతో ఒక చోట ఇలా అంటారు.

**"పుస్తకానికి**
**జీవితానికి**
**అవినాభావ**
**సంబంధం**

**అక్షరాలతో**

**జీవితలక్ష్యాలకు**

**గవాక్షాలు తెరుస్తుంది పుస్తకం"**

అని జీవితం ఉన్నతంగా, ఆదర్శవంతంగా సాగిపోవాలంటే అధ్యయనమూ అవసరమే. అందుకే పుస్తకాన్ని ఒక స్నేహితునిగా భావించి నడుస్తుందీ కవయిత్రి. అంతేకాకుండా ఈ కవయిత్రిలో తాత్వికతా పాళ్ళు కూడా ఎక్కువే. ఈమె రాసిన అనేక కవితల్లో తాత్వికత మనకు గోచరిస్తుంది.

అందుకే 'పుస్తకసారం' కవిత ముగింపులో

**"ఆఖరి పేజీలాంటి**

**ఆఖరి మజిలీని**

**ఆ పరాత్పరుడికి అర్పణ కావిస్తూ**

**అర్థవంతంగా జీవించాలి**

**ఇదే పుస్తకసారం"** అని ముగిస్తుంది. సంస్కృతి, సాంప్రదాయాల పట్ల ఈమెకు మక్కువ ఎక్కువ. యోగిపుంగవులు అనాదిగా బోధిస్తూ వస్తున్న ఆధ్యాత్మిక భావాలు కూడా ఈమెలో ఎక్కువే. అయితే ఈ కవయిత్రిలోని భావజాలాల్ని నేను ఏకీభవిస్తానని భావించనవసరం లేదు. మీరు ఏకీభవించమని బోధించడమూ లేదు. అయితే కవిత్వపరంగా రాజ్యశ్రీ ఏమిటో వ్యక్తం చేయడం ఈ నూతన ప్రక్రియలో నా బాధ్యతగా భావిస్తాను. కవులు అనేకానేక భావజాలాల్తో తమ సాహిత్య సృజనను గావిస్తారు. అందరూ వాటిని అంగీకరిస్తారని అనుకో వడం పొరపాటుగానే భావించాలి. ఒక విమర్శకుడిగా కవి యొక్క కవిత్వాన్ని అంచనా వేయాల్సి ఉంటుంది. వారి భావాలకు దగ్గరగా ఉన్నవారు వారితో ఏకీభవిస్తారు. ఎవరైనా ఏకీభవించనివారు వారిని తృణీకరించాల్సిన అవసరం లేదు. అనేకానేక భావజాలాల్ని సాహిత్యంలో అనాదిగా చూస్తూ వస్తున్నాం. అది మనకు ఇష్టమైన భావజాలం కాకున్నా కవి ఏమి చెప్పాడో తెలియజేయడం తప్పుకాదు.

అయితే కవి మనకిష్టం లేని భావాల్ని కూడా ఎంతో అందంగా చెప్ప వచ్చు. అటువంటి భావజాలాల్ని ఎంతో అందంగా చెప్పాడు ఆ కవి అని విమర్శకుడంటే,

విమర్శకుడు ఆ భావజాలానికి చెందినవాడని అర్థం చేసుకోకూ డదు. ఇక్కడ నేను కవయిత్రి, రచయిత్రి అయిన రాజ్యశ్రీ సాహిత్యాన్ని ఏ భావజాలంతో ఏ కవిత చెప్పారో దాని యొక్క అర్థమేమిటో, కవయిత్రిగా తన కవిత్వం ఎంత ఉన్నతంగా చెపుతున్నారో తెలియజేయడమే నా కర్తవ్యం. దాన్ని ఈ ప్రక్రియలో ఆవిష్కరించడానికి ప్రయత్నిస్తాను.

రాజ్యశ్రీలో సామాజిక బాధ్యత కలిగిన కవయిత్రిని గమనించగలం. జనం ఆశలు ఎలా ఉంటాయో, వాస్తవాలు ఎలా నేర్పుతాయో తెలిసిన కవయిత్రి రాజ్యశ్రీ. చిన్న విషయాన్నే తెలిపినా అది వాస్తవానికి అద్దం పడుతుంది.

లక్షకే కారని/టాటా వూరిస్తే/జనమంతా/ఎగబడ్డారు/బిలబిల/లాటరీలో/మొదట/తమకే/రావాలని/ఎదురుచూపుల/తహతహ/కారైతే చౌకగా/వచ్చింది కానీ/ పెట్రోధరల/మంటలు చూసి/గిలగిల/ గుంతలమయమైన/మహానగర/రహ దారుల్లో/ఏకీలుకాకీలు/ఊడోస్తుందేమోనని/విలవిల.

ఇది అత్యంత వాస్తవికతతో కూడిన విషయం. నగరంలో నివసించే వారికి అనుభవమైన విషయం. పాఠకుడు ఆమె చెప్పినది ఎంత వాస్తవమో ఇట్టే గ్రహించగలడు. మార్మికంగా చెప్పి అదేమిటో అర్థం కాక పాఠకుడు గందరగోళంలో పడే పరిస్థితి మచ్చుకైనా ఆమె కవిత్వంలో ఉండదు.

సమాజపు పోకడలపై ఆమెకు పూర్తి అవగాహన ఉంది. మనం సమా జపరంగా కొన్ని కట్టుబాట్లను ఏర్పరుచుకొని సంఘజీవనం సాగిస్తున్నాము. అనాచారాలను ఖండిస్తాం. హక్కులు, బాధ్యతలు ప్రతి పౌరుడికి కల్పించే విధంగా చట్టాలను రూపొందించుకొని సాగిస్తున్న జీవనం మనది. అయితే చేసుకున్న చట్టాల ప్రకారం నడుస్తున్నదా దేశం అంటే లేదనే సమాధానమొస్తుంది. ఈ దేశంలో బాల కార్మికులు ఉండకూడదనీ ఒక చట్టాన్ని చేసుకున్నాం. మరి దాని అమలు తీరు ఎలా ఉందో రాజ్యశ్రీ ఒక కవితలో చెపుతారు.

**"చట్టాలెన్నున్నా**
**అవి అయిన వాళ్ళకి చుట్టాలే!**
**వెట్టిచాకిరీ చట్టం ఉంది**
**కానీ బంగ్లాలో చాకిరీ నుండి విముక్తి లేదు**

**కడుపునిండా అన్నం తిన్నది లేదు**
**వంటి నిండా బట్టకట్టినది తెలీదు**
**దొరలకు ఎక్కసమై పారేసిన**
**బిర్యానీ పొట్లాల కోసం**
**కుమ్ములాడుకుంటూ**
**కుక్కలతో పోటీపడుతున్న**
**అనాథలం మేము-బాలకార్మికులం మేము"**

అని వేదనగా పలుకుతారు రాజ్యశ్రీ. రోజూ మనం చూస్తున్న దృశ్యాలను వింటున్న విషయాలను మనకు కవిత్వంలో చూపిస్తారామె. ఈ కవితనే కొన సాగిస్తూ పగలంతా చిత్తు కాగితాల వేట/రాత్రికి చెత్తకుండీల మాటున/బిక్కు బిక్కుమంటూ/వీధి కుక్కల పక్కన/ఒకింత చోటు చేసుకొని/గోనెసంచిలో కాళ్లు ముడుచుకొని/కునుకుతీసే/అనాథలం మేము-బాలకార్మికులం మేము అంటారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఆరున్నర దశాబ్దాలు దాటినా దేశంలోని దారిద్ర్యం అలానే ఎందుకుందో పాలకులు ఏనాడూ ఆలోచించిన పాపాన పోలేదు. అనేక రుగ్మతలతో దేశం విలపిస్తుంటే ఒకవర్గం విలాసాలలో మునిగి తేలుతుంది. ఈ దేశం అధోగతిపాలు కావడానికి పాలకులే కదా కారణం. ఉన్నవాడు ఇంకా ఇంకా దోచుకుని కుబేరులవుతుంటే లేనివాడు మరింత బికారిగా మారిపోవడం ఈ దేశంలో జరుగుతున్నది. ఇది ఒక పార్టీవారు చేస్తు న్నది కాదు. అన్ని పార్టీలు దీనికి బాధ్యత వహించవలసినదే.

మనం ఎటు పయనిస్తున్నామో, ఏ తీరంవైపునకు చేరతామో తెలియని పరిస్థితి నెలకొని ఉన్నది. దారెంట నడుచుకుంటూ వెళుతున్నప్పుడు అనేకానేక దృశ్యాలు మనకు ఎదురుపడుతుంటాయి. మనం చూసీచూడనట్లు వెళ్లిపోతుం టాము. అయితే నిత్యం మనకు తారసపడుతుంటారు. చెత్తకుప్పల దగ్గర కాగి తాలనేరుకుంటూ ఒక గోనెసంచితో పిల్లలు తారసపడతారు. ఈ దేశపు ప్రగతికి అది ఒక నిదర్శనం. అలాంటి దృశ్యాలను చూసినప్పుడు రాజ్యశ్రీ లాంటి కవ యిత్రి వేదనగా అక్షరరూపంలో వారి బాధను మనకు చూపిస్తారు. అదే మనం పై కవితలో గమనించగలం.

**"అమ్మ ఎవరో తెలియదు**
**అయ్య ఎవరో తెలియదు**
**తెలిసిందల్లా**
**పేగులు మెలేసే ఆకలి ఒకటే**
**పొట్టనిండటం కోసం**
**వీపునమూటలు మోస్తే"**

ఇలా సాగుతుందీ కవిత. అట్టడుగు వర్గాల పట్ల ఆమెకు ఒక సానుభూతి ఉంది. అందుకే అక్కడక్కడ వారి ఆకలికేకలు ఆమె కవిత్వంలో మనకు తారసపడతాయి. ఏమిటీ దేశం, ఏమిటీ బ్రతుకులు అని ఆలోచింపజేస్తాయి.

మరో కవితలో మనకు భారతదేశం ఎలా ఉందో కనిపిస్తూ ఉంది.

ఆరుపదులు దాటిన/స్వతంత్ర్య భారతం/ఎ.కె.47అండతో జెండా ఎగురుతుంది/ ప్రజాస్వామ్యం/బంధువులతో నిండి/రాచరికాన్ని తలపిస్తోంది అని ఒక బలమైన స్వరాన్ని వినిపిస్తారు. స్వాతంత్ర్యం వచ్చిందా! వస్తే ఎక్కడుంది అని మనం ప్రశ్నించుకోవాల్సిన రీతిలో రాజ్యశ్రీ వ్యక్తం చేసినది అక్షరసత్యమే కదా! ఆమె రాసిన ఈ కవిత ఈ దేశపు పరిస్థితికి అద్దం పట్టింది. ఈ కవితను ఇక్కడ పూర్తిగా ఇవ్వడం సముచితమనుకుంటాను. ఎందుకంటే పాఠకులు రాజ్యశ్రీ కవిత్వంపై ఒక అంచనాకు రావడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని నేను భావిస్తున్నాను.

వ్యవసాయం వెన్నుముక/ అయిన దేశం/రైతుల ఆత్మహత్యల/నిల యంగా మారింది/ ప్రాంతీయ, భాషా, వర్గ/పోరాటాలతో/జాతి నిర్వీర్యమవు తోంది/ఎవరు గెలిచినా/ ఒరిగేదేముందని/ఓటువేయడానికి నిర్వేదం/ద్రవ్యోల్బణం పెరిగిందని/కరువుభత్యం/ పెరుగుతూపోతోంది/సంచులతో డబ్బుపట్టుకెళితే/దోసి లితో సరుకు వస్తోంది/ విదేశీ జబ్బులు దిగుమతయి/జనం మృత్యువాతపడు తున్నారు/జాతీయ, అంతర్జాతీయ/ముష్కరుల దాడికి/అమాయకులు బలవుతు న్నారు/అరవై ఏళ్ళలో/అరవై కోట్ల జనాభాను పెంచుకున్నాం/ ఉప్పు సత్యాగ్రహం చేసిన/ గాంధీని మరిచిపోతున్నాం/'కంది' వందకు అమ్ముతున్నా/ 'గాడ్'సేల కొమ్ము కాస్తున్నాం/ఎక్కడుంది లోపం?/ఏమిటి మన కర్తవ్యం?/రండి!ఒక్కటై కదలండి అంటూ పిలుపునిస్తారు రాజ్యశ్రీ. ఇదే కవితను కొనసాగిస్తూ...

ఓటు బలంతో/రాజకీయ ప్రక్షాళన కావిద్దాం/వర్గవైషమ్యరహిత/సమాజా నికి నడుం కడదాం/నల్లబజారును/నడిరోడ్డులో ఎండగడదాం/వేతనపెంపుకాదు/ధరల నియంత్రణకు/పాటుపడదాం/తులసి మొక్క వైద్యంతో/'స్వైను'ను తరిమి కొడదాం/కిరాతక 'కసబ్'లను రూపుమాపుదాం/మనజనమే మనబలముగా/జాతిపిత నేర్పిన/ అహింసావాదాలతో/ప్రపంచశాంతి/సారథులమవుదాం. ఈదేశంలో ఎన్ని రుగ్మతలు ఉన్నాయో ఈ కవిత ద్వారా గ్రహించవచ్చు. అయితే అన్ని రుగ్మతలపై పోరాటం చేద్దామని పిలుపునిస్తారు రాజ్యశ్రీ. ఇది అవసరమైన చర్య. రైతుల ఆత్మహత్యలు మొదలుకొని అనేకానేక విషయాలను ఈ కవితలో చర్చించారు. ఈ దేశంలో జరిగిన జరుగుతున్న అనేకానేక విషయాలను ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ వాటిపై స్పందిస్తూ అక్షరాయుధాల్ని ఎక్కుపెట్టి కదులుతారు రాజ్యశ్రీ. ఆమెలో ఉన్న చైతన్యం ఆమె కవిత్వంలో కనిపిస్తుంది.

రాజకీయాల పట్ల ఆమెకు అవగాహన ఉంది. సమకాలీన కవులు రాజకీయాలపై స్పందించి సాహిత్య సృజన చేయడం సహజమైనదే. మనచుట్టూ జరుగుతున్న సంఘటనలపైనా స్పందించడం చూస్తున్నదే. అలాంటి స్పందన రాజ్యశ్రీగారిలోనూ మనచూస్తాం.

**'మళ్ళీమొదలయింది**
**ఎన్నికల హడావిడి**
**నాయకులకు సరిగా**
**నటించడం రాదేమోనని**
**నటులంతా నాయకులవడానికి**
**క్యూ కట్టారు'**

అంటూ ఒక వ్యంగ్యకోణాన్ని ఆవిష్కరిస్తారామె. అలాగే

**'ఏ పార్టీని గెలిపించినా ఏమున్నది ఘనత**
**పదవి వచ్చాక నేతలందరిదీ ఒకే బాట**
**సగటు ఓటరు ఎదురుచూస్తున్నాడు**
**ఆశగా**

**వర్గవైషమ్యాలు లేని సమాజం కోసం**
**రక్తపాతం లేని ఎన్నికల కోసం**
**భరతజాతి పురోగతే నా ఏజెండా**
**అనే నాయకుడి కోసం'**

అంటారు. రాజకీయాలు ఎంత కలుషితమైపోయాయో మనకు తెలిసిందే. పార్టీల నాయకులు ఎజెండాలన్నీ ఒక్కటే. పార్టీలను రాజకీయనాయకులను చూసి ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి నేడు ఉన్నది. ఏ పార్టీని గెలిపించినా ప్రజలకు ఉపయోగమేమీ లేదనే గ్రహింపునకు ప్రజలు ఎప్పుడో చేరుకున్నారు. ఆ కోణంలో తన కవితను నడిపారు రాజ్యశ్రీ. ఇది కవుల కనీస బాధ్యత. ఆ బాధ్యత నుండి ఆమె ఎప్పుడు తప్పుకు పోలేదు. ఈమెలో ఒక ఆశావహ దృక్పథం కూడా మెండుగానే ఉంది. అది ఆమె కవిత్వంలో మనకు అక్కడక్కడా గోచరిస్తూనే ఉంటుంది. అలాంటి ఆశావహ దృక్పథం కూడా అవసరమైనదే. దాన్నే కవితాత్మకంగా తెలియజేస్తుంది రాజ్యశ్రీ.

కార్యేషుదాసి నుంచి/శయనేషురంభ వరకు/ అన్ని పాత్రలు నీవే అంటూ స్త్రీ పక్షపాతిగా, ఒక స్త్రీగా స్త్రీల బాధల్ని చూస్తున్న కవయిత్రిగా ఆమె రాసిన ఒక కవిత ఆలోచింపజేస్తుంది.

రోడ్లు పూడ్చినా/రోదసిలో నడచినా/ప్రతిభనీదే
అశ్లీల పోస్టర్లు చింపాలన్నా/అయేషాకి న్యాయం జరగాలన్నా/తెగువనీదే
సంతూరు సబ్బయినా/బాగ్‌పైపర్ విస్కీ అయినా/అట్టమీద బొమ్మనీదే/
సామాజిక రచనలకైనా/బుల్లితెర సీరియల్స్‌కైనా/కథా వస్తువు నీవే
పబ్బుల్లో స్టెప్పులకైనా/భగవంతుని భజనలకైనా/ఆలంబన నీవే
బెల్టుషాపు ముయ్యాలన్నా/కుళ్లాయి నీళ్ళు రావాలన్నా/పోరాటం నీదే

అంటూ స్త్రీ నిర్వహించే వివిధ పాత్రలను మనకు చూపిస్తారు. ఈకవిత చివరలో ఇన్నింటికి కారణభూతివైనా/మెప్పుకోలుకి ఎదురుచూడని కర్తవ్యపరాయణత నీది/కర్మఫలత్యాగివి నీవు అని స్త్రీ ఔన్నత్యాన్ని చాటి చెప్తుతారు.

ఒక స్త్రీగా స్త్రీల పట్ల ఆమెకు సానుభూతి ఉంది. అది ఆమె కవిత్వంలో అక్కడక్కడా కనిపిస్తుంది. రాజ్యశ్రీ ఒక వాదానికో లేక ఒక ఇజానికో కట్టుబడి కవిత్వం రాయదు. అన్నిటికీ మించి అడుగడుగునా ఆమె కవిత్వంలో మానవతా వాదం మాత్రం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. కొన్ని ఊహలు, కొన్ని కలలు, కొన్ని వాదాలు, కొన్ని బేధాలు అనేకానేక ఆలోచనలు, పరిష్కారాలు ఆమె కవిత్వం నిండా పరుచుకుంటాయి. ఆమె ఆలోచనా పరిధి విస్తృతమైనది. ఏవో కొన్ని ఆలోచనలకు పరిమితమైన కవిత్వం ఆమెది కాదు. అన్నీ ఆమెకే కావాలి. అటువంటి కవిత్వం కాబట్టి వస్తు విస్తృతి ఆమె కవిత్వంలో కనిపిస్తుంది. కవిత్వం ఎక్కడన్నా పలుచబడ్డట్టు కనిపించినా ఈ రచయిత్రి చెప్పదలుచుకున్నది. ఏమిటో సూటిగా పాఠకుడికి తగులుతుంది. మానవసంబంధాలు రోజురోజుకు మృగ్యమవుతున్న దృశ్యమొకటి నేడు మనకు కనిపిస్తుంది. పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను పిల్లలు నిర్లక్ష్యం చేయడం ఎంతో బాధాకరం. పెద్దవారై పోయిన వారి పట్ల పిల్లలు పట్టించుకోకపోవడం, నిరాదరణకు గురిచేయడం ఎంతో శోచనీయం. అటువంటి ఒక సందర్భాన్ని తన అక్షరాలతో మన ముందుంచా రొకచోట రాజ్యశ్రీ.

**పుట్టింటి అరణంగా**
**నాకిచ్చిన ఇంటిస్థలం**
**కొండంత ప్రేమతో**
**కొడుకు పేర రాశాను**
**పెద్ద భవంతి వెలిసింది**
**ఇద్దరూ ఉద్యోగం చేస్తే గానీ**
**గడవని రోజులంటూ**
**ఉద్యోగస్తురాలిని**
**కోడలిగా తెచ్చాడు**
**ముద్దుమురిపాలతో**
**మనుమలను పెంచి పెద్ద చేశాను**
**జీవితంలోని ఆఖరిమజిలీకి**
**దగ్గరయ్యాను**

**ఇంటి మహారాణిలా**
**వెలిగిన నాకు**
**పాతసామానుగదిలో**
**ఒకింత చోటు గిరగీసి మరీ ఇచ్చాడు**

అంటూ వేదనగా పలుకుతారు. ఇది ఒక బాధాకర సన్నివేశం.

**'నేను పోయాక**
**పున్నామనరకం నుండి**
**విముక్తి కలిగిస్తాడనుకున్నా**
**బ్రతికుండగానే నరకబాధలు**
**రుచి చూపించాడు**
**ఆకలేసి ఏడిస్తే పాలిచ్చి లాలించిన నేను**
**కడపటికి**
**రెండు కన్నీటి బొట్లకు నోచని తల్లిని'**

ఇలాంటి కవితలు చదివినప్పుడు మానవత్వం ఉన్న ఎవరికైనా హృదయం ద్రవిస్తుంది. రెండు కన్నీటి బొట్లు అటువంటి తల్లులకోసం జారవిడుస్తారు. ఇటువంటి కవితలను రాసిన రాజ్యశ్రీలో ఒక మానవతావాది మనకు కనిపి స్తారు. కవిత్వానికి ఒక సార్ధకత ఉంటుంది. అటువంటి సార్ధకతను సాధించే గుణం ఆమె కవితల్లో మనకు కనిపిస్తుంది.

పల్లెటూర్ల పట్ల అమితమైన ఇష్టత కూడా ఈ కవయిత్రిలో మనం గమనించగలం. ఆమె పట్నంలో ఉండవచ్చును గానీ ఆమె మనసు పల్లెంత స్వచ్ఛంగా ఉంటుందని చెప్పవచ్చు. అది ఆమెకు స్వతహాగా అబ్బిన గుణం.

**'పల్లె రమణీయత**
**నాగరికతకు తెలియని**
**సొగసుల ప్రకృతిమాత**
**మదిని పులకింపజేసే**
**సోయగాల దృశ్యమాలిక'** అంటూ పల్లె అందాలను మనకళ్ళకు చూపిస్తా రొక

కవితలో. ఎన్నెన్నో భావపరంపరలు రాజ్యశ్రీ కవిత్వంలో కనిపించి మనల్ని ముగ్ధులను చేస్తాయి.

“ఎంతసేపూ సీరియస్ కవిత్వమే రాయకూడదు. మధ్యమధ్యలో హాస్యమూ వెదజల్లాలి. హాస్యం వెనుక సీరియస్‌నెస్ ఉంటుంది. కానీ ఆహ్లాదపరుస్తూ గుణపాఠం చెప్తుంది. దీనికి రాజ్యశ్రీగారి ఈ కవిత చూడండి.

**“రంభలాంటి**
**భార్యకోసం**
**వెతుకులాటలో**
**యవ్వనం కరిగినీరైయింది**
**దిగులుతో బట్టతల వచ్చేసింది**
**ఇంకో బట్టతలను పెళ్ళిచేసుకొని**
**జీవితంలో పడ్డాడు రాజీ...”**

అమ్మమీద, తెలుగు భాషమీద రాసిన కవితలు పదేపదే చదివింపజేస్తాయి. సచివాలయం అంటే చాలామందికి కోపం, చిరాకు ఏ ఫైలూ నడవదనీ, నడిచినా ‘నత్తనడక’అనీ అనుకుంటాం. కానీ పీతకష్టాలు పీతవి అన్నట్టు సచివాలయ సిబ్బందికీ కష్టాలున్నాయి. వీటిని మనకు తెలియజేస్తూ ఓ కవిత రాశారు రాజ్యశ్రీగారు. ఇలా సరదాగా కొన్ని, చమత్కారంగా మరికొన్ని, ఆవేదనతో ఇంకొన్ని రాశారు. కాసేపు మంచిని గురించి ఆలోచింపచేసి ‘ఖుషీ’కలిగించడమే ఈ కవితల ఉద్దేశ్యం అంటూ రాజ్యశ్రీ రాసిన ‘ఊహల వసంతం’కవితా సంపు టికి రాసిన ముందుమాటలో ద్వానా శాస్త్రిగారు రాజ్యశ్రీ కవిత్వాన్ని విశ్లేషించారు. రాజ్యశ్రీ కవిత్వంలో అనేకానేక విషయాలు మనకు కనిపిస్తాయి. చిటపటలు శీర్షికతో రాసిన చిన్న కవితలు ఆమె ఆలోచనా పరిధి ఏమిటో అవగతమవుతుంది.

**‘ముసుగు వేస్తే ఉక్కపోత**
**ముసుగు తీస్తే దోమవాత**
**తీసివేసే లోపల**
**కోడికూత’**

మధ్యతరగతి జీవుల కష్టాలు ఎలాంటివో హాస్యరసం రంగరించి మనకు అందిం చారు. దీనిలో హాస్యం ఎంత ఉందో వాస్తవం కూడా అంతే ఉంది.

**'ఒక్కరితో ఆపేసరికి**
**యమలోకంలో క్యూ పెరిగి**
**ఒకే కాన్పులో**
**నలుగురు జన్మిస్తున్నారు'**

కుటుంబ నియంత్రణ మీద వ్యంగ్యబాణాన్ని సంధించి హాస్యాన్ని పండించారు.

**'హైటెక్ బస్టాండ్లు**
**పగటిపూట పండ్ల దుకాణాలు**
**రాత్రిపూట బిచ్చగాళ్ళ ఆవాసాలు**
**ప్రయాణీకులు ఎప్పుడూ రోడ్డుమీదే'**

నగరాలలో రోజూ మనం చూస్తున్న విషయమే ఇది. అయితే ఆమె చెప్పిన విధానం ఎంతగానో ఆకట్టుకుంటుంది.

**'బ్యాంక్ కౌంటర్ ముందు**
**బిచ్చగాడు**
**అతడు జమకోసం**
**నేను లోనుకోసం'**

ఇలాంటివి ఇప్పుడు కామనైపోతున్నాయి. ఆ మధ్య బెంగళూరులో చెత్తకుప్పలో లక్షరూపాయలకు పైగా చిల్లర దొరికింది. పోలీసులు విచారణ జరిపితే అదంతా బిచ్చమెత్తుకునే వ్యక్తివని తేలింది. రాజ్యశ్రీగారు పైన రాసిన కవిత ఆ సంఘట నను గుర్తుచేస్తుంది. కాల ప్రభావాలు కవిత్వంలో ఎప్పుడూ ప్రతిఫలిస్తూనే ఉంటాయి. సమకాలీనతకు దూరంగా రాసే కవిత్వం కాలంలో కలిసిపోతుంది తప్ప అది నిలిచి ఉండదు. అయితే రాజ్యశ్రీగారి కవిత్వం సమకాలీనత ప్రతి ఫలిస్తూ ఆకట్టుకుంటాయి.

**'ట్యాంక్‌బండ్**
**అందాలు తిలకిస్తున్నా**
**చుట్టూరా**
**ఆకలిచూపులు'**

ఇటువంటివన్నీ ఒక్క ట్యాంక్‌బండ్ మీదే కాదు ఎక్కడైనా కనిపిస్తూనే ఉంటాయి. స్త్రీలకు రక్షణ లేకుండా పోయింది. దుర్మార్గమైన పరిస్థితుల్లో సమాజముంది. దాన్ని పై కవితలో చూపించారు రాజ్యశ్రీ.

**'ప్రజల జ్ఞాపకశక్తి**
**తాత్కాలికం**
**నిన్నటి రౌడీని**
**నేడు నాయకుడిని చేస్తున్నారు'**

అందుకే రాజకీయాలు ఇంతగా దిగజారిపోయింది. నలుగురు ఎన్నికల్లో పోటీచేస్తే నలుగురూ ఒకే బాపతుగా కనిపిస్తున్నారు. ప్రజలు ఓటు ఎవరికి వేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొని ఉంది. చేసేది ఏమీ లేక ఎవరో ఒకరిని గెలిపిస్తారు. ఆ గెలిచినవాడు ప్రజలకు చేసేది ఏమీ ఉండదు. తొండ ముదిరితే ఊసరవెల్లి రౌడీ ముదిరితే రాజకీయనాయకుడు అంతే. దీన్ని అంతం చేయాల్సి ఉంది. ఆ మార్పును కోరుకుంటూ కవులు కలాలు కదపాల్సి ఉంది.

**"మస్తిష్కం/మహామేధావి**
**కునుకుపడితే/చాలు**
**గవాక్షం/తెరుచుకొని**
**లోకాలన్నీ/చుట్టపెట్టి/వస్తుంది**
**మెలకువ/వచ్చి/కనులు/తెరిచేసరికి**
**బుద్ధిమంతురాలిలా/నా వశంలో/వున్నట్టు/నటిస్తుంది"**

ఇలాంటి కవితలెన్నో రాసిన రాజ్యశ్రీ అనేక పురస్కారాలను పొందారు. ఈమె ప్రతిభకు గుర్తింపుగా జి.వి.ఆర్ ఇంటర్నేషనల్ నిర్వహించిన కార్యక్రమంలో డా॥సి.నారాయణరెడ్డి

గారిచే కళాపురస్కారం, 'గుండెచప్పుళ్ళు' పుస్తకావిష్కరణ సందర్భంగా ఆంధ్రప్రభ నాటి ఎడిటర్ పి.విజయబాబు చేతులమీద సన్మానం, విశ్రాంత గవర్నర్ (కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్) డా॥పి.రమాదేవి గారిచే సత్కారం, డా॥రమణాచారిగారిచే సన్మానం, భారత భాషా భూషణ్ వంటివి ఎన్నో ఉన్నాయి. ఒక ప్రతిభావంతురాలైన కవయిత్రిగా ఆమె పేరు సంపాదించుకున్నారు. కేతవరపు రాజ్యశ్రీగారు సచివాలయంలో ఉన్నత పదవిలో ఉంటూ ఎన్నో సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఎందరెందరో ప్రము ఖులను ఆహ్వానించి సభలు నిర్వహించారు. వారిని సత్కరించారు. నిరంతరం సాహిత్యంతో అనుబంధం కొనసాగిస్తున్నారు.

అప్పట్లో రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, ప్రస్తుత తెలంగాణా ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి.రమణాచారిగారు రాజ్యశ్రీ రాసిన వెన్నెలమెట్లు కవితా సంపుటిలో ఇలా అంటారు.

**పక్షి**
**తనువాలిన చెట్టును గానీ**
**కొమ్మను గానీ**
**నమ్ముకోదు**
**తన రెక్కలను తప్ప**
**పక్షి**
**శ్రామికునికి సంకేతం**
**రెక్కలకవీ అంతే!**

శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ/ కవయిత్రిగా, రచయిత్రిగా/ కావ్యకర్తగా, కార్యకర్తగా/ సెక్రటేరియట్ ఉద్యోగుల్లో/చాలామందికి తెలుసు.

సముద్రం/ఎన్ని ఆటుపోట్లున్నా దాటదు/తీరం దాంపత్యమూ/ అంతే ఆలూమగల మధ్య/ఎన్నో భేదాభిప్రాయాలున్నా/ఎంత విభేదమున్నా/సముద్రంలా చెలియలికట్ట/ దాటకుండా ఉన్న దాంపత్యమే/దాంపత్యమన్న శ్రీమతి రాజ్యశ్రీగారి/ కవితలోని భావం ఎందరికో అనుభవైక వైద్యం.

**కొలిమిలో/కాలుతున్నా**
**వ్యక్తిత్వం/ఉన్నతంగా**
**మేలిమి/బంగారం**

కొలిమిలో కాలినప్పుడే/బంగారం పసతేలుతుంది/ మేలిమి బంగారంగా రాణిస్తుంది/ పసిడి మిసిమిని వెదజల్లుతుంది/ఎదురుదెబ్బలెన్నెన్నో తట్టుకున్న/ మనిషి వ్యక్తిత్వమూ అంతే/ పిండితార్థం సులభం/ ఇలా ఎన్నెన్నో/ తమ కవితల ద్వారా ఎగిరే రెక్కల్తో భావాంబర వీధిలో/ పాఠకులను విహరింపచేయడమే శ్రీమతి రాజ్యశ్రీ లక్ష్యం కాబోలు/ తమ లక్ష్యసాధనలో/ శ్రీమతి రాజ్యశ్రీ ఎంతవరకూ కృతకృతురాలయిందో/ మీరూ ఈ వెన్నెల మెట్లపై/ మీ పదంపదం కలిపి చూడండి అంటూ డా॥ కె.వి.రమణాచారిగారు రాజ్యశ్రీ కవిత్వం గురించి తెలుపుతూ ఆయన కూడా కవిత్వం చెప్పారు. ఇది రాజ్యశ్రీ గారికి ఆయనిచ్చిన కితాబు. మరో కవిత చూద్దాం.

**'చెట్టు భూదేవి పురిటిబిడ్డ**
**పిట్ట ఆకాశానికి ముద్దుబిడ్డ**
**చలనంలేని చెట్టుకి**
**చెరించే పిట్టను చూస్తే ముచ్చట**
**అందుకే తన గుండెను తొలిచి**
**గూడుకట్టింది దానికి'**

ఒక అద్భుతమైన భావన. చెట్టును భూదేవి పురిటిబిడ్డ అనటం, పిట్ట ఆకాశానికి ముద్దుబిడ్డ అనటం ఇంతవరకూ ఎవరూ అని ఉండలేదు. ఇటువంటి భావనలే రాజ్యశ్రీగారిని కవయిత్రిగా ఒక మెట్టుపైకి ఎక్కిస్తాయంటే అతిశయోక్తి కాదు. అపారమైన పరిశీలనా శక్తి వల్లనే ఇటువంటి భావనలు వస్తాయి. ఆమెకు ప్రకృతి పట్ల గల అపార ప్రేమను ఇలాంటి కవితల వల్ల తెలుసుకోవచ్చు.

నాటి పశుసంవర్ధక శాఖామాత్యులు, నేటి ఆంధ్రప్రదేశ్ శాసనసభా ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ రచయిత్రి రచనల గురించి ప్రస్తావిస్తూ– "శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ రాసిన "గుండెచప్పుళ్లు" నానీలు చూశాను. సచివాలయంలో డిప్యూటీ సెక్రటరీగా

బాధ్యతలు నెరపుతూనే సాహిత్యాభిలాష కలిగి ఉండటం ఆమె ఉత్తమాభిరుచికి నిదర్శనం. ఇందులో కొన్ని మెరికల్లాంటి నానీలు, నా దృష్టిని ఆకర్షించాయి. మచ్చుకు

**"సేదతీరుదామని**
**పల్లెకు వెళ్లే**
**బాంధవ్యం**
**కృత్రిమంగా నవ్వింది"**

**"కలం చిన్నదే**
**దాని గళం**
**జాతి యావత్తునూ**
**చేస్తుంది జాగృతం"**

**"చెత్తకుండీల్లో**
**చిత్తుకాగితాలే కాదు**
**పిల్లలు కూడా**
**దొరుకుతున్నారు"**

**"గారాలపట్టి ఆమె**
**పుట్టింట**
**పెళ్లికాగానే మరమనిషి**
**మెట్టినింట"**

ఇట్లా రాస్తూపోతే ఎన్నో ఉన్నాయి. రాజ్యశ్రీ గారి నానీల్లో దేశభక్తి, రాజకీయ స్పృహ, భగవద్భక్తి, ఆధ్యాత్మిక చింతన, స్త్రీవివక్ష, ఆత్మాభిమానం వంటి ఎన్నో అంశాలు చోటు చేసుకున్నాయి. విభిన్న విషయాల మీద ఆమెకుగల అవగాహనకు ఈ నానీలు అద్దం పడుతున్నాయి. భావం పదునైన బాణంగా సూటిగా మనసుకు తగులుతుంది.

రచనా వ్యాసంగానికే పరిమితం కాకుండా రాజ్యశ్రీగారు "చేతన" సచివాలయ సారస్వత వేదిక కార్యవర్గంలో ముఖ్యభూమికను పోషిస్తూ సచివాలయ ఉద్యోగులలో సాహిత్యాభిలాషను పెంపొందిస్తూ, వారిని ప్రోత్సహించడం అభినందనీయం. ఉత్తమ

సాహిత్యాభిరుచి గల రాజ్యశ్రీగారి కలం నుంచి మరిన్ని రచనలు రావాలని ఆశిస్తున్నాను అని అంటారు బుద్ధప్రసాద్‌గారు.

తెలుగు భాష పట్ల రాజ్యశ్రీగారికి అమిత అభిమానం. మాతృభాష పట్ల నేటితరం చూపుతున్న చిన్నచూపునకు వేదన చెందుతారు. ప్రభుత్వాలు భాషను గౌరవించాల్సిన సమయంలో పట్టించుకోకపోవడం మనం చూస్తున్నదే. ఇంగ్లీషు చదువుల వ్యామోహంలో నేటితరం కొట్టుకుపోతున్నది. ప్రతి ఒక్కరు మాతృభాషను గౌరవించాలని ఆమె కోరుకుంటారు. భాష పట్ల అభిమానంతో 'గువ్వలచెన్నా' అనే ఒక కవితను రాశారు రాజ్యశ్రీ.

**పల్లె నుండి పట్నానికి పయనం**
**మాతృభాషతో వియోగం**
**ఆంగ్లభాషతో సంయోగం**
**అపుడే మరిచెను తెలుగుదనం–ఓ గువ్వలచెన్నా**

**తెల్లవాడి రాజ్యం**
**తెల్లారి ఏళ్ళు గడిచినా**
**తెలుగుభాషకు**
**పట్టలేదు రాజభోగం–ఓ గువ్వలచెన్నా**

**మాతృభాషయందు**
**మాట్లాడిన చిన్నచూపు**
**ఆంగ్లమున సంభాషించిన**
**మిక్కిలి వినయము చూపు–ఓ గువ్వలచెన్నా**

అంటూ తెలుగు భాష ఎలా నిరాదరణకు గురి అవుతున్నదో తెలియజేస్తారు. పక్క రాష్ట్రమైన 'తమిళనాడు'లో వారి మాతృభాష పట్ల వారికి గల గౌరవం తెలుగు వారికి లేకపోవడం దురదృష్టం. సాహిత్యం పట్ల అక్కడి ప్రభుత్వాలు ఎంతగానో ఆదరించడం కనబడుతుంది. మన దగ్గర అటువంటి ఛాయలేమీ కనపడవు. ఒక విషయం గమనించాల్సి ఉంది. తమిళనాడు ప్రభుత్వం తమిళనాడులోని తెలుగు స్కూళ్లను మూసివేయాలని ఇటీవల

నిర్ణయించింది. మన ప్రభుత్వాలు దాని గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. అది భాష పట్ల తెలుగు ప్రభుత్వాలకున్న శ్రద్ధ. భాష ఎవరికి కావాలి. మనం బాగుంటే చాలు అన్న రీతిగా మన రాజకీయనేతలున్నారు. అలా మాతృభాష పట్ల మమకారం చూపించిన రాజ్యశ్రీగారు దేవతలుండే స్వర్గలోకం కంటే ఈ భూలోకమే అసలు స్వర్గలోకమంటారు. దేవతలకు లభించని స్వర్గం అంటూ ఒక కవితను రాశారు. ఇందులో మనముండే నేలను ప్రేమించడం కనిపిస్తుంది.

అతిలోక సుందరం/అప్సరసలుండే/నాకలోకం/ఆకలిదప్పులుండవట/అచట/వార్థక్యమంటే/అసలే/తెలియదట/అమృతం సేవిస్తూ/ఎల్లప్పుడూ/యవ్వ నంతో/హొయలొలికిస్తూ/ఆటపాటలతో/ఆనందిస్తుంటారట/ఆ స్వర్గాన్ని/అంది పుచ్చుకోవాలని/అర్రులు చాస్తుంటాడు/మనిషి/కానీ/జరామరణాలు లేని/ ఆ మనుగడలో/పసఏముంది?/అమాయకపు/బాల్యం/మధురోహల/యవ్వనం/తీపిచేదుల/వైవాహిక జీవనం/మాతపితలుగా/బిడ్డల/ముద్దుమురిపాలను/ఆస్వాదించే/ఆనందం/అమ్మమ్మా తాతయ్యలుగా/జీవితాన్ని పండించుకునే/సంతృప్తి/ఆధ్యాత్మిక చింతనలో/కాలం గడిపే వృద్ధాప్యం/షడ్రుచుల సమ్మేళనం/మధురమైన మానవ జీవనవిధానం/ మనిషికి దేవుడిచ్చిన వరం/దేవతలకు లభించని/ఇహలోక స్వర్గం.

మానవ జీవనంలో ఉన్న మధురిమను ఈ కవితలో తెలియజేస్తారు రాజ్యశ్రీ. ఆమె ఆధ్యాత్మికపరంగా చాలా కృషిని కొనసాగిస్తున్నారు. ఆధ్యాత్మిక వ్యాసాలనేకం రాశారు. అనేక ప్రాంతాలలో ఆధ్యాత్మిక ప్రసంగాలనిచ్చారు. ఇస్తున్నారు.

'నీలోకి నువ్వు'పేరిట ఆధ్యాత్మిక గుళికలను కేతవరపు రాజ్యశ్రీ మనకు అందించారు. ఇంతవరకూ వారి కవితలకు మాత్రమే పరిమితమయ్యేవారు. సామాన్యంగా ఉద్యోగస్తులు రిటైర్‌మెంట్ తర్వాత ఈ మధ్యకాలంలో ఒక వ్యాప కంగా ఈ 'ఆధ్యాత్మిక రచనలు'చేయడం సాధారణంగా కనిపిస్తూ ఉంది. అయితే తెలుగు సంస్కృత ఉపాధ్యాయులూ, వాస్తు, జ్యోతిషరంగాల వారు ఈ ఆధ్యాత్మిక రచనలవైపూ, టివిఛానల్స్‌లో ప్రసంగాలవైపూ దృష్టి సారించి రాణిస్తున్నారు. కానీ కేతవరపు రాజ్యశ్రీగారు అలా కాదు. స్వతహాగా దైవభక్తి ఉన్నవారు. మానవీయ విలువల పట్ల గాఢనమ్మకం ఉన్నవారు. ఎప్పుడూ

చిరునవ్వుతో కనిపించే ఈమెకు, అందరూ అలాగే హాయిగా ఉండాలనుకునే మనస్తత్వం కలవారు. దాదాపు 20 వివిధ అంశాల మీద రాసిన రాజ్యశ్రీ 'నివేదన'తో ప్రారంభించిన పుస్తకాన్ని, నిత్యసంతోషం, బ్రహ్మజ్ఞానం, నిర్భయమరణం, సారూప్యశక్తి, జీవిత సాఫల్యం వంటి అంశాలలో పరమాత్ముడి మీద  నమ్మక ముంచి, ఆయన సేవలోనూ, ధ్యానంలోనూ జీవిత కాలాన్నంతా గడపాలని రాజ్యశ్రీగారు కొన్ని ఉదాహరణలనూ అక్కడక్కడా ఇచ్చుకుంటూ వచ్చారు. పువ్వు మీదే తన ధ్యాసంతా పెట్టిన పురుగు చివరకు తుమ్మెదలాగా ఎలా మారిపోయిందో చక్కగా చెప్పారు. మనిషి ప్రలోభాలకు లోను కాకూడదంటుంది ఈమె" అంటూ రాజ్యశ్రీగారు రాసిన ఆధ్యాత్మిక వ్యాససంకలనం 'నీలోకి నువ్వు'కు రాసిన ముందుమాటలో విశ్లేషిస్తారు పులివర్తి కృష్ణమూర్తి.

ప్రతిమనిషి కొన్ని నిశ్చితాభిప్రాయాలుంటాయి. ఆ కోణంలో వారి ప్రయాణం సాగుతుంటుంది. ఆ ప్రయాణంలో అనుభవాలను ప్రోదిచేసుకుంటూ నడుస్తుంటారు. కొందరు ఆధ్యాత్మిక భావజాలంలో పయనిస్తూ మనుషుల్ని ప్రేమించే తత్వమొకటి పెంపుచేసుకుంటారు. అధ్యయనం ద్వారా, అనుభవాల ద్వారా పొందిన జ్ఞానాన్ని పదుగురికి పంచే గుణాన్ని కూడా పెంచుకుంటారు. ఇక్కడ కేతవరపు రాజ్యశ్రీగారు కూడా అదే చేస్తున్నారు.

ఆమె ఇష్టదైవంగా శిరిడీ సాయిని నమ్ముకున్నారు. శిరిడి సాయి సమస్త మానవులను ఒకేవిధంగా పరిగణించేవారు. ఆయన పంచిన ప్రేమమార్గాన్ని ఇక్కడ రాజ్యశ్రీగారు అనుసరిస్తూ ఆయన బోధించిన విలువలతో కూడిన జీవనాన్ని గడుపుతున్నారు. అయితే మనుషుల్ని ప్రేమించడంతో పాటు దురా చారాలను ఖండిస్తారు. సమాజ రుగ్మతల్ని ఎండగడతారు. ప్రకృతిలో పరవశి స్తారు. ఇలా తనదైన ఒక ముద్రను సాహిత్యంలో వేసే క్రమంలో ముందుకు నడుస్తున్నారు రాజ్యశ్రీ.

జి.వి.ఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి గారు "శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ నాకు కవయిత్రిగానే తెలుసు ఆమె రచించిన గుండె చప్పుళ్లు, ఊహల వసంతం, సిసింద్రీలు, కవితా సంపుటాలను మా సంస్థ ద్వారా ఆవిష్కరించాం. సచివాలయంలో ఉన్నతోద్యోగం చేస్తూనే రచనలు చేస్తూ చేతన సచివాలయ సారస్వత వేదికను అందరూ మెచ్చేలా నిర్వహించటం కొనియాడదగినది.

త్వరలో పదవీ విరమణ చేయబోతున్న రచయిత్రి మరిన్ని రచనలను పాఠకుల ముందుకు తేవాలని గొప్ప వ్యక్తిత్వం కల్గిన రాజ్యశ్రీని కోరుతూ అభినందిస్తూ ఆశీర్వదిస్తున్నాను అని రాజ్యశ్రీగారి గురించి వివరిస్తారొక”చోట.

అలాగే డా॥ పోతుకూచి సాంబశివరావు “రాజ్యశ్రీ మంచి రచయిత్రి, సృజనాత్మక రచనలు ఎన్ని వ్రాసినా, దృష్టి ఆధ్యాత్మికత వైపు కూడా ప్రసరించడం ఆమె అదృష్టం. మనిషి చివరదశలో ఆధ్యాత్మికత చాలు అని కొందరంటారు. అలా కాకుండా జీవితంలో ప్రతిక్షణం పరమాత్మను ధ్యానిస్తూ తన జీవిత గమ నానికి మూల చైతన్యం భగవంతుడే అని స్థిరమైన నమ్మకం కల్గినవారే, భక్తిద్వారా, దైవసాన్నిధ్యం పొంది తరిస్తారు.

ఎన్ని రచనలు చేసినా అవి కీర్తినివ్వలేవు. ఆలోచనా పటిమ ద్వారా ఆధ్యాత్మిక పరిమళం ప్రసరిస్తే ఆ జీవి ధన్యుడు. చరిత్రలో నిలుస్తాడు. ధనము, సంపాదన అవసరమైనా, మన జీవిత గమ్యం  నిమిత్తం అయితే మనిషి జీవితం ధన్యం. ఇటువంటి మంచి రచనలు చేసిన రాజ్యశ్రీకి నా శుభాభినందనలు” అని అంటారు.

ఆమెలోని రచయిత్రిని అనేకానేకమంది మెచ్చుకుంటూ చేసిన వాక్యాలు, అభినందనలు అనేకం ఉన్నాయి. వాటిని సందర్భోచితంగా మనం ఈ వ్యాసంలో చూద్దాం.

పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్, ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారు ఇలా అన్నారు. “అక్షరాలు పరిమితం, అవి వెదజల్లే, జ్ఞానపరిమళాలు విశ్వవ్యాప్తం” అన్న రాజ్యశ్రీగారి మాట ఈకవితలో సార్ధక మవుతున్నది. ఆమె ఊహల్లో ఉయ్యాలలూగినది, భావాల్లో పసిడి స్నానం చేసింది. అమితమైన కళాభిరుచి ఉన్నా సుదీర్ఘ కావ్యం చదివి మురిసిపోయే రోజులు కావు ఇవి. వ్యక్తిగతంగా ప్రతిక్షణం విలువైన ప్రజాజీవితంలో ఈ సంక్షిప్త కవితలు మనస్సును ఉత్తేజపరుస్తాయి.

**“అక్షరం వేసిన పునాది మీద**
**నిర్భయంగా నిలబడుతుంది వ్యక్తిత్వం”**

ఈ భావం ఎంతో సమాలోచించి చెప్పింది. సంపద గర్వాన్ని కలిగిం చవచ్చు. కానీ అక్షరం అహంకారాన్ని దూరం చేస్తుందన్న భావాన్ని మరోచోట ఆమె చెప్పడం అనుభవైక సత్యం.

ఇంతకు ముందు అనేక రచనలు సృజించిన రాజ్యశ్రీగారికి ఇది మరో కీర్తికేతనం. వారికి హార్థికాభివందనలు అని ఆమె కవిత్వం గురించి వివరించారొక చోట డా॥ఎల్లూరి శివారెడ్డిగారు.

కేతవరపు రాజ్యశ్రీ అక్షరాలపై కురిపించిన అపారమైన అభిమానం మనకు 'అక్షరకేతనం' కవితా సంపుటిలో దర్శనమిస్తాయి.

**'నా అక్షరాలు ప్రజాశక్తులు వహించే విజయ ఐరావతాలు**
**నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు'***అన్నాడు తిలక్.*

ప్రముఖ కవి డా॥తిరునగరి అక్షరాలతో కవి చేసే 'ఆల్కెమీ' కవిత్వం దాని రహస్యం తెలిపిన ఈ తరం కవయిత్రి శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీగారు. సతత కవితా హృదయ హరితాన్ని, పోషించుకుంటూ కవితా సృజన చేస్తున్న రాజ్యశ్రీగారు ఇప్పటికీ గేయ, వచన కవితా సంపుటాలను ప్రచురించి గుర్తింపు పొందారు. ఆధునిక కవితా ప్రక్రియలైన నానీలు, రెక్కలు, వ్యంజకాలు రచించి సాహిత్య విమర్శకుల ప్రశంసలందుకున్నారు. ఇప్పుడు అక్షర కేతనం పేరుతో అందమైన ముక్తకాలను అక్షరాల మహిమ ఎంతటిదో వివరిస్తూ ఓ గ్రంథమే రాశారని కితాబునిచ్చారు రాజ్యశ్రీగారికి.

ఇది ముమ్మాటికీ సత్యమైన మాట.

**'అక్షరాలు పరిమితం**
**అవి వెదజల్లే**
**జ్ఞానపరిమళాలు**
**విశ్వవ్యాప్తం'**

అక్షరాలకు ఉండే అజేయమైన శక్తిని గ్రహించారు కాబట్టే ఆమె కవిత్వానికి అర్థవంతమైన విలక్షణత చేకూరింది. ఆమె కవిత్వం రాసే క్రమంలో ఎలాంటి గందరగోళాలు ఉండవు. సామాన్యుడు సైతం హాయిగా చదువుకొని ఆనందిం చగలడు. ఇది కేతవరపు రాజ్యశ్రీగారు సాధించిన విశిష్టత.

అలాంటి విలక్షణత విశిష్టత సాధించిన కేతవరపు రాజ్యశ్రీకి రచనా వ్యాసంగంతో పాటు వీణావాదన, ఆధ్యాత్మిక ప్రవచనాలు, చెస్ ఆడటం, కవితా గోష్ఠి వంటి అభిరుచులూ ఉన్నాయి.

ఆమె ఇప్పటివరకు చిరుసవ్వడులు, గుండెచప్పుళ్లు, ఊహల వసంతం, సిసింద్రీలు, వెన్నెల మెట్లు, నీలోకి నువ్వు, (ఆధ్యాత్మిక వ్యాసాలు) తృప్తీ నీవెక్కడ, బొమ్మ–బొరుసు, అక్షరకేతనం, ఆధ్మాత్మికత వృద్ధులకేనా? నా లండన్ యాత్ర, స్ట్రింగ్ ఆఫ్ థాట్స్, రెక్కల్లో గీతామృతం వంటి సంపుటాలను వెలువరించారు. సంకలనాలు కవితా చేతన, చేతన కథాఝరి వంటివి ప్రచురించారు. అలాగే గృహహింసా చట్టం మహిళకు రక్షణ కవచం, పర్యావరణ చిట్కాలు "కలాల కదంబం" అలాగే కథలు, సామాజిక అంశాలపై వ్యాసాలు, ఆధ్యాత్మిక రచనలు వంటివి వివిధ పత్రికలలో ప్రచురించబడినాయి. సహసంపాదకులుగా సాహితీ కిరణం పత్రికకు పనిచేశారు.

ఆంధ్రప్రదేశ్ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక కార్యదర్శిగా, సంఘమిత్ర ఓల్డ్ ఏజ్ హోమ్ కార్యదర్శిగా పనిచేశారు. సాహితీ కార్యక్రమాలు, కవిసమ్మేళనాలు, పర్యావరణ పరిరక్షణ సదస్సులు వంటివి నిర్వహించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. టి.వి. మరియు రేడియో కార్యక్రమాలలో మహిళలకు సంబంధించిన కార్యక్రమాలలోనూ పాల్గొన్నారు.

కేతవరపు రాజ్యశ్రీ ఎం.కామ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్తి చేశారు. ఆమె ఇంటి వాతావరణం కూడా సంగీత, సాహిత్య మేళవింపుతో ఉండేది. కీ.శే. ప్రభావతి, కీ.శే. మహంకాళి వెంకటరావు దంపతులకు జన్మిం చిన రాజ్యశ్రీగారు 1977నుండి ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో వివిధ హోదాలలో పనిచేసి ప్రభుత్వ ఉపకార్యదర్శిగా 2011లో పదవీ విరమణ చేశారు.

ఈమె ప్రతిభను గుర్తించి "ప్రజ్ఞాశ్రీ" (శ్రీకిరణ్ సాంస్కృతిక సమాఖ్య) "భారత్ భాషా భూషణ్" (అఖిల భారతీయ భాషా సమ్మేళన్, భోపాల్) "మదర్ థెరిస్సా అవార్డు" (షీ ఫౌండేషన్, హైదరాబాద్) "స్త్రీ శక్తి పురస్కారం" (కళానిలయం) "వేదాంత వక్త" (యోగ వేదాంత విజ్ఞాన అకాడమీ) నెల్లూరు సృజన సాంస్కృతిక వారిచే పురస్కారం,

"ప్రతిభా పురస్కారం" (తంగిరాల మెమోరియల్) "ఉగాది పురస్కారం" (వైష్ణవి ఆర్ట్స్–నందననామ సంవత్సరం) ఇలా అనేకానేక పురస్కారాలు, అవార్డులు ఆమె పొందారు. సాహిత్యం అనేది ఒక వ్యాపకంగా కాక జీవితంలో ఒక భాగంగా చేసుకున్న కవయిత్రి రాజ్యశ్రీ. ప్రముఖ సినీనటులు, రచయిత రంగనాథ్‌గారంటారు.

**"గోరుముద్దలు తినిపించిన అమ్మకు**
**'అక్షరాభిషేకం' చేసి ఊహల వసంతమన్నది–**
**అణువణువున అమ్మనే నింపుకొని**
**అమ్మతనంలోని మధురిమకు అర్థం చెప్పింది**
**ప్రాచీన గ్రంథాలను–కీటకాలు జీర్ణించుకుంటున్నాయని**
**కవి సమ్మేళనానికి–వేదికపై ఖాళీ కుర్చీలని**
**యంత్రాలెన్నోచ్చినా–కూలివాడి అవసరం తగ్గలేదని**
**సిసింద్రీలంటూనే–జువ్వలను వదిలింది**
**'వెన్నెల మెట్లెక్కి' రెక్కలు మొలిపించినా–**
**'చిట్టికవితలతో చిరుసవ్వడులు చేసినా**
**గుండె చప్పుళ్లంట 'నానీ'లతో నిజాలు చెప్పినా–**
**అన్నిటా యధార్థాలు–ఎత్తిపొడుపులు–**
**అసహాయతలు–ఆర్ద్రతలు–**
**దాడులు–అభ్యర్ధనలు–ఓదార్పులు**
**తన కలం స్పృశించని అంశం లేదు**
**తన ఆవేశానికి అంతమూ లేదు**
**నీలోకి నువ్వంటూ అంతర్యానం చేయించి**
**జ్ఞానగనులను చూపించి, ఆధ్యాత్మిక సంపదనందించి**
**జీవిత సాఫల్యానికి దారి చూపించింది**
**పరుగెత్తే కలాలు ఎన్నో సాహిత్యంలో**
**పలుకరించేవి కొన్ని జీవితంలో**
**తెగిపోతున్న మానవసంబంధాలు–**

**నశిస్తున్న మావనతా విలువలు–**
**హృదయాన్ని కలచి వేస్తుంటే**
**ప్రేమ రాహిత్యం బ్రతుకు నెడారిగా మారుస్తోందని–**
**నవ్వును అతికించుకొని బ్రతకలేక–**
**మనుషులకు దూరమైన తృప్తి నాహ్వానిస్తూ–**
**తృప్తీ నీవెక్కడంటూ పరితపిస్తూ వెదుకుతుంది**
**సాహిత్యశ్రీ, ప్రజ్ఞాశ్రీ అని లోకం బిరుదులిచ్చినా**

*ఒక మానవతావాది "శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ"* అంటూ రాజ్యశ్రీగారి రచనలను ఉటంకిస్తూ, ఆమెలోని విశిష్టతలను తెలుపుతూ ఒక కవిత రూపంలో ఆమెపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

"అక్షరాలు అందించే అనుభూతి అమృతం. భాష ద్వారా వ్యక్తపరచలేని భావాలను, అనుభవాలను, కష్టాలను, కన్నీటిని, ఆనందాన్ని, ఆత్మీయతను అక్షరం వ్యక్తపరుస్తుంది. అమ్మలోని అమృతత్వాన్ని, నాన్నలోని క్రమశిక్షణను వ్యక్తపరచాలంటే అక్షరమే ఆలంబన "అఆ"లతో మొదలుపెట్టి అంచెలంచెలుగా ముక్తికి సోపానాలు పరుస్తాయి అక్షరాలు. అక్షరం మీద ఏర్పాటు చేసిన ఒక కవిసమ్మేళనంలో "అక్షరమే నా ఆయుధం" అంటూ సమాజంలో జరిగే అన్యా యాలను ఎండగడుతూ కవిత చదివాను. అప్పటినుంచీ నాకు తెలియకుండానే అక్షరం నా మస్తిష్కంలో నిక్షిప్తమైందని చెప్పుకున్నారు, అక్షరంపై అధికారం సంపాదించి సాహిత్యం సాగిపోతున్న రాజ్యశ్రీ

**'అక్షరాలు**
**నిశ్శబ్ద తరంగాలు**
**జాతి యావత్తునూ**
**జాగృతం చేసే ఆయుధాలు'**

ఇది నూటికి నూరుపాళ్ళు నిజం. 'ఫ్రెంచి విప్లవం' ఒకరకంగా సాహిత్యం వల్లే వచ్చిందని చెప్పవచ్చు. వాల్టేర్, రూసో వంటి వారి రచనలు ప్రజల్లో చైత న్యాన్ని తీసుకువచ్చాయి. భారత స్వాతంత్రోద్యమంలో ఎందరో కవులు స్వేచ్ఛ కోసం, జన

జాగృతికోసం రచనలు సాగించారు. 'మా కొద్దీ తెల్లదొరతనం' అంటూ గరిమెళ్ళ సత్యనారాయణగారు ఆనాడు జనంలో చైతన్య దీప్తులు వెలిగించారు. వీరగంధము తెచ్చినారము వీరుడెవ్వరో తెలుపుడంటూ వచ్చిన గీతం స్వాతంత్ర్య కాంక్షను రగిలించింది. నిజాము నిరంకుశపాలనకు వ్యతిరేకంగా నా తెలంగాణ కోటి రత్నాల వీణ అంటూ దాశరథి రాసినా, ఖబడ్దార్, ఖబడ్దార్ నైజాం పాదుషాహే'అంటూ ఆవత్స సోమసుందర్ గర్జించినా, ఒక కాళోజీ, ఒక హీరాలాల్ మోరియా ఇలా అక్షరాన్నే ఆయుధంగా చేసుకొని ముందుకు కదిలారు.

హిట్లర్ లాంటి నియంత కూడా ఆయుధాలకు భయపడను కానీ అక్షరాలకు భయపడతానన్నాడు. అదే విషయాన్ని నాలుగు పాదాల్లో చెప్పి అక్షరానికి ఉన్న అగ్నిశక్తిని చూపించారు కేతవరపు రాజ్యశ్రీ.

**'అక్షరతూణీరాలు**
**సంధించు**
**సమాజ అసమానతలను**
**తొలిగించు'**

అంటూ సమాజ అసమానతలపై అక్షరాయుధాన్ని ఎక్కుపెడతారు.

**'నిద్రిస్తున్న ప్రకృతిని**
**అక్షరం**
**సుప్రభాతమై**
**మేల్కొలుపుతుంది'**– అంటారు రాజ్యశ్రీ.

అక్షరం ప్రకృతినే కాదు. నిద్రాణమై ఉన్న జాతినీ మేల్కొల్పుతుంది. అయినా మనిషి కూడా ప్రకృతిలో భాగమే కదా! ఏదైనా అక్షరం ప్రభాతగీతమై మేల్కొలపడం అనేది అక్షరసత్యమే కదా!

ఇలాంటి సత్యమైన వాక్కులను అక్షరాల ద్వారా అందిస్తారు రాజ్యశ్రీ. కేతవరపు రాజ్యశ్రీ వంటి వారి వల్ల తెలుగు భాషకు ఎనలేని మేలు జరుగుతుంది అని ఖచ్చితంగా చెప్పవచ్చు.

**'అమ్మానాన్నలు**
**నడకనేర్పితే**
**అక్షరాలు**
**నడత నేర్పుతాయి'**

ఇందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు కదా! అక్షరాలతో విన్యాసం చేస్తూ 'అక్షరకేతనం' ఎగురవేశారు రాజ్యశ్రీగారు.

**'నేను' అనే అక్షరాలు**
**అహంకార పూరితాలు**
**'మేము' అనే అక్షరాలు**
**ఐకమత్యానికి ప్రతీకలు"**

తరతమ బేధాలు లేకుండా అందరూ కలిసి మెలిసి జీవించడంలో ఉన్న మధురిమ నేను నాది అనుకోవడంలో ఉంటుందా. ఇది ఒక విశ్వభావన. విశ్వమంతా ఐకమత్యంతో జీవించాలనే కాంక్ష ఒకటి ఆమె కవితల్లో కనిపిస్తుంది. దాన్ని ఆమె తన అక్షరాల్లో అద్భుతంగా వ్యక్తం చేసారు.

**'అక్షరాలు నేర్వని రైతన్న**
**పొలంలో**
**బీజాక్షరాలు**
**నాటుతాడు'**

ఇటువంటి భావనని ఇంతకు ముందు ఎవరన్నా వ్యక్తం చేశారో లేదో గాని రైతు పక్షాన నిలబడి పొలంలో బీజాక్షరాలు నాటుతాడని చెప్పటం గొప్పగా ఉంది. దీని ద్వారా ఆమె కవితాశక్తి కూడా బయటపడుతుంది.

**'మనసులోని**
**దిగుళ్లకి**
**ఓదార్పు మంత్రాలు**
**అక్షరాలు'**

అక్షరాలు పదాలుగా, వాక్యాలుగా, గేయాలుగా మారి మనసు గాయాలను మాన్పిస్తుంది. దాన్నే దిగుళ్లకు అక్షరం ఓదార్పు మంత్రంగా మారుతుందని రాజ్యశ్రీ అంటారు.

**'వెదురుబొంగులో**
**పూదిన అక్షరాలు**
**వేణుగానమై**
**పరవశింప చేస్తాయి'**

అక్షరంతో ఎన్ని సత్యాలనో సరళంగా కవితాత్మనిచ్చి రాజ్యశ్రీ సాహిత్యంలో ఒక సుస్థిరస్థానం సంపాదించుకున్నారని చెప్పవచ్చు. ఒక జ్ఞానకాంక్షతో అక్షరాల వెంట దశాబ్దాల తరబడి నడవడం ఆమె అలవర్చుకున్నారు. అవన్నీ కవిత్వంగా, వ్యాసంగా, నిత్యసత్యాలుగా వెలువడుతుంటాయి.

అక్షరాలు వెంటపడి/వేధిస్తున్నాయి/తమను ఆయుధంగా/చేసుకొని/సమాజపు కుళ్ళుని/కూకటివేళ్ళతో/పెకిలించి వేయమని/ఆవేశం పెల్లుబికి/కలం చేత బట్టా/ భ్రూణహత్యలు/అత్యాచారాలు/బిడ్డలను మాయం చేస్తున్నా/ముఠాలు/బాల కార్మికులపై పైశాచిక/దండనలు/కీచకులుగా మారుతున్న టీచర్లు/వార సత్వంగా మారుతున్న రాజకీయ పదవులు/అక్రమార్జనలు/భూకబ్జాలు/మద్యం మాఫియాలు/దొంగతనాలు/దోపిడీలు/ ఎన్నో!ఎన్నో/అన్నీ ఒక్కసారిగా చుట్టుముట్టి/ మాగురించి రాయమంటే/ మా గురించి రాయమంటూ/పోటీపడ్డాయి/ఇన్ని అరా చకాలను/ఎండగట్టడానికి/నా కలం బలం చాలదని/నిస్సత్తువ ఆవరించింది కలం చిన్నదే!కానీ! దాని గళం!జాతి యావత్తుని/జాగృతం చేయగలదు/ఝళి పించు నీ కలం/సంధించు అక్షర తూణీరాలను /ఎండగట్టు సమాజ దురాగ తాలను/అంతరాత్మ వెన్నుతట్టి ప్రోత్సహించింది/క్షరంలేని అక్షరాలను/ఆయుధంగా సంధించడానికి/నిర్భయంగా/నిలబడింది నా కలం/రేపటితరాన్ని/జాగృతం చేయ డానికి. పై కవిత సమకాలీన సమాజంలో జరుగుతున్న అనేక దుర్మార్గాలను, విధ్వంసకర దృశ్యాలను ఆవిష్కరించారు రాజ్యశ్రీ. ఉదయం లేచింది మొదలు టి.వి. ఆన్ చేసినా, లేక పేపర్ తిరగేసినా పై కవితలో రాజ్యశ్రీగారు చూపించిన దృశ్యాలు అన్నీ మనకళ్లకు కనపడతాయి. సమాజం ఏ దిశగా ప్రయాణం సాగిస్తున్నది? అనే ప్రశ్న ఉదయించి మనసును కలిచివేస్తుంది. మానవతా వాదులైన కవులు ఈ వేదనా భరిత దృశ్యాలను తమవిగా

చేసుకొని, తమలోకి బట్వాడా చేసుకొని తమ కవితా హృదయాలకు ఊరట కల్పించుకుంటారు. అటువంటి ఊరట కవులకు కచ్చితంగా కావాలి కదా! అలా లేనప్పుడు ఈ దృశ్యాలను ఖండిస్తూ ఎవరు రాస్తారు? అందుకే జరుగుతున్న పరిణామాలను, సమకాలీన ప్రపంచపు రుగ్మతలను రాజ్యశ్రీ ఎప్పటికప్పుడు ఖండిస్తూ కవిత్వం రాస్తూనే ఉన్నారు. దాని ద్వారా కొంత ఊరటనూ పొందుతున్నారు. ఇది రాజ్యశ్రీ లాంటి కవయిత్రులకు తప్పనిసరియైన అవసరం. సాహిత్య జీవులకు దక్కేది అదే కదా!

ప్రముఖ శిశువైద్య నిపుణులు రచయిత డా॥పి.ఎస్.మూర్తిగారు "రాజ్యశ్రీ' కవిత్వమొక రత్నాలమూట. అది ఒక రసధుని. కవితలతో రాజ్యశ్రీ నవసరాలు పండించగల నేర్పరి. ఆమె గొప్ప భావుకురాలు. మాట సూటి, భావం మేటి. ఎటువంటి భావాన్నైనా నేర్పుగా నిర్మొహమాటంగా చెప్పగలదు" అంటారు మూర్తి. అలా అంటూనే రాజ్యశ్రీతో నాకు పరిచయం దాదాపు మూడు దశాబ్దాలు. ఆమె మంచి స్నేహశీలి. ఆమె పక్షులతో స్నేహం చేస్తుంది. చకోర పక్షులైతే మరీనయం. గాలితో స్నేహం చెయ్యగలదు. ఆకాశంతో స్నేహం చేసి ఊసులు చెప్పగలదు. నవ్వుల పువ్వులు కురిపించే రెండో హనీమూన్ చదవాల్సిందే. కాదేదీ కవిత కనర్హం అన్నట్టు సిగ్నల్ లైట్లు గూడా రాజ్యశ్రీకి కవితాస్ఫోరకాలే. కొన్ని బాధాకర సన్నివేశాలు గుర్తుకొచ్చినప్పుడు 'కన్నీరు నాకో వరం' అనీ, జీవితంలో 'ప్రేమ రాహిత్య'మైనప్పుడు కన్నీరు కూడా ఆవిరై పోయి దు:ఖంతో కళ్ళు కాగి కన్నీరెండిపోవటం మనకు కంటతడిపెట్టిస్తుంది. అంటూ ఇన్ని రసాలు కురిపించి కేతవరపు రాజ్యశ్రీని అభినందిస్తారు డా॥ పి. యస్.మూర్తి.

ఆమె సందర్భానుసారము తన కవిత్వంలో రసపోషణ గావించడం చూడవచ్చు. ఒక కవిత రాసే క్రమంలో ఏ ఏ సామాగ్రి అవసరమో ఆమెకు తెలుసు. అందుకే ఆమె కవిత్వం పలువురి ప్రశంసలను అందుకుంటూ ముందుకు సాగుతున్నది.

**'అక్షరయానంలో అహరహం శ్రమించి**
**విశ్రాంతి అంటే రోజూ చేసే పనికి**
**భిన్నంగా చేసేదని నిర్వచనం చెప్పి**
**ఆశయాల నిచ్చనలు ఎక్కించావు'**

**అనారోగ్య అంపశయ్య మీద**
**పండుటాకులా పడుకుని కూడా**
**జీవితకాలపు ప్రేమ రాహిత్యాన్ని**
**నీ ఆర్ద్ర దృక్కులతో మటుమాయం చేశావు**

**నాన్నా! ఇన్నేళ్లుగా**
**నన్ను నడిపిస్తున్నది**
**నీవారసత్వపు వ్యక్తిత్వవికాసమే**
**నా కన్నీటిలో మెరిసేది**
**వెలకట్టలేని నీ జ్ఞాపకాలే**

అంటూ తండ్రి గురించి ఎంతో ఆర్ద్రంగా చెపుతారు రాజ్యశ్రీ. విలువలతో కూడిన జీవితం నుండి, ఆత్మీయతానురాగబంధాల నుండి వచ్చే కవిత్వం ఇలాగే ఉంటుంది. మమతానురాగాలు పంచిన తల్లిదండ్రులను ఎన్నటికీ మరిచి పోలేము కదా! ఆ జ్ఞాపకాలు తలవని తలంపుగా తలుపు తడుతుంటాయి. గడిచిపోయిన కాలంలోని గుండె చప్పుళ్లు మనవి మనదైన నాటి రోజుల్లోకి నడిపించుకుపోతాయి. ఒక్కోసారి అవి వేదనకు గురిచేస్తాయి. ఒక్కోసారి ఆనం దపు అంచులకు తీసుకు వెళుతుంటాయి. చూస్తుండగానే అంతటి మంచికాలం గడిచిపోయిందేమిటా అని తెలియని ఏవో ఆలోచనలు చుట్టుముడుతుంటాయి. ఇదీ అని చెప్పలేనితనాల్లోకి ఒక్కోసారి కూరుకుపోతుంటాము. నిస్సత్తువ ఆవరిస్తుంది. కొంత తేరుకొని ఆ ఆలోచనలకి అక్షరరూపం ఇచ్చినప్పుడు అద్భుత కవిత్వమవుతుంది. అలాంటి కవిత్వం శాశ్వతత్వం సంతరించు కుంటుంది. ఇలాంటివన్నీ మనం కేతవరపు రాజ్యశ్రీ కవిత్వంలో చూడవచ్చు. తల్లితోటి అనుబంధం, తండ్రి నుండి పొందిన అనురాగం అన్నీ ఆమె మస్తిష్కంలో నిక్షిప్తమై ఉన్నాయి. వారు ఆమె గుండె గోడలపై మమకారపు చిత్రాలుగా అలరారుతూనే ఉన్నారు. వీటన్నింటిని ఆమె కవిత్వంగా అందిస్తూ ఉంటారు. ఏ సందర్భానికైనా, ఏ వస్తువుకైనా ఆమె కవిత్వం ద్వారా న్యాయం చేయడమూ మనం ఆమె రచనలలో చూడవచ్చు.

ఒక్కోసారి ఒక కవయిత్రిలో ఇన్నిన్ని వైవిధ్యభరిత కవిత్వ దృశ్యాలను చూడటం ఆశ్చర్యమనిపిస్తుంది. క్షరంలేని అక్షరాలు/మోస్తున్న నిండు గర్భిణి/పుస్తకం అంటారు

ఒకచోట ఇటువంటి కవిత్వం వెనుక ఎంతటి ప్రతిభావ్యు త్పత్తులు ఉండాలి! ఎంతటి విశాల ఆలోచనలుండాలి. ఎంతటి అధ్యయన ముండాలి. అన్నీ ఆమెను వెన్నంటే ఉంటాయి.

ప్రసవించగానే కొన్ని అక్షరాలు/కిలకిల నవ్వుతాయి/కొన్ని గలగల మాట్లాడతాయి/ మరికొన్ని భాష్పాలు రాలుస్తాయి/కొన్ని అక్షరాలు/జీవిత లక్ష్యాలకు గవాక్షాలు తెరుస్తాయి/ మరికొన్ని విజ్ఞానపు అంచులు చూపిస్తాయి / కొన్ని అక్షరాలు ఆత్మీయంగా పలకరిస్తాయి/ మరికొన్ని/ఒంటరితనం తోడుగా ఉంటాయి/ కొన్ని ఆధ్యాత్మికతను అలవరుస్తాయి/ మరికొన్ని పరమాత్మను చేరే/మార్గం చూపిస్తాయి/నవరసాల నవనవోన్మేషణాన్ని/నిశ్శబ్దంగా మనిషి/మస్తిష్కంతో ఎక్కించి/మనోవికాసాన్ని కలిగిస్తూ/పరోపకార చింతనే/పరమావధిగా భావిస్తాయి. ఇటువంటివన్నీ రాజ్యశ్రీ కవిత్వంలో వెలుగులీనుతూ కనిపిస్తూనే ఉంటాయి. కాబట్టే అక్షరాలు ఏఏ భావాల్ని పలికిస్తాయో తెలపగలిగారు.

"నేటి నిజం" పత్రికా సంపాదకులు ఆరుపదుల్లోకి అడుగిడినా ....ఆరేళ్ల అమ్మాయిలా తలలో నాలుకలా అందరితో ఎంతో కలివిడిగా ఉంటారు కేతవరపు రాజ్యశ్రీ. 'నేటి నిజం'కు నా రచన పంపాను మీకు నచ్చితే ప్రచురించమని ఎంతో వినమ్రంగా రాజ్యశ్రీగారు ఫోనులో మాట్లాడినప్పుడు మాట్లాడటం ఒక కళ అనేకంటే మాట్లాడటం ఆమె సంస్కారానికి నిదర్శనం అనిపించింది.

జీవించడం వేరు, ప్రత్యేకతను సంతరించుకొని జీవించడం వేరు. మనం జీవించడంతో పాటు మనచుట్టూ ఉన్నవారి జీవితాలను అవగాహన చేసుకోవడం కవికి ఉండాల్సిన ముఖ్యలక్షణం. ఈ లక్షణమే మంచి కవిత్వాన్ని పండించడానికి వీలవుతుంది. ఈ దిశలోనే రాజ్యశ్రీగారి ప్రయాణం సాగుతోంది అని రాజ్యశ్రీగారి ఉన్నత వ్యక్తిత్వాన్ని మనముందుంచారొక చోట 'నేటి నిజం' పత్రిక సంపాదకుడు బైసా దేవదాసుగారు.

కేతవరపు రాజ్యశ్రీగారితో పరిచయమున్న ఎవరికైనా ఈ విషయం ఇట్టే అవగతమవుతుంది. దాన్ని తెలిపారు బైసా దేవదాసుగారు.

**'అమ్మను ఎన్ని కోణాల్లో**
**ఆవిష్కరించినా ఇంకా**

**కొరత మిగిలే ఉంటుంది**
**పొద్దుపొడుపుతో**
**నిద్దురలేచే అమ్మ**
**ఎత్తే అవతారాలెన్నో'**

అమ్మతనపు మమకారమే అలాంటిది. నిదురలేచింది మొదలు జీవనసమరం మొదలుపెడుతుంది. సంసారనావతో కష్టసుఖాల కడలితో అంతులేని ప్రయాణం ఆమెది. అన్ని పాత్రలను ఆమోఘంగా పోషించి అందరికీ అనురాగం పంచి న్యాయం చేస్తుంది అమ్మ. అటువంటి అమ్మ గురించి ఎంత చెప్పినా ఇంకా మిగిలే ఉంటుంది కదా! ఆ గ్రహింపు కల ఈ కవయిత్రి దాన్ని వ్యక్తం చేసే క్రమంలో అమ్మగా తాను అమ్మల గురించి వ్యక్తం చేసిన ఈ కవితలోని ప్రతివాక్యమూ నిత్యజీవిత సత్యం.

ఈ జీవిత ప్రయాణం ఎక్కడో అంకురంగా మొలకెత్తి ఎన్ని మజిలీలనో దాటుకుంటూ మొదలుపెట్టిన చోటుకే చేరుకుంటుంది. మొదలు, ముగింపుల మధ్య ఉన్న ప్రయాణమే జీవితం. మరి ఆ జీవితం ఎలా సాగించాలో, దేనికి ప్రాధాన్యతనిచ్చి నడవాలో తెలుసుకోవాలి. ఒక స్త్రీకి బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు తోడుంటాడు. అలాగే మగవాడి జీవితంలోనూ ప్రయాణం ప్రారంభించిన దగ్గర నుండి ముగింపు వరకు స్త్రీ పాత్రలు వెన్నంటే వస్తుంటాయి. స్త్రీగాని, పురుషుడు గాని ఈ యవనికై ప్రతి పాత్రకి న్యాయం చేయగలిగితే ప్రయాణం సుఖవంతమవుతుంది. లేకపోతే ఆటుపోట్లకు గురై కుమిలిపోవాల్సి వస్తుంది. అలాగే అంతర్గతంగా అలజడులు రేగి ప్రయాణం దు:ఖతీరాలకు చేరుతుంది. ఉన్నది ఒకటే జీవితం. ఉన్న ఒక్క జీవితాన్ని సౌందర్యవంతం చేసుకోవాలి. అలా చేసుకోవాలంటే ఒక నిర్దుష్టమైన ప్రణాళిక మనకుండాలి. అలా ఉన్నప్పుడు జీవితంలోని చిన్న చిన్న అడ్డంకులను అవలీలగా దాటి ప్రయాణం సాగించగలుగుతాము. అలా సాగే ప్రయాణంలో కళలకు, కవిత్వాలకు తావుంటుంది. అలాగే కళలను, కవిత్వాన్ని ఆహ్వానించే మనసూ అప్పుడే ఉంటుంది. ఇవన్నీ రాజ్యశ్రీగారిలో ఉన్నాయి. ఆమెకు ఒక ప్రణాళికాబద్ధమైన జీవనవిధానముంది. ఒడిదుడుకులను అవలీలగా ఎదుర్కో గలిగే నేర్పు, స్థైర్యం నిండుగా ఉన్నాయి. ఇదంతా మీకు ఆమె కవిత్వాన్ని చది వితే అర్థమవుతుంది. ఒక నిర్దుష్టమైన, ప్రణాళికబద్ధమైన

జీవితం లేకపోతే ఆమె ఇన్ని కార్యనిర్వహణా బాధ్యతలు తలకెత్తుకోలేదు. నడిచి వచ్చిన జీవితంలో ఎన్నో విజయాలు స్వంతం చేసుకోగలిగారు. అయినా ఆమెలో కించిత్తు గర్వం కూడా మనకు గోచరించదు. అదే ఆమెను ఇంకా ఇంకా ఎత్తుకు ఎదిగేలా చేస్తుంది.

**'చెట్లు**
**ఉరివేసుకుని**
**బహుళ అంతస్తుల**
**భవనాలకు ఊపిరిపోసాయి.**
**కొవ్వొత్తి తానుకాలిపోతూ**
**అంధకారాన్ని మింగేసి**
**వెలుగుదారి చూపుతుంది**
**తనడొక్కమాడ్చుకుని**
**పిల్లల భవితకు**
**పునాదులేస్తున్న**
**అమ్మలాగా!'**

ఈ కవితలో మూడు త్యాగచిహ్నాలు కనిపిస్తాయి. చెట్టు, కొవ్వొత్తి, అమ్మ ఈ మూడింటిని వాడటం వల్ల ఒక ఉదాత్తభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఒక్కో కవిత ప్రత్యేకించి కొన్ని ప్రతీకల్ని ఎక్కువ సందర్భాల్లో వాడుతుంటారు. ఇక కేతవరపు రాజ్యశ్రీ గారు 'అమ్మ' చెట్టును ఎక్కువగానే ఉపయోగించటం మనకు కనిపిస్తుంది. ఒక స్త్రీగా తన హృదయంలో ఇమిడి ఉన్న అమ్మను తన కవితా ప్రతీకల్లో వాడుకోవడంలో ఆశ్చర్యపడవలసిన పనిలేదు.

"కవయిత్రి శ్రీమతి కె.రాజ్యశ్రీ సాహిత్యంలో, లలితకళలలో విద్వాంసులైన వారి ఇంట జన్మించారు. ప్రస్తుతం వీరు సచివాలయంలో సహాయ కార్యదర్శిగా ఉద్యోగబాధ్యతలు నిర్వహిస్తున్నారు. బాధ్యతాయుతమైన పెద్ద పద విలో ఉండి కూడా ఆమెకు ఉన్న సాహిత్య వారసత్వం వల్ల సహజంగానే సాహిత్యం వైపు మొగ్గుచూపారు. సచివాలయంలోని 'చేతన' సాహితీ సంస్థకు అధ్యక్షురాలిగా, మహిళలకు ప్రధానంగా ఉపయోగకరంగా ఉండే పుస్తకాలే కాక, కవితా రచన చేసి పుస్తకాలు ప్రచురించారు. అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించి

పెద్దపెద్ద సాహితీవేత్తలతో పరిచయాలు పెంచుకున్నారు. ఈ నేపథ్యమే 'చిరుసవ్వడులు'అనే కవితా సంకలనం ప్రచురించడానికి కారణమయింది".

"ఈ గ్రంథంలోని కవితలన్నింటిలోను చైతన్యశీలి అయిన మహిళ తన చుట్టూ ఉన్న సమాజంలో వివిధ సందర్భాలలో పొందిన స్పందనలు ఉన్నాయి. అంతేకాకుండా ముఖ్యంగా సమాజంలోని విలువల గురించి స్పంద నలు కవిత్వీకరించారు. భారతీయ సమాజంలో మనుషుల మధ్య సంబంధాలూ, ముఖ్యంగా కుటుంబ చట్రంలో, సమాజ చట్రంలో నేటి మహిళ పొందుతున్న అనుభవాలు, అనుభూతులు, నేటి మహిళ జీవనసారం వర్ణించారు. భౌతిక ప్రపంచంలో వ్యక్తి తాను ఎన్నో సుసాధ్యం చేసుకున్నా, సమాజం ఎంత మారినా మనుషుల మధ్య సామరస్యమైన సంబంధాలు లేనిదే వ్యక్తికిగాని, సమాజానికి గాని మిగిలేది ఏమీ ఉండదనీ, మానవ సంబంధాలలో తల్లి పాత్ర ఉదాత్తమైనదనీ చెపుతారు. ఈనాటి తెలుగు భాషకు ఏర్పడిన పరిస్థితి నుంచి, పెరుగుతున్న ధరలు, ఉగ్రవాదం ఆమె కవిత్వంలోని వస్తువులు ఆమె కలం స్పందనలు.

ఆలోచనలలో, అనుభవాలలో, పరిణతి కలిగినవారు శ్రీమతి రాజ్యశ్రీ గారు" అని ఆనాటి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎ.మంజులతగారు కితాబిచ్చారు. 'చిరుసవ్వడులు'అనే కవితా సంకలనానికి రాసిన ముందుమాటలో. అది అక్షరసత్యమనే చెప్పుకోవాలి. కుటుంబ సంబంధాల పట్ల ఉన్నతమైన విలువలతో కూడిన ఆలోచనలున్నాయి. అమితంగా ప్రేమించే గుణం ఆమెలో గోచరిస్తుంది. ఇది భారతీయ కుటుంబాలలో కనిపించేదే

**'కన్నీరు నాకొక వరం**
**శబ్దరహితంగా**
**బాధను బహిర్గతం చేసి**
**మనసును తేలికపరిచే లేపనం'**

అంటారొక కవితలో రాజ్యశ్రీగారు. మనిషికి నీరెంత అవసరమో కన్నీరూ అంతే అవసరం. కన్నీరే లేకపోతే హృదయం బ్రద్దలై రుధిరం చిమ్ముతుంది. బాధలను అణిచిపెట్టటం చేయకూడని పని. ఆ బాధల నుండి కన్నీరు కొంత విముక్తిని ప్రసాదిస్తుంది. అదే అంటారు రాజ్యశ్రీ.

**ఆత్మజను అల్లుడికి అప్పగిస్తున్నప్పుడు**
**కొంగును నోటికి అడ్డం పెట్టుకుని**
**కళ్లతో ఆలపించిన**
**ఆనందవిషాదాల మౌనరాగం'**

భారతీయ కుటుంబవ్యవస్థలో వివాహం ఒక ముఖ్య ఘట్టం ఆడపిల్లకు పెళ్ళిచేసి అత్తవారింటికి పంపే సందర్భంలో అనివార్యంగా కలిగే బాధ పెళ్లిచేసిన తల్లిదండ్రులకు మాత్రమే తెలుస్తుంది. కాలం గడిచేకొద్ది ఆ బాధ మాయమవుతుంది. ఇక సాధారణ పరిస్థితులు నెలకొంటాయి. పెళ్ళి చేసి ఆడపిల్లను అత్తవారింటికి పంపుతున్నప్పుడు కలిగిన ఆ బాధకు కన్నీరే ఉపశమనం కలిగిస్తుంది. ఆ బాధలో కూడా కూతురికి ఒక తోడు దొరికి ఒక ఇంటిదౌతున్నదన్న ఆనందం కూడా అందులో ఉంటుంది. అందుకే రాజ్యశ్రీగారు ఆనంద విషాదాల మౌనరాగం అంటూ ఒక గొప్ప ప్రయోగాన్ని చేశారు.

కేతవరపు రాజ్యశ్రీగారు హైదరాబాదులో పుట్టిపెరిగినవారు. ఇక్కడే వారి మెట్టినిల్లు కూడా. ఇక్కడి యాస,భాషల పట్ల కూడా ఆమెకు అభిమాన ముంది. అందుకే తెలంగాణయాసలో ఒక వ్యవసాయ కూలీ అయిన ఒక మహిళ బాధను కవితారూపంలో వ్యక్తం చేస్తారు.

"పెయ్యిలోని పానమంతా/పొలంకాడ ఆవిరయిపోనాది/పోరలు ఆకలితో ఆగమవుతుంటరని/గబగబలాడుకుంటా/గుడిసెకాడికి లగెట్టుకొచ్చా/గంజికాసి పోసినంక సల్లబడ్డరుపిల్లోల్లు/ఒల్లుబగబగలాడుతుంది/పనికాడ ఎకిలసూపులు సూత్తరని/నిండా పైటసుట్టుకొని/ఉడకపోత బరాయించుకున్న/గొయ్యిలాంటి నులకమంచంలో పెయ్యిని దిగేశా/పిసరంతగాలి తొయ్యక/కొంగుదీసి పంకాలా ఇసురకుంటున్నా/యాడినించొచ్చాడో/ కల్లుకంపు కొట్టుకుంటూ/వంకర్లు బోతావచ్చి/ ఆబగా నా గుండెల్ని సూత్తన్నడు/ తాగుబోతునాయాలు/ఆని ఎకిలి సూపులకు/పోకిరిసేట్టలకు/వల్లంతా కంపరమైపోనాది/ ఏలాపాలా లేని వాడి సర సానికి/రస్తా అయింది నా మెల్లో తాలి/ఛీ/ రోతపుట్టినాది/ ఆడజలమ మీద/కూసింత తొంగుండనీకి కూడా/సొతంత్రం లేని బతుకు"ఇటువంటి కవితలతో ఆమె స్త్రీవాద కవయిత్రిగా దర్శనమిస్తారు. కూలీనాలీ చేసుకుని కుటుంబ

భారాన్ని మోసే స్త్రీల పట్ల రాజ్యశ్రీకి ఉన్న సానుభూతి ఎలాంటిదో కూడా మనకు అర్థమౌతుంది.

స్త్రీల కష్టాలను తనవిగా చేసుకొని రాజ్యశ్రీ చెప్పే విధానం వల్ల ఒక్కో సందర్భంలో మనం ఆ కవితా వస్తువులోని వేదనాభరిత దృశ్యాలలోకి ప్రవేశించి ఆవేదనను మనం కూడా అనుభవించాల్సివస్తుంది. ఏ ప్రయోజనం ఆశించి కవిత రాస్తాడో ఆ యొక్క కవితలోకి పాఠకుడు లీనమై కవి అనుభవించినది, పాఠకుడు కూడా అనుభవిస్తే ఆ కవి ఆశించిన ప్రయోజనం నెరవేరినట్టే. అలా ఆలోచించినప్పుడు రాజ్యశ్రీ కవితలకు అలాంటి ప్రయోజనాన్ని చేకూర్చి పెట్టగల శక్తి మెండుగా ఉంది.

**'ప్రతి పని**
**ఏదో ఒక**
**ప్రతిఫలాపేక్షతోనే**
**చేస్తాము**
**దానికి**
**కాస్త**
**మానవీయత**
**జోడిస్తే**
**ఆత్మానందం**
**కూడా**
**జత అవుతుంది'**

ఇలాంటి కవితలు రాజ్యశ్రీలో మానవీయకోణాన్ని ఆవిష్కరిస్తాయి. మనం ఎలాంటి పనులు చేస్తూ ఉన్నా మానవీయతని విడిచిపెట్టకూడదు! ఆ మాన వీయతే మనల్ని సంఘంలో మంచి వ్యక్తిగా నిలబెడుతుంది. తద్వారా ఒక ఆనందాన్ని కూడా ఇస్తాయి. ఒక కవిత రాసి తృప్తి పడటమంటే ఆ కవిత నుండి ఎంతో కొంత ఆనందాన్ని అందించాలి. రాసిన వారికే కాక చదివిన వారికి కూడా అలాంటి ఆనందాన్ని ఇచ్చినప్పుడు ఆ కవితకు సార్ధకత చేకూరు తుంది. రాజ్యశ్రీ కవితలకు ఆ సార్ధకత చేకూరే విధంగా ఉంటాయనడంలో సందేహం లేదు.

**గల్లీగల్లీకో**
**మద్యదుకాణానికి**
**'లైసెన్సు'ఇచ్చి**
**మరణమృదంగం మోగిస్తూ**
**మద్యపానం**
**ఆరోగ్యానికి హానికరం**
**అంటూ సర్కారు**
**సన్నాయినొక్కులు**
**'అశ్వద్ధామ హత:**
**కుంజరః' అన్నట్టు**

ఇదో దురదృష్టకరమైన విధానం. సర్కారుకు వచ్చే ఆదాయంలో ఎక్కువభాగం మద్యం అమ్మకాల నుండే. అభివృద్ధి చేస్తున్నామనే సర్కారు ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టటం ఘోరాతిఘోరం. కేవలం లైసెన్స్‌లు ఇవ్వడమే కాక షాపుల వారికి టార్గెట్స్ పెట్టి ఎక్కువ మద్యం అమ్మించే పనికి సర్కారు పాల్పడుతుంది. క్రమంగా మద్యం నుండి ప్రజల్ని దూరం చేయాల్సి ప్రభుత్వాలు వీధివీధిలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయించడం మనం చూస్తున్నది. ఈ మధ్య కల్తీకల్లుకు అలవాటుపడి అది దొరక్క పిచ్చివాళ్లగా మారుతున్న వాళ్లని చూస్తు న్నాం. ఆదిలోనే కఠినంగా కల్తీకల్లుపై దృష్టిపెట్టి ఉంటే ఇలాంటి దుస్థితి ఏర్పడక పోను కదా! మద్యమహమ్మారిపై సమరం చేయాల్సి ఉంది. సమాజం పట్ల బాధ్యత కలిగిన కవయిత్రిగా పై కవితలో ప్రభుత్వాలకు చురకలంటించారు రాజ్యశ్రీ.

"లఘుకవితా రూపాల్ని ఈనాడు విస్తృతంగా వినియోగిస్తున్నారు. మంచి కవులుగా తయారు కాదలచినవారికి ఇవి సోపానాలుగా ఉపయోగ పడవచ్చు. లేదా కవితాసృజనతో ప్రత్యేక కోశాన్ని ప్రతిభావంతంగా వినియోగిం చగలవారికి వాహిక కావచ్చు. ఎందుకంటే లఘు రూపాలకు వాటి ప్రత్యేకత, ఏ కాలంతోనైనా, ఏదేశంలోనైనా ఉంది. కొద్దిపాదాలతో ఒక పెద్ద వస్తువును మడిచిపెట్టడమనేది గొప్ప ప్రతిభకు సంబంధించిన విషయమే. చాటువులుగాని, వేమన శతకం లాంటి ముక్తకాలుగానీ, ఉర్దూ షేర్లుగానీ, జాపాను హైకూలుగానీ ఎన్నెన్నో ఇందుకు నిదర్శనం, ఒక్కొక్క రూపం,

సాధారణంగా ఒక్కొక్క వస్తువుకి మంచి వాహికవుతుంది, మినీకవితలో సామాజిక, హైకూలో అనుభూతి, రెక్కల్లో తాత్వికత గమనించగలం, అయితే క్రమపరిణామంలో ఏరూపమైనా వస్తు విస్తృతికి దారితీస్తుంది. కేతవరపు రాజ్యశ్రీ 'సిసింద్రీలు' మినీ కవితల్లో సామజికతయే ప్రధానంగా ఉంది. అక్కడక్కడ మిగిలిన వస్తువులు కూడా కనిపిస్తాయి. సామాజిక వస్తువును స్వీకరించడంలో, ఈనాడు మనం మన ప్రతినిత్యం గమనించే ఎన్నో అంశాలు రాజ్యశ్రీ మినీ కవితల్లో కనిపిస్తై'' అంటారు ప్రముఖ కవి, విమర్శకులు డా॥అద్దేపల్లి రామమోహనరావుగారు 'సిసింద్రీలు' మినీ కవితాసంపుటికి రాసిన ముందుమాటలో. రాజ్యశ్రీగారు వివిధ ప్రక్రియల్లో సాహిత్యసృజన గావించడం అది పదుగురిని ఆకట్టుకొని ప్రశంసలు పొందడం ఆమెలోని ప్రతిభకు తార్కాణంగా పేర్కొనవచ్చు.

**'ద్రోణుడు ద్రోహి!**<br>
**కాబట్టే**<br>
**ఏకలవ్యుడు**<br>
**ఖ్యాతిగడించాడు**<br>
**సాటిలేని మేటి**<br>
**విలుగాడుగా!'**

ఇదొక ఘాటైన విమర్శ, అయితే ఒక్క ద్రోణుడే కాదు మన పురాణాల్లోను ఇతిహాసాల్లోనూ అనేకమంది ద్రోహులు కనిపిస్తారు. కొంచెం రాజ్యశ్రీ వంటివారు వాటిని పరిశీలించి ప్రకటిస్తే బాగుంటుంది. శంబూకుని వధ ఎందుకు జరిగిందో, కర్ణుడుశాపాలకు ఎందుకు గురికావాల్సివచ్చిందో, మను వాదంలోని మర్మాలు ఏమిటో కవిత్వం ద్వారా తెలియజేస్తే బాగుంటుందను కుంటున్నాను.

**'స్త్రీ' ని**<br>
**అందలమెక్కిస్తూ**<br>
**ఉపన్యాసం**<br>
**ఇంటి ఇల్లాలికి**<br>
**మాత్రం**<br>
**దాన్నించి**<br>
**మినహాయింపు'**

పైకి ఒకటి మాట్లాడినా లోపలొకటి వుంచుకోవడం రాజకీయనాయకు లకే కాదు, అన్ని చోట్లా వున్నదే, ఈ దేశంలో మహిళకు జరిగిన, జరుగుతున్న అన్యాయాలు అన్నీ ఇన్నీ కావు, దీనిపై తీవ్రంగా పోరాడాల్సి వుంది. ఏదో ఒకటి చెప్పామని కాకుండా స్త్రీలు తమ ధిక్కార స్వరాల్ని వినిపించాల్సి వుంది. ఇక కవయిత్రులపై, రచయిత్రలపై చాలా బాధ్యత వుంది.

**'కులమతాలు**
**కతీతమని**
**బాస**
**కుర్చీ ఎక్కగానే**
**మనోడిమీదే**
**ధ్యాస'**

నేటి రాజకీయ నాయకుల నైజాన్ని వ్యంగ్యంగా వ్యక్తీకరించారు రాజ్యశ్రీ, రాజకీయ నాయకులు ఏ కులం వానికి టిక్కెట్ ఇస్తే గెలుస్తాడో అంచనాలు వేసుకుంటారు, రాజకీయాలు కులం కంపులో కొట్టుకుపోతున్నాయి. ఎవరైతే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయగలరో ఆలోచించడం ఏనాడో పోయింది, కుల సమీకరణాలంటూ మరింకేదో అంటూ ఎవరు ఎక్కువ ఖర్చుచేయగలరో అలోచించుకుంటూ పార్టీలు ముందుకు నడుస్తుంటాయి. ఇక రాజకీయం అంటే అసహ్యించుకునే పరిస్థితికి దిగజారిపోయింది. అవినీతి పరులు కాని వారిని అవినీతి పరులుగా మారుస్తున్న పరిస్థితి నేడు నెలకొనివుంది. లంచగొండితనం, కులపక్షపాతం, మతతత్వం ఇలా అనేకా నేకం రాజకీయాలలో ఏనాడో ప్రవేశించాయి. ఇది ఒక లాభసాటి వ్యాపా రంగా భావించడమూ పెరిగిపోతుంది. చట్టసభల్లో చర్చలు చూస్తూంటే వీధి రౌడీలకన్నా హీనంగా తిట్టుకోవడం, కొట్టుకోవడం కనిపిస్తున్నది. ఎవరికి ఎవరూ సమాధానం చెప్పలేని పరిస్థితి, ప్రతి రంగాన్ని భ్రష్టుపట్టించారు. ఇలాంటి వాటిపై ధ్వజమెత్తుతూ కవిత్వం రావాల్సి వుంది. పైకవితలో రాజ్యశ్రీ ఒక చిన్న చురక నంటిస్తారు. రాజకీయనాయకులకు వారి స్వరాన్ని ఇంకా పెంచాల్సివుంది.

**'పచ్చనోటుతో వల**
**చిక్కిన చేపకు**
**కడుపు నిండా సారా**
**ఐదేళ్ళ వరకు**
**లేవకుండా చెర!**

భారతదేశంలో ఎన్నికల తంతు అలా తయారైయింది. అందుకే కదా పార్టీలు ఖర్చు ఎంత పెట్టగలడో చూసి ఎక్కువ ఖర్చు చేసేవాడికి టిక్కెట్ ఇచ్చేది. ఖర్చు చేసి గెలిచినవాడు దానికి రెట్టింపు సంపాదించుకోవచ్చని ఆలో చిస్తాడు తప్ప ప్రజాక్షేమం వాడికి పట్టదు, ఇలాంటి విధానాన్ని ప్రక్షాళన చేయాల్సి వుంది.

**తానా ఆటా సిలికాన్**
**విదేశంలో మన సంస్కృతిని**
**చాటి చెప్పేసంస్థలు**
**అమెరికాకి**
**కులగజ్జిని**
**అంటించిన ఘనులు కూడా!'**

ఒక సాంస్కృతిక సంస్థలోనే కాదు అన్ని సంస్థల్లో కులాలు ప్రవేశించి భ్రష్టుపట్టిస్తున్నాయి. స్వయంగా గమనించిన వారు కాబట్టి మనవాళ్ళు అమె రికాలో కులాలవారిగా సంస్థల్ని నెలకొల్పినట్టు పై కవితలో తెలుపుతారు, ఒక పక్క మన సంస్కృతిని చాటుతున్న సంస్థల్లో కులాలకుళ్ళు ప్రవేశించడం దౌర్భాగ్య పరిస్థితి.

**'కుత్సిత వ్యవస్థ**
**అని పదేపదే**
**నిందించకు**
**దానిలో**
**నువ్వు కూడా**
**ఒక భాగమేనని**
**మరిచిపోకు!'**

ఇది ఒక ఆత్మపరిశీలనా కోణాన్ని ఆవిష్కరిస్తుంది. ఎవరికి వారు ఆత్మ పరిశీలన చేసుకొని తమలోని తప్పులను సరిదిద్దుకుంటే సమాజం మారుతుంది. ఇది ఏ ఒక్కరికో పరిమితమైనది కాదు, అందరూ ఆ దిశగా ఆలోచించాల్సివుంది. ఇది విశాలంగా ఆలోచించాల్సినది. ఆ భావంతోనే కేతవరపు రాజ్యశ్రీగారు పై కవితను మనకందించారనిపిస్తుంది.

**'ఆడశిశువుగా జన్మించినందుకు**
**తల్లిదండ్రుల ఏడుపు**
**నిద్రపోనీయలేదు**
**బాలికనయ్యాక**
**అరవ చాకిరీ**
**నిద్రపోనీయలేదు**
**కన్నెనయ్యాక**
**వెకిలి చూపులు**
**నిద్రపోనీయలేదు**
**మగనాలినయ్యాక**
**మగడు నిద్రపోనీయలేదు**
**తల్లినయ్యాక**
**పిల్లలు**
**నిద్రపోనీయలేదు**
**అవ్వనయ్యాక**
**ఆయాసం**
**నిద్రపోనీయలేదు**
**ఎన్నాళ్లనుంచో తీరని కోరిక**
**హాయిగా ఆదమరిచి నిద్రపోవాలని**
**ఆకోరిక తీరేది బహుశః**
**మృత్యు దేవత ఒడిలోనేనేమో?'**

ఆడదానిగా జన్మించినందుకు జీవితమంతా కష్టాలతో, కన్నీళ్ళతో, దుఃఖంతో, శోకంతో, చాకిరితో, బాధతో అశాంతిగా బ్రతకవలసిరావడం శోచనీయం. ఒక స్త్రీగా, స్త్రీల కష్టాలను తెలుసుకున్న వారిగా స్త్రీ గురించి వివరిస్తారు రాజ్యశ్రీ. ఇందులో ఎంతో వాస్తవికత వుంది. తరతరాలుగా స్త్రీని ఒక బానిసను చేసి వారికి సుఖం లేకుండా చేస్తున్నది మన సమాజం, ఆకాశంలో సగభాగమైన స్త్రీకి కూడా స్వేచ్ఛ అవసరమని గుర్తించాలి. వారికి కొన్ని ఆశలుంటాయి. కోరికలుంటాయి. వాటిని నెరవేర్చుకోవాలని ఆశపడుతుంటారు. స్త్రీ,పురుష భేదభావం నశించి అందరూ సమానమనే ఆలోచన చేయాల్సి వుంది. స్త్రీని పంజరంలో బంధించి వుంచడం ఘోరం. స్త్రీ జీవితానికి కూడా సుఖం, శాంతి, స్వేచ్ఛ అవసరమని గుర్తించాలి. స్త్రీలు తమ బాధ్యతల నుండి ఏనాడు తప్పుకు పోవాలని చూడరని, అలాంటి స్త్రీల మీద పెత్తనం చేస్తూ వారిని చిన్న చూపు చూడటం నేరం. ఆడపిల్ల అయినా, మగపిల్లవాడైనా ఒక్కటేనని అందరూ తెలుసుకొని తీరాలి. స్త్రీలు ఎంతో ఎత్తుకు ఎదిగిన, ఎదుగుతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కొందరు ఈ విషయాలను పక్కనపెట్టి భ్రూణహత్యలకు పాల్పడుతున్న సందర్భాలూ వున్నాయి. ఇటువంటి పైశాచికత్వానికి ఒడికట్టటమంటే మానవీయతను మంటకలపటమేనని తెలుసుకోవాలి. ఇటువంటి ఆలోచననలన్నీ చేస్తూ కవిత్వంగా మలుస్తారు రాజ్యశ్రీ. రాజ్యశ్రీ కవిత్వానికి ఆ పదును కూడా ఎక్కువగానే ఉన్నది. ఒక సమస్యపై కవిత్వం రాసే క్రమంలో ఆమె కవిత్వం అక్కడక్కడ పల్చగా ఉన్నట్టు అనిపించవచ్చునేమోగానీ ఆ సమస్య తీవ్రతను తక్కువగా చూడలేం. వైవిధ్య వస్తు సముదాయం ఆమె కవిత్వం నిండా పరుచుకొని వుంటుంది.

**"మనది ప్రజాస్వామ్య దేశమని**
**ప్రపంచంలోనే అతిపెద్ద**
**ప్రజాస్వామ్య దేశమని**
**చాలా గర్వంగా వుండేది**
**కానీ నేడు**
**ఆ ప్రజాస్వామ్యాన్ని నడిపించేదెవరు?**
**ప్రజలా? ప్రభుత్వమా**

**నాయకులా? ఎన్నికలా?**
**కాదు - కానేకాదు**
**వీళ్ళందరికీ అతీతంగా**
**నిశ్శబ్దంగా చాపకిందనీరులా**
**ప్రజాస్వామ్యాన్ని నడిపిస్తున్నది**
**మద్యం మాఫియా!!'**

ఎంతటి ధిక్కారంతో వినిపిస్తారో కవితను, ప్రజా ప్రభుత్వాలు మద్యం,మా ఫియా గుప్పిటలో ఇరుక్కోవడం సిగ్గుచేటైన విషయం. మద్యం, మాఫియాలు రాజకీయ నాయకుల అవతారమెత్తడం కూడా వున్నది. ప్రజాస్వామ్యం అప హాస్యం పాలు కావడంలో మద్యం,మాఫియాలతో రాజకీయ నాయకులు లాలూచీ పడటం కూడా ఒక కారణమే. ఎన్నికల్లో పోటీచేసే వారందరికీ ఈ మద్యం మాఫియాలు డబ్బులు, మద్యం అందజేస్తారు. ఎవరు గెలిచినా మద్యం మాఫియాలు వారితో తమకు కావల్సినట్టు పనులు చేయుంచుకోగలరు. ఇటు వంటి విషయాలు అందరికీ తెలిసినవే అయినా వాటిని వెల్లడించడానికి ఎవరికి వారికి భయమే. ఇటువంటి విషయాలను ధైర్యంగా వెల్లడిస్తారు రాజ్యశ్రీ. దీనిలో ఎటువంటి బెరకుతనమూ లేదు. ఇది ఒక ధర్మాగ్రహం.

ఇలా సమాజంలో జరిగే అనేక సంఘటనలపై ధర్మాగ్రహన్ని వ్యక్తం చేసే రాజ్యశ్రీలో ఆధ్యాత్మిక పాళ్ళూ ఎక్కువే సుగమ్‌బాబుగారు సాహిత్యంలో ప్రవేశపెట్టిన రెక్కల్లో గీతామృతాన్ని రచించారు. ఇందులో అనేక ఆధ్యాత్మిక విషయాలు తెలుపుతారు. "కవయిత్రిగా, ఆధ్యాత్మిక వ్యాసకర్తగా పేరు తెచ్చుకున్న డా॥కేతవరపు రాజ్యశ్రీ "రెక్కలో గీతామృతం" అందించడం ముదావహం.

కాలాన్ని బట్టి కొత్తగా వస్తున్న ప్రక్రియల్లో రెక్కలు ఒకటి. సుగమ్ బాబుగారు ఏక్షణంలో ఈ ప్రక్రియను ఆరంభించారోగాని ఎంతో మంది కవులు దాన్ని సమాదరించారు. సాహితీలోకం ఆదరణను బట్టి సుగమ్‌బాబుగారు స్వయంగా 'ధమ్మపదం'ను 'రెక్కల్లో' అందించి కావ్యజగత్తుకే మహోపకారం చేశారు. ఇప్పుడు రెక్కల్లో భగవద్గీత అవతరించింది. 700శ్లోకాలతో అలరారే భగవద్గీతను రాజ్యశ్రీగారు బాగా పరిశీలించిరి. 108 శ్లోకాలను ఏరుకొని గీతాసారాన్ని అందించారు. అధ్యాయాల వంక వెళ్ళకుండా అసలు విషయాన్ని

మరవకుండా కొనసాగిన ఈ కవితారూపానువాదం కమనీయం ! రమణీయం" అంటూ కేతవరపు రాజ్యశ్రీని మెచ్చుకుంటారు రెక్కల్లో గీతామృతం 'పుస్తకానికి రాసిన ముందుమాటలో ఆచార్య మసన చెన్నప్పగారు.

**చిరిగిన వస్త్రం వదిలి**
**నూతన వస్త్రం ధరించినట్టు**
**కొత్తదేహంలోకి**
**ఆత్మప్రవేశం**
**శరీరం**
**నశ్వరం!**

ఈ రెక్కలో దేహం శాశ్వతం కాదు. ఆత్మ శాశ్వతమైనది. కాలం తీరిన దేహం నుండి ఆత్మ కొత్త శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఈ సత్యాన్ని శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధిస్తాడు. ఈ శ్లోకాన్ని పామరులకు కూడా అర్థమయ్యేరీతిలో రాజ్యశ్రీ తేలికభాషలో తెలుపుతారు.

**పుట్టుట**
**గిట్టుట/మరల పుట్టుట/**
**తథ్యం**
**తప్పనిదానికి**
**దుఃఖమేల?**

పుట్టినవాడు మరణించడం, మరణించినవాడు మరలాపుట్టుట తప్పనిసరి అయినది. దుఃఖపడ్డా, పడకున్నా ఇది తప్పని సరిగా జరిగేదే. అటువంటప్పుడు దుఃఖపడటమెందుకు అని శ్రీకృష్ణుడు అర్జునునికి తెలిపిన ఒక సత్యాన్ని రాజ్యశ్రీ తెలుపుతారు. ఆధ్యాత్మిక ప్రపంచంలోని వారికి దక్కే తృప్తి ఏదో రాజ్యశ్రీ గారికి దక్కుతుందేమో తెలియదు కానీ ఆమె గీతలోని 108శ్లోకాలను తీసుకొని తెలిపిన విధానం మాత్రం చాలా బాగుంది. మనం వీటన్నింటిని నమ్ముతామా! నమ్మమా? అనేది వేరే విషయం. అయితే కవిత్వపరంగా ఆమె చెప్పినదేమిటి అనేదాన్నే తీసుకుందాం! అయితే ఇదంతా శ్రీకృష్ణుడు అర్జునునికి తెలిపినదిగా భావిం చబడుతున్నది కాబట్టి ఆ దారిలో నడిచేవారిని ఆకట్టుకుంటుందని చెప్పటంలో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు.

**అగ్నిని పొగ**
**అద్దాన్ని ధూళి**
**పిండాన్ని మాయ**
**కప్పేస్తాయి.**
**అలాగే కోరికలు**
**జ్ఞానాన్ని.....**

ఇలా ఈ గీతామృతంలోని రెక్కలన్నీ భగవద్గీతలోని శ్లోకాలపరంగా రాసి తనదైన ప్రతిభను చాటుకున్నారు రాజ్యశ్రీ.

"భారతీయ వేదాంతసారం భగవద్గీత. కర్మ, జ్ఞాన, భక్తి, ధారల త్రివేణీ సంగమమైన 'గీత' ఆచరణాత్మక తత్త్వం. అందుకే శ్రీకృష్ణ గురోపదేశమైన గీతోపదేశానికి ఆధ్యాత్మిక ప్రపంచంలో గురుస్థానం ఉంది. వివిధ భాషల్లో అనువాదాలు, వ్యాఖ్యానాల ద్వారా విశ్వవాప్తమైంది. జరామరణాలు దుఃఖభాజకాలు. మానవ జీవితంలో తలెత్తే శోకగ్రస్త సమస్యలన్నిటికీ పరిష్కారం చూపి సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుంది గీత. అల్పుడననే భ్రాంతి నుండి విముక్తి కలిగించి జీవనయానం ముందుకు సాగటానికి తోడ్పడుతుంది. కింకర్తవ్యంలా మూఢుడైన నరుడు, నారాయణుని ప్రభోదంతో సమస్యా సోపానాలను అధిగమించి పరిపూర్ణతను పొందాడు. "గీతాతత్త్వాన్ని చాటే 108 శ్లోకాలను ఎన్నుకుని కవ యిత్రి రాజ్యశ్రీ గీతామాధుర్యాన్ని పాఠకులకు చవిచూపారు. మూలంలోని భావాలను పఠితలకు కరతలామలకం గావించారు" అని రాజ్యశ్రీ రాసిన 'రెక్కల్లో గీతామృతం' పుస్తకానికి రాసిన ముందుమాటలో ఆచార్య ఎస్వీ రామారావు గారు అంటారు.

**"నెత్తావిని గాలిమోసుకెళ్ళినట్టు**
**గత జీవిత భావపరంపరను**
**జీవుడు మోసుకెళ్తాడు**
**కొత్తజన్మలోకి"**

వంటి కవితా పంక్తులు గీతనే అనుసృజనలా ఆహ్లాదం కలిగిస్తాయి. గీతాసారాన్ని దేశీకవితా ప్రక్రియ అయిన 'రెక్కల్లో' రాయడం ఈ గ్రంథంలోని విశిష్టత. నాలుగు చిన్న

పాదాల తర్వాత ముక్తాయింపు చరణాలు కవయిత్రి ప్రతిభను నిరూపిస్తాయని కూడా అంటారు ఎస్వీరామారావుగారు. ఈ గీతామృతాన్ని ఇంగ్లీషు, హిందీ, కన్నడ భాషలలో కూడా వెలువడి ఇతర భాషా కవులు మన్ననలు పొందడం జరిగింది.

డా॥ కేతవరపు రాజ్యశ్రీ మానవ సంబంధాలకు సంబంధించిన కవితలు రాజకీయ కవితలు, సమాజాభ్యుదయం కోసం రాసిన కవితలు, ఆధ్యాత్మిక కవితలు, ఆధ్యాత్మిక వ్యాసాలు, రెక్కలో గీతామృతం  అనేకానేకం ఆమె సృజనలో ఉన్నాయి. ఆమె ఏదో ఒక వాదానికిగాని, ఏదోఒక ఇజానికిగాని సంబంధించిన కవయిత్రికాదు. ఈమె రచనల్లో స్త్రీవాద కవిత్వమూ వుంది. అభ్యుదయ కవిత్వమూ వుంది. శిరిడిసాయి మీద రాసిన కవిత్వమూ వుంది. ఆమెలో కలిగే చలనాల వల్ల ఆమెలో కలిగే భావాలవల్ల ఆమె విన్నవి, కన్నవి, ఆమెకు మంచిగా అనిపించినా, బాధ కలిగించినా, వేదన పొందినా, ప్రకృతిలో పరవశిం చినా ఆమె కవిత్వం రాశారు. ఒక నిర్దుష్టమైన నిబ్ధతగా కాక విస్తృత పరిధిగా సాగిన ఆలోచనలు ఆమెలో కలిగించిన భావావేశాలు అన్నీ కవిత్వంగా రూపు దిద్దుకున్నాయి. అది ఆమె స్వేచ్ఛ అనే అనుకుందాం. ఒక రచయిత్రిని అంచనా వేయడానికి ఆమె కవిత్వం, ఇతర సాహిత్య ప్రక్రియలు మనకు తోడ్పడతాయి. అలాగే కేతవరపు రాజ్యశ్రీ కవిత్వాన్నీ,  అలాగే ఆమె సాహిత్య సృజనలో ఉన్న పలు అంశాలను పరిశీలించి ఈ సుదీర్ఘ వ్యాసాన్ని రాయడం జరిగింది. నేను సాహిత్యంలో నూతనంగా ప్రవేశపెట్టిన ఈ ప్రక్రియలో ఆమెకు వేసిన నూరు ప్రశ్నలకు ఆమె పూర్తి సమాధానాలిచ్చారు. వాటిలో కూడా కేతవరపు రాజ్యశ్రీ సాహిత్యాన్ని, ఆమె భావజాలాన్ని మనం అంచనా వేయివచ్చు. ఈ వ్యాసం ద్వారా కేతవరపు రాజ్యశ్రీ మనకు సాహిత్యపరంగా ఏమిటో పూర్తిగా పరిచయ మవుతుందని భావిస్తున్నాను.

మీ

*నియోగి*

28-10-2015

సమయం - ఉదయం - 6 గం॥ల 30ని॥లు

సెల్. నెం. 9553097319

# వంద ప్రశ్నలు – వేల అనుభావాలు

**1. మొదటిగా మీకు సాహిత్యం పట్ల అభిరుచి కలగడానికి ప్రేరేపించిన అంశాలు ఏమిటి?**

**జ :** సంగీత సాహిత్యాల సమ్మేళనం మా కుటుంబం. మా తాతగారు కీ.శే.విద్వాన్ మహాకాళి వేంకటేశ్వరరావుగారు చెళ్లపిళ్లవారి శిష్యులు, బహుభాషాకోవిదులు. అష్టావధానం, శతావధానం చేశారు. 'శ్రీవేంకటేశ్వరశతకం' రచించారు. హిస్టరీ, జాగ్రఫీలో వారు రాసిన పుస్తకాలు పాఠ్యాంశాలుగా వుండేవి. తెలుగు–ఇంగ్లీషు డిక్షనరీ రాశారు. అవన్నీ కూడా చిన్నప్పుడు మాచేత ఫెయిర్ కాపీ చేయిం చేవారు. దానివలన చక్కని భాషాపరిజ్ఞానం, స్ఫూర్తి వారి వద్ద నుంచి నాకు లభించిన అమూల్యసంపద.

మా నాన్నగారు కీ॥శే॥ మహాకాళి వేంకటరావుగారు తండ్రిని మించిన తనయుడు. వృత్తి రీత్యా ఏ.జి ఆఫీసులో పనిచేసినా, ప్రవృత్తిరీత్యా, కవి, నటులు, నాటక రచయిత, జ్యోతిష, వాస్తు శాస్త్ర పండితులు. అమిత భక్తితత్పరులు. లలితా ఉపాసకులు. చిన్నతనం నుంచి మాకు శ్రీలలితా సహస్రనామ పారాయణ నేర్పించారు.

మాఅమ్మ శ్రీమతి ప్రభావతి వీణావిద్వాంసురాలు. అమ్మతోపాటు వీణా కచేరీలకు, నాన్నతోపాటు కవి సమ్మేళనాలకూ, సాహితీసమావేశాలకూ వెంట వెళ్లడం వలన సంగీత సాహిత్యాభిలాష సహజంగానే అలవడింది.

నేను 1977లో సచివాలయంలో ఉద్యోగంలో చేరాను. అప్పటికే నేను B.Com., Shorthand, Typewriting హైయర్‌గ్రేడ్ పాసయ్యాను. ఉద్యోగంలో చేరిన తరువాత ఉస్మానియా యూనివర్సిటీలో Exteral Educationలో M.Com పాస్ అయ్యాను. ఎందుకంటే మా నాన్నగారికి తన పిల్లలందరినీ పోస్ట్‌గ్రాడ్యుయేట్స్ చేయాలని కోరిక ఎం.కాం. అయిన తరువాత ఉద్యోగంలో చేరవచ్చన్నారు. కానీ నాకు ఉద్యోగం చేసి, నాన్నగారి బాధ్యత పంచుకోవాలని కోరిక. అందుకే ఉద్యోగంలో చేరినా, ఎం.కాం. చేస్తానని నాన్నగారికి మాట ఇచ్చి, ఆఫీసు అయిన తరువాత, యూనివర్సిటీలో స్పెషల్ క్లాసెస్ అటెండ్ అయి ఎం.కాం. పాస్ అయ్యాను.

యాంత్రికమైన ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులకు, వారి అంతరంగంలో నిగూఢంగా వున్న సాహితీ ఆర్తిని తృప్తిపరచి మనోల్లాసం కలిగించడానికి "చేతన సచివాలయ సారస్వత వేదిక" అనే సాహితీ సంస్థను స్థాపించుకున్నాము. చేతన సంస్థ నెలనెలా సాహితీ కార్యక్రమాలు, చర్చలూ గోష్టులూ, కవిసమ్మేళనాలు నిర్వహిస్తూ వచ్చింది. శ్రీయుతులు మధురాంతకం రాజారాం, ఆచార్య తిరుమల అద్దేపల్లి రామ్మోహనరావు, తనికెళ్ల భరణి, నండూరి రామకృష్ణమాచార్య ఇలా అనేక మంది సాహితీ ప్రముఖులు చేతన వేదిక మీద ప్రసంగించి ఉద్యోగుల్లో సాహిత్యం పట్ల అభిమానాన్ని పెంపొందించారు.

కొంత కాలానికి 'చేతన' లో చైతన్యం తగ్గింది. కార్యక్రమాలు నిర్వహిం చడానికి రూపాయి కూడా సంస్థకు లేని పరిస్థితి. ఆ తరుణంలో 2006లో నన్ను అధ్యక్షురాలిగా ఎన్. ప్రసాద్‌ను కార్యదర్శిగా ఎంపిక చేసి, చేతులు దులుపుకుని ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోయారు.

వృత్తిరీత్యా పదోన్నతులు పొందుతూ, ఉపకార్యదర్శినైనా, ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, ప్రవృత్తిగా చేతన అధ్యక్షురాలిగా అనేక కార్యక్రమాలు నిర్వహించాను. కొంత నా చేతిమీద, కొంతసాహిత్యాభిమానుల ఆదరణతో నెలకొక కార్యక్రమ ఖర్చును ఒకరు భరించే విధంగా నచ్చచెప్పి, నెలనెలా సాహితీ కార్యక్రమాలు నిర్వహించాను.

శ్రీ వ్యయనామ సంవత్సర ఉగాదికి కవితాపోటీలు నిర్వహించి ప్రధమ,ద్వితీయ,తృతీయ బహుమతులు, ఇంకా ప్రోత్సాహక బహుమతులు పెట్టాము. దానితో చేతన తిరిగి చైతన్యం సంపాదించుకుంది. అనేక మంది దీనిలో సభ్యులుగా చేరారు. సభ్యత్వ రుసుము రూ. 50/- పెట్టాము. కొంత డబ్బు సమకూరింది. ఈ పోటీలకు రావూరి భరద్వాజగారిని న్యాయ నిర్ణేతలుగా పెట్టాము. దానిలో నేను రాసిన కవిత "రూపాయి"కి ద్వితీయ బహుమతి వచ్చింది. మొదటి బహుమతి జూపాక సుభద్రకి, తృతీయ బహుమతి శ్రీమతి ఆదిలక్ష్మికి వచ్చినాయి.

నా కవితకు ద్వితీయ బహుమతి రావడంతో నాకు కొంత ఆత్మవిశ్వాసం వచ్చింది. తరువాత ఒంగోలులో తెలుగు రచయితల సమావేశాలకు ఆహ్వానం వచ్చింది. వారు

నిర్వహించిన స్త్రీల కవిసమ్మేళనంలో నేను "సహస్రావధాని" అనే స్త్రీ వాద కవిత, చదివాను. దానికి విశేష స్పందన వచ్చి, స్టేజి దిగిన తరు వాత చాలామంది నాదగ్గరకి వచ్చి, "చాలా బాగుంది మీ కవిత" అని చెప్పి నా ఫోన్ నంబరు తీసుకొనడంతో నా కవితా ప్రస్థానం మొదలయింది.

తరువాత సచివాలయంలోని "చేతన" నిర్వహించిన కవితాపోటీలకు వచ్చిన కవితలన్నీ ఒక సంకలనంగా తేవాలని సంకల్పం కలిగింది. ప్రిన్సిపల్ సెక్రటరీల దగ్గర వున్న పి.ఎలను కలిసి, వారి ద్వారా కొన్ని అడ్వర్‌టైజ్‌మెంటులను సంపాదించి ఆ డబ్బుతో "కవితా చేతన" అన్న కవితల సంకలాన్ని ప్రచురిం చాము. శ్రీ ఎన్. రామనరసింహ (సరసి) మంచి కార్టూనిస్ట్. చేతన సభ్యులు. ఆయన ఈ పుస్తకానికి ముఖచిత్రం, కవితలకు రేఖాచిత్రాలు గీసి పుస్తకాన్ని అందంగా మలిచారు. ఇదే ఉత్సాహంతో సచివాలయలోని రచయితలు రాసిన కథలను "చేతన కథాఝురి" అనే పుస్తకంగా వెలువరించాను.

"గృహహింస చట్టం మహిళకు రక్షణకవచం" అనే పుస్తకాన్ని, నేను స్వయంగా సమాచారం సేకరించి, క్రోడీకరించి, సమాచారాన్ని, ఫోన్ నంబర్లతో సహా ప్రచురించి, డా॥ కిరణ్ బేడి ఐ.పి.ఎస్ గారిచేత ఆవిష్కరింప చేశాము.

చేతన పరిధిని విస్తరింపచేసి, పర్యావరణ దినోత్సవం, మహిళా దినోత్సవాలనూ నిర్వహిస్తూ వచ్చాము.

ప్లాస్టిక్ సంచుల నిషేధం గురించి అవగాహనా సదస్సులు నిర్వహించి, ప్లాస్టిక్ సంచులకు బదులుగా నూలు సంచులు కుట్టించి, డా॥ అక్కినేని నాగేశ్వరరావు గారిచే నూలు సంచుల పంపిణీ కార్యక్రమము నిర్వహించాము.

సాహిత్యాభిమానులు చేతన కార్యక్రమాలకు మురిసి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు సహాయమే కాకుండా, వారి పరపతిని ఉపయోగించి, ప్రకటనలు ఇప్పించి చేతన కార్యక్రమాలు నిరాఘాటంగా కొనసాగడానికి సహాయ సహకారాలు అందించారు.

ఒక్క రూపాయి కూడా లేని "చేతన" సంస్థను బ్యాంక్ అక్కౌంట్ ఓపెన్ చేసే స్థాయికి తీసుకువచ్చి కార్యక్రమాల నిర్వహణకు డబ్బు ఇబ్బందులు లేకుండా చేశాము.

నేను రిటైర్ అయి 4 సం.లు అయినా చేతనకు గౌరవ అధ్యక్షురాలుగా కొనసాగుతూ, కార్యక్రమంలో పాలుపంచుకునే విధంగా, ప్రస్తుత చేతన అధ్యక్షురాలు శ్రీమతి జి.కృష్ణవేణి, చంద్రశేఖర్ మొదలైన వారు నన్ను గౌరవి స్తున్నారు.

నేను సచివాలయములో కనపడగానే, ఇవాళ 'చేతన' కార్యక్రమం వుంది కదా! చేతన అనగానే 'రాజ్యశ్రీ' అని గుర్తుకొచ్చే విధంగా దానిలో మమేకమై పోయారని కనపడిన ప్రతి ఒక్కరూ చెబుతూ వుంటారు.

చేతన ప్రచురించిన కవిత, కథా, కదంబ పుస్తకాల ఆవిష్కరణ సభలకు గొప్పగొప్ప సాహితీవేత్తలను పిలిపించి, ఆవిష్కరింపచేసి వారిచే సచివాలయ ఉద్యోగులలో కవితా పటిమకు మెరుగులు పెట్టే విధంగా సూచనలు, సలహాలు ఇప్పించాము. వారిలో డా॥ మల్లెమాల, డా॥ సి.నా.రె. డా॥ ఎన్. గోపి, అద్దేపల్లి మొదలైన ప్రముఖులున్నారు.

ఇలా ప్రతినెల పెద్ద పెద్ద కవులతో పరిచయం, వారితో మాట్లాడినప్పుడు వెలువడిన కవితా సుగంధం నాలో అప్పుడప్పుడు తొంగిచూస్తున్న కవితాఆర్తికి బలం చేకూర్చింది. డా॥ ఎన్. గోపీగారు చేతన వేదిక మీద ప్రసంగించినప్పుడు, నానీల గురించి చెప్పి తాను రాసిన నానీల పుస్తకం అందరికీ పంచిపెట్టారు. ఆ నానీలు నన్ను బాగా ఆకర్షించాయి. నాలుగు లైన్లల్లో చక్కని భావం వ్యక్తీకరించే అవకాశం, దానికి అక్షరసంఖ్య నిబద్ధత వున్నా ఏవిధమైన ఛంధస్సు అవసరం లేకపోవడం వలన, అడపాదడపా నానీలు రాస్తూ వినిపిస్తుంటే స్నేహితులు చాలా బావున్నాయి అనడం జరిగేది. అలా అలా 108 నానీలు రాసి "చిరుసవ్వ డులు"అనే నానీల సంకలాన్ని ఆగస్టు 21, 2008న ప్రచురించి, మా చేతన సంస్థద్వారా రావూరి భరద్వాజగారు, డా॥ పాలకుర్తి మధుసూదనరావు గారు, డా॥ ఆవుల మంజులత గారి చేతుల మీదగా ఆవిష్కరింపచేశాను. ఈ పుస్తక సమీక్ష ఈనాడు, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి ఇంక అనేక దినపత్రికలలో ప్రచురింపబడి, సామాజిక స్పృహ కలిగిన మంచి కవయిత్రిగా పేరు పొందాను.

చిరుసవ్వడులు పుస్తకం వెలువరించగానే, నేను ఏ అంశం మీద స్పందించినా, అది ఒక "నానీ"గా రూపుదిద్దుకుంది. అందుకే చిరుసవ్వడులు వచ్చిన 8 నెలలకే " గుండెచప్పుళ్లు" అనే మరో నానీల పుస్తకం వెలువరించాను. ఈ పుస్తకాన్ని నాఅభిమాన

నటుడు అక్కినేని నాగేశ్వరరావుగారికి అంకిత మివ్వడం, వారు దానికి అంగీకరించడమే కాక "నీ కృతిని నేను స్వీకరిం చాను కనుక నేను నీకు అల్లుడని, నువ్వు నాఅత్తగారివి ఇప్పుడు!" అంటూ చమత్కరించారు.

తరువాత "ఊహల వసంతం", "తప్తినీవెక్కడ?" "ఆకసాన్ని మింగాలని" అనే వచన కవితా సంపుటాలను, "సిసింద్రీలు" అనే మినీ కవితల సంపుటి, రెక్కల ప్రక్రియలో, "వెన్నెల మెట్లు", ముక్తకాలు, హైకూలు, వ్యాసాలు, ఆధ్యాత్మిక వ్యాసాలు రాస్తూ సాహితీ ప్రస్థానం కొనసాగిస్తున్నాను.

ఇప్పుడు రెక్కల ప్రక్రియలో "గీతామృతం" పుస్తకం రాశాను. ఇది తెలుగు, ఇంగ్లీషు, హిందీ, కన్నడ భాషల్లోకి అనువదించడం జరిగింది.

"ఊహల వసంతం" కవితాసంకలనానికి నెల్లూరు సృజన సాహిత్య సంస్థ మరియు విశ్వసాహితీ సంస్థ వారిచే ఉత్తమగ్రంథ పురస్కారం లభించింది.

"రెండో హనీమూన్" అనే హాస్యకవితకు ఉత్తమ హాస్యకవితా పురస్కారం లభించింది. నా సాహితీ ప్రస్థాన కొనసాగింపులో అనేక పురస్కారాలు, సన్మానాలు అందుకున్నాను. ఆధ్యాత్మికవేత్త, ప్రజ్ఞశ్రీ, సాహిత్యశ్రీ, స్త్రీ చక్ర, భారత భాషా భూషణ్, మదర్‌థెరిసా అవార్డు, గౌరవడాక్టరేటు మొదలైనవి కొన్ని మచ్చు తునకలు.

అలా మొదలైన సాహితీ ప్రస్థానం, హైదరాబాదు, మచిలీపట్నం, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, వరంగల్, కరీంనగర్, హుజూరాబాద్‌లో వున్న సాహితీసంస్థల అన్నిటి ద్వారా, సన్మానాలు, సత్కారాలు పొందడమే కాక, వారివారి సభలలో వేదికకు ఆహ్వానించి గౌరవిస్తున్నారు.

నా సాహితీ ప్రస్థానం అమెరికాలోనీ "తానా" సభలకు, లండన్‌లో "యుక్త" సభలకు, న్యూజెర్సీలోని తెలుగువాణి, సాహితీభారతీ సంస్థలకూ కూడా చేరుకుని, అక్కడ కార్యక్రమాలలో నా కవితాగానం చేయడం నాకు చాలా సంతృప్తినిచ్చింది.

**2. కవిత్వానికీ జీవితానికీ సమన్వయం ఎలాంటిది?**

**జ.** జీవితంలోంచే పుడుతుంది కవిత్వం. "రవిగాంచనిచో కవిగాంచును" అన్నారు.

ప్రతిమనిషి తాననుభవిస్తున్న జీవితం కన్నా, ఇంకా ఉన్నతంగా, జీవించాలని, ఊహాలోకాల్లో విహరించడం సహజం. ఊహలకి ఒకరూపమిస్తూ రాసే కవిత్వం ఎంతో ఆహ్లాదంగా మనసును ఆనందడోలికల్లో విహరింపచేసే విధంగా వుండి ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తుంది. ఆ ఊహల్ని నిజం చేసుకోగలిగేవారు కొందరు. మనకది అందని ద్రాక్ష పండని ఊహలకే పరిమితం చేసుకునేవారు మరికొందరు, ఇలా కవిత్వం కొందరిని ధ్యేయం చేరుకునేలా చేస్తుంది, కొందరికి ధ్యేయం పెట్టుకునేలా చేస్తుంది.

అలా కాకుండా ఇంకోరకం కవిత్వం మనజీవితంలోంచే పుట్టుకొస్తుంది. మన బాల్యంలో అనుభవించిన తీపి సంఘటనలుగానీ, చేదు అనుభవాలు, యవ్వనదశలో కలిగిన మధురోహలు, ప్రేమ, పెళ్ళి, చదువులు తరువాత మధ్యతరగతి సర్దుబాట్లు, వయసు మళ్ళిన తల్లిదండ్రులతో పడే ఇబ్బందులు వారి మనస్తత్వాలు, ఇలా మన చుట్టూ వున్న, మనతోనే ఉన్న సంఘటనలు కూడా కవిత్వాన్ని ప్రభావితం చేస్తాయి. జీవితాన్ని బాగా లోతుగా పరిశీలించి రాసే ఇటువంటి కవిత్వం ప్రతీమనిషి తనను ఆ కవిత్వంలో చూసుకునే విధంగా వుండి, మనలాంటి భావాలు కలవారు ప్రపంచంలో చాలామంది వున్నారన్న భావం కలిగి, జీవితాన్ని జీవించడం నేర్చుకుంటాడు.

ఇంకో రకం కవిత్వం సమాజ అసమానలతనూ, అన్యాయాన్నీ, పేదరికాన్నీ ప్రశ్నిస్తూ, ఆక్రోశిస్తూ రాసే కవిత్వం. అభ్యుదయ కవిత్వం అణగారిన జీవితాలను మేలుకొలుపు పాడుతూ, తిరగబడమని ప్రోత్సహించే కవిత్వం, ఈ కవిత్వం ద్వారా సమస్యలని ధైర్యంగా ఎదుర్కునే సాహసం, సమాజాన్ని ప్రశ్నించే ధైర్యం కలుగుతుంది.

శ్రీశ్రీగారి “పదండి ముందుకు పదండి తోసుకు” ప్రతిఒక్కరినీ ప్రభావితం చేసి ఆవేశపరచిన కవిత. కవిత్వం ఒక సంతోషంలోంచి పుడుతుంది ఒక బాధలోంచి పుడుతుంది. ఒక ఊహాలోంచి పుడుతుంది.

ఒకరికి కవిత్వం ప్రేయసీప్రియుల
సరససల్లాపాలు,ఎదురుచూపులు
ఒకరికి నిత్యజీవితంలోని సంఘటనలు
ఒకరికి కడుపుమండి అరిచే పిలుపులు

మనిషి భావోద్వేగాలు సమాహారమే కవిత్వం. మనిషికీ మనసుకీ ఉండే సమన్వయమే కవిత్వానికీ జీవితానికీ ఉండే సమన్వయం.

**3. అనుభవాల నుండి కవిత్వం ఉద్భవిస్తుందా? లేక అభ్యాసం వల్ల సృజనకారులుగా మారుతారా?**

**జ:** నేలవిడిచి సాము లేనట్టే, అనుభవాలతో సంబంధం లేని కవిత్వం ఉండదు. ఒక సామాజికుడు తాను సమాజంలో సంచరిస్తూ, సంఘర్షణలో పాలుపంచుకుంటూ ఉంటాడు. రోజూ తనచుట్టూ ఉన్నవాళ్లనూ, తననూ, ప్రభావితం చేస్తున్న అంశాలకు స్పందిస్తూ కవిత్వం రూపొందిస్తాడు. (కొందరికి జీవితానుభవాల నుంచి కవిత్వం ఉద్భవిస్తుంది)

గురజాడ గారు ఆనాడు సమాజంలో స్త్రీల పరంగా జరుగుతున్న దురాగతాలకు స్పందించి రాసిన కవిత్వమే 'పుత్తడిబొమ్మ పూర్ణమ్మ' అలాగే 'కన్యాశుల్కం'.

నేను ఒక ముక్తకంలో ఇలా రాశాను

**"నాడు కన్యాశుల్కం**
**నేడు వరకట్నం**
**ఏనాడూ లేదు మగువకు**
**మనువులో సుఖం"**

గురజాడ వారి టైమ్‌లో స్త్రీలు కన్యాశుల్క బాధితులు. మొగవాళ్లే ఎదురు డబ్బిచ్చి చేసుకున్నా, ముదుసలి వెధవలు ముక్కుపచ్చలారని ఆడపిల్లల్ని పెళ్లిచేసుకుని, రోగం రొస్టూతో బాధపడుతూ ఆ పిల్లచేత చాకిరీ చేయించుకుని, చివరికి పుటుక్కుమనేవారు. పదేళ్ల వయసుకే, ఆ చిన్నారి విధవరాలై, వంటింటికే పరిమితమై ఉండిపోయేది.

ఈనాడు వరకట్నం కోసం ఆడపిల్లల తల్లిదండ్రులను పీక్కుతింటూ, ఆడపిల్లల్ని కనాలంటేనే భయపడే విధంగా సమాజాన్ని తయారుచేశారు. అందుకే రోజురోజుకీ భ్రూణహత్యలు పెరిగిపోతున్నాయి. కావలసినంత కట్నం ఇచ్చి పెళ్లిచేసినా,మొగుడన్నవాడికి ఏ అవసరం వచ్చినా, వాడు స్కూటరు కొనుక్కో వాలన్నా, బిజినెస్ పెట్టాలన్నా భార్య పుట్టింటి నుంచి డబ్బులు తెమ్మని భార్యను వేధించడం కిరోసిన్ పోసి నిప్పంటించడం ఇలా రకరకాల గృహహింసలకు గురవుతున్నారు మహిళలు.

ప్రముఖ కవి నియోగి అంటారు

**పల్లెలో చావుకు**
**పత్తిగింజ కారణం**
**ఆ పత్తిగింజ ఎక్కడిదిరా పాలకుడా?**

రైతుల కడగండ్లను చూసి స్పందించిన కవిత ఇది.
ఇలా సామాజిక అంశాల పట్ల స్పందనే కవిత్వంగా ఉద్భవిస్తుంది.

ఒక కవి ఇలా రాశాడు

**"నడిచే వంటిల్లు**
**మా అమ్మ**
**వంటిట్లోని గిన్నెల మీద**
**నాన్నపేరు"**

ఇది చాలా సహజంగా అనాదిగా జరుగుతూ వస్తోంది. ఇది కవి, జీవితానుభవం నుంచి పుట్టిన కవిత.

**"యుగానికో అవతారం**
**సృష్టించాడు బ్రహ్మ**
**రోజులో పది అవతారాలు**
**ఎత్తుతుంది అమ్మ!"**

ఇది నా స్వానుభవంలోంచి వచ్చిన కవితలోని ఒక భాగం. పొద్దున్న లేచిన దగ్గర నుండి అమ్మ పనిమనిషి, ఇస్త్రీ చేసే (పిల్లల బట్టలు) రజకురాలు. చిందర వందర చేసి పోయిన ఇంటిని సర్దే ఇంటీరియర్ డెకరేటర్, వంటమనిషి. హోమ్‌వర్క్ చేయించే టీచర్, పిల్లల ఆటతో తగిలిన దెబ్బలకు ఫస్ట్ ఎయిడ్ చేసే డాక్టర్, ప్రేమతో అన్నం తినిపించే అన్నపూర్ణ, వీరుల కథలు చెబుతూ నిద్ర పుచ్చే వీరవనిత, భర్తనూ ఇంటినీ చూచుకునే ఇల్లాలు ఇలా అష్టావధానం చేస్తుంది స్త్రీ.

గుఱ్ఱం జాషువా తన జీవిత సంఘటనల ఆధారంగానే కవిత్వం రాశారు. అభ్యాసం వలన కవిత్వానికి పదును పెట్టగలుగుతాము. అంతేకానీ, సృజనకారులు కాలేరు. సమాజంలోని సంఘటనలకూ, జీవితంలోని సంఘుట నలకూ చలించిన ప్రతివారూ కవిత్వం రాయలేరు. ఈ మధ్య రెండు వాక్యాలను ముక్కలుగా ఖండించి, అర్థాన్ని నిలువుగా రాసి దాన్ని కవిత్వమంటున్నారు. వారికి తమ భావాన్ని వ్యక్తీకరించాలన్న ఉబలాటం ఉండటం మంచిదే! అయితే దాన్ని కవిత్వీకరిస్తే బాగుంటుంది. అది ఇతరుల రచనలు చదవడం వలన, అభ్యాసం వలన వస్తుంది. అభ్యాసం వలన సృజనకారులు కాలేరు. కానీ అభ్యాసం వలన స్పందనకు రూపమివ్వగలరు.

**4. కవిత్వానికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి?**

**జ:** ప్రపంచంలో ఇంతవరకూ కవిత్వం ఇలా ఉండాలని నిర్వచించలేదు. ఎందుకంటే కవి యొక్క భావాలకూ, హృదయ స్పందనలకూ, సిద్ధాంతాలకూ, ఆర్ద్రతకూ అక్షరరూపం కవిత్వం. హృదయ స్పందనలు జీవితం నుంచీ రావచ్చు. సమాజం నుంచీ రావచ్చు, లేదా అభ్యుదయ భావాలూ కావచ్చు. ఇటువంటి సంఘటనలను లేదా స్పందనలను, ప్రపంచానికి సుకుమారంగా, సున్నితంగా, మందలింపుగా, కొరడా ఝళిపించే విధంగా ఆయా భావాల కనుగుణంగా కవిత్వీకరించి చూపించేదే కవిత్వం.

అది పద్యమైనా కావచ్చు, గద్యమైనా కావచ్చు. వచన కవిత్వమైనా కావచ్చు, రెక్కలు, నానీలు, ముక్తకాలు కావచ్చు. భావ వ్యక్తీకరణకు తోడ్పడే ఏ ప్రక్రియ అయినా పాఠకుడి మనసును తాకే విధంగా ఉండేది కవిత్వం.

"కవిత్వమంటే కదిలేది, కదిలించేది"అన్న శ్రీశ్రీగారితో ఏకీభవిస్తాను.

**5. మీకుటుంబానికి సాహిత్యానుబంధం వుందా?**

**జ.** మాది సాహిత్య నేపథ్య కుటుంబం. మా తాతగారు కీ.శే. మహాకాళి వేంకటేశ్వరరావు పండితులు. ఆయన ఉద్యోగ విరమణానంతరం, ఎమ్.ఎ. చదివి, విద్యార్జనకు వయసుతో పనిలేదని నిరూపించారు. స్కూలు సెలవుల్లో, మనవలూ మనవరాళ్లను కూర్చోబెట్టుకుని, భారత,భాగవత పద్యాలు చదివి, వాటి అర్థాలు చెప్పి, మాచేత బట్టీ కొట్టించేవారు. తాను స్వయంగా శ్రీవేంకటేశ్వర శతకం రవీంద్రుని కవితాసంగ్రహము, హిస్టరీ ఆఫ్ ఇండియన్

ఇండిపెండెన్స్, ఇంగ్లీషు, తెలుగు డిక్షనరీ, ఇంగ్లీషు గ్రామర్ కంపోజిషన్ ఇంగ్లీషు, తెలుగులో 101 వ్యాస రచనలు మొదలైనవి రాసారు.

మా ఇంటి అడ్రస్ కూడా పద్యరూపంలో రాసి మాచేత బట్టీ పట్టించారు.

**"అష్టోత్తర శతనామా దిష్టంబగు గృహము**

**శ్రేష్టము వివేకనగరము**

**వింశతీ భాగ్యనగర్**

**స్పష్టముగా వ్రాసి పంపుదు లేఖల్"**

తండ్రిని మించిన తనయుడు కీ.శే. మహాకాళివేంకటరావుగారు, బహు ముఖీన ప్రతిభ కలవారు. ఆ రోజుల్లో దాశరధి, సి.నా.రె. ఆరుద్ర మొదలైన వారితో కవిసమ్మేళనాలలో పాల్గొనేవారు. 'కోఠి'లోని శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయంలో "ఎక్కువగా కవి సమ్మేళనాలు జరిగేవి. మేము నలుగురు అక్కాచెల్లెళ్లం, ఇద్దరు అన్నదమ్ములు. ఆడపిల్లలమే పెద్దవాళ్లం. కవి సమ్మేళనం వున్నరోజున, ప్రొద్దున్న స్కూల్‌కి వెళ్లేటప్పుడే చెప్పేవారు. హోమ్‌వర్క్‌లు తొందరగా పూర్తి చేసుకుని సాయంకాలం 5గం॥లకి ఒకటో నంబరు బస్సునెక్కి, కోఠికి రమ్మనమని, తాను ఆఫీసు నుంచి సరాసరి వచ్చేవారు. సభలో తను చదివిన కవిత, ఇతరుల కవితలు ఎలావున్నాయి, వాటిని విశ్లేషించమని, ఎవరి కవిత ఎందుకు బాగుందో చెప్పమని ఇంటికి వెళ్లేటప్పుడు దారిలో అడిగేవారు అలా ఊరికినే కవితలు వినడం కాకుండా, విశ్లేషించే అవగాహన కల్పించారు. నాన్నగారికి దాశరధిగారి కవిత్వమంటే చాలా ఇష్టం. ఆయన కవిత్వంలోని భావ వ్యక్తీకరణ ఎంత బాగుందో మాకు విపులీకరించేవారు. మేము త్యాగరాయ గానసభ సందులో,మా తాతగారు కట్టించిన ఇంట్లో వుండేవాళ్లం. ఇంటిదగ్గరలోనే ఆంజనేయ స్వామి గుడి వుంది. దాని వెనక సందులో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥ సి.నారాయణారెడ్డిగారి ఇల్లు వుండేది. నాన్నగారు, సినారె మిత్రులవడం వలన, సి.నా.రె. గారింటికి తను వెళ్తున్నప్పుడు, మాలో ఎవరో ఒకరిని వెంటపెట్టుకుని వెళ్లేవారు, అలా చిన్నప్పటి నుంచీ సాహితీ ఆస్వాదన కలిగించారు మా నాన్నగారు మహాకాళి వేంకటరావుగారు.

అంతేకాదు నాన్నగారు కవితలు, కథలు, నాటకాలు, రేడియో కార్య క్రమాలకి పాటలు రాశారు.'బాలానందం' కార్యక్రమంలో పాడడానికి మంచి పాటలు తను రచించి, రాగం కట్టి, మాచేత ప్రాక్టీస్ చేయించి బాలానందం కార్యక్రమంలో పాల్గొనడానికి రేడియో స్టేషన్‌కి పంపేవారు.

ఇప్పటికీ నాకు గుర్తు ఆ పాట–

**"రండి రండి రండీ,**
**కలసి మెలసి వుండీ,**
**ఆడుకుందాం రండీ,**
**మనం పాడుకుందాం రండీ"**

అంటూ సాగుతుంది ఆ పాట. సంక్రాంతి కల్చరల్ అసోసియేషన్ అనే సంస్థ స్థాపించి దానిద్వారా నాటికలు వేయించడం, సంగీత కార్యక్రమాలు నిర్వహించడం చేసేవారు. తను స్వయంగా రాసిన "అయోమయం" "అదేమిటి" నాటికలలో తాను హీరోగా నటించడమే కాక, ఇతర కళాకారుల చేత మా ఇంట్లోనే రిహార్సల్స్ చేయిం చేవారు. మా అమ్మ అందరికీ టిఫిన్లు, కాఫీలు ఏర్పాటు చేసేది.

నాన్నగారి అసలు వృత్తి ఎ.జి. ఆఫీసులో ఆడిట్ ఆఫీసరుగా చేసేవారు. ఎ.జి.ఆఫీసులో "తెలుగు నాటక సమితి" సంస్థను స్థాపించారు. ఇప్పుడు ఎన్నో సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎ.జి. ఆఫీసులోని "రంజని" సంస్థకు కూడా నాన్నగారు వ్యవస్థాపక అధ్యక్షులు.

ఎప్పుడూ నిత్య చైతన్యశీలిగా వుంటూ, తాను వుండటమే కాకుండా, కుటుంబాన్ని కూడా దాంట్లో పాలు పంచుకునే విధంగా ప్రోత్సహించేవారు. ఆ రోజుల్లోనే లక్నో విశ్వవిద్యాలయములో ఈవెనింగ్ కాలేజీలో ఎమ్.ఎ. ఎల్.ఎల్.బి ఒక్కసారే చదివిన మేధావివారు. ఎ.జి.ఆఫీసునుంచి రిటైర్ అయిన తరువాత తన కిష్టమైన జ్యోతిషశాస్త్రం, వాస్తుశాస్త్రం అధ్యయనం చేసి "దైవజ్ఞశిరోమణి" బిరుదును పొందారు. జాతకాల పరిశీలనకావించి, గ్రహదోష నివారణలు తెలిపి, ఎంతమందికో వివాహాలు, ఆరోగ్యసమస్యలు పరిష్కరించే వారు. ఈనాటి ప్రముఖ జ్యోతిష పండితులు శంకరమంచి

రామకృష్ణశాస్త్రిగారు మా నాన్నగారి దగ్గర జ్యోతిషశాస్త్రంలో ప్రావీణ్యం పొందారు. కంప్యూటర్ హారోస్కోప్ మ్యాచింగ్ నాన్న గారి దగ్గర నేర్చుకున్నారు. ఈనాటి ప్రముఖ జ్యోతిష్య, వాస్తు శాస్త్ర నిపుణులు శ్రీలీలాప్రసాద్ గారికి కూడా నాన్నగారు గురుతుల్యులు.

నాన్నగారి ప్రతిభకు నిదర్శనంగా, వారిమీద గౌరవముతో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో "మా నాన్నగారిపేరు మీద జ్యోతిషంలో ప్రావీ ణ్యత కనబరిచిన ఉత్తమ విద్యార్థికి బంగారు పతకాన్ని "మహాకాళి వెంకటరావు" స్వర్ణపతకం ప్రతి సంవత్సరం బహుకరించే విధంగా ఏర్పాటు చేశాము.

మా అమ్మ కీ.శే. మహాకాళి ప్రభావతి ప్రముఖ వైణికురాలు. మనుమ లను, మనుమరాళ్లను ఒళ్లో పెట్టుకుని ఆడిస్తూనే వీణాసాధన చేసేది. విద్యార్థులకు నేర్పించేది.

ఇలా సంగీత సాహిత్యాలతో, పండితుల కవితా గోష్టులతో ఎప్పుడూ అలరాడుతుండేది మా ఇల్లు. తాతగారు, అమ్మానాన్నలు మాలో సంగీత సాహి త్యాల పట్ల కొంత అవగాహన, అంతర్లీనంగా బీజాలు నాటారు. అలా సాహితీ ఆస్వాదన, ఆనందించడం నేర్పించారు. అలా సంగీత సాహిత్యాల నేపథ్యంలో పెరిగిన నాకు సాహిత్యం పట్ల అభిరుచి కలిగించింది.

**6. సాహిత్యంలో నేడు స్త్రీలు ఎలాంటి పాత్రను పోషిస్తున్నారు?**

**జ:** సాహిత్యరంగంలో స్త్రీలు అన్ని ప్రక్రియల్లోనూ రాస్తూ తమస్థానాన్ని పదిలం చేసుకుంటున్నారు. నాడు తెన్నేటి హేమలత, రంగనాయకమ్మ కోడూరి కౌసల్యా దేవి, ఆనందారామం, యద్ధనపూడి సులోచనారాణి వారపత్రికల్లో సీరియల్స్ రాస్తూ పాఠకులను ఉర్రూతలూగించారు. మొదట్లో రంగనాయకమ్మ గారు చక్కని నవలలు స్వీట్‌హోమ్, జానకి విముక్తి లాంటివి రాశారు. పోనుపోనూ వారి సాహిత్యంలో స్త్రీవాదం పాళ్లు ఎక్కువై, ఇటీవల మరీ మితిమీరిపోయి, ఆరాధ్య దేవుళ్లయిన పురాణ పురుషులను సైతం ఆడిపోసుకుంటూ, హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా రాసి పలువురి విమర్శకులకు లోనయింది. కోడూరి, యద్ధనపూడి కుటుంబ నేపథ్యం, ప్రేమలను కథావస్తువులుగా తీసుకుని పాఠకుల ప్రేమాభిమానాలు సంపాదించారు. ఇప్పుడు స్త్రీల రచనలు అన్ని ప్రక్రియల్లో విరివిగా వస్తున్నాయి. కథ, కవిత్వం, బాలసాహిత్యం ఇలా

అన్నిటా తమదైన ముద్ర వేసుకుంటూ సాహితీ పథంలో దూసుకుపోతున్నారు. స్త్రీలు రచనా రంగంలోనే కాదు, పత్రికా సంపాదకులుగా కూడా రాణిస్తున్నారు. ఇలా బహుముఖీన సాహిత్యరీతుల్లో తమ ఉనికి చాటుకుంటూ దూసుకు పోతున్నారు.

డా॥ముక్తేవి భారతి గారు కథాప్రపంచాన్నీ, వోల్గాగారు, స్త్రీవాద సాహిత్యాన్నీ, సూర్య ధనుంజయ్‌గారు బంజారా సాహిత్యాన్నీ, డా॥కాత్యాయనీ విద్మహే అభ్యుదయ స్త్రీ వాద సాహిత్యంలో, శ్రీమతి జూపాక సుభద్ర దళిత సాహిత్యంలో, డా॥మంగళగిరి ప్రమీల పద సాహిత్యంలో, శ్రీమతి ఆకెళ్ల సుబ్బ లక్ష్మి, స్వరాజ్యం రమణమ్మగార్లు, బాలసాహిత్యంలో డా॥గురజాడ శోభా పెరిం దేవి వయోజన సాహిత్యంలో డా॥కేతవరపు రాజ్యశ్రీ, ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి, డా॥సి.భవానీదేవి, శైలజామిత్ర, కొండపల్లి నీహారిణి మొదలైన కవయిత్రులు వాదాలకు, ఇజాలకు అతీతంగా సామాజిక, మానవతా కోణంలో, సమాజంలో దేశంలో జరుగుతున్న దురాగతాలను, దుశ్చర్యాలకు స్పందిస్తూ తమ కవితా సాహిత్యాన్ని వెలువరిస్తూ, సాహితీ రంగంలో తమదైన ముద్ర వేసుకుంటూ, నేటి సాహిత్య ప్రపంచంలో ముఖ్యమైన పాత్రపోషిస్తున్నారు.

సాహిత్యరంగంలో ప్రముఖ పూర్వ రచయిత్రులు ఈనాటి ప్రముఖ రచయిత్రులు, కవయిత్రులు దూసుకుపోతున్నా స్త్రీలకు సముచిత స్థానం, సాహితీ సభలలో కానీ, కవి సమ్మేళనాలలో కానీ, సెమినార్లలో కానీ లభించడం లేదు. ఏదో మొక్కుబడిగా ఒకరికో, ఇద్దరికో అవకాశం కల్పించి చేతులు దులిపేసుకుంటున్నారు. రచయిత్రుల మీద రకరకాల వ్యంగ్యోక్తులతో అవహేళనలు చేస్తున్నారు. అయినా అన్నింటినీ పక్కకి నెడుతూ సాహితీసేవలో ముమ్ముందుకు సాగిపోతోంది వారి కవితాసేద్యం.

## 7. అధ్యయనం లేకుండా కవిత్వం రాయచ్చా?

**జ:** కవిత్వం మనసులోని భావాలకు అక్షరరూపం. ఒక దు:ఖభరితమైన లేదా సంతోషదాయకమైన విషయానికి స్పాంటేనియస్‌గా స్పందించడం, దాన్ని అక్షరబద్ధం కావించడమే కవిత్వానికి పురుడు పోస్తుంది. దానికి కొంత కవితాత్మకత, భాష జోడిస్తే మంచి కవితగా ఆవిర్భవిస్తుంది. ఇది కొంతమందికి సహజంగా వస్తుంది. అటువంటి వారికి అధ్యయనంతో పనిలేదు. కాదేదీ కవిత కనర్హం అన్నట్టు, తన జీవితం, తన

చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అధ్యయనం చేసి మంచి కవిత్వం రాయగలరు. ఇక్కడ ప్రతిభ ముఖ్యం. పాండిత్యం ఉన్న వారందరూ మంచి కవులనీ చెప్పలేము. ఇక్కడ భావవ్యక్తీకరణ ముఖ్యం. జీవితానుభవం నుంచి వచ్చే కవిత్వానికి ఏ అధ్యయనాలూ అవసరం లేదు. ప్రతిభావంతులు కాకపోతే పాండిత్యం ఉన్నా మంచి కవిత్వం రాయలేరు. అయితే అధ్యయనం ప్రతిభకు మెరుగులు దిద్దుతుంది. కత్తికి పదునుపెట్టినట్టు, అధ్యయనం ద్వారా తమ స్పందనలకు అక్షరరూపమిస్తే చక్కని కవిత్వం రాయ గలుగుతారు. తన అనుభవాలకు, ఇతరుల లోకానుభవాలను అనుసంధానం చేసుకుంటే మధురమైన కవిత్వం వెలువడుతుంది. కవి నిత్య విద్యార్థిగా ఉండాలి. రాయడం మొదలు పెట్టాక అధ్యయనం చేయడం కూడా తన కవిత్వానికి మరింత పదును చేకూర్చడానికి ఉపయోగంగా ఉంటుంది.

మాది సాహితీ నేపథ్య కుటుంబమే అయినా, అడపా దడపా కవితలు రాసినా, నేను కవయిత్రిని అవడం డా॥ఎన్.గోపీ గారి నానీల ద్వారానే. అది కూడా ఏదో పెద్దకవయిత్రిని అయిపోదామని కాదు. నిత్యం నాలో జరుగుతున్న సంఘర్షణలకు, స్పందనలకు అణగారిన భావవ్యక్తీకరణకు ఒక ఆలంబనగా "నానీలు"రాశాను. నా మొట్టమొదటి పుస్తకం "చిరుసవ్వడులు"నానీల సంకలనం. ఆ నానీలు చాలా బావున్నాయని పలువురు ప్రముఖ కవులు మెచ్చు కోవడంలో, ఇంకా ఇంకా రాయాలన్న ఉత్సాహం మొదలయింది. ఇతర కవుల రచనలు కూడా అధ్యయనం చేస్తే ఇంకా నీ భావాలకు పదును పెట్టగలుగుతావని కొంతమంది పెద్దలు సలహా ఇచ్చారు. తరువాత ఇతరులు రాసిన కవిత్వం చదవడం మొదలు పెట్టాను. ఇతరుల రచనలు చదివినా, నాలోని స్పందనలకు రూపం నాదైన శైలిలో ఇచ్చాను. నాకు మొదటి నుంచీ ఏదీ నిగూఢంగా, వ్యంగ్యంగా, లౌక్యంగా మాట్లాడటం కానీ, రాయడం గానీ చేతకాదు. ముక్కుసూటి వ్యవహారం. అందుకే నా కవిత్వం కూడా నిగూడార్థం లేకుండా, నేను చెప్పదలచుకున్నది డైరెక్ట్‌గా పాఠకుడి మనసులో దూరి సామాన్యుడికి సైతం హాయిగా అర్థమై, ఆస్వాదించే రీతిలో ఉంటుంది. ఏ పత్రికలో నా కవిత కానీ,వ్యాసం కానీ ప్రచురింపబడినా మారుమూల పల్లెటూళ్ల నుండి అనేకమంది ఫోన్లు చేసి తమ ఆనందాన్ని తెలియచేస్తూ ఉంటారు. ఆటోడ్రైవర్లు, మెకానిక్‌లు, బడ్డీకొట్టువాళ్లు ఫోన్ చేసి సంతోషం వెలిబుచ్చుతున్నప్పుడు, నాకు ఆనందంగా ఉంటుంది, సామాన్యుడి మనసు తట్టగలిగినందుకు.

**ఎవరో అన్నట్టు**
**పద్యం పండితుల కోసం**
**పాట పామరుల కోసం**

నేటి సాహితీ ప్రక్రియలు సామాన్యుడిని అలరించే విధంగా ఉండి ఎంతమందికో సాహిత్యాభిలాష కలిగిస్తున్నాయి. అందుకే నేను ఇటీవలి కాలంలో వస్తున్న లఘు కవితా రూపాలన్నింటిలో రచనలు చేసి పలువురి ప్రశంసలు పొందాను. అందులో వచన కవితలు, మినీ కవితలు, రెక్కలు, నానీలు, వ్యంజకాలు, ముక్తకాలు, హైకూలు ఉన్నాయి.

రెక్కల రూపశిల్పి సుగమ్‌బాబుగారి ప్రోద్బలం వలన "భగవద్గీత"లోని ముఖ్యమైన108 శ్లోకాలు గ్రహించి, వాటిని రెక్కల ప్రక్రియలో "రెక్కల్లో గీతామృతం"అన్న పుస్తకాన్ని వెలువరించాను. ఈ గీతామృతం పండిత పామరుల ప్రశంసలు పొంది దేశంలోనే కాక చివరకు లండన్ తెలుగు మహాసభల్లో కూడా ఆవిష్కరింపబడింది. ఆ.ప్ర.శాసనసభ 'డిప్యూటీ స్పీకర్, మండలి బుద్ధప్రసాద్, ఆ.ప్ర. డిప్యూటీ సీ.ఎం.మాన్యులు కె.ఇ. కృష్ణమూర్తిగారు, వంగూరి ఫౌండేషన్ అధ్యక్షులు వంగూరి చిట్టెన్ రాజుగారు, యుక్తా అధ్యక్షులు కిల్లి సత్యప్రసాద్ గారు పద్మశ్రీ కొలకలూరి ఇనాక్‌గార్లు ఆసీనులైన వేదిక మీద రెండోసారి 'గీతామృతం' పుస్తకం ఆవిష్కరణ జరిగింది. అందరూ కూడా భగవద్గీతను అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్టు భగవద్గీత సారాన్ని సామాన్యుడికి అర్థం అయ్యే విధంగా బాగా రాశారని ప్రశంసించారు. ఆం.ప్ర.ఉప ముఖ్యమంత్రి కె.యి.కృష్ణమూర్తిగారు, యుక్తా (లండన్) సభ రెండవ రోజు నన్ను కలిసి, "రాత్రి పడుకునే ముందు గీతామృతం పుస్తకం చదివాను అమ్మా. చాలా బాగా రాశావు. భగవద్గీత అంటే ఎంతో వేదాంతం ఉంటుంది. మనకర్థం కాదని భయపడేవాడిని. భగవద్గీతంటే భయం పోయింది. నిజంగా ఇది గీతామృతమే! నాకు గీత చాలా సులభంగా అర్థమయ్యే విధంగా రాసి నా చేత చదివించినందుకు చాలా సంతోషం" నాలాంటి వాళ్లకెందరికో ఇది ముక్తికి దారి చూపించే దారి దీపం" అని చెప్పినప్పుడు నిజంగా నా జన్మ ధన్యమయిందనిపించింది.

నిజానికి అంతకు ముందు మా నాన్నగారి ప్రోద్బలం వలన గీతను చదవడం, భక్తియోగం, కర్మయోగం, కంఠతః నేర్చుకున్నా. కానీ మొత్తం భగవద్గీతలోంచి 108

శ్లోకాలు ఎంచుకోవడం, వాటిని సరళభాషలో, రెక్కల ప్రక్రియలో రాయడం చాలా కష్టతరమైన పని. మూలంలోని భావం చెడకుండా రాయాలి. మొదట మనసులోని భావాలకు అక్షరరూపమిచ్చి, కవిత్వంరాశాను. అవసరం అనుకున్నప్పుడు అధ్యయనం చేశాను. అధ్యయనం చేసి రాయడం, చేయకుండా రాయడం కవిలోని సృజనాత్మకతను బట్టి ఉంటుంది.

**8. నిబద్ధత విషయంలో నేటి కవులు ఎలా ఉంటున్నారు?**

**జ:** కవి ఏ భావాల్ని రాస్తున్నాడో ఆ భావాలను విశ్వసిస్తూ దానికనుగుణంగా జీవించడాన్ని నిబద్ధత అంటాము. కవి తన కవిత్వంలో చెప్పిన భావాల గురించి మాట్లాడటం నిబద్ధత అనిపించుకోదు. ఆ మార్గంలో తాను జీవించినప్పుడే నిబద్ధత గల కవిగా గుర్తింపబడుతాడు. కొంతమంది కవులు తమ కవిత్వంలో ఎంతో ఉన్నత భావాలనూ, ఆశయాలనూ, జాలి, కరుణ, కనబరుస్తారు. కానీ నిజజీవితంలో వాటికి వ్యతిరేకంగా జీవనం గడుపుతుంటారు. స్వచ్ఛమైన పల్లెజీవితాన్ని గురించి రాస్తారు. పట్నంలో సుఖాలు వదులుకోలేరు.

హేతువాద రచయితలమంటూ రచనలు చేస్తూ గుండె విరుచుకు తిరుగుతారు. భార్యలకు తోడుగా గుళ్లకూ, గోపురాలకూ వెళుతుంటారు. ఇంట్లో జరిగే వ్రతాలకూ, పూజలకూ, అడ్డుచెప్పక ప్రసాదాలు ఆరగిస్తుంటారు. కవి సమ్మేళన సభల్లో స్త్రీల గురించి బహు గొప్పగా కవిత్వం చదువుతారు. ఇంటికి వస్తూనే “ఏమే ఎక్కడ చచ్చావ్” అంటూ తిట్ల వర్షం కురిపిస్తారు. రాజకీయ నాయకుల్ని తిట్టుకుంటూనే పేరుకోసం ఆ నాయకులను పొగుడ్తూ కవిత్వం రాస్తున్నారు.

ఇటువంటి కవులను చూసినప్పుడు నేతిబీరకాయలో నేయి ఎంత ఉంటుందో కవులలో నిబద్ధత కూడా అంతే. చలంగారు స్త్రీలు వివక్షతకు గురి అవుతున్నారని, స్వేచ్ఛగా జీవించాలని ఆశించి, సమాజ కట్టుబాట్ల నుంచి స్త్రీ విముక్తికోసం రచనలు సాగించారు. అయితే చలంగారి రచనలు స్త్రీలలో విశృంఖలత్వాన్ని చూపించాయి.

కొంతకాలం ఆ రకమైన జీవితంలో తాను కూడా స్వేచ్ఛగా విహరిం చాడు. కానీ చివరి వరకు నిబద్ధతగా నిలువలేకపోయాడు.

తరువాతి జీవితం ఆధ్యాత్మిక జీవనం కొనసాగించాలని భగవాన్ రమణుల ఆశ్రమంలో చేరారు. వేమన కూడా విశృంఖల శృంగార జీవితం అనుభవించి, విసిగి వేసారి చివరికి యోగిగా మారి, తన అనుభవసారాన్ని విశ్వదాభిరామ వినురవేమ అంటూ సుద్దులు చెబుతూ శతకం రాశాడు. అదే వేమన శతకం. మనం అందరం ఈరోజు వేమన శతకాన్ని వేనోళ్ల కొనియాడుతూ ఆయన పేరుమీద యూనివర్సిటీ కూడా పెట్టుకున్నాము. అయితే వేమన నిబద్ధత గల కవి అనలేము.

నేడు కులరహిత సమాజం కావాలంటూ కవిత్వం రాస్తూ, సన్మానాలు చేయించుకొంటూ, కులాల కవిసమ్మేళనాలు నిర్వహించుకుంటున్నారు. నేను ఒకచోట రాసిన వ్యంజకం :

**కవిత్వంలో చూపిస్తారు**
**ఎన్నో ఆదర్శభావాలు**
**నిజజీవితంలో వాటికి**
**లేదు చోటు.**
**మహిళాభ్యుదయం మీద**
**ఉపన్యాసాలు, సత్కారాలు**
**గుమ్మంలో అడుగిడుతూనే**
**ఇల్లాలిని తిట్లు, శాపనార్థాలు**

అయితే అందరినీ ఒకే గాడిలో చూడ లేము. కొంతమంది ఉద్యమకవులు నిబద్ధత కలవారూ ఉన్నారు. డా॥ఆవంత్స సోమసుందర్‌గారు నిబద్ధతకు నిలువెత్తు సాక్ష్యం. ఒకరకంగా రంగనాయ కమ్మగారిని నిబద్ధత గల రచయిత్రి అని చెప్పవచ్చు.

**9. మంచి మనిషి కాకుండా మంచి కవి కాగలడా?**

**జ:** పూల సువాసన దారానికి అంటుకున్నట్టు, మంచి మనిషి రాసే కవిత్వానికి గుబాళింపు ఉంటుంది.

పూల మీద నుంచి వీచిన గాలి పులకిత సుగంధం. సజ్జనుడైతేనే మంచి కవిత్వాన్ని రాయగలడు. వాగ్గేయకారులైన శ్రీ త్యాగరాజు, అన్నమయ్య, శ్యామశాస్త్రి గార్లు వస్తుతః మంచి మనుషులు. తమ ప్రతి పని, పాట భగవంతుడికి అర్పణం చేశారు. అందుకే వారి నుండి వచ్చిన చక్కని కీర్తనలు ఈనాటికీ నిత్యనూతనంగా పలువురికి ఆదర్శప్రాయంగా, సంగీత సామ్రాజ్యాన్ని ఏలుతు న్నాయి. వీరు నిబద్ధత గల కవులు. అందుకే జననీరాజనాలు అందుకుం టున్నారు.

మంచి కవిత్వం ఎప్పుడూ మంచి మనసులోంచి ఉద్భవిస్తుంది. తిక్కన, పోతనల జీవనవిధానానికి, కవిత్వానికీ సన్నిహిత సంబంధం ఉంది. సుకవుల వద్ద నుంచి సుగంధ భరితమైన కవిత్వం జాలువారుతుంది.

**10. ఒక రచన చేసే క్రమంలో ఏఏ సామగ్రి అవసరమవుతుందటారు?**

**జ:** ఒక రచన చేయడానికి ముందుగా ఆసక్తి, కవితా వస్తువు, హృదయ స్పందన, భావవ్యక్తీ కరణ, శైలి, శిల్పం, సృజన అనే సామగ్రి అవసరమవుతుంది. వీటికి తోడు అధ్యయనం కూడా ఉంటే మంచి కవిత్వం వెలువడుతుంది. కవిత్వం రాయడ మంటే ఆషామాషీ కాదు. దీనికి వ్యక్తి పరిశీలన వ్యవస్థ పరిశీలన, లోకపరిశీలన ఉండాలి. ఎలా చెబితే బాగుంటుందో తెలియాలి. దానికి కొంత శిల్పం జోడిం చాలి. ఈ వైపుగా కృషి చేయాలి.

అన్నప్రాశన నాడే ఆవకాయ తిన్నట్టు కాకుండా, మొదట భావవ్యక్తీ  కరణలో తొట్రుపడినా, పైన చెప్పిన కవితా సామగ్రి మీద దృష్టిపెట్టి, నేడు వస్తున్న లఘు కవితా రూపాలను ఆసరాగా చేసుకుని తరువాత పెద్ద రచనలు చేయవచ్చు. మనచుట్టూ జరిగే సంఘటనల పరిశీలన కూడా మంచి కవిత్వ సామగ్రి.

ఒకసారి నేను ఆఫీసుకు నా స్కూటీ మీద వెళ్తున్నప్పుడు, రెడ్ సిగ్నల్ పడగానే స్కూటీ ఆపి చుట్టుపక్కల గమనిస్తున్నాను. అన్ని రకాల వాహనాలు రెడ్‌సిగ్నల్ పడగానే ఆగిపోయాయి. వెంటనే ఎక్కడనుంచొచ్చారో బిలబిలమంటూ అయిదారుగురు బిచ్చ గాళ్ళు వాహనాలను చుట్టుముట్టి యాచన చేస్తున్నారు. నాకు మనసులో వెంటనే స్పందన కలిగింది. అది ఒక నానీగా రూపాంతరం చెందింది.

**"రెడ్ సిగ్నల్ దగ్గర**
**ఆగిన వాహనం**
**బిచ్చగాడికి ఇచ్చింది**
**గ్రీన్‌సిగ్నల్"**

ఇది చదివిన చాలామంది అన్నారు. అరే రోజూ ఇది అందరం గమ నిస్తూనే ఉన్నాం. మీరు భలే రాశారే! మనకి రెడ్‌సిగ్నల్ బిచ్చగాడికి గ్రీన్ సిగ్నల్. భలే స్పాంటేనియస్ స్పందన అని మెచ్చుకున్నారు.

అలాగే ఒకసారి బిర్లామందిర్‌కి వెళ్లాం. గుడిలో ఉన్న వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకున్నాము. బయటకు వస్తుంటే ఒక లఘు కవిత రూపుదిద్దుకుంది.

**"గుడిలో దేవుడు**
**వేంకటేశ్వరుడు**
**మరి గుడిపేరు**
**బిర్లామందిర్"**

బిర్లా నిజానికి వేంకటేశ్వరస్వామి గుడి కట్టించాడు. కానీ అది బిర్లామందిర్‌గా ప్రసిద్ధికెక్కింది. దీనిలో చిన్న వ్యంగ్యం తొంగిచూస్తోంది. ఇలా లఘు రూప కవితలే కాకుండా, వచన కవితలు కూడా రాశాను. "కలుపుగులాబి" అని ఒక కవిత రాయడానికి యం. కాంతారావు, ఐపిఎస్‌గారు పరోక్షంగా కారకులు. కాంతారావుగారు, ఐపిఎస్ ఆఫీసరయినా, కల్చరల్ డిపార్టుమెంట్ డైరెక్టరుగా పనిచేశారు. వారు కవితాప్రియులు. మంచి సాహిత్యాన్ని ఆశీర్వదించేవారు. వారు డైరెక్టర్‌గా ఉన్న టైమ్‌లోనే పుస్తకావిష్కరణ సభలకు రవీంద్రభారతి సమావేశ మందిరం ఉచితంగా ఇచ్చే ఏర్పాటు చేశారు.

సచివాలయంలో చేతన సంస్థ, సాహితీ కార్యక్రమాలతో పాటు, సచివాలయం లోని కవుల చేత కవి సమ్మేళనం నిర్వహించేవారు. అలా కవి సమ్మేళనాలు నిర్వహిస్తూ, సచివాలయంలో సాహితీ ప్రీతి కలిగిన ఐఎఎస్, ఐపిఎస్, ఆఫీసర్లను ముఖ్య అతిథిగా పిలిచి, మా కవితలు వినిపించేవాళ్లం. అందులో ముఖ్యులు డా॥కె.వి.రమణాచారి (ఐఎఎస్), శ్రీఎల్.వి.సుబ్రహ్మణ్యం (ఐఎఎస్),డా॥యం కాంతారావు (ఐపిఎస్),

శ్రీవిద్యాసాగర్ (ఐఎఎస్) శ్రీమతి జి. అరుణ (ఐఎఎస్), శ్రీమతి చందనాఖాన్ (ఐఎఎస్) మొదలైన సాహితీ ప్రియులను పిలుస్తూ ఉండేవాళ్లం.

ఇలాంటి పెద్ద ఆఫీసర్ల దగ్గర కవిత్వం చదవాలంటే కవితా వస్తువు, భావవ్యక్తీకరణలో జాగ్రత్త వహించాలి. మంచి కవిత రాసినప్పుడు, పెద్దల ప్రోత్సాహము కూడా మనల్ని ఉత్సాహపరుస్తుంది.

## 11. స్త్రీ వాద రచనలు స్త్రీలే చేయాలా?

**జ:** స్త్రీవాద రచనలు మొదట చేసింది పురుషులే. నిజానికి స్త్రీల హక్కులను వారికి తెలిసేటట్టుగా చేసి, ఆమెను చైతన్యవంతురాలిగా చేసింది పురుషుల సాహిత్యమే. ఆనాడు కందుకూరి వీరేశలింగం పంతులు, రాజారామ్మోహన్ రాయ్ వంటి మహానుభావులు స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టి విధవా వివాహాలు, సతీసహగమన నిషేధం వంటి సంఘసంస్కరణలు తీసుకు వచ్చి స్త్రీలను చైతన్యవంతులుగా చేశారు.

గురజాడవారు కన్యాశుల్కం నాటకంలో విధవా వివాహాల గురించి గిరీశం చేత చక్కని డైలాగులు చెప్పిస్తారు. ఆరోజుల్లో ఉయ్యాలలో ఉండే ఆడపిల్ల తండ్రికి కన్యాశు ల్కమిచ్చి వివాహం చేసుకునేవారు. ఆ దురాగతా లనుంచి స్త్రీకి విముక్తి కలిగించే విధంగా గురజాడ వారు రచనలు చేశారు. ఆరోజున వారు వేసిన బీజం ఫలదీకరించి బాల్యవివాహాలు చాలామటుకు తగ్గుముఖం పట్టాయి. అలాగే విధవా వివాహాలు కూడా ఈనాడు జరుగు తున్నాయి. ఆరోజుల్లోనే వారు స్త్రీ వాదానికి బీజం వేశారు. సఫలీకృతులైనారు.

తరువాత స్త్రీ వాదానికి అంత ప్రాముఖ్యత ఇచ్చి, స్త్రీలు కూడా తనవంటి మనిషేనని ఆమె వ్యక్తిత్వానికి ప్రాధాన్యమిచ్చి, స్త్రీ స్వేచ్ఛగురించి రచనలు సాగించినవారు చలం. స్త్రీని మనిషిగా చూసే సంస్కారం ఉన్న పురుషులెవరైనా స్త్రీవాదం గురించి రాయచ్చు. రాసేవారికి స్త్రీల గురించి పూర్తి అవగాహన ఉండాలి.

కాబట్టి స్త్రీవాదం స్త్రీలే రాయాలని లేదు. కాకపోతే స్త్రీల మనోభావాలు, మానసిక సౌకుమార్యపు స్పందనల గురించి స్త్రీల అభివ్యక్తీకరణ పురుషులకన్నా బావుంటుందని నా అభిప్రాయం.

## 12. స్త్రీల కవిత్వంలో సాంద్రత ఎంత?

**జ:** ఒక తోటలో అనేక రకాల మొక్కలు అనేక రకాల పూలుంటాయి. ప్రతీ పువ్వు అందమైనదే. కొన్ని సుకుమారంగా ముట్టుకుంటే రేకలు రాలేవి. కొన్ని బలంగా ఉ ండేవి. దేని అందం దానిదే. దేని సొగసు దానిదే. అలాగే కవిత్వంలో సాంద్రత స్త్రీల పరంగా ఒకరకంగా, పురుషుల పరంగా ఒక రకంగా ఉండవచ్చు. స్త్రీల కవిత్వంలో ఒక మానవీయ కోణం, కుటుంబ సమస్యలకోణం, స్త్రీల అస్తిత్వ నిరూపణ, పోరాటం, కుటుంబ నిర్వహణ, ఉద్యోగ బాధ్యతల మధ్య నలిగిపోతున్న జీవనయానం ఇత్యాది విషయాలు ప్రతిబింబిస్తుంటాయి. ఆమె పరిధి ఇల్లు, పిల్లలు, ఉద్యోగం, సమర్ధవంతంగా నిర్వహించుకోవడం చుట్టూ తిరుగుతుంది. పిల్లలు సరిగ్గా లేరంటే తండ్రి నేమీ అనరు. "తల్లి పెంపకం అలా ఉంది మరి" అంటూ సమాజమూ, కట్టుకున్న భర్త కూడా నిందిస్తారు.

స్త్రీ తనలో ఎంత ప్రతిభ దాగున్నా, ఇంట గెలిచి రచ్చ గెలవమన్న నానుడికి లోబడి, తన పరిధిని కుదించుకుంటుంది. సాహిత్య పరిధి కూడా దానికి తగినట్టుగానే ఉంటుంది. అంతమాత్రం చేత కవిత్వంలో సాంద్రత పురుషుల కంటే తక్కువని అనలేం. యద్ధనపూడి సులోచనారాణి నవలల్లో అనేక విజ్ఞాన విషయాలు ఉంటాయి. పురుషుల విషయంలో ఇది వేరు. "పురుషుడుకి బయటి ఎక్స్‌పోజర్ ఎక్కువ. బయటి పరిసరాల అధ్యయనం చేసే అవకాశం ఉంది. లోకజ్ఞానం ఎక్కువ. అందుకని, వారి రచనలు కూడా సాంఘిక, దేశ, అంతర్జాతీయ సమస్యలపై ఉంటాయి.

నేను సచివాలయంలో ఉన్నతహోదాలో పనిచేస్తున్నా, నా సీటులో ఉండే పని చూసుకోవడం, మధ్యలో పిల్లలకి ఫోన్ చేసి వాళ్లు లంచ్ చేసారా? ఒంట్లో బాగా లేకపోతే, టాబ్లెట్ వేసుకున్నావా, బయట తిరక్కు రెస్ట్‌తీసుకో అంటూ వాళ్లని మానిటర్ చేయడం, మధ్యాహ్నం సీటులోనే, లంచ్ ముగిం చుకుని మళ్లీ పనిలో తలదూర్చి, ఆఫీసు టైమ్ అవగానే, బయలుదేరి, ఇంటికి వెళ్లే దారిలో పిల్లలకేమైనా కావలసినవి కొని, కూరగాయలు కనబడితే తీసుకుని ఇంటికి రావడం జరిగేది. వస్తూనే కాళ్లూచేతులు కడుక్కుని వంటింట్లో దూరి పిల్లలు తింటామంటే లైట్ టిఫిన్ చేసి పెట్టడం, వాళ్ల విషయాలు కనుక్కుని, కబుర్లు చెప్పి, మళ్లీ రాత్రి వంటకి ప్రిపరేషన్. రాత్రి వంటిల్లు సర్ది పక్క చేరేసరికి పది గంటలు, మళ్లీ మర్నాడు పొద్దున్న చేయాల్సిన మెనూ గురించి ఆలోచన.

ఎంత ఉద్యోగం చేసి ఊళ్లేలినా, స్త్రీ ప్రయారిటీ ఇల్లూ, పిల్లలూ.

అదే ఆఫీసులో నాకింద పనిచేసే గుమాస్తాలు, ఆఫీసుకు వస్తూనే, రిజిష్టరులో సంతకం చేసి 'చాయ్' తాగొస్తామని చెప్పి కాంటీన్‌కెళ్లి అరగంట తర్వాత సీటులో కూర్చునేవారు. లంచ్ టైమ్‌లో బయటకి వెళ్లి ఆ కబుర్లూ ఈ కబుర్లూ మేసి వచ్చేవారు. సాయంత్రం 4 గంటలకు మళ్లీ 'చాయ్' అని బయటికి వెళ్లేవారు. బయట చెట్ల కింద నుంచుని ఆఫీసులో ఏ డిపార్టుమెంటులో ఏం జరిగిందీ, క్యాబినెట్ మీటింగ్‌లో ఏం జరిగిందీ, ఏ సెక్రటరీని ఏ మినిష్టరు కోపం చేశాడు, ఇలా రాష్ట్ర దేశ రాజకీయాలన్నీ మాట్లాడుకుని నింపాదిగా సీటుకి వచ్చి, ఆఫీసు టైమ్ అయిపోయిన తరువాత కూడా లేటుగా కూర్చుని ఆడవాళ్లందరూ వెళ్లిపోయినా, తాము పనిపూర్తయ్యే వరకూ కూర్చుని చేశా మంటూ పై ఆఫీసర్ల దగ్గర మెప్పుకోలు పొందేవారు. పగలంతా తిరిగినది లెక్క లోకి వచ్చేది కాదు.

కానీ ఉద్యోగినులు వచ్చింది మొదలు సీటు కదలకుండా బాధ్యతా యుతంగా పని చేసుకుని, టైమ్‌కి ఇంటికి వెళితే ఎవరి మెప్పుకోలూ ఉండేది కాదు. పైగా "ఈ ఆడవాళ్లతో ఇదే బాధండీ! సాయంత్రం 5గం.లు దాటితే ఉండరు" అని చిన్నచూపు చూసేవారు.

వాళ్లు ఎలా అంటే ఏమిటి? మనకేమీ మెప్పుకోలు అక్కరలేదు. పనిచూసుకుని టైమ్‌కి ఇంటికెళ్లి పిల్లల్ని చూసుకుంటే చాలు అనుకునేవాళ్లం. పోనీ ఇంటికొచ్చి ఏమైనా సుఖపడతామా, కాలుమీద కాలు వేసుకుని కూర్చోగలుగుతామా అంటే అదీలేదు. వెంటనే ఇక్కడ వేరే ఉద్యోగంలో పరకాయ ప్రవేశం చేయాలి. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే స్త్రీలు, పురుషులు సమానంగా ఉద్యోగాలు చేస్తున్నా, ఉద్యోగం ఇల్లూ వరకే స్త్రీలు పరిమితమైతే, మగవాళ్లు ఉద్యోగంతో బాటు, బయట ఎక్స్‌పోజర్ కూడా సంపాదించుకునేవారు. వారి పరిధి ఇతర విషయాల మీద చుట్టుపక్కల జరుగుతున్న విషయాల మీద కూడా విస్తరించేది. మగవారి కున్న సోషల్ లైఫ్ వలన అది సాహిత్యంలో ప్రతిబింబిస్తోంది. విస్తృత అధ్యయనం కనపడుతుంది. స్త్రీల రచనల్లో అస్తిత్వ పోరాటం ఎక్కువగా కనపడుతుంది.

సాహిత్య పరిధుల్లో తేడా తప్పితే స్త్రీ పురుషుల కవిత్వంలో ఎవరి సాంద్రత వారిదే!

తెన్నేటి హేమలత 'వనకిన్నెర' నవల రాశారు. దానిలో ఒక చిన్న పిల్లవాడిని ఒక కోతి ఎత్తుకుపోయి అడవిలో పెంచుతుంది. కొన్ని రోజులకి ఒక ఆఫీసర్ అడవిలోకి వెళ్లి పిల్లవాడిని మనిషిగా గుర్తించి ఇంటికి తీసుకొచ్చి, నాగరికత నేర్పిస్తాడు. నాగరికత నేర్చిన పిల్లవాడు, శాస్త్రాల్లో, పురాణాల్లో చెప్పిన వాటికి విరుద్ధంగా ఈ సమాజం ఎందుకుందని ప్రశ్నిస్తూ, చివరకి ఈ నాగరిక ప్రపంచం కంటే అనాగరికమనుకున్న అడవి జీవితం బాగుందనుకుం టాడు. అలా సమాజంలో జరుగుతున్న దురాగతాలను ఎండగడుతూ ఆ నవల రాశారు. అలాగే యద్ధనపూడి సులోచనారాణి గారి నవలలు కూడా చాలా విజ్ఞానాత్మకంగా ఉంటాయి.

### 13. స్త్రీల బాధల గురించి, వారి స్వేచ్ఛ గురించి రచనలు చేసిన చలంపై మీ అభిప్రాయం ఎలాంటిది?

**జ:** ఆనాటి సమాజంలో స్త్రీల బాధల్ని నిశితంగా పరిశీలించి, స్త్రీ వ్యక్తిత్వానికీ ఆమె ఆలోచనలకు ప్రాధాన్యమివ్వాలనీ, స్త్రీకి కూడా పురుషుడి లాగే లైంగిక స్వేచ్ఛ ఉండాలని చెప్పినవారు చలం. తన ఇంట్లోనే తాను బానిస జీవితం గడుపుతూ యంత్రంలా పనిచేసుకుంటూ పోతున్న స్త్రీ గురించి, ఆమెకూ హృదయముందనీ, యంత్రజీవి కాదనీ తన రచనల్లో చిత్రించాడు. ముఖ్యంగా అగ్రవర్ణ స్త్రీలకు జరుగుతున్న అవమానాల్ని, అణచివేతల్నీ భావోద్వేగాలనూ దృశ్యమానం చేస్తూ రచనలు సాగించాడు.

స్త్రీలో ప్రేమను, కామంగా అర్థం చేసుకునే మగజాతి దురహంకారాన్ని ఖండించాడు. అయితే స్త్రీ లైంగిక స్వేచ్ఛా గురించి కొంత విశృంఖలంగా రాయడం వలన ఆ రోజుల్లో స్త్రీలను చలం రాసిన పుస్తకాలను చదవనిచ్చేవారు కారు. ముఖ్యంగా బ్రాహ్మణ సాంప్రదాయ కుటుంబాల్లో. మేము చిన్నతనంలో అన్ని రకాల నవలలు కథలు చదివేవాళ్లం. కోడూరి కౌసల్యదేవి, లత, రంగ నాయకమ్మ ఆనందారామం, యద్ధనపూడి సులోచనారాణి, కొమ్మూరి వేణుగోపా లరావు మొదలైన వారి నవలలు పత్రికల్లో సీరియల్స్‌గా వచ్చేవి. అన్నీ చదివేవాళ్లం. అలాగే చలం రాసిన 'స్త్రీ', 'మైదానం' లాంటివి

కూడా మాపెద్దక్క బైటికి చదువుతుంటే, మిగతా ముగ్గురక్కాచెల్లెళ్లం పక్కనే కూచుని శ్రద్ధగా వినేవాళ్లం. ఆరోజుల్లో పావలా లైబ్రరీ అని ఉండేది. పేపరువాడు ఇవాళ మ్యాగజైన్ ఇచ్చి, రేపు తీసుకువెళ్లేవాడు. దానికి పావలా ఇచ్చేవాళ్లం. అందరం విడివిడిగా చదువుతే చాలా టైమ్ పడుతుందని పెద్దక్క చదువుతే అందరూ వినేవాళ్లం. అలా చలం రాసిన 'మైదానం' చదువుతుంటే నాన్నగారు కోప్పడి మానిపించేవారు. అప్పట్లో స్త్రీవాదం పట్ల ఇంత అవగాహన లేక, అశ్లీలంగా ఉందని నాన్న వద్దన్నారను కునేవాళ్లం.

జీవితానుభవం నేర్పిన పాఠాలు, అడుగడుగునా వివక్షతకు గురవుతున్న స్త్రీల గురించి ఆవేదన చెందుతూ, ఆలోచిస్తున్నప్పుడు, వెంటనే చలం గుర్తుకొ స్తారు. ఆరోజుల్లోనే స్త్రీల అసహాయత, ఆమె హృదయ ఘోష గురించి ఆలోచన చేసి రచనలు సాగించారు చలం.

అయితే సమాజపు కట్టుబాట్లకు అతీతంగా, అశ్లీలతకు తావుండడం వలన సాంప్రదాయ సమాజం అతడిని వెలివేసిందనే చెప్పాలి. ఎటూ తోచని చలం చివరకు అరుణాచలంలోని రమణ మహర్షి ఆశ్రమానికి చేరుకున్నారు. చివరి జీవితం ఆధ్యాత్మిక చింతనతో గడిపిన చలం అంటే నాకు ఇష్టం. ఎందుకంటే రమణమహర్షి అంటే నాకెంతో ఇష్టం.

### 14. స్త్రీవాదం పట్ల మీ వైఖరి ఏమిటి?

**జ:** స్త్రీ వాదం అంటే నా దృష్టిలో పురుష సమాజంపై ధిక్కారం కాదు. పురుషుడిపై స్త్రీది పైచేయిగా నిరూపించుకోవడం కాదు. స్త్రీ పురుషులిరువురూ సమాన స్వేచ్ఛతో కల్మషరహితంగా, ఏవిధమైన దాపరికం లేకుండా కలిసిమెలిసి ఉంటూ, సుఖదు:ఖాలను స్నేహితుల్లా పంచుకుంటూ జీవనం సాగించడమే స్త్రీ వాదం. 1975వ సంవత్సరాన్ని అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించారు. అప్పటి నుంచి స్త్రీ జీవితం అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా పయనిస్తోంది. ప్రభుత్వాలు కూడా స్త్రీల సర్వతోముఖాభివృద్ధికి ఎన్నో పథకాలు అమలు పరుస్తున్నారు. ఆనాటి శారదా చట్టం నుంచి నేటి గృహహింస చట్టం, నిర్భయ చట్టం, ఇలా స్త్రీల రక్షణకు ఎన్నో చట్టాలు చేశారు. నిజానికి స్త్రీలు రక్షణ పొందే వర్గం నుంచి రక్షించే దిశగా ఎదగాలి.

మాది సాంప్రదాయ మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబం. ఉమ్మడి కుటుంబం. మా నాన్నగారికి మేము నలుగురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు. మాది ఉమ్మడి కుటుంబం అవడం వలన పాతికమందిదాక పిల్లలం. (అమ్మా యిలు, అబ్బాయిలు) జెండర్ బేధం తెలియకుండా ఆడుకునేవాళ్లం. మా నాయనమ్మ మాత్రం ఆడపిల్లలు మొగపిల్లల్తో, ఆటలేమిటి అంటూ కోపం చేస్తూ ఉండేది. హాయిగా నవ్వుతూ ఆడుకుంటుంటే "నవ్వు నాలుగు విధాల చేటు" ఆడపిల్లలు గట్టిగా నవ్వకూడదు అంటూ కట్టడి చేసేది. స్కూల్ నుంచి వచ్చిన తరువాత మొగపిల్లలందరూ, హాయిగా ఆడుకుంటుంటే, మమ్మల్ని మాత్రం అమ్మకు పనుల్లో సాయం చేయమని పురమాయించేది.

నేను ఉక్రోషంతో ఆమె మీద అరిచేదాన్ని. మొగపిల్లలు ఆడుకుంటే ఏమీ అనవు. మాకు మాత్రం పనులు పురమాయిస్తావు అని పోట్లాడేదాన్ని. "రేపు మిమ్మల్ని ఒక అయ్య చేతిలో పెట్టాలి. పనీ పాటా రాకపోతే ఎట్లా?" అని ఎదురు ప్రశ్నించేది.

ఇలా వివక్షతకు గురవుతున్నా, వీలున్నప్పుడల్లా ఎదురుతిరుగుతూ, ఆవిడ చేత తిట్లు తినేవాళ్లం. మా నాన్నగారు మటుకు మా నాయనమ్మ మాటలు విన్నా, ఆవిడకి నచ్చచెప్పేవారు. ఈరోజుల్లో ఆడపిల్లలు కూడా బాగా చదువు కోవాలి అమ్మా. వాళ్లమ్మకి సాయం నే చేస్తాలే, వాళ్లని చదువుకోనీ అనేవారు. కానీ ఆవిడ వినేది కాదు. నలుగురాడపిల్లలు పుట్టారు. మీ పెళ్లిళ్లు ఎలా చేస్తాడో ఏమిటో మీ నాన్న అంటూ దిగులు పడిపోతూ ఉండేది.

ఆవిడ దిగులు చూసి మాకు చాలా అవమానంగా ఉండేది. అప్పుడే మనసులో ఒక తిరుగుబాటు ధోరణి వచ్చింది. బాగా చదువుకుని, ఉద్యోగం చేసి నాన్నకి చేదోడుగా ఉండాలని, పెళ్లిళ్లు చేసుకుని వంటింటి కుందేలుగా ఉండకూడదని.

బి.కాం. పాస్ అయిన తరువాత సచివాలయంలో ఉద్యోగంలో చేరడం జరిగింది. అక్కడ కూడా స్త్రీల పట్ల వివక్షత చాలా ఉండేది. ఎవ్వరి చేత మాట పడకుండా ఉండాలని చాలా ఫర్ఫెక్ట్‌గా పనిచేసేదాన్ని. నా పనిని మెచ్చుకుని, పనిచేయకుండా తిరుగుతున్న మొగవాళ్ల పని కూడా నాకు అంటకట్టేవారు. ఎక్కడ ఫైళ్లు బాగా పేరుకుపోయి ఉన్నాయో, అక్కడ నన్ను వేసేవారు. మొగవాళ్లని తమ సొంత పనులు చేయించుకోవడానికి

ఉపయోగించుకుంటూ, వాళ్ల సీటు పని మాకప్పగించేవారు. ఇలా ఎక్కడ చూసినా వివక్షతే. కొంచెం అందంగా ఉన్న ఉద్యోగినులకు కొన్ని చోట్ల బాస్‌ల దగ్గర నుంచి లేదా సాటి కొలీగ్ నుంచి వేధింపులు ఉండేవి. లేడీస్ టాయ్‌లెట్స్ రెండు మూడు బిల్డింగ్స్‌కి ఒకటి ఉండేది. అందులో లైట్లు సరిగా ఉండేవి కావు. గర్భిణులు వెళ్లాలంటే, జారిపడిపోతారేమోనని భయంగా ఉండేది.

అప్పుడే కొంతమంది ఉద్యోగినులం కలిసి, కనీస సదుపాయాలు లేకుండా ఉద్యోగం చేయడం కష్టం. ఈ విషయాన్ని మనమందరం అధికారుల దృష్టికి తీసుకువెళ్దామని నిశ్చయించుకున్నాము.

అలా సచివాలయ ఉద్యోగినీ సంక్షేమ సంస్థ ఏర్పాటు చేసుకుని, ఒక రిప్రజెంటేషన్ తయారుచేసుకుని అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి గారి దగ్గరికి వెళ్లి మా రిప్రజెంటేషన్ ఇచ్చాము. 'మీకెందుకమ్మా ఈ అసోసి యేషన్లూ? మగవాళ్లతో సమానంగా మీకు జీతాలిస్తూనే ఉన్నాంగా! అన్నారు. అదికాదండీ, ఉద్యోగినులుగా మాకు కొన్ని సమస్యలు ఉన్నాయి. అవి మీ దృష్టికి తీసుకువద్దామని" అని చెప్పాము.

"మీకొచ్చిన సమస్య ఏమిటి? అన్నారు.మాకు సరైన టాయిలెట్స్ లేవండీ. గర్భిణీలు దూరం వెళ్లాలంటే కష్టంగా ఉంది అని ఇంకా చెప్పబోయే లోపల ఏమిటీ ఇలాంటి చిన్న చిన్న విషయాల కోసం ప్రత్యేకంగా సంక్షేమ సంస్థ కావాలా? సరేలే ఏదో పెట్టుకోండి. కానీ మొగవాళ్లతో కొట్లాటలు పెట్టుకో కండి. వాళ్లతో కలిసి పనిచేసుకోండి"అంటూ సంస్థ పెట్టుకోవడానికి పర్మిషన్ ఇచ్చారు.

అప్పట్లో ఒక ఎనిమిదిమందిమి కలిసి పెట్టుకున్న సంస్థకు మాలో ఒకరు అధ్యక్షులు, ఒకరు కార్యదర్శి, ఉపకార్యదర్శి, కోశాధికారి అంటూ తలా ఒక పోస్ట్ అనుకొని దానిని "సచివాలయం ఉద్యోగినీ సంక్షేమ సంస్థ" అని రిజిష్టరు చేయించాము. నేను ఈ సంఘానికి ఫౌండర్ సెక్రటరీగా ఉన్నాను. అప్పటి నుంచి వేధింపులకి గురవుతున్న ఉద్యోగినుల గురించి ఆఫీసర్లకి చెప్పి సరిదిద్దడం, లంచ్‌రూములు ఏర్పాటు చేయించడం, ప్రసూతి సెలవులను 4 నెలలకు పొడిగించే ఉత్తర్వులు ఇప్పించడం, ఉద్యోగినుల కోసం యోగా క్లాసు లను నిర్వహించడం, గర్భిణీ ఉద్యోగినుల కోసం, సచివాలయం డిస్పెన్సరీలో

గైనకాలజిస్టు పోస్టు సాంక్షన్ చేయించడం ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ఇతర సంఘాల వాళ్లు ముక్కు మీద వేలేసుకునే విధంగా కార్యక్రమాలు నిర్వహించాము.

గృహహింస చట్టాన్ని మహిళలు మరింత అవగాహనతో ఉపయోగిం చుకునే విధంగా గృహహింసా చట్టం మహిళకు రక్షణ కవచం అన్న పుస్తకాన్ని, గృహహింసకు గురైన మహిళ ఎక్కడికి వెళ్లాలి, ఎవరిని కలవాలి, వారి ఫోన్ నంబర్లతో సహా ఆ పుస్తకంలో పొందుపరచి అందరికీ ఉచితంగా పంచిపెట్టాము.

ఎక్కడ ఏ ఉద్యోగినికి ప్రాబ్లమ్ వచ్చినా మా భుజస్కందాల మీద వేసుకుని సరిదిద్దేవాళ్లం.

బ్యాంకులతో మాట్లాడి ఆడవాళ్లు స్కూటర్లు కొనుక్కునేందుకు లోన్లు ఇప్పించాము. ఇలా వివక్షతను ఎదుర్కొంటూనే పురుషులతో స్నేహంగా మెలుగు తూనే మేమంటే ఏమిటో నిరూపించుకున్నాము. ఇది ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే నా ఉద్దేశంలో స్త్రీవాదమంటే, మన హక్కులు కోసం అస్తిత్వం కోసం పోరాటం చేయడంలో, పురుషులను ధిక్కరించాల్సిన అవసరం లేదు. వారితో కలిసిమెలిసి ఉంటూనే మన వ్యక్తిత్వం కాపాడుకోవాలి.

స్త్రీవాదమంటే స్త్రీ తన అస్తిత్వాన్ని నిలుపుకోవడం లేదా నిరూపిం చుకోవడం. నిజానికి ప్రతి ఇంట్లో స్త్రీ ఒక ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇల్లాలిగా, తల్లిగా, బంధుమిత్రులనాదరిస్తూ, సమస్యలకు సంధానకర్తగా, అలాగే ఇరుగు పొరుగువారితో కలుపుగోలుగా, వారితో సత్సంబంధాలు కొనసాగిస్తూ, స్త్రీ ఇంటికీ సమాజానికీ ఒక కేంద్ర బిందువుగా ఉంటుంది. వంటింటిని భుజస్కం దాల మీద మోసినా ఏనాడూ మెప్పుకోలుకి ఎదురుచూడదు. అది తన కర్తవ్య మన్నట్టు చేసుకుపోతుంది. ఈనాడు ఇంటికే కాదు. పొలం నుంచి గగనతలం వరకు అన్నిటా తానై తనను తాను నిరూపించుకుంటూ తన ఉనికిని ప్రపంచానికి చాటుతూనే ఉంది.

పురుషుడు ఇంటి యజమాని హోదాలో చేతకానివాడైనా, తప్పుచేసినా, తన అసమర్థతలను ఒప్పుకోడు. ఇదేమిటి అని ప్రశ్నించిన స్త్రీని దుర్భాషలాడటం లేదా ఆమె మీద చేయిచేసుకోవడం, తన మగతనానికి నిరూపణగా అనుకుంటాడు. నలుగురిలోనూ పరువుపోతుందని స్త్రీ సర్దుబాటు చేసుకుని, తన కోపాన్ని తనలోనే అణచివేసుకుంటుంది.

నేనొక చోట రాశాను

**సమాజంలో**
**స్త్రీ, పురుషుల అసమానత్వం**
**స్త్రీ సర్దుబాటుతనం**
**వల్లే వచ్చిందని**

ఇలా సర్దుబాటు చేసుకోకుండా, ఇద్దరూ సమానమేనని హక్కులు, వాగ్యుద్ధాలు, విడిపోవడాలు వరకూ వెళ్లడం అనేది స్త్రీవాదం కాదు. స్త్రీ ఎదురు తిరిగి పోరాడటం కంటే తనలోని అపారమైన శక్తియుక్తుల ద్వారా అన్నిటినీ అధిగమిస్తూ తన వ్యక్తిత్వాన్ని అస్థిత్వాన్ని నిరూపించుకుంటూ, కుటుంబానికీ, సమాజానికీ ఒక మార్గదర్శిగా ఎదగడమే స్త్రీవాదం.

స్త్రీని సమాజంలో ఉన్నతస్థాయిలో చూపించినవారు, పురుషులతో సమానంగా చదువుకోవాలనీ, బాల్యవివాహాలు చేయరాదని, విధవావివాహాలు ప్రోత్సహించినవారు, స్త్రీ పురుషులిరువురు సమాన హోదాల వారనీ ఇలా స్త్రీలలో చైతన్యం తీసుకువచ్చిందీ పురుషులే! కాబట్టి స్త్రీ పురుషులిరువురు సమాన స్వేచ్ఛతో కుటుంబ జీవనానికి విలువనివ్వాలి. వివక్షత సమర్థవంతంగా ఎదుర్కుంటూ స్నేహంగా మెలుగుతూ, తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకోవడమే స్త్రీవాదం.

భర్త వదిలేసినా కాయకష్టం చేసి కొడుకును బడిలో వేస్తే అడ్మిషన్ ఫామ్‌లో తండ్రి పేరు రాయమని ఉంటుంది. ఇక్కడ స్త్రీలో ఒక మానసిక సంఘర్షణ చోటు చేసుకుంటుంది. ఇటీవల కొన్ని రాష్ట్రాల్లో తల్లిపేరు కూడా చేర్చినట్టు చదివాము. ఇది హర్షించతగ్గ విషయమే. ఇటువంటి చోట అస్థిత్వాన్ని నిరూపించుకోవడం స్త్రీవాదం.

### 15. రంగనాయకమ్మ రచనల పట్ల మీ అభిప్రాయం?

**జ:** మొదట్లో నేను ముప్పాళ్ల రంగనాయకమ్మగారి నవలలు చాలా ఇంటరెస్టింగ్‌గా చదివేదాన్ని. స్వీట్‌హోమ్‌లో బుచ్చిబాబు పాత్ర అంటే చాలా ఇష్టంగా ఉండేది. నెక్స్ట్ వీక్ సీరియల్ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూసేదాన్ని. ఆవిడ రాసిన “బలిపీఠం” “చదువుకున్న

కమల'' ''కృష్ణవేణి'' నవలలు కూడా చాలా ఇష్టపడే దాన్ని. తరువాత ఆవిడ రంగనాయకమ్మగా మారటం, మార్క్సిజం వైపు మళ్లడం, ఆ దిశగా మార్క్సిజం మీద పుస్తకం రాయడం, స్త్రీవాద రచయిత్రిగా ముద్రపడటం ఇవన్నీ జరిగాయి. ఇవన్నీ ఆవిడ వ్యక్తిగత విషయాలు. కానీ హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా, హిందువుల పవిత్ర గ్రంథమైన రామాయణాన్ని నేటికీ ఆదర్శపురుషుడిగా, భగవంతుడిగా కొలువబడుతున్న శ్రీరాముడిని కించపరుస్తూ "రామాయణ విషవృక్షం" రాయడం అందునా ఇంగ్లీషులో తర్జుమా చేసి పాశ్చాత్యులు సైతం ఈసడించుకునే విధంగా చేయడం క్షమించరాని విషయం.

హిందువులు కర్మసిద్ధాంతాన్ని నమ్ముతారు. ఎవరి పాపానికి వాళ్లే పోతారని వదిలేస్తారు. ఇటువంటి రచనే ఇతర మతస్థుల దేవుళ్లపై ఎవ్వరైనా రాస్తే వారు ఆ రచయితను దేశం నుంచి బహిష్కరించడం లేదా కఠినశిక్ష విధిస్తారు. సల్మాన్‌రష్దీ, తస్లీమాల ఉదంతాలే దీనికి నిదర్శనం.

ఒక భర్త నుంచి కారణాంతరాల వల్ల విడిపోయి, వేరొకరితో వివాహం చేసుకోకుండా సహజీవనం సాగించిన మనిషికి, శ్రీరాముడి ఏకపత్నీ వ్రతం యొక్క గొప్పదనం ఎలా తెలుస్తుంది. సమాజంలో కట్టుబాట్లు తెంచుకుని, స్త్రీపురుషులు సహజీవనం సాగిస్తుంటే, మనుషులకీ, జంతువులకీ తేడా ఏం ఉంటుంది?

మనం ఒక సహపంక్తిలో కూర్చుని నలుగురితో కలిసి భోంచేస్తున్న ప్పుడు, మనకు ఇష్టంలేని పదార్థం పక్కనవాడు తింటున్నప్పుడు, అది మనకి ఇష్టంలేకున్నా ఈ పదార్థమంటే నాకసహ్యం అని మనం చెప్పలేం. ఎందుకంటే ఒకరి ఇష్టాన్ని అసహ్యించుకోవడం, అమర్యాద, అనాగరికత కాబట్టి. అలాంటిది కోట్లమంది హిందువుల ఆరాధ్య దేవుడైన శ్రీరాముడి గురించి, హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా రాయడం ఎంతో అనాగరికం.

నేటి సమాజంలోని అన్యాయాలను ఎదురించవచ్చు. వేల సంవత్సరాల నాటి రాజకీయ. సాంఘిక విలువలు, కట్టుబాట్లు నాయకుడి లక్షణాల గురించి రాసిన రామాయణాన్ని మార్క్సిస్ట్ దృష్టితో చూసి రామాయణ విషవృక్షంగా రాసి రాముడిని దేవుడిగా

కొలిచే హిందువులను మనోక్షోభకి గురిచేసిన రంగనాయకమ్మపై అభిప్రాయమేముంటుంది. తిరస్కార భావన తప్ప.

**16. స్త్రీల పట్ల నేడు సమాజంలో జరుగుతున్న అకృత్యాల పట్ల మీరు ఎలా స్పందిస్తారు?**

**జ:** చిన్నతనంలో మా నాయనమ్మ అనేది "ఆడపిల్లగా పుట్టే కంటే ఆడవిలో మానై పుట్టడం మేలు" అని. కడుపులో బిడ్డ, చంకలో బిడ్డ, ఇంకో చేతిలో నీళ్లబిందె. ఇదే ఆడదాని జీవితం అని, పదిమంది పిల్లల్ని కన్నా మొగుడిముఖం ఎలా ఉంటుందో తెలియదు. ఎప్పుడైనా, ఎక్కడయినా, రాసినా, ఉపన్యాసాలి చ్చినా నేను అనుభవించిన జీవితం గురించి రాయండి అంటూ అప్పుడప్పుడు తన జీవితంలోని సంఘటనలు చెబుతూ ఉండేది.

నేడు సమాజంలో జరుగుతున్న అకృత్యాల గురించి చెప్పాలంటే నాటి గురించి కూడా కొంత చెప్పాలి. ముక్కుపచ్చలారని ముద్దుగుమ్మను విధవరాలని చేసి వంటింటికి పరిమితం చేసింది నాటి కన్యాశుల్కం. నవవధువుకు కిరస నాయిలుతో మరణశాసనం చేసింది నేటి వరకట్నం. యవ్వన తుళ్లింతలను అనుభవించనీయకుండా, మాటువేసి మానభంగం చేస్తున్న కామాంధులు, కసుగాయలని కూడా చూడకుండా, వావీ వరుసలు లెక్కచేయకుండా, కన్నూ మిన్నూ గానని పాశవిక మానభంగాలు, తరువాత హత్యలు. ఇవన్నీ పుట్టిన తరువాతి సంగతులైతే, ఆడపిల్ల అని తెలియగానే పుట్టకుండానే పొట్టలోనే చిదిమేస్తున్న అమానుషత్వం, వేలగొంతుల స్త్రీల ఆర్తనాదాలు నరరూప రాక్షసుల ఆగడాలకు, ఆవిరులైపోతున్నాయి. పొద్దున లేచి వార్తాపత్రిక తెరవగానే ప్రత్యక్ష మయ్యే హృదయవిదారకమైన వార్తలు.

ఇప్పుడు నాగరికత పెరిగిన తరుణంలో స్త్రీలు మరిన్ని ఇబ్బందుల పాలవుతున్నారు. సెల్‌ఫోన్, ఇంటర్‌నెట్, చాటింగ్, ఫేస్‌బుక్ వంటి అధునాతన సాంకేతిక ప్రక్రియల ద్వారా స్త్రీపురుషుల మధ్య సాన్నిహిత్యం పెరిగింది. కాని స్త్రీ మరిన్ని కొత్త సమస్యల్లో ఇరుక్కుంది. స్త్రీల టాయ్‌లెట్స్‌లో చిన్న చిన్న కెమెరాలు పెట్టి స్త్రీని నగ్నంగా చిత్రీకరించి బ్లాక్‌మెయిల్ చెయ్యడం, చాటింగ్ ద్వారా ప్రేమలోకి దింపి, ఫలానా చోటుకి రమ్మనమని, అక్కడ స్నేహితులతో కలిసి సామూహిక మానభంగాలకు పాల్పడటం,

ఆఫీసునుంచి ఇంటికి వస్తుంటే, క్యాబ్ డ్రైవర్ మానభంగం చేయడం, ఇలా రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. సైబర్ నేరాలలో స్త్రీ నిత్యమూ నరకయాతననుభవిస్తోంది. ప్రపంచీకరణ స్త్రీ సమస్యలను మరింత జటిలం చేసింది.

ఇవన్నీ చూస్తుంటే వింటుంటే ఆ రోజు మా నానమ్మ చెప్పిన మాట నాటికీ నేటికీ సత్యమనిపిస్తోంది. ఆనాడు స్త్రీకి నడుము విరిగే చాకిరీలు ఏడాదికో కాన్పు, వంటింటికే పరిమితమైన జీవితం తరువాతికాలంలో వరకట్న చావులు, కన్నకూతురిని తగలబెట్టి చంపాడని తెలిసినా, సాక్ష్యం చెప్పలేని నిస్సహాయ తల్లిదండ్రులు, మనకెందుకులే అని తప్పించుకు తిరిగే బంధువర్గాలు. అర్థాంగిని వ్యభిచారానికి పంపి, డబ్బు సంపాదించే భర్తలు. తాగుడు, పేకాట్లలో జీతమంతా తగలేసి, భార్యను పుట్టింటి నుంచి డబ్బు తెమ్మని ఇంటి నుంచి పంపించి వేసే మొగుళ్లు.

ఏమిటీ అరాచకాలు. స్త్రీని పురుషుడెప్పుడూ తనతోటి వ్యక్తిగా చూడలేని దుర్మదాంధుడు. ఎన్ని రకాలుగా స్త్రీ తనని తాను రక్షించుకోవాలి. అడవిలో జంతువులను వేటాడినట్టు నాగరిక సమాజమనుకుంటున్న ఈ జనారణ్యంలో స్త్రీని రకరకాల వేధింపులతో అనునిత్యం వేటాడుతున్నారు.

నాడు స్త్రీని అపహరించిన రావణులు, ద్రౌపదిని చెరబట్టిన కీచకుడు, వస్త్రాపహరణం కావించిన దుశ్శాసనుడు, శిశుహత్యలు కావించిన కంసుడు దుర్మార్గులుగా కనిపించడం లేదు నాకు. వేలకు వేలు రావణాసురులు, కీచకులు, దుశ్శాసనులు, కంసులు గల్లీల్లో విచ్చలవిడిగా దుశ్చర్యలకు పాల్పడుతున్న నేటి సమాజంలో స్త్రీ తనను తాను ఎలా రక్షించుకుంటుంది?

ప్రభుత్వాలు స్త్రీల రక్షణకోసం నాటి “శారదా”చట్టం నుంచి నేటి నిర్భయ చట్టం వరకు శాసనాలు చేసి చేతులు దులుపుకుంటున్నాయి. నిజంగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే, పుచ్చిపోయిన మన న్యాయవ్యవస్థ తీర్పు ఇవ్వడానికి ఏళ్లకి ఏళ్లు గడిచిపోతాయి. ఇంగ్లీషులో ఒక సామెత ఉంది. “జస్టిస్ డిలేయ్‌డ్ ఈజ్ జస్టిస్ డినైడ్” అని. తీర్పు ఇవ్వడం ఆలస్యమయితే అన్యాయం చేసినట్టే. నిర్భయ చట్టం చేసిన తరువాత కూడా, అనేక రకమైన పాశవిక మానభంగాలు, హత్యలూ జరుగుతూనే ఉన్నాయి. అందుకే

స్త్రీని మృగాల్లా అన్ని వైపుల నుంచి వేటాడుతున్న మానవ మృగాళ్లకు డెబ్బకు దెబ్బతీసే సత్వర ఆటవిక న్యాయమే సరైన శిక్ష. ఇస్లామిక్ దేశాల్లో అమలుపరుస్తున్న సత్వర న్యాయనిర్ణయం, సత్వర శిక్ష అమలు భారతదేశంలో కూడా రావాలి. అప్పుడే అతివల గుండెల్లో రగులుతున్న అగ్ని జ్వాలలు చల్లారుతాయి.

**17. స్త్రీలు నేడు అనేక రంగాల్లో విజయబావుటాలు ఎగురవేస్తున్నా కూడా అనేకచోట్ల వివక్షకు గురి అవుతున్నారంటే మీరేమంటారు?**

**జ:** ఇది ముమ్మాటికీ నిజం. అనేకచోట్ల కాదు. అన్నిచోట్లా.

**18. స్త్రీ వాద రచనల్లో ప్రధానంగా చోటు చేసుకుంటున్న అంశాలు ఎలాంటివి?**

**జ:** స్త్రీ వాద రచనల్లో ఎక్కువగా సమానహక్కులు, అస్థిత్వ పోరాటాలు, భావ వ్యక్తీకరణలో స్వేచ్ఛ, లైంగిక హింస, వివక్షత ఎలుగెత్తి వినిపిస్తున్నాయి. స్త్రీ జాతికి జరుగుతున్న అవమానాలు, అణచివేతలు, వాటికి ఎదురు తిరిగినప్పుడు కలిగే పరిణామాలు స్త్రీవాద రచనల్లో చోటు చేసుకుంటాయి.

**19. స్త్రీలు వివక్ష నుండి, విముక్తి కావాలంటే ఏం చేయాలంటారు?**

**జ:** స్త్రీలు వివక్షత నుండి విముక్తి కావాలంటే తన వ్యక్తిత్వానికి పదు నుపెట్టుకోవాలి. ప్రతి పనిలో తన అస్థిత్వాన్ని నిరూపించుకోవాలి. పదునైన సాహిత్యం ద్వారా వివక్షతను ఎలుగెత్తి చాటాలి.

**20. అసలు సాహిత్యంలో జండర్ కోణం అవసరముందా?**

**జ:** జెండర్ కోణం అవసరమే! స్త్రీ ఆకాశంలో సగం, పురుషుడి జీవితంలో అర్ధభాగం అంటూ ఉపన్యాసాలూ, పేజీలకి పేజీలు సాహిత్య నింపడమే కానీ, స్త్రీని సాటి మనిషిగా చూసే నైజం, సంస్కారం, పురుషుడిలో రాలేదు. అణచివేతకు నిర్లక్ష్యానికి గురవుతున్న ఏ జెండరైనా తన ఆవేదనను అక్షరబద్ధం చేయాలి. సమాజానికి ఎలుగెత్తి చాటాలి. స్త్రీల మనోభావాల్నీ, బాధల్నీ అర్థంచేసుకుని సాటిమనిషిగా చూసే నైతికత వచ్చేవరకూ సాహిత్యంలో జెండర్ కోణం అవసరం ఉంది. ఇటీవల పురుషులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పురుష సంఘాలు ఏర్పడినాయి. ఈ దిశగా కూడా సాహిత్యంలో జెండర్ కోణాన్ని ఆవిష్కరించవచ్చు.

**21. నేటివాదాలు ఇజాలపై మీ ఆలోచన ఏమిటి?**

**జ.** మనది ప్రజాస్వామ్య దేశం. ఎవరి ఇష్టప్రకారం వారు రకరకాల ఇజాలు, వాదాలతో బతికేస్తుంటారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం కదా మరి! ఈవాదాలు ఇజాలు కూడా సమాజంలోని అసమానతలు, పీడన నుంచే జని స్తాయి. వీటిని తొలగించడం కోసం సమాజంలో అన్ని వర్గాల అస్థిత్వ నిరూపణ కోసం ఈ వాదాలు, ఇజాల సాహిత్యం ఉద్భవించింది. సాహితీ క్షేత్రంలో ఎన్ని వాదాలొస్తే అంత మంచి సాహిత్య సృజన వుంటుంది. వీటి గురించి చర్చ, సంఘర్షణ జరిగినప్పుడే సమాజం చైతన్యవంతంగా వుంటుంది.

ఇక వ్యక్తిగతంగా అయితే నాది మానవతావాదం. సకల మానవాళి అభివృద్ధికి ఏవాదం కృషిచేస్తుందో, మానవత్వానికి పెద్దపీట వేస్తుందో అదే వాదం సజీవంగా నిలుస్తుంది.

**22. ప్రాంతీయవాద కవిత్వం ఈమధ్య విరివిగా వచ్చింది. వస్తున్నది కదా! దీనిపై మీ అభిప్రాయమేమిటి?**

**జ:** సదభిప్రాయమే! ప్రాంతీయవాదం సమాజ అసమానతల ప్రతిఫలం. ఇక ప్రాంతీయవాద కవిత్వం తెలంగాణా గురించి అయితే, భాష, యాస, ఆత్మగౌరవం విషయంలో వివక్షతకు గురైంది. ఫలితంగా ప్రాంతీయవాద కవిత్వం ఉవ్వెత్తున ఎగిసిపడి, ఉద్యమానికి ఊపిరిగా మారి ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని సంపా దించి పెట్టింది. ప్రాంతీయవాద కవిత్వం తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. ఏదీ ప్రాంతీయం కాకుండా విశ్వజనీనం కాలేదు.

**23. ఈ మధ్య మీరు అమెరికా పర్యటించి వచ్చారు కదా!అక్కడి సాహిత్యానికీ, భారతీయ సాహిత్యానికీ ఏమైనా బేధాలున్నాయా?**

**జ:** ఏ దేశమేగినా ఎందుకాలిడినా, తెలుగుసాహిత్యం గుబాళింపు ఒక్కటే. ప్రాంతీయ భేదాలు తప్పితే, భావాలన్నీ ఒక్కటే. మనుషుల మధ్య, దేశాల మధ్య ఎల్లలు చెరిపివేస్తుంది కవిత్వం.

నేను 'తానా' సభలలో పాల్గొన్నప్పుడు, అక్కడి వారి కవిత్వ రీతులు చూసి అబ్బురపడ్డాను. వారు మాట్లాడే స్వచ్ఛమైన భాష, మనందరికీ కనువిప్పు. అలాగే లండన్‌లో

"యుక్త"సభలకు వెళ్లినప్పుడు కూడా, అక్కడ వారు సృజిస్తున్న సాహిత్యం చాలా గొప్పగా ఉంది.

వంగూరి చిట్టెన్ రాజుగారు వంగూరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సంస్థ స్థాపించి, అమెరికాలో, లండన్‌లో, ఇండియాలో కూడా సాహితీవేత్తలందరికీ ఒక వారధిలా నిలిచి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వయంగా వారు మంచి హాస్య రచయిత. 108 హాస్య కథల సంకలనం రచించి అది హైదరాబాదు త్యాగరాయగానసభలో ఆవిష్కరింప చేయడం ఎంతైనా అభినందనీయం. వారిని చూస్తే అమెరికన్ ఛాయల కంటే 16 అణాల తెలుగువాడి లానే ఉంటారు. వారి కవిత్వమూ 16 అణాల తెలుగుదనమే!

అలాగే అమెరికా డల్లాస్ నగరంలో "తెలుగు వెలుగు" అనే మాస పత్రికను నిర్వహించడమే కాక, నెలనెలా తెలుగు వెన్నెల పేరిట, "ప్రతినెలా ఒక సాహితీ కార్యక్రమం నిర్వహిస్తూ, తెలుగు భాష రమ్యతను అమెరికాలో విరజిమ్ముతున్న సుబ్బు జొన్నలగడ్డ గారు మంచి కవి. వారి సతీమణి, అక్కడి సెటిలయిన తెలుగువారి పిల్లలకు తెలుగునేర్పడం కోసం "ఆదివారం పిల్లలకు తెలుగు బోధిస్తున్నారు.

నేను ఇటీవల న్యూజెర్సీలో ఉన్న మా అమ్మాయి దగ్గర ఉండి వచ్చాను. అప్పుడు అక్కడున్న సాహితీ మిత్రులతో పరిచయం అయింది.

న్యూజెర్సీలో "సాహిత్యభారతి" (మనమాట, మనపాట, మనపద్యం) అనే సంస్థ ద్వారా చక్కని తెలుగు సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీని అధ్యక్షులైన కాశీనాధుని రాధ, ఉపాధ్యక్షులుగా భావరాజు భారతి, కార్య దర్శిగా వైదేహి శశిధర్ గార్లు స్వయంగా మంచి రచయిత్రులు. వీరు తెలుగు సాహిత్యాన్ని అవపోసన పట్టినవారు.

వారు ఏప్రిల్ 2015లో "ఆధునిక కవితారీతులు" అనే అంశం మీద నా ప్రసంగాన్ని ఏర్పాటు చేశారు. ఆ సభలో ప్రముఖ రచయిత్రులు (అమెరికా లోని) ఏలూరిపాటి అపర్ణ, దశిక శ్యామల, పేరి దివాకర్ మొదలైన వారితో పరిచయం అయింది. వారి కవిత్వం, కథలు, వ్యాసాలు చాలా అత్యున్నత ప్రమాణాలు కలిగినవిగా ఉన్నాయి.

న్యూజెర్సీలోని తెలుగు కళా సమితి వారు 'తెలుగుజ్యోతి' సాహిత్య పత్రిక నిర్వహిస్తున్నారు. దానిలో నా కవిత కూడా ఒకటి ప్రచురింపబడింది. దానిలో పడిన

కవితలు, కథలు అన్నీ చదివినప్పుడు, తెలుగు కవుల గుండె చప్పుళ్లలో దేశ, విదేశాల తేడా లేదని తెలుసుకున్నాను. తెలుగు సాహితీ ప్రపంచ మంతటా ఒకటే.

**24.భారతీయ భాషల్లో వస్తున్న కవిత్వానికీ, తెలుగులో వస్తున్న కవిత్వానికీ ఏమైనా తేడాలున్నాయా?**

**జ.**భారతీయ భాషల్లోనే కాదు, ప్రపంచ సాహిత్యంలోనయినా, తెలుగులో వస్తున్న కవిత్వమైనా, సాహిత్యం, సామాజిక, సాంస్కృతిక రాజకీయ నేపథ్యంలోనే సాగు తుంది. ఆయాప్రాంతాల స్వరూప స్వభావం,ప్రజలసంక్షోభ జీవనం ఆయా ప్రాంతపు భాషా కవుల కవిత్వంలో ప్రతిఫలిస్తుంది. నైసర్గిక స్వరూపంలో తేడాలే కానీ, కవిత్వంలోని భావం విశ్వజనీనం.

**25.ఇతర భాషల కవిత్వంతో పోలిస్తే తెలుగు సాహిత్యం ఏస్థాయిలో వున్నదంటారు.**

**జ.** తెలుగు కవులు ప్రపంచంలో ఎవరికీ తీసిపోని మంచి సాహిత్యం సృష్టించారు. సృష్టిస్తున్నారు. నేను అఖిలభారతీయ భాషా సాహిత్య సమ్మేళన్(భోపాల్)లో సభ్యురాలిగా, భారతీయ భాషల్లో వస్తున్న కవిత్వ ధోరణులను పరిశీలించడం, ఆస్వాదించడం జరిగింది. ఆ భాషా సాహిత్యాలకన్నా మన తెలుగువారి కవి త్వంలో వైవిధ్యం, సాంద్రత చాలా ఎత్తులో వుంది. మన కవిత్వానికి అనువాదాలు బాగా వస్తే మన కవిత్వం గొప్పదనం, ఇతరులకు కూడా తెలుస్తుంది.

అయితే తెలుగువాడంటే తెలుగువారికి పడదు. చిన్నచూపు, తెలుగువారి కవిత్వం ఎంతబాగున్నా ఈర్ష్యాసూయలలో నలుగుతూ, పైకి రానివ్వరు. అవార్డులకు సిఫారసు చేయరు. అందుకే తెలుగువాళ్లకి అఖిలభారత స్థాయిలో అవార్డులు, జ్ఞానపీఠాలు రావడం బ్రహ్మప్రళయం.

తెలుగువాళ్ల గురించి ఒక కథ గుర్తుకొస్తుంది. అన్ని రాష్ట్రాల నుంచి పీతలను సీల్డు కంటైనర్స్‌లో సేకరించి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారట. తెలుగు రాష్ట్రంలో నుంచి వెళ్లే కంటైనరికి ఈ సీలు కాదు కదా, కనీసం మూత కూడా లేదట. అదేమిటి దానికి మూతలేకపోతే అవిపైకొచ్చి గందరగోళం సృష్టిస్థాయి కదా అని తనిఖీ అధికారి అడిగాడట.

అవి పైకిరావు సార్ చాలా ఏళ్లనుంచి ఇలానే పంపుతున్నాము అన్నాడట, కావాలంటే మీరే చూసుకోండి అన్నారట. అధికారి కంటైనర్‌లోకి తొంగిచూశాడట అవి. నిజంగానే పైకి రావడం లేదట. ఎందుకని పరిశీలనగా చూస్తే, ఒకటి పైకి వస్తుంది. ఇంకోటి కిందకి లాగేస్తోందట. కాబట్టి అవి పైకి రాలేకపోతున్నాయని తెలుసుకున్నాడు.

ఇది మన తెలుగువారి సాహిత్యానికి సరిపోలుతుంది. ఒకరి కవిత్వం బాగా ప్రచారంలోకి వస్తుంటే చేయూతనివ్వకుండా, కిందికి ఎలా లాగుదామా అని పాత చరిత్రలు, వ్యక్తిగత విషయాలు బైటకిలాగి అపఖ్యాతి పాలు చేయడానికి ప్రయత్నిస్తుంటారు.

ప్రభుత్వం ప్రఖ్యాత సాహిత్యకారుల గురించీ, జ్ఞానపీఠ పురస్కార కవుల గురించి పాఠ్యపుస్తకాలలో పాఠ్యాంశం కిందపెట్టి, వారి సాహిత్యపు విలువల గురించి భావితరాలకు తెలిపే విధంగా చర్యలు తీసుకోవాలి. అప్పుడు తెలుగు సాహిత్యకారుల గురించీ సాహిత్యం గురించి విద్యార్థులకు అవగాహన కలుగుతుంది.

### 26. జీవితంపై సాహిత్య ప్రభావం ఎటువంటిది?

**జ:** సాహిత్యం జీవితమంత విస్తృతమైంది. సాహిత్యం జీవిత పోరాటంలో, ఆటుపోట్లను, భరించే శక్తినిస్తుంది. చైతన్యస్ఫూర్తినిస్తుంది. కవిత్వంలో చూపించే ఆదర్శాలకనుగుణంగా, నిబద్ధతగా జీవించే విధంగా ఆలోచింపచేస్తుంది. సాహిత్యం చదివి, ఉత్తమమైన మార్గంలో జీవితం గడుపుతున్నవారూ, తమ జీవితాల్ని అంచనా వేసుకుని సంస్కరించుకున్న వారూ ఎందరో ఉన్నారు. మనిషి జీవితానికి సాహిత్యం ఒక దివ్యౌషధం.

### 27. మంచి కవిత్వాన్ని మీరు ఎలా అంచనా కడతారు?

**జ:** వ్యక్తి గురించి, సామాజిక వ్యవస్థ గురించి భావ సంఘర్షణ ఉండేదే మంచి కవిత్వం. ఆ భావ సంఘర్షణకి అక్షర రూపమివ్వడంలో, వ్యక్తపరిచే విధానంలోనే కవి ప్రతిభ కనపడుతుంది. ప్రజలకు అర్థమయ్యే భాషలో చెప్పేదే మంచి కవిత్వం.

### 28. సాహిత్యంలో నేడు వస్తున్న ప్రక్రియలపై మీరేమంటారు?

**జ.** ఆధునిక సాహిత్యం బహుముఖంగా రకరకాల కొత్త పోకడలతో ప్రక్రియలతో రూపుదిద్దుకుంటోంది. కవిత్వం అనాదిగా రూపం మార్చుకుంటూనే వస్తోంది. భావోద్రేకమైన

కవిత్వం వచనమైంది. భావవ్యక్తీకరణను చిన్నచిన్న కవితలలో ఇమిడ్చి అనంత భావాన్ని, సాధారణ పాఠకులు సైతం ఆస్వాదించే విధంగా రాయడం ప్రశంసనీయమైన విషయం. అందుకే ఈ కవితా రూపాలు ఈనాడు విస్తృతంగా వస్తున్నాయి. వేమన శతక పద్యాలు, ఉర్దూషేర్లు, గజల్స్, జపాను హైకూలు ఇందుకు నిదర్శనం. ఈనాడు వస్తున్న మినీ కవితలు, రెక్కలు, నానీలు, ముక్తకాలు, వ్యంజకాలు, ఈకోవకు చెందినవే. విస్తృత భావాన్ని, సంక్షిప్తంగా పాఠక రంజకంగా చెప్పే లఘు కవితారూపాలు ఎక్కువ మందిని కవిత్వంవైపు ఆకర్షిస్తున్న అయస్కాంతాలు.

**29. ఈ ప్రక్రియల వల్ల కవిత్వం పలచబడుతోందా?**

**జ.** నిజానికి ఈ ప్రక్రియల వల్ల కవిత్వం చైతన్యవంతమయింది. కవి తన కవిత్వంలో బలమైన కవితా పటిమ, సృజనాత్మకత కనబరచగలిగితే ఏ ప్రక్రియ అయినా కాల పరీక్షకు నిలబడుతుంది. కవిత్వం ఏ రూపంలో వున్న బలంగానే ఉంటుంది.

**30. సమాజ పరిణామాలు కవిత్వంపై ఎలాంటి ప్రభావం చూపుతాయి?**

**జ:** కవిత్వానికి సమాజమే భూమిక. సమాజమే నేపథ్యం. సమాజంలో జరిగే పరిణామాలు కవిత్వంలో ప్రతిఫలిస్తాయి. ఆనాటి సమాజ పరిస్థితులు కందుకూరి, గురజాడ వంటి వారి కవిత్వంలో ప్రతిఫలించి సంఘ సంస్కరణలకు పురుడు పోసాయి.

ఇటీవల వర్షాభావం వలన పంటలకు నీళ్లులేక, అప్పులు తీర్చలేక, రైతులు పడుతున్న బాధలు, ఆత్మహత్యల నేపథ్యంగా విరివిగా, కవిత్వం వెలువడు తోంది. ప్రత్యేక తెలంగాణా కోసం చేసిన పోరాటంలో ఉద్యమకవిత్వం వెల్లువై పారింది. సమాజంలో అణచివేతకు గురైన వర్గపోరాటాల పరిణామ ఫలితమే సమర సాహిత్యానికి శంఖారావాలు.

**31. నేడు సాహితీ సంస్థలు అవార్డులు ఎంతవరకూ సవ్యంగా ఉంటున్నాయి?**

**జ:** సాహితీ సంస్థల అవార్డులు, సాహితీకారులను ప్రోత్సహించే రీతిలో ఉండాలి. అయితే బాగా రాసే కవులందరికీ ఈ అవార్డులు వస్తాయని గ్యారంటీ లేదు. కొన్ని సాహితీ సంస్థలు ఏదో ఒక కార్యక్రమం చెయ్యాలి కాబట్టి, తమకు నచ్చిన కవులను ఎంపిక చేసుకుని, ఆ అవార్డుతో వారికి సంబంధం ఉందా లేదా అని చూడకుండా ఇస్తున్నారు.

సేవారంగంలో ఉన్నవారికి కాకుండా ఒక సాహితీవేత్తకు మదర్‌థెరిసా అవార్డుతో సత్కరిస్తారు. ఇటీవల దాశరథి శతజయంతి ఉత్సవాల సందర్భంగా, దాశరధి కవిత్వం పట్ల సదభిప్రాయం లేని, ఆయన కవిత్వం గొప్పదనం తెలియని వారికి, దాశరధి పురస్కార ప్రదానం చేసింది ఒక సంస్థ.

అలా అన్ని అవార్డులు అపసవ్యంగా ఉంటున్నాయని కాదు. కొన్ని సంస్థలు చాలా సంవత్సరాలుగా సాహితీ సేవలో నిబద్ధతగా ఉంటూ, సరియైన వ్యక్తులకు అవార్డులు ఇచ్చినవారూ ఉన్నారు.

సమాజంలో మంచీ, చెడూ ఉన్నట్టే సాహితీసంస్థలు కొన్ని స్వలాభం కోసం, కొన్ని సాహితీసేవ కోసం పనిచేసేవీ ఉన్నాయి.

**32. ఎవరికైనా ఏదైనా అవార్డు వస్తే, ఏదో పైరవీ వల్ల వచ్చినదని అనడం తరచుగా వినిపిస్తుంది. ఇందులో వాస్తవమెంత?**

**జ.** దీనిలో కొంత వాస్తవికత లేకపోలేదు నిజానికి మంచికవిత్వం రాయడం ఒకటేకాదు. దాన్ని పదిమందీ చదివేలా చేయాలి. దాని గురించి నలుగురూ చర్చించేలా చేయాలి. అయితే చాలా మంది మంచి కవిత్వం రాసిన వాళ్లు, అవార్డులకోసం ప్రయత్నించక, తమ రచనలను సాహితీలోకానికి వదిలేసి, తప్పక అవార్డుల వస్తాయనుకుంటారు. మంచి పుస్తకమని అభినందిస్తారే తప్ప అవార్డులు ఇవ్వరు. ఎవరో ఒక గాడ్‌ఫాదర్ వుండి, వారి గురించి శ్రద్ధ తీసుకుని సదరు అవార్డు కమిటీకి రచయిత పేరు సిఫారసు చేస్తేనే ఈ అవార్డులు వస్తున్నాయి. అందుకే మంచి రచనలు చేసే వారందరికీ అవార్డులు వస్తాయను కోవడం పొరపాటే.

ఇంకో విషయమేమిటంటే, అవార్డులు పైరవీ వల్ల వచ్చినా, తమ స్వయంకృషివల్ల వచ్చినా, అది నిజంగా మంచి కవిత్వమే అయివుంటుంది. కేవలం సిఫార్సుల వల్ల వచ్చే కవిత్వం అవార్డుకే పరిమితమవుతుంది. కానీ జనం రివార్డులు రావు. అలా అర్హత లేకుండా అవార్డు తీసుకున్న సాహితీవేత్తలు స్వల్పశాతం మాత్రమే. అలా తీసుకున్న వారు ప్రముఖసాహితీ వేత్తల కళ్లలోకి ధైర్యంగా చూడలేక, తప్పించుకు తిరుగుతారు. కవితాలోకం సదరు కవిని చూసిన చూపులకే అతను సిగ్గిల్లిపోతాడు. ధైర్యంగా అవార్డుపేరును పక్కన

రాసుకోలేదు. అసలు ఏ ప్రతిభా లేకుండా కూడా సిఫార్సుతో అవార్డులు తెచ్చుకుని గుండె విరుచుకు తిరిగేవారూ వున్నారు, ఉంటారు. గుండీలన్నీ విప్పదీసుకుని తిరిగే వారిని నోరు వెళ్లబెట్టి చూడటం తప్ప చేసేదేమీ వుండదు.

ప్రతీ రచయిత మంచిసాహిత్య సృష్టి చేయాలి కానీ అవార్డులే పరమా వధిగా కాదు. ఈరోజు సాహితీలోకంలో మనం చూస్తూనే ఉన్నాం. ఒకటో రెండో కవితా సంకలనాలు రాగానే, పైరవీలు చేసుకుంటూ ఆ రెండూ పుస్తకాల తోనే ఎన్నో పురస్కారాలు దక్కించుకుంటున్నారు. ఈ పురస్కారాల కోసం వెంపర్లాడే వారు తమ యోగ్యత, సాహితీలోకానికి తాను అందించిన ఉత్తమ రచనలు, సేవ కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఆత్మావలోకనం చేసుకోవాలి.

అయితే సిఫారసులు లేకుండా నిజమైన, నిగ్గుతేలిన రచనలు చేసిన సాహితీ కారులను కొన్ని సాహితీ సంస్థలు, సంఘాలు కానీ గుర్తించి పురస్కారాలు అందించిన లేదా సిఫారసు చేసిన సంఘటనలూ లేకపోలేదు.

అందరినీ ఒకే గాడిలో కట్టేసి, ఎవరికి ఏ అవార్డు వచ్చినా "ఆ బాగా డబ్బులు వెదజల్లారు, పైరవీలు చేశారు, పురస్కారాలు రాకేం చేస్తాయి" అన్న ధోరణిలో విమర్శలు చేస్తూ పురస్కారాలనూ, సదరువ్యక్తులను కించపరచడం సాహితీలోకంలో ఒక జాఢ్యంలా తయారయింది. ప్రతి కవీ తనకు వచ్చిన అవార్డు తన ప్రతిభ చూసి ఇచ్చారనీ, ఇతరులకు వచ్చినవి పైరవీల ద్వారా తెచ్చుకున్నట్టు ఈర్ష్యా అసూయలు ప్రదర్శిస్తూ బాహాటంగా తమ అక్కసు వెళ్లగక్కుతుంటారు. గురివిందగింజ తనకింద నలుపెరగదన్న సామెతలాగా కాకుండా, నిజమైన కవిత్వాన్నీ, సాటికవులను ప్రేమిస్తూ ప్రోత్సహిస్తూ వుండే సుహృద్భావ వాతావరణం రావాలి. అపుడు అవార్డులకు సిఫారసుల అవసరం వుండవు. అయితే బంగారు పళ్లేనికైనా గోడ చేరువ అవసరం అన్నట్టు, సుకవికి సైతం పురస్కారాలు శోభను చేకూర్చు తాయి. దీనికి సహృదయ కవిమిత్రుల సిఫారసుల కూడా పనిచేస్తాయి.

## 33. సాహిత్యంపై కాలప్రభావాలు ఎలాంటివంటారు?

**జ:** సాహిత్యంపైనే కాదు అన్నింటి మీదా కాలప్రభావాలుంటాయి. మనం చూస్తున్న ప్రపంచం క్షణక్షణం మార్పులు చెందుతూ ముందుకు సాగుతుంటుంది. ఇది అనివార్యమైనది. కాలం

ఎప్పుడూ ఒక్కలాగే ఉండిపోదు. అలాగే మనం కూడా. కాలాన్ని బట్టీ మనలో ఏర్పడుతున్న మార్పుల్ని బట్టీ, మనం పొందుతున్న అనుభవాలను బట్టీ సాహిత్యంలో మార్పులు చోటు చేసుకుం టాయి. సాహిత్యం కాలప్రభావాల నుండి తప్పించుకు పోలేదు. అలా నిన్నలోనే నిలిచిపోయి సాహిత్య సృజన చేస్తే అది అవసరం లేని కవిత్వంగా మిగిలిపోయే ప్రమాదమూ ఉంటుంది. అసలు సాహిత్యాన్ని తరిచి చూస్తే ఆ కాలపు సంఘ పరిణామాలు అవగతమవుతాయి. అవ్వాలి కూడా. కాలం సాహిత్యంపై బలమైన ముద్రనే వేస్తుంది.

**34. మీరు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే సాహిత్యానికి సేవలందించారు కదా! ఆసేవలెలాంటివి?**

**జ:** నేను సచివాలయంలో వివిధ స్థాయిల్లో బాధ్యతాయుతమైన పదవుల్లో పనిచేశాను. నాకున్న సాహితీ ప్రియత్వం వలన, సచివాలయములోని 'చేతన' సాహితీ సంస్థకు అధ్యక్షురాలిగా కూడా వ్యవహరించాను. ప్రతినెల ఒక సాహిత్య కార్యక్రమాన్ని నిర్వహించడం, ప్రముఖ సాహితీవేత్తలను ఆహ్వానించి వారి ప్రసంగాల ద్వారా సచివాలయ ఉద్యోగులకు సాహితీ సృజన కలిగించే విధంగా కార్యక్రమాలు నిర్వహించడం చేశాము. మా కార్యక్రమాలన్నీ ఆఫీసు పనికి భంగం వాటిల్లకుండా భోజన విరామ సమ యంలో నిర్వహించుకునేవాళ్లం.

సచివాలయంలో పనిచేసే వారికి మాత్రమే కవి సమ్మేళనం నిర్వహించి, వారిలోని అంతర్లీన కవితా ఆర్తిని ప్రోత్సాహించాము. ఉద్యోగులు రాసిన కవితలను, కథలనూ సంకలనం చేసి పుస్తకాలు ప్రచురించాము.

కవితల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రముఖుల చేత బహుమతి ప్రదానం చేయించాము. ప్రముఖులలో మచ్చుకి, కీ.శే. రావూరి భరద్వాజ, డా॥ సి.నా.రె., మండలి బుద్ధప్రసాద్, డా॥ కె.వి.రమణాచారి, డా॥ ఆవుల మంజులత, మల్లెమాల, సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ దర్శకులు కె.విశ్వనాథ్, అక్కినేని నాగేశ్వరరావు, డా॥ పట్టాభిరామ్, యద్ధనపూడి సులోచనారాణి లాంటి వారున్నారు. అలాగే మహిళల వ్యక్తిత్వ వికాసం కొరకు ఉపయోగకరంగా ఉంటే పుస్తకాల ప్రచురణ కూడా కావించి ఉచితంగా అందచేశాము.

ఆఫీసుకీ, ఇంటికీ పరిమితమయ్యే, సచివాలయ ఉద్యోగులను సాహితీ సృజన వైపు మళ్లించడమే కాక, వారు కూడా మంచి కవులుగా గుర్తింపు పొం ది, పుస్తకరచనలు చేయడం గర్వకారణం.

**35. కవుల మధ్య అసూయలు ఎక్కువంటారు. నిజమేనా?**

**జ:** కవుల మధ్య సామరస్య ధోరణి తక్కువ. పైకి చాలా ఆదర్శ భావాలున్నట్టు కనపడతారు. కానీ, మనసుకి ప్రతిబింబం ముఖం అన్నట్టు వారి మొహంలో అసూయా భావం ప్రతిఫలిస్తుంటుంది. నోటితో మెచ్చుకుంటూ నొసటితో వెక్కిరించే వారెక్కువ. అప్పటిదాకా నా కవిత్వాన్నీ మెచ్చుకుంటూ మాట్లాడిన వారు, నాకొక అవార్డు రాగానే, ఏదో ఒక వంకతో సభకు రాకుండా, మూడో వ్యక్తి దగ్గర నా గురించి వ్యంగ్యంగా మాట్లాడటం నాకు అనుభవైక వైద్యమే. కవుల్లో ద్వంద ప్రవృత్తి ఉంది.

**36. ఈవిషయంలో మీకేమయినా అనుభవాలు ఎదురైనాయా?**

**జ:** చాలా అనుభవాలున్నాయి. అనుభవాల గురించి చెప్పే ముందు నా గురించి కొంత చెప్పాలి. నేను కవిత్వం రాయడం మొదలుపెట్టకముందే సమాజంలో పేరు ప్రఖ్యాతులు గడించిన ప్రముఖ సాహితీ దిగ్గజాలతో పరిచయం ఉంది. మాది సాహితీ నేపథ్య కుటుంబమనీ, మా తాతగారు తెలుగు పండితులనీ, నాన్నగారు బహుముఖీన ప్రజ్ఞావంతులనీ ఇంతకు ముందే చెప్పడం జరిగింది. సచివాలయంలో వివిధ హోదాలలో పనిచేస్తూనే, "చేతన"సాహితీ సంస్థ అధ్యక్షురాలుగా పేరు మోసిన సాహితీవేత్తలను సాహితీ సమావేశాలకు ఆహ్వానించడం, వారితో చేతన వేదిక మీద సాహితీచర్చలూ, గోష్టులూ నిర్వహించడం, నేను కవిత్వం రాయడానికి పునాది వేశాయి.

నేను 1977లో సచివాలయంలో సీనియర్ స్టెనోగ్రాఫర్‌గా చేరి, అంచెలంచెలుగా పదోన్నతులు పొంది 2011లో ఉపకార్యదర్శి హెూదాలో పదవీ విరమణ కావించాను. నా ఈ ఉద్యోగ ప్రస్థానంలో, అనేకమంది కార్యదర్శులతో, మంత్రివర్యులతో, సమావేశాలలో, క్యాబినెట్ సమావేశాలలో పాల్గొనడం, వారిని కలవడం ఫైల్సు గురించి చర్చించడం జరిగేది.

భారతప్రభుత్వం ఇచ్చే "పద్మా" అవార్డుకి రాష్ట్రప్రభుత్వం పంపించే నామినేషన్స్ స్క్రూటినీ చేసే సీటులో సైతం పనిచేశాను. అందువల్ల వైవిధ్యభరితమైన వ్యక్తులతోనూ, కళలతోనూ, కళాకారులతోనూ పరిచయముండేది. ఒక సంఘటన నాకిప్పటికీ ఆనందాన్నిస్తుంది. "వెంకన్న"అనే ఆయన అనంతపూర్ జిల్లాలోని ఒక గ్రామం నుంచి వచ్చిన వెనుకబడిన కులానికి చెందిన వ్యక్తి. అతడు ఒక ఆర్టిస్ట్, స్కల్ప్టర్, పెయింటర్. అతను తన ప్రొఫైల్ తీసుకుని, కలెక్టరు గారి సిఫారసు లేఖతో 'పద్మశ్రీ' అవార్డు కోసం మాకు సబ్‌మిట్ చేయడానికి వచ్చాడు. అలా అన్ని ప్రాంతాల నుండి వచ్చిన వాటిని, ఒక కమిటీ ముందు పెట్టి, కమిటీ సెలక్ట్ చేసిన లిస్ట్ భారత ప్రభుత్వానికి పంపడం జరుగుతుంది. సాధారణంగా ఒక వ్యక్తికి ఒకే కళ ఉంటుంది. వెంకన్నగారిలో మూడు కళలు మిళితమై, అనేక అవార్డ్సు రివార్డ్స్ అందుకున్నారు. మనముందు కూర్చున్న కాసేపట్లో మన బొమ్మ గీసేవారు, విగ్రహాల తయారీ అవి పోత విగ్రహాలు, శిల్పాలు చెక్కడం, చెక్కతో తయారుచేయడం చాలా గొప్ప కళాకారుడు ఆయన.

ఆయన ప్రొఫైల్ చూసి 'మీకు తప్పక పద్మశ్రీ' వస్తుందని చెప్పాను. నిజంగానే వారిని భారత ప్రభుత్వం "పద్మశ్రీ"తో సత్కరించింది. అది తీసుకుని వెంకన్నగారు హుటాహుటిన హైదరాబాదు వచ్చి నా పై ఆఫీసర్ నారాయణరావుగారిని కలిసి తన ఆనందాన్ని పంచుకున్నారు. మీరు నా ఫైల్ మంచి మనసుతో పంపారు. అందుకే వచ్చింది అని తన గుర్తుగా నేను మా వారూ ఉన్న ఫొటో తీసుకుని స్కెచ్ గీశాడు. అది ఇప్పటికీ మా డ్రాయింగ్ రూములో అందరి దృష్టి ఆకర్షిస్తూ ప్రశంసలు పొందుతోంది.

అలాగే హోమ్ డిపార్ట్‌మెంటులో అసిస్టెంట్ సెక్రటరీగా జైళ్లశాఖ, పాస్‌పోర్టులు కార్యకలాపాలు చూసేదాన్ని. ఒకసారి చెర్లపల్లి జైల్ ఇన్స్‌పెక్షన్‌కి వెళ్లాము. అక్కడ ఏ ఖైదీని పలకరించినా, హృదయ విదారకమైన గాథ ఉంటుంది. ఒక కుర్రాడు ఇంజనీరింగ్ చదువుతున్నాడుట. ఒక రూమ్‌లో నలుగురు కుర్రాళ్లు ఉండేవారట. అందులో ఒకతను నక్సలైట్స్‌కి సహాయం చేసేవాడని పోలీసులు అతనితో పాటు ఆ గదిలో ఉన్న మిగతా ముగ్గురినీ కూడా అరెస్ట్ చేసి జైల్లో పడేశారుట. ఆ ముగ్గురూ అమాయకులని జైల్లో అందరికీ తెలుసు. కానీ, కేసు తేలేవరకూ అక్కడ మగ్గిపోవాల్సిందే. ఆ అమాయకుల చదువు, భవిష్యత్తూ అంతా నాశనమయిపోయింది. ఇన్స్‌పెక్షన్ మాటేమోగానీ, మనసు

వికలమయింది. అయితే చెర్లపల్లి జైల్ మోడల్ జైల్‌గా భారతదేశం మొత్తంలో పేరు గడించింది.

జూన్ 5వ తారీకు పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుతూ "అక్కినేని అమల"ను అతిథిగా పిలిచాము. ఆవిడ పర్యావరణ కాలుష్యం గురించి ఒక చక్కని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తాను నిర్వహించే, "బ్లూక్రాస్" సంస్థకు తీసుకెళ్లి, జంతు సంరక్షణ గురించి వివరించారు. అమలగారు అక్కడ "కబేళాకు తరలించే జంతువులను, కాళ్లు విరిగిపోయిన కుక్కలనూ, గాడిదలనూ తీసుకువచ్చి వాటికి శస్త్రచికిత్సలు నిర్వహించి బాగుచేయడం చూశాము. అమల రాగానే జంతువులన్నీ కూడా సకిలించడం, మారాం చేయడం చూస్తే చాలా ఆశ్చర్యంగా, వింతగా అనిపించింది.

ఇలా సచివాలయ ఉద్యోగంలో ఎన్నో అనుభవాలు.

నేను సాహితీ సేవకంటే ముందు, సంఘమిత్ర వృద్ధాశ్రమానికి సెక్రటరీగా ఉండి, వృద్ధులకోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాను. 'మదర్‌థెరిస్సా' సేవా పురస్కారమందుకున్నాను. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా, అనేక సమాజ సేవా కార్యక్రమాలు, మెడికల్ కాంప్స్, నేత్రదాన శిబిరాలు నిర్వహించాను. అందుకే లయన్స్ క్లబ్ వారు నాకు "డెడికేటెడ్ సర్వీసు అవార్డు" ప్రదానం చేశారు.

మహిళ సమాజంలోనే కాకుండా, గృహంలో ఎదుర్కొంటున్న హింసను దృష్టిలో పెట్టుకొని గృహహింసా చట్టాన్ని ఎలా ఉపయోగించుకోవాలో, ఎవరి దగ్గర అర్జీ పెట్టుకోవాలో, ఆ అధికారుల ఫోన్ నంబర్లతో సహా "గృహహింసా చట్టం-మహిళకు రక్షణ కవచం"అనే పుస్తకాన్ని రాసి, చేతన సంస్థ ద్వారా విడుదల చేయించాను.

ఇంటా బయటా వేధింపులకి గురవుతూ మానసికంగా కృంగిపోతున్న ఉద్యోగినుల కోసం మానసిక నిపుణులను పిలిపించి, వారిలో మనోధైర్యాన్ని కలిగించే విధంగా కృషి చేశాము. ఉద్యోగినుల కోసం ప్రత్యేకంగా కంప్యూటర్ శిక్షణ ఇప్పించాము.

సంసార బాధ్యతలలో కూరుకుపోయిన మహిళా ఉద్యోగుల్లో నిద్రాణమైన కళలను వెలికితీస్తూ ఆటపాటల కార్యక్రమాలు, పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చేవాళ్లం.

ఇలా స్త్రీ చైతన్యం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. "స్త్రీశక్తి" పురస్కారమందుకున్నాను.

అనాథాశ్రమాలను సందర్శించి ఇతోధికంగా ఆర్థికసాయం చేయడం, మా ఇంట్లో వాళ్ల పుట్టినరోజు పండుగలప్పుడు మానసిక, శారీరిక వికలాంగుల ఆశ్రమాలల్లో అన్నదానం నిర్వహించడం జరుగుతుంది.

సచివాలయంలో ఉపకార్యదర్శి హోదాలో బాధ్యతలు నిర్వహిస్తూనే, సాహితీ కార్యక్రమాలు నిర్వహించడం, స్వీయరచనలు చేయడం మొదలు పెట్టాను. దాదాపుగా ఇప్పుడొస్తున్న కవితా ప్రక్రియలన్నిటిలో వచన కవిత్వంతో మొదలుపెట్టి మినీ కవితలు, రెక్కలు, నానీలు, వ్యంజకాలు, ముక్తకాలు, హైకూ లలో పుస్తకాలు వెలువరించాను. 5 సంకలన ప్రచురణలు చేశాను. మూడు ఆధ్యాత్మిక పుస్తకాలు, సామాజిక అంశాలపై వ్యాసాలు, కథలు, మన పురాణాలలో తెలుసుకోదగ్గ విషయాలు రాశాను. .

హైదరాబాదులోనే కాకుండా ఇతర జిల్లాల్లో కూడా ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశాను. కవిసమ్మేళనాలు నిర్వహించాను. గజల్ శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా బ్రాడ్ కాస్ట్ అయ్యే 'ఆలయవాణి వెబ్ రేడియోలో' భక్తి కవిసమ్మేళనం, గీతామృత పఠనం, ఆధ్యాత్మిక ఉపన్యాసం నిర్వహించాను. 'లండన్ తెలుగువాణి'లో తెలుగు భాషా సంస్కృతి గురించి ప్రసంగించాను.

అమెరికాలోని 'తానా' సభలో, లండన్‌లోని "యుక్త" సభలలో వారి ఆహ్వానం మేరకు స్వీయ కవితా పఠనం కావించాను.

సాహితీ సంస్థలకూ, మాసపత్రికలకూ సలహాదారుగా ఉన్నాను. కొన్ని సాహితీ సంస్థల ఆవిర్భావానికి సూత్రధారి నేనే.

అక్కినేని నాగేశ్వరరావుగారికి నేను రాసిన "గుండెచప్పుళ్లు" పుస్తకం అంకితమివ్వడం, నేను రాసిన "ఊహల వసంతం" పుస్తకాన్ని వారు ఆవిష్కరించడం, రెండుమూడు సార్లు వారిని ఇంటర్వ్యూ చేసి సాహితీ పత్రికలకు పంపడం, వారితో, వారి శ్రీమతి అన్నపూర్ణగారితో పరిచయం, మా అమ్మాయి వివాహానికి అక్కినేని వచ్చి ఆశీర్వదించడం నా జీవితంలో మరపురాని సంఘటనలు. "మీ సాహితీ పత్రికను నాకు

అంకితమిచ్చి మీరు నాకు అత్తగారయ్యారు. అత్తగారిని సత్కరించాలిగా మరి" త్వరలోనే మిమ్మల్ని సత్కరిస్తామంటూ నాతో చమత్కారంగా మాట్లాడిన కొద్దిరోజులకే వారు పరమపదించడం జరిగింది. వారున్నప్పుడు స్వీకరించలేకపోయినా, 'రాగసప్తస్వర' సంస్థ వారు తమిళనాడు గవర్నరు రోశయ్యగారి చేతుల మీదుగా నాకు "అక్కినేని స్వర్ణపతకం"బహూకరించడం నా అదృష్టం.

ఇవన్నీ ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే వైవిధ్యభరితమైన అంశాలు నా సాహితీ ప్రస్థానంలో చోటుచేసుకున్నాయి. కనుకనే, వైవిధ్యభరితమైన పురస్కారాలు, సత్కారాలూ అందుకున్నాను.

మొదట్లో నా సాహిత్యకృషిని అభినందిస్తూ ప్రోత్సహించినవారే, పురస్కారాలు రావడం మొదలు పెట్టగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

**"నేనేమీ కానప్పుడు**
**ఎందరో మిత్రులు**
**ఎంతో కొంత సాధించాక**
**చుట్టూరా శత్రువులు"**

అని ఒక నానీ రాశాను. ఇది స్వానుభవమే!

**"నీ విజయానికి**
**ఈర్ష్యపడుతున్నారంటే**
**నువ్వొక మెట్టు**
**ఎదిగానని సంతసించు"**

అంటూ నన్ను నేను ఉత్సాహపరుచుకున్నాను.

ఎవరిపేర్లూ ప్రస్థావించనవసరం లేదు. సచివాలయంలోని చేతన కార్యక్రమాల్లో ఒక అవకాశమిప్పించండి జన్మ ధన్యమవుతుందన్న వ్యక్తులు, నా పుస్తకావిష్కరణ సభలో అతిథిగా అవకాశమివ్వమని అడిగినవారు, అవకాశం వాడుకుని, నేడు నా గురించి వ్యతిరేకంగా మాట్లాడటం చూసి ఆఫీసు రాజకీయాల నుంచీ బయటపడ్డాననుకుంటే,

సాహితీ ప్రపంచంలో అంతకు మించి రాజకీయాలుంటాయని తెలిసి ఆశ్చర్యపోతున్నాను. ఎవరో ఏదో అన్నారని, నిరాశా నిస్పృహలను దరికి రానీయకుండా సాహితీ సృజన చేసుకుంటూ పోతున్నాను.

సాహితీరంగంలోకి ఎప్పుడు వచ్చామని కాకుండా, సాహితీసృజన, అందులోని సాంద్రత పరిగణనలోకి తీసుకుని ఆలోచిస్తే, రెండు నాల్కల ధోరణి ఉండదు.

**37. అసమసమాజపు అవకతవకల్ని మీ సాహిత్య సృజనలో ఎలాంటి ప్రాధాన్యతనిస్తారు?**

**జ:** సామాజిక పరిస్థితులపై పాఠకులకు అవగాహన కలిగే విధంగా, పరిణా మాలకు హెచ్చరికగా నా సాహిత్య సృజన ఉంటుది. మన న్యాయవ్యవస్థ, ప్రభుత్వాలు, సమాజంలో స్త్రీలపై జరుగుతున్న అకృత్యాలకు సరైన దిశలో, సమయంలో న్యాయం చేయలేక, వాళ్లమీదే అపవాదులు వేసి చేతులు దులుపు కుంటున్నారు. అత్యాచారం జరిగిందంటే సాక్ష్యం చూపమంటూ కోర్టు చుట్టూ తిప్పుకునే అసమ న్యాయవ్యవస్థ, స్త్రీల వస్త్రధారణ వల్లనే అత్యాచారాలు జరుగు తున్నాయంటూ, వ్యాఖ్యానం చేసి తప్పించుకునే మంత్రివర్యులూ, బడాబాబులు ఉన్నంతకాలం స్త్రీలపై అకృత్యాలు, గృహహింసలూ జరుగుతూనే ఉంటాయి.

స్త్రీ తనను తాను రక్షించుకోవాలి తప్ప ఈ అసమసమాజం ఏమీ చేయలేదని, వ్యక్తిత్వ వికాసం, స్వీయరక్షణ,ఆర్థిక స్వాతంత్ర్యాల ద్వారానే ఇది సాధ్యమంటూ ఉద్బోధిస్తాను. సమాజంలో స్త్రీలు తమను తాము రక్షించుకునే వాచ్‌డాగ్‌లా తయారు కావాలి.

**38. మీరు కవిత్వాన్ని ఏ లక్ష్యంతో రాస్తారు?**

**జ:** వాడుకభాషలో, ప్రజలను చైతన్యవంతులను చేసే విధంగా నా కలానికి పదునుపెట్టడమే నా లక్ష్యం.

**39. మీరు ఎవరిని ఆదర్శంగా పెట్టుకుని కవిత్వం రాస్తారు.**

**జ:** నా కవిత్వానికి ఆదర్శం మనిషి. ప్రత్యేకించి స్త్రీ. అమ్మ, అమ్మతనం గురించి రాయడానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తాను.

**40. తెలుగు సాహిత్యంలో విమర్శకున్న స్థానమేమిటి?**

**జ:** తెలుగు సాహిత్య విమర్శ అనగానే డా॥రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు గుర్తుకొస్తారు.

సాహిత్యాన్ని సృష్టించేవారి కన్నా సాహిత్యాన్ని విమర్శించే వారికి ఎక్కువ సాహిత్య పరిజ్ఞానము ఉండాలన్నారు త్రిపురనేని మధుసూధనరావు గారు. ఆ కోవకు చెందినవారే డా॥రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు.

అయితే ప్రస్తుతం తెలుగు సాహిత్యంలో ప్రశంస తప్ప విమర్శను స్వీకరించేవారు తక్కువ. నేటి సమాజంలో విమర్శకులు తక్కువైపోయారు. విమర్శ ఉంటేనే సాహిత్యం నిగ్గుతేలుతుందంటారు. కానీ విమర్శించే వారిని పక్కకు తప్పిస్తుంటారు.

ఒక పుస్తకావిష్కరణ సభలో, వక్తగా పుస్తకం గురించి మాట్లాడుతున్న ప్పుడు, దానిలోని కవిత్వ పటిమ, సాంద్రత, విలువల గురించి మాట్లాడి, రచ యితను ప్రోత్సహించాలి కానీ, సభాముఖంగా రచయిత కవిత్వాన్ని విమర్శిం చడం, కవిని సభలో చిన్నబుచ్చడం, అంత సమంజసం కాదని కొందరి అభిప్రాయం.

వ్యక్తిగతంగా, లోటుపాట్లను ప్రస్తావించి మున్ముందు చేసే రచనల్లో వాటిని సరిదిద్దుకోమని సలహాలివ్వచ్చని కొందరి వాదన.

## 41. విమర్శ ఏ మేరకు సవ్యంగా ఉంటున్నది?

**జ:** సాహిత్య విమర్శకులకు ఒక ప్రాపంచిక దృక్పథం, నిబద్ధత ఉండాలి. లోతుగా అధ్యయనం చేయాలి. ఇవి లేకుండా, విమర్శ చేసినందువల్ల తనకు సాహిత్యం మీద పట్టు ఉందనుకుంటారని, గొప్పకోసం పనిగట్టుకుని, ఆ రచనల్లో ఒకటో రెండో లోపాలను వెదికి పట్టుకుని విమర్శిస్తుంటారు కొంతమంది. విమర్శ చేసేవారే విమర్శకు గురికావల్సి వస్తోంది. మంచి సాహిత్య విమర్శకుడు గొప్ప పాఠకుడు కావాలి. అప్పుడే విమర్శ సవ్యంగా ఉంటుంది.

## 42. తెలుగు కవులు తమకు తామే మహాకవులమని గొప్పలు చెప్పుకుం టారు. దీనిపై మీ కామెంటు?

**జ:** రాజుల కాలంలో, కవులు, రాజుల ప్రశంసల కోసం, కీర్తికోసం పొరుగు రాజ్యాల కవుల ముందు తమ పాండిత్య ప్రతిభను ప్రదర్శిస్తూ తమ గొప్పదనాన్ని నిరూపించుకొనేవారు. తమ రాజ్యంలోని కవులను చూసి మురిసిన రాజులు వారిని తగు రీతిని సత్కరించేవారు.

నేటి సమాజంలో కూడా రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వంలో పరపతి సంపాదించడం కోసం కవిత్వాన్ని వాడుకుంటూ, తమకు తామే గొప్పవారమని చాటుకుంటూ లబ్ధి పొందుతున్నవారున్నారు.

కవులు పేరు ప్రతిష్టలు కోరుకోవడం సహజం. పదికాలాలు నిలబడే కవిత్వం, విశ్వమానవ శ్రేయస్సును, ప్రగతిని ప్రతిబింబించే కవిత్వం రాసి పేరు ప్రతిష్టలు సంపాదించవచ్చు.

ఇప్పుడు ఎవరికి వారు రెండు మూడు పుస్తకాలు రాసి, ఉత్తమ కవితా పురస్కాలందుకుంటూ, ఇతరుల పుస్తకాలు చదవకుండానే, సాహితీ సముద్రంలో తాము ఎక్కడ ఉన్నామో చూసుకోకుండానే తమకు తామే మహాకవులమని భావించుకోవడం చూస్తున్నాం. తాము గొప్ప కవులు కాబట్టి ఇతర కవుల సభలకు వెళ్లకపోవడం, ఇతరుల కవిత్వాన్నీ, భావజాలాన్నీ విమర్శించడం లాంటివి చేస్తున్నారు. అందరూ అలాంటి వారనీ కాదు. 'నిండుకుండ తొణకదు' అన్న విధంగా ఎంతో పాండిత్యం ఉండి, సాహిత్య రచన పట్ల వినయ విధేయ తలతో అంకితభావంతోనూ జీవించిన డా॥ ఆవంత్స సోమసుందర్‌గారి లాంటి వారు అందరికి ఆదర్శనీయులు.

**43. కవులు ముఠాలుగా ఏర్పడుతున్నారంటే మీరేమంటారు?**

**జ.** బైట ప్రపంచంలో ఎలా ముఠాలు వున్నాయో, సాహితీ ప్రపంచంలో కూడా ముఠాలు వున్నాయి. ఒకే వాదానికి చెందిన కవులు, ఒకే వర్గానికి, ఒకే కులానికి ఒకే ప్రాంతానికి చెందిన కవులు ముఠాలుగా ఏర్పడుతూ, అవార్డులూ, సన్మానాలూ, అవకాశాలు వారివారి వర్గం వారికిచ్చుకుంటూ సభలు నిర్వహిస్తు న్నారు. నివ్వెరపోయి చూడటం తప్ప ఏమీ చేయలేకపోతోంది సాహితీలోకం.

కులాల మతాల గోడలు కూల్చేద్దాం అంటూ కవిత్వం రాస్తూ, విశ్వజనీనమైంది కవిత్వం అంటూనే, ముఠాలుగా ఏర్పడుతున్న కవులు, సాహితీ లోకానికి మచ్చ తెస్తున్నారు.

**44. ఏదైనా ఒక అవార్డు రావాలంటే కమిటీలోని వారి పరిచయాలు లేకుండా రావంటారు? నిజమేనా?**

**జ:** కొంతవరకూ నిజమే! అవార్డు రావడమన్నది కమిటీ సభ్యుల విచక్షణ మీద ఆధారపడి ఉంటుంది. ఎంత మంచి కవిత్వానికైనా, సిఫార్సుల అవసరం ఉంటోంది. ప్రతిభావంతులైన సాహితీవేత్తలెందరో కనీస గుర్తింపునకు కూడా నోచుకోలేదు. అయితే ఒక్కొక్క సారి ప్రతిభకు కూడా పట్టం కడుతూ, అవార్డు కమిటీలు తమ ప్రతిష్టను కాపా డుకుంటున్న సందర్భాలూ ఉన్నాయి.

**45. తెలుగు సాహిత్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఏమన్నా సహాయపడుతున్నదా? (తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత)**

**జ.** కాళోజీ నారాయణరావుగారి జన్మదినాన్ని తెలంగాణా భాషా దినోత్సవంగా జరుపుకోవాలన్న ప్రభుత్వ నిర్ణయం హర్షించదగినది. ఆయన జయంతిని పురస్కరించుకొని, సాహిత్యరంగంలో విశేష కృషి చేసిన వారికి ఆయన పేరిట స్మారక పురస్కారాన్ని ప్రదానం చేయడం ప్రభుత్వం సాహిత్యాభివృద్ధికి చేస్తున్న కృషికి నిదర్శనం. ఈ సంవత్సరం డా॥ అమ్మంగి వేణు గోపాల్ గారిని కాళోజీ పురస్కారంతో సత్కరించడం తెలుగుసాహిత్యంపై ప్రభుత్వానికి అవగాహన, గౌరవం పెరిగాయని భావించవచ్చు. అలాగే అన్ని జిల్లాల్లో భాషా చైతన్య కార్యక్రమాలు, చర్చాగోష్టులు, వ్యాసరచన, కవిత్వం తదితరాల్లో పోటీలు జరపాలన్న ప్రభుత్వ నిర్ణయం. "దాశరథి" గారి గౌరవార్థం ఆయన పేరు మీద, ప్రతి సంవత్సరం ఒక ప్రసిద్ధ సాహితీవేత్తకు "దాశరథి" పురస్కారమివ్వాలని నిర్ణ యించి, మొదటిసారిగా డా॥ తిరుమల శ్రీనివాసాచార్యగారికి పురస్కారము అందచేయడం, సాహిత్యం పట్ల, సాహితీకారుల పట్ల తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నదనడానికి నిదర్శనం.

**46. పుస్తకాలు కొని చదువుతున్నవారు తగ్గిపోతున్నారంటే మీరేమంటారు?**

**జ:** నిజమే! అంతర్జాలంలో పుస్తక పఠనం వచ్చాక, పుస్తకాలు కొని చదివే వారు తక్కువయ్యారు. పుస్తకావిష్కరణ సభలు జరిగినపుడు పుస్తకం రేటు ఇంత, దీన్ని ఈ రోజు కొన్న వారికి సగం రేటుకే ఇస్తాము అని ప్రకటన చేసినా, ఒకరో ఇద్దరో నిజమైన సాహిత్యాభిమానులు తప్పితే కొనేవారెవరూ ఉండటం లేదు. పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తే, అడిగి మరీ తీసుకుంటారు.

**47. కవులు ఏమైనా ప్రయోజనమాశించి సాహిత్య సృజన చేస్తారంటారా?**

**జ:** అంతర్లీన ఆర్తిని సంతృప్తి పరచడమే కవిత్వ ప్రయోజనం. గుండెలోని బాధ కానీ, సంతోషం కానీ బహిర్గత పరచి వాటిని దూదిపింజంలా ఎగురవేయ గలిగే సాధనం కవిత్వం. సమాజంలో నిత్యం జరిగే సంఘటనలకూ, సంఘర్షణ లకూ స్పందించి, నలుగురినీ ఆ దిశగా ఆలోచింపచేయడమే కవి ఆశించే ప్రయోజనం. బాధాతప్త హృదయాన్ని కవిత్వం సేదతీరుస్తుంది. "కవిత్వమొక తీరని దాహమన్నారు" శ్రీశ్రీ. తనకు ఎదురైన ప్రతీ సంఘటననూ, కవిత్వ రూపంలో పంచుకోవడంలోని తృప్తే కవి ఆశించే ప్రయోజనం.

**48. మీ సాహిత్య జీవితంలో ఎందరెందరో మహామహులు తారసపడి ఉంటారు కదా! ఆ అనుభవాలు ఎలాంటివి?**

**జ.** నా సాహిత్య జీవితంలో తారసపడి నాకు ప్రేరణ కలిగించిన మహానుభావు లెందరో! అందరికీ వందనాలు.

నా సాహితీ జీవితానికి ప్రేరణ కలిగించిన వారిలో ముఖ్యులు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత కీ.శే. రావూరి భరద్వాజగారు. అప్పుడప్పుడు కవిత్వం రాస్తూ వున్నా, భరద్వజగారి ప్రేరణవలన సరదాగా రాసుకున్న "నానీ"లను "చిరు సవ్వడులు" అనే పుస్తక రూపంలో తీసుకు రావడం, దానికి వారు ముందుమాట రాయడమే కాకుండా, ఆవిష్కరణ సభలో ఆశీ:ప్రసంగం చేసి "నీలోని కవితా ప్రతిభను సచివాలయ గోడలకే పరిమితం చేయక, సువిశాల కవితా ప్రపంచం లోకి అడుగిడమంటూ ప్రోత్సహించారు". ప్రోత్సహించడమే కాదు. జి.వి.ఆర్. ఆరాధన సంస్థ ప్రతియేటా నిర్వహించే "కాంతమ్మ భరద్వాజ మెమోరియల్" కవిసమ్మేళన నిర్వహణ అవకాశాన్ని త్యాగరాయగానసభలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా కవితా ప్రపంచంలోకి తీసుకువచ్చారు రావూరి భరద్వాజ గారు, గుదిబండివెంకట రెడ్డిగారు. ఆనాటి నుంచి వారి దేహాంతం వరకూ వారితో నా అనుబంధం కొనసాగింది. "మా అమ్మవి నువ్వు" అంటూ ఆప్యా యంగా తలనిమరేవారు. వారికి జ్ఞానపీఠ అవార్డు వచ్చినప్పుడు, నేను, మావారు వారి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలంద చేసినప్పుడు, మంచంలో పడుకుని వున్నవారు, లేచి కూచుని ఆప్యాయంగా మాట్లాడటం, వారిలోని, నిరాడంబరతకూ నిర్మల మనస్తత్వానికీ నిదర్శనం.

నా మొట్ట మొదటి పుస్తకావిష్కరణకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన అప్పటి తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆవుల మంజులత గారితో పరిచయం నా సాహితీ ప్రస్థానానికి ఓ గుబాళింపు. నిర్మల మందాకినిలా వుంటుంది ఆవిడ ముఖారవిందం. నిగర్వి ఎప్పుడు కనబడినా ఇంకా ఏంరాస్తున్నారంటూ చిరునవ్వుతో పలకరిస్తారు.

అప్పటి హైదరాబాదు దూరదర్శన్ డైరెక్టరు, ఇప్పటి ఎస్.వి. బి.సి., సి.ఇ.వో అయిన డా॥ పాలకుర్తి మధుసూదనరావుగారు ఆ పుస్తకావిష్కరణ సభకు సభాధ్యక్షత వహించారు. దూరదర్శన్ నిర్వహించే ఉగాది సమ్మేళనంలో ప్రముఖ సాహితీవేత్తల సరసన నాకు పాల్గొనే అవకాశం ఇచ్చి కవయిత్రిగా తెలుగురాష్ట్రాల దూరదర్శన్ ప్రేక్షకులకు నన్నూ, నా కవిత్వాన్ని పరిచయం చేశారు మధుసూదన్‌గారు. అనాటి నుంచీ ఈనాటి వరకూ వారితో సాహిత్యాను బంధం కొనసాగుతూనే వుంది. చాలామార్లు వారి చేతులమీదగా సత్కారాలు అందుకోవడం మరచిపోలేని అనుభవం.

నా రెండవ పుస్తకం "గుండెచప్పుళ్లు" దానికి రాష్ట్ర పశుపంవర్ధక శాఖకు మంత్రిగా వున్న "మండలి బుద్ధప్రసాద్" గారు, ఎంత బిజీగా వున్నా, పుస్తకానికి ముందు మాట రాసి "ఉత్తమ సాహిత్యాభిరుచి గల రాజ్యశ్రీ గారి కలం నుండి మరిన్ని రచనలు రావాలని ఆశీర్వదించారు. బుద్ధప్రసాద్ గారు, పదవిలో వున్నా లేకపోయినా, వారి హుందాతనం, మంచితనం, పెద్దరికం అందరూ గౌరవించేలా చేస్తుంది. వారు సభలో ఉంటే నిండుతనం. నాటినుంచీ నేను ఇటీవల రాసిన "గీతామృతం" పుస్తకానికి ముందుమాట రాయడం, వారి చేతుల మీదుగా సాహితీ పురస్కారాలందుకోవడం, 'తానా' సభలలో, లండన్‌లోని యుక్తా సభలో, వారితో పాటు, వేదికను పంచుకుని సంభాషించడం, నా జీవితంలో ఎనలేని ఆనందాన్నిచ్చిన సంఘటనలు.

సాహితీ మేరునగధీరులు, జ్ఞానపీఠ పురస్కారగ్రహీత, పద్మభూషణ్ డా॥ సి.నారాయణరెడ్డిగారు, సాహితీకారులందరికీ ఆరాధ్యుడు. జి.వి.ఆర్ ఆరాధన సంస్థ వారు నిర్వహించిన కార్యక్రమంలో డా॥ సి.నారాయణరెడ్డి గారి ద్వారా "కళాపురస్కార" మందుకోవడం, నిజంగా నా అదృష్టం. తర్వాతి రోజుల్లో, నా సాహితీ ప్రస్థాన కొనసాగింపులో వారు, నేను రాసిన ఒకటి రెండు పుస్తకాలను ఆవిష్కరించడం, 'అక్షరకేతనం' పుస్తకానికి ముందుమాట రాయడం, వారు ముఖ్య అతిథిగా వున్న ఒకటి

రెండు సభలలో సభాధ్యక్షత, విశిష్ట అతిథిగా పాల్గొనడం, నాకు సాహిత్యమిచ్చిన విలువైన బహుమతిగా అనుకుంటాను.

చిన్నప్పటి నుంచీ అక్కినేని నాగేశ్వరరావు గారంటే వారి సినిమాలంటే మహాపిచ్చి నాకు. "సుడిగుండాలు" "మరోప్రపంచం"లాంటి విలువలు గల సినిమాలు తీసిన వారి వ్యక్తిత్వమంటే చాలా ఇష్టం. అంతటి ఇష్టమైన వ్యక్తికి, నా "గుండెచప్పుళ్లు" పుస్తకాన్ని అంకితమివ్వడానికి వారు అంగీకరించడం నమ్మలేని నిజం. నేను రాసిన "ఊహలవసంతం" పుస్తకాన్ని వారే ఆవిష్కరించారు. ఆ పరిచయం, అలా కొనసాగి తరచూ, వారి ఇంటికి వెళ్లి, వారినీ, శ్రీమతి అన్నపూర్ణ గారినీ పలకరించి, కొంచెంసేపు హాయిగా పాత సినిమా కబుర్లు వారితో ముచ్చటించుకోవడం జరిగేది.

సాహితీకిరణం మాసపత్రిక కోసం వారిని ఇంటర్వ్యూ చేసి ప్రచురించడం జరిగింది. వారు 90వసంవత్సరంలో అడుగిడినప్పుడు, మరోసారి వారిని, ఇంటర్వ్యూ చేసి వస్తున్నప్పుడు, ఈసారి అక్కినేని పురస్కారంతో సత్కరించాలి మా అత్తగారిని అని చమత్కరించావు. "అంత మాటన్నారు–అదే  పదివేలు" అన్నాను. అది నెరవేరే లోపలే వారి మహాభినిష్క్రమణం జరిగింది. అది అత్యంత విషాదకర సంఘటన. ప్రపంచం మెచ్చిన ఒకమహా నటుడితో నాకు పరిచయముండటం, వారితో జరిగిన ఆత్మీయ సంభాషణం నాకు అత్యంత విలువైన అనుభవం. మా "అమ్మాయి" ప్రియాంక వివాహానికి వచ్చి ఆశీర్వదించారు. అది నా జీవితంలో ఒక మధురానుభూతి.

సచివాలయంలో సాహితీ కార్యక్రమానికి అడ్డేపల్లి రామ్మోహన్‌రావు గారిని ఆహ్వానించాము. అప్పటికి వారి వయసు 70 సంవత్సరాలనుకుంటా, వేదిక మీద కుర్రాడికి మల్లే మైకు పుచ్చుకుని అటూ ఇటూ తిరుగుతూ ఉత్సాహం ఉరకలెత్తించే విధంగా చేసిన వారి ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఇప్పుడు 80సంవత్సరాల పండుగ చేసుకుంటున్నా వారిలో అదే ఉత్సాహం, స్ఫూర్తి. నేను మినీ కవితలు రాస్తున్నప్పుడు వార్ని సలహాలు, సూచనలు తీసుకోవడం జరిగింది. "సిసింద్రీ"లు అనే మినీ కవితా సంకలనాన్ని వారే ఆవిష్కరించారు. వారు అభ్యుదయవాదులైనా, ఇటీవల నేనురాసిన "గీతామృతం" పుస్తకం చదివి,  ఫోన్ చేసి, బాగా రాశావని అభినందించారు.

సచివాలయంలో సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు ఏవి జరిగినా, వాటికి వెన్నూదన్నూ డా॥ కె.వి. రమణాచారి, ఐఎస్ గారు. కార్యక్రమం చేద్దా మనుకోగానే, ముందుగా వారి వద్దకు వెళ్లి విషయం చెప్పి, వారి సలహా, సూచనలు తీసుకునేవాళ్లం. అప్పట్లో రెవెన్యూ శాఖ, ముఖ్య కార్యదర్శిగా, ఊపిరి సలపని పనిలో ఉండికూడా, ఏదైనా పత్రికలో నా కవిత పడగానే, చదివి వెంటనే ఫోన్ చేసేవారు "చాలాబావుందమ్మా" అంటూ. 'సాహితీ కిరణం' మాసపత్రికకు, మొట్టమొదటిగా ఇంటర్వ్యూ చేసింది రమణాచారిగారినే!

రెక్కల ప్రక్రియలో నేను రాసిన "వెన్నెల మెట్లు" పుస్తకానికి ముందు మాటరాస్తూ "తన కవితల ద్వారా ఎగిరేరెక్కల్తో, భావాంబరవీధిలో పాఠకులను విహరింప చేయడమే శ్రీమతి రాజ్యశ్రీ లక్ష్యం, వెన్నెల మెట్లలో పదపదం కలిపి చూడండి అంటూ" నా పుస్తకాన్ని తన ముందు మాటలో ఆకాశంలోకి ఎగిరే శారు. చాలా వరకు, నేను రాసిన పుస్తకాలకు వారే ముఖ్యఅతిథి, ఆవిష్కర్తగా వున్నారు నాకు జరిగిన సన్మానాలు, సత్కారాలు, అందుకున్న పురస్కారాలలో సగం పైగా వారి చేతుల మీదుగా తీసుకున్నవే!

ఇటీవల నేను 'గీతామృతం' పుస్తకాన్ని ఇంగ్లీషులో తర్జుమా చేశాను. తెలుగు–ఇంగ్లీషు రెండు భాషల్లో రాసిన ఈ పుస్తకాన్ని రమణాచారి గారికి అంకితమివ్వడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇప్పుడు వారు తెలంగాణా ప్రభుత్వానికి సలహాదారుగా క్యాబినెట్ హోదాలో ఎంతో బిజీగా వున్నా, అందరికీ అందుబాటులో వుండే అందరివాడుగానే వున్నారు. అంతే ఆత్మీయంగా వున్నారు. మూడు సార్లు గిన్నీస్ రికార్డులకెక్కిన గజల్ మేస్ట్రో గజల్ శ్రీనివాస్ గారు, నా సాహితీ ప్రస్థానంలో విలువైన వ్యక్తి. వారి విశిష్ట వ్యక్తిత్వాన్ని, సాహితీ కిరణం ద్వారా పరిచయం చేయడం నా భాగ్యం. "నా పుస్తకావిష్కరణ సభలకు విశిష్ట అతిథిగా విచ్చేసి, అమూల్యమైన సలహాలనిచ్చేవారు. "పుస్తకం రాసి ఆవిష్కరించి వదిలేయడం కాదు" కవిత్వం మనబిడ్డ. బిడ్డను ఎలా పెంచిపోషిస్తామో, కవిత్వాన్ని కూడా పదుగురికీ తెలిసేలా చేయాలి. వినిపించాలి" అని చెప్పేవారు.

వారు స్థాపించిన "ఆలయవాణి వెబ్‌రేడియో" లో నా చేత కార్యక్రమాలు నిర్వహింప చేశారు. నేను రాసిన "గీతామృతం" రికార్డు చేయించి వెబ్

రేడియోలో ప్రసారం చేయించారు. ఈనాటికీ వారి కార్యక్రమాలన్నింటికీ, నన్ను ఆహ్వానిస్తూ, అభిమానంగా రిసీవ్ చేసుకుంటారు. మంచి వ్యక్తిత్వం గల శ్రీనివాస్ గారి పరిచయం నా సాహితీ ప్రస్థానంలో ఓ మైలురాయి.

మల్లెమాలగారితో, వారి సాహిత్యంతో కూడా నాకు మంచి పరిచయం. "మల్లెమాల రామాయణం" పుస్తకాన్ని "ప్రసాద్ లాబ్స్"కి రమ్మని పిలిచి, నా గురించి రెండు చక్కని మాటలు రాసి, పుస్తకాన్ని ఇచ్చారు. ఈరోజు వారు లేకున్నా వారి చిన్న పుస్తకం నా కళ్లెదురుగా వారిని గుర్తు చేస్తూ వుంటుంది.

"మంచుకొండ ఠీవి, మరుమల్లియతావి, ఈ కవిత రాజ్యశ్రీ ప్రతి కవితా ప్రజల హృదయలలో గుబాళిస్తూనే వుంటుంది"అన్న డా॥ తిరునగరి.

"అమితమైన కవితాభిరుచి కలిగిన కవయిత్రి కేతవరపు రాజ్యశ్రీ" అన్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారు, "చేరా, బూరా, నారా అని ప్రసిద్ధ పురుష సాహితీ వేత్తలున్నారు. స్త్రీలలో 'కేరా' అప్పుట్లో కె. రామలక్షిగారు కానీ ఇప్పట్లో కేతవరపు రాజ్యశ్రీ గారే! బ్రతుకు తీపిని పంచే మానవీయ కవిత్వం ఆమెది' అన్న సుధామగారు, "రాజ్యశ్రీ హృదయం స్పందిస్తే వారి కలం స్పృశించని అంశం గానీ, ప్రక్రియగానీ వుండదు" అన్న నటులు, రచయిత రంగనాథ్"గారు. నానీల పుస్తకాలు వెలువడడానికి స్ఫూర్తి కారకులైన డా॥ ఎన్. గోపిగారు, "వెన్నెల మెట్లు, "గీతామృతం" పుస్తకాలను రెక్కల ప్రక్రియలో రాయడానికి నన్ను ప్రోత్స హించిన రెక్కల రూపశిల్పి, ఆత్మీయులు, సుగమ్‌బాబుగారు, నా సాహిత్యాన్ని ప్రోత్సహిస్తూ, నా సాహిత్య కృషిని అభినందిస్తూ, విశ్వసాహితీ సంస్థ ద్వారా అనేక అవకాశాలను, పురస్కారాలనూ ఇవ్వడమే కాకుండా, నా సాహితీకృషికి మెచ్చి అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ (భూపాల్)వారిచ్చే "సాహిత్యశ్రీ", "భారత్ భాషా భూషణ్" పురస్కారాలను నాకు ప్రదానం చేయించి సాహితీ లోకంలో నాకొక గౌరవాన్ని కల్పించిన వారు పితృసమానులు, గురుతుల్యులు డా॥ పోతుకూచి సాంబశివరావుగారు. ఇంకా ఎందరో ఎందరో. ఇటువంటి మహనీయులతో పరిచయాలు, అనుభవాలు నా సాహితీ యానంలో మధురఘట్టాలు.

నా రచనా వ్యాసంగాన్ని అభిమానిస్తూ ఆశీస్సులందజేసే, డా॥ పి.యస్. మూర్తిగారు, డా॥ డి.మధుసూదన్‌గారు, తంగిరాల చక్రవర్తిగారు అలాగే అమెరికాలోని తానా సభలకు ఆహ్వానించి, సత్కరించిన, వంగూరి చిట్టి రాజు గారు, లండన్‌లో జరిగిన "యునైటెడ్ కింగ్‌డమ్ తెలుగు అసోసియేషన్" వారు నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానించి, ఇనాగరల్ సెషన్‌లో, అష్టావ ధానంలో, కవితా పఠనం మొదలైన అంశాలలో పాల్గొనే అవకాశాన్నిచ్చి, సన్మానించిన కిల్లి సత్యప్రసాద్, చిట్టెరాజు గార్ల అభిమానం, ఆ సభలో ప్రముఖ కవులైన తనికెళ్ల భరణి, సుద్దాలఅశోక్ తేజ, కొలకలూరి ఇనాక్, సిరివెన్నెల సీతారామశాస్త్రి, జొన్నవిత్తుల, పాలపర్తి ఇలా ఎందరో సాహితీ దిగ్గజాలతో, వేదిక పంచుకుని సంభాషించడం, పరిచయాలు ఇలా ఎన్నో ఆనందానుభవాలు.

నా సాహితీ జీవితంలో తారసపడిన మహానుభావులు, నా పుస్తకావిష్క రణలు కావించిన సాహితీ సంస్థల అధ్యక్షులు, గుదిబండి వెంకటరెడ్డిగారు, వంశీరామరాజుగారు, వై.కె. నాగేశ్వరరావుగారు, అభినందన భవానీ గారు, భారతీకమలాకర్‌గారు, రఘుశ్రీగారు, లంక సుబ్రహ్మణ్యంగారు, చిక్కరామ దాసుగారు, త్యాగరాయగానసభ అధ్యక్షులు కళాదీక్షితులుగారు– ఎందరో మహానుభావులు మహాగొప్పవైన అనుభవాలు.

నా సాహిత్యానికి వన్నె చేకూర్చే బిరుదులు, పురష్కారాలతో నన్నభినందించి, సత్కరించిన సాహితీ సంస్థలకు, వారి కార్యవర్గానికి వేల కృతజ్ఞతలు.

**49. సాహిత్యానికి అకాడమీల నుండి ఎలాంటి ప్రోత్సాహం లభించాలంటారు?**

**జ.** ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వివిధ అంశాల మీద 100 మంది సాహితీకారుల చేత పుస్తకాలు రాయించి ప్రచురించింది సాహిత్య అకాడమీ. అలా ఏదో ఒక ఉత్సవాలప్పుడే కాకుండా, నిరంతరంగా ఈ ప్రక్రియ కొనసాగిస్తే సాహిత్యానికి, సాహితీకారులకీ కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

**50. సాహిత్య సృజనవల్ల కవులు ఎలాంటి తృప్తిని పొందుతారు?**

**జ.** సాహిత్య సృజనవల్ల, మనం అనుభవించిన జీవితాన్ని కళాత్మకంగా ఆవిష్కరిం చగలుగుతాము. జీవితాన్ని దగ్గరగా, నిశితంగా, పరిశీలించడం, పరిశీలించిన కోణాలను, పాఠకుల మనసుకి హత్తుకునే విధంగా కవిత్వీకరించడంలో, తీయని మానసిక సంతృప్తి

వుంటుంది. అవి చదివిన పాఠకులు వారి స్పందన తెలియ చేసినప్పుడు, వారి జీవితాల్ని సవరించుకున్నామనీ, తమకు సరైన మార్గనిర్దేశం కలిగిందనీ చెప్పినప్పుడు, అనిర్వచనీయమైన అనుభూతి, తృప్తి కలుగుతుంది. ఆ తృప్తే, కవులకు ఎవరెస్టు ఎక్కినంత సంతోషాన్నిస్తుంది.

**51. మీ సాహిత్యంలో తాత్వికత, ఆధ్యాత్మికత ఎక్కువగా గోచరిస్తుంది. దానికి కారణం?**

**జ:** పువ్వు వికసిస్తే పరిసరాలు పరిమళ భరితం అవుతాయి. ఆధ్యాత్మిక పరిమళ పుష్పాలను ప్రపంచవ్యాప్తంగా వికసింపచేసేది భారతీయ సంస్కృతి. ఎంత మనో హర పరిమళమయినా, భారతదేశ ఆత్మజ్ఞాన సువాసన ముందు దిగదుడుపే.

నా సాహిత్యంలో తాత్వికత, ఆధ్యాత్మికత ఎక్కువగా మా అమ్మానాన్నల నుండి సంక్రమించిందే! మా కుటుంబంలో ముందు నుంచీ దైవభక్తీ, ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. మా నాయనమ్మ ఏమీ చదువుకోకపోయినా, ఆవిడ మాట్లాడే మాటల్లో తాత్వికత, కర్మసిద్ధాంతం ఉట్టిపడేవి.

నా చిన్నప్పుడు మా అమ్మ తనతో పాటు సత్యనారాయణస్వామి గుడిలో చెప్పే ఆధ్మాత్మిక ప్రవచనాలకు తీసుకెళ్లేది. ఆ ప్రవచనంలో "ఈ జగత్తంతా మిథ్య" ఈ జీవితం ఒక సినిమా రీలు లాంటిది. సినిమా చూస్తున్నంత సేపూ దీనిలోని కష్టసుఖాలతో తాదాత్మ్యం చెంది, మనం కూడా అనుభవించి, బయటకు రాగానే అది సినిమా అని గుర్తుకొస్తుంది. అలాగే జీవితమనే నాటకంలో పాత్ర ధారులం మనమందరం. మన పాత్ర అయిపోగానే, ఈ దేహం వదిలి, ఆత్మ పరమాత్మలో చేరుతుంది" అంటూ సాగిపోయేది ఉపన్యాసం. ఆ మాటలు అప్పుడు నా మనసులో రికార్డు అయ్యాయి కానీ, అర్థం మటుకు కాలేదు.

మా నాయనమ్మ కీ.శే.సుబ్బమ్మగారు. ఆవిడ జబ్బుపడి పక్షవాతంతో మంచాన పడ్డారు. మాటకూడా లేదు. ఏవైనా దేవుడి పుస్తకాలు చదివి వినిపించమని సౌంజ్ఞల ద్వారా అడిగేది. మా నాన్నగారు, ఆవిడ సేవల నిమిత్తం ఇంట్లో వాళ్లందరికీ తలా ఒక డ్యూటీ వేశారు. ముఖం కడిగించడం, చెంచాతో అన్నం తినిపించడం, "బెడ్‌పాన్" పెట్టడం, పుస్తకాలు చదివి వినిపించడం ఇలా ఉండేవి.

ఆ డ్యూటీలో నాకు ఆవిడకి భగవద్గీత చదివి వినిపించమని నాన్నగారి ఆర్డరు. హాయిగా ఆడుకోడానికి వెళ్లనీయకుండా, ఈ భగవద్గీత చదివి విని పించడం ఏమిటిరా బాబూ, నేనేమన్నా 90 ఏళ్ల దాన్నా అని మనసులో విసు క్కుంటూ, నాన్న భయానికి ఆవిడకి రోజుకి 10-15 శ్లోకాలు అర్థంతో సహా చదివి వినిపించేదాన్ని,

అలా భగవద్గీతే కాకుండా, ఆవిడకి ఆరోగ్యం చేకూరడానికి కొన్ని భగవత్ శ్లోకాలు చదివి, నానమ్మ చేత మననం చేయించడం జరిగింది. వాటి తాలూకు వాసన నాలో నిక్షిప్తమైంది. పెద్దయ్యాక కొన్ని సద్గ్రంథాలు, గురుచరిత్ర, భగవాన్ రమణ మహర్షి చరిత్ర, 'గీతజయంతి' ఉత్సవాల్లో సంపూర్ణ భగవద్గీత పఠనం చేయడం జరిగింది.

మా నాన్నగారు భగవద్గీతలోని 700శ్లోకాలను సత్యనారాయణస్వామి గుడిలో వేసవి సెలవుల్లో పిల్లలకి నేర్పేవారు. ఉదయం లేచినప్పటి నుంచి, రాత్రి నిద్రించే సమయం వరకు, ప్రతీపనిలో భగవంతుడి ధ్యానం చేసే పద్యాలను వివిధ గ్రంథాల నుంచి సేకరించి చిన్న పుస్తకరూపంలో ముద్రించి, పిల్లలందరిచేత కంఠోపాఠం చేయించేవారు. బాగా చెప్పిన వారికి బహుమతులిచ్చేవారు. అలా మా పిల్లలు కూడా తాతగారి నుంచి, భగవద్గీత నేర్చుకున్నారు. నాన్నగారి తదనంతరం అదే ఆనవాయితీ నేను కొనసాగించి, వేసవి సెలవుల్లో పిల్లలకి భగవద్గీత శ్లోకాలు, 12, 16 అధ్యాయాలు, పద్యాలు నేర్పించేదాన్ని. పిల్లలకి శ్లోకాలు నేర్పించడమే కాక, వాటి అర్థాలు చెప్పడం వలన వాళ్లకి తొందరగా కంఠోపాఠం వచ్చేవి.

భగవాన్ రమణ మహర్షి ఆశ్రమానికి మా అమ్మగారి కోరిక మేర తీసుకెళ్లాను. అక్కడకి వెళ్లినప్పుడు వారి గురించి, వారి ఆధ్యాత్మికత గురించి, వారి మీద చలం రాసిన పుస్తకం, సూరి నాగమ్మగారు రాసిన "రమణాశ్రమ లేఖలు" చదవడం జరిగింది. అవి నన్ను చాలా ప్రభావితం చేసాయి.

అక్కడి నుంచి రాగానే "భగవాన్ రమణ" అనే కవిత రాసి రమణాశ్రమా నికి పంపడం, వారు నా కవితను భగవానుని సమాధి వద్ద ఉంచి, నా కవితను రమణాశ్రమం నుంచి వచ్చే పత్రికలో ప్రచురించడంతో నా జీవితం ధన్యమైందన్న ఆనందం కలిగింది.

తరువాత తరువాత ఆధ్యాత్మిక గురువుల చరిత్రలు, "ఒక యోగి ఆత్మకథ" పుస్తకాలు చదివాను.

అలా మొదలైన నా ఆధ్యాత్మిక పరిజ్ఞానం, నాకు తెలిసినంత వరకూ నలుగురితో పంచుకోవాలని ఆధ్యాత్మిక వ్యాసాలు రాయడం మొదలుపెట్టాను. చాలా పత్రికలలో ఈ వ్యాసాలు వచ్చాయి. "సాహితీకిరణం" మాసపత్రికలో "ఆధ్యాత్మికం" అనే శీర్షిక ద్వారా 'బెంగళూరు తెలుగు తేజం' మాసపత్రికలో "తెలుసుకోదగ్గ విషయాలు" అనే శీర్షికతో, ఆధ్యాత్మిక వ్యాసాలు కొంత కాలం సీరియల్‌గా రాశాను. ఈ వ్యాసాలకు పాఠకుల వద్ద నుంచి మంచి స్పందన రావడంతో ఈ వ్యాసాలను సంకలనం చేసి "నీలోకి నువ్వు", "ఆధ్యాత్మికత వృద్ధులకేనా"అన్న పుస్తకాలు వెలువరించాను.

చిన్నప్పటి నుంచీ, అధ్యయనం చేసిన 'భగవద్గీత'లోని అతిముఖ్యమనిపించిన 108 శ్లోకాలను రెక్కల ప్రక్రియలో గీతామృతం రాయడం నాలోని ఆధ్యాత్మిక భావనలకు చిరుసంతృప్తి.

**52. తెలుగు సాహిత్యంలో సంస్కృతీ సంప్రదాయాల ప్రభావం ఎలాంటిది?**

**జ.** ఒక జాతి సంస్కృతీ సాంప్రదాయాలను భావితరాలకు అందించేది భాష. భాషా పరిరక్షణ, జాతి పరిరక్షణగా పరిణమించి, సంస్కృతి ఉనికిని నిలబెడుతుంది. భాషను ఆలంబనం చేసుకుని సాహిత్యం, సాహిత్యాన్ని చుట్టుకుని కళలు వర్ధిల్లుతాయి. తెలుగు ప్రజల భాష ఆహారపు అలవాట్లు, జీవనవిధానం అన్నీ కూడా తెలుగు సాహిత్యంలో ప్రతిబింబిస్తున్నాయి.

సంస్కృతం నుంచి సాహిత్యాన్ని తెలుగు మార్గం వైపు మళ్లించిన నన్నయ్య కవిత్వంలో, ఆకాలంలో ప్రజానీకం ప్రశాంత జీవనాన్నీ, ఆధ్యాత్మికతనూ అలవరచుకొని జీవనం సాగించిందనీ

**"ఎరుకగలవారి చెరతిలు**
**గరచుచు సజ్జనుల గోష్ఠి గదలక ధర్మ**
**బెరగుచు నెరిగినదానిని**

**మరువక అనుష్ఠించునది సమంజస బుద్ధిన్"** అన్న పద్యంలో ఆనాటి సంఘజీవనం, సంస్కృతీ కనపడతాయి.

దేశీయ భాషలో, దేశీయుల్లో అతి సామాన్యుల జీవన సంస్కృతిని, సాహిత్యంలో ప్రతిబింబింపచేస్తూ, గొబ్బి పదాలు, వెన్నెల పదాలతో సాహిత్యంలో పల్లె సంస్కృతీ సాంప్రదాయాలను వెలుగులోకి తెచ్చాడు పాల్కురికి సోమనాథుడు.

బసవపురాణమూ, కృష్ణరాయుని "ఆముక్తమాల్యద" తెనాలి రామలింగడి "పాండురంగ మహాత్యమూ, వేమన పద్యాలు, వానమామలై వరదాచార్యుడి "సుభద్రాకళ్యాణం", ఇవన్నీ కూడా జనజీవితాన్నీ సంస్కృతీ సాంప్రదాయాలనూ ప్రతిబింబించే సాహితీప్రక్రియలే. శ్రీశ్రీ రచనల్లో అభ్యుదయ భావమెంత ఉందో సంప్రదాయ కవిత్వ ప్రభావమూ అంతే ఉంది.

**53. కవులు మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి నుండి వచ్చిన వారే ఎక్కువగా ఉంటారు? ఎందుకని?**

**జ:** మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి నుండి ఎక్కువగా కవులు ఉంటారన్న మీ మాట నూటికి నూరుపాళ్ళు నిజం. ఈ వర్గాల వారి ఆలోచనలు వారు అనుభవించే జీవితం ఉన్నత వర్గాల వారి జీవనవిధానానికి భిన్నమైనది. మధ్యతరగతి వారు జీవితాన్ని చాలా దగ్గరగా చూస్తారు. జీవనంలోని అనేక కోణాలను తరచి చూడటమే కాకుండా సమాజాన్ని అట్టడుగు కోణాల నుండీ, అలాగే మానవీయ సంబంధాలను అనుభవ పూర్వకంగా చూడటం జరుగుతుంది. అందుకే సృజనకారులు ఆ వర్గాల నుండే ఎక్కువగా రావటం జరుగుతుంది.

**54. ఉద్యమాలు ఉన్నప్పుడు కవిత్వం ఉధృతంగా వచ్చి తదుపరి కాలంలో స్తబ్దత ఏర్పడుతుందంటారా?**

**జ.** ఉద్యమసాహిత్యానికి ఒక క్రమపరిణామముంటుంది. ఉద్యమమనేది అణచి వేతకు నిరసనగా, స్వతంత్రంకోసం సమాజ అసమానతల మీద, సమాజ మార్పుకోసం ఆవిర్భవిస్తుంది. బ్రిటిషువారి హయాంలో భారతస్వాతంత్ర్యం కోసం ఉద్యమాలు నడిపినప్పుడు ఉద్యమసాహిత్యం ఉధృతంగా వచ్చి ప్రజలను చైతన్య పరిచింది. స్వాతంత్ర్యానంతరం అటువంటి కవిత్వం అవసరం కనపడక స్తబ్దత ఏర్పడింది. ఉద్యమం రూపుదాల్చడానికి సాహిత్యం ఒక శక్తివంతమైన పనిముట్టులా

ఉపయోగపడుతుంది. సాహిత్యం వలన ఉద్యమం బలోపేత మవుతుంది. ఉద్యమ ప్రయోజనం నేరవేరినా, లేదా అణగదొక్కబడినా సాహిత్యంలో స్తబ్దత ఏర్పడుతుంది. తెలంగాణ రాష్ట్రసాధన కోసం ఉద్యమ కవిత్వం సాగరఘోషలా అగ్నికణంలా ఎగసిపడింది. దీని ప్రయోజనం సిద్ధించిన తరువాత స్తబ్దత అని కాదుకానీ, దాని దిశ మార్పు చెందుతుంది. కొందరు ఉద్యమ కవులు చివరి వరకూ స్థిరంగా వుండకుండా, ఆ ముద్రవేయించుకుని తరువాత స్తబ్దుగా ఉంటారు. దాని వలన కూడ ఉద్యమ కవిత్వంలో స్తబ్దత ఏర్పడుతుంది.

దళిత ఉద్యమ కవిత్వం ఒక సునామీలా సమాజాన్ని ఊపివేసింది. చాలా గొప్పకవితా సంకలనాలు వెలువడ్డాయి. దళిత వర్గములో కూడా కుమ్ములాటలు,కుతంత్రాలు బయలుదేరి ఉద్యోగాలు, పదవుల కొరకు బలైపోయి, కొంతవరకూ ఉద్యమం, దానితో బాటు సాహిత్యం చప్పబడింది.

**55. కవులు ప్రభుత్వాలను సమర్థించే వారుగా గాక ప్రతిపక్ష పాత్ర పోషించాలంటే మీరేమంటారు?**

**జ:** కొంతవరకు సరి అయినదే. జరిగే ప్రతి సంఘటనా ప్రభుత్వాలకు లింకుపెట్టి చూడలేం. అయితే చాలా వాటికి ప్రభుత్వాలే బాధ్యత వహించవలసి ఉంటుంది. ప్రభుత్వాలు తప్పుడు విధానాలను అవలంబిస్తుంటే కవులు పట్టనట్టు ఉండటం ఎంతమాత్రం సరి అయినది కాదు. ఆయా సందర్భాలను బట్టీ సమాజ శ్రేయస్సును దృష్టిలో వుంచుకుని కవులు స్పందించాల్సిన బాధ్యత ఉంటుంది. దానిని తప్పనిసరిగా తమ సమస్యగా భావించి సాహిత్య సృజన చేయాలి.

**56. మీరు కవిత్వం రాసే క్రమంలో ఏ అంశాలకు ప్రాధాన్యత నిస్తారు?**

**జ.** కవిత్వం రాసే క్రమంలో ముందుగా కవితా వస్తువుకు ప్రాధాన్యత నిస్తాను. ఆ వస్తువుకు నాదైన శైలిలో శిల్పంతో కలిపి జనంలోకి తీసుకెళ్లేందుకు, ప్రజలకు అర్థమయ్యే భాషలో చెప్పడానికి మానవతా విలువలను జోడిస్తాను.

**57. కవిత్వానికి ఏమైనా ప్రత్యేకమైన భాష ఉంటుందా?**

**జ.** కవి మనసు మాట్లాడే భాషే కవిత్వం. కవిత పాఠకుల హృదయాలను కదిలిస్తుంది.

గిలిగింతలు పెడుతుంది. ఊహాలోకాల్లో విహరింప చేస్తుంది. ఓదార్పునిస్తుంది, నిశ్శబ్ద విప్లవాన్ని రగిలిస్తుంది. వైవిధ్యభరితమైన అనుభూతుల నిస్తుంది. కాబట్టి దానికి ఒక ప్రత్యేకమైన భాష లేదు. కవి తన భావ ప్రస్ఫుటీకరణ కోసం తనకు తానుగా ఒక భాషను నిర్మించుకుంటాడు.

## 58. స్త్రీల సమస్యల పట్ల మీరు ఎలా స్పందిస్తారు?

**జ.** స్త్రీలు సమాజంలో వివిధ సందర్భాలలో పడుతున్న మనోభావాల్నీ, బాధల్నీ, కుటుంబ చట్రంలో స్వీయపరివేదనలనీ చూసినప్పుడు నాలో కలిగే భావావేశా లను నా రచనలో ప్రతిబింబిస్తాను.

స్త్రీలలో వ్యక్తిత్వ వికాసం, చైతన్యం, సామాజిక స్పృహ పెంపొందించే దిశగా ఆలోచింపచేసేవిగా వుంటుంది నా సాహిత్యం.

సహస్రావధాని అనే కవితలో "భర్తముందు పోతే/ సాంఘిక కట్టుబాట్లలో / వేధించే బంధుజనం/ తానే ముందుపోతే/ కాటికి పంపడానికి / వంతులుపోయే / సంతానం / అన్నిటినీ భరిస్తూ / అన్నిటినీ అధిగమిస్తూ / పొలం నుంచి – గగనతలం వరకు / సర్వత్రా తానైన సహస్రావధాని – ఆమె/ సమాజం కట్టు బాట్లతో ఎంత కుంగదీసినా, స్త్రీ తన్ని తాను నిరూపించుకోవాలనీ, నిరూపించు కుంటోందనీ, స్త్రీ ఉన్నత వ్యక్తిత్వాన్ని వ్యక్తీకరించాను..

నేను సచివాలయంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు స్పందనగా, "సచివాలయ మహిళా ఉద్యోగినీ సంక్షేమ సంఘం" స్థాపనకు పునాదివేసి సంస్థకు, స్థాపక కార్యదర్శిగా, అనేక మహిళా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాను.

ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా స్వీయరక్షణ దిశగా, వారి ఆలోచనా దృక్పథంలో మార్పు తీసుకువచ్చాము.

నిర్భయకు జరిగిన పైశాచిక మానభంగానికి నిరసనగా రాసిన కవితలో "ఏళ్లూ పూళ్లూ పట్టే న్యాయ విచారణ కాదు / చర్యకు ప్రతిచర్య కావించే సత్వర ఆటవిక న్యాయమే / కామాంధులకు సరియైన శిక్ష అంటూ మండుతున్న గుండెతో రాశాను. ముస్లిమ్ దేశాలలో

స్త్రీలపై అత్యాచారాలకు, సత్వరమేశిక్ష అమలు చేస్తారు. కానీ మనదేశంలో ఎంత పెద్ద నేరగాళ్లయినా "బెయిలు" పేరుతో బయటికి వచ్చి కేసులు మాఫీ చేయించుకుంటారు.

మహిళా సంఘాలను కూడా వెనకనుండి మాఫియాగాంగులు, నడిపిస్తుంటే, న్యాయంకోసం మహిళ ఎక్కడికెళుతుంది. అందుకే స్వయం రక్షణా దిశగా అడుగులు వేయమంటూ "స్త్రీలూ-స్వయం రక్షణ", అనే వ్యాసం రాశాను. అది నేటి నిజం ప్రతికలో ప్రచురితమై, చాలా మంచి స్పందన వచ్చింది.

**59. మీ సాహిత్యానికి కుటుంబం నుండి ఎలాంటి ప్రోత్సాహం ఉంటుంది.**

**జ:** నాకు సాహిత్యం పట్ల అభిరుచి కలగడానికి మొదటి కారకులు మా నాన్నగారు కీ.శే. మహాకాళి వేంకటరావుగారు. దురదృష్టమేమిటంటే నేను కవితలు రాయడంలో ఓనమాలు దిద్దుతున్న సమయంలోనే ఆయన పరమపదించారు. అందుకే నా తొలి కవితా కృతి "చిరుసవ్వడులు"మా నాన్నగారికి సర్వం తానే అయిన మా అమ్మ ప్రభావతిగారికి అంకితమిచ్చాను. నాన్న ఉంటే ఎంత సంతోషించే వారోనని అనుకోని రోజు లేదు ఈనాటికీ. అమృతాంతరంగ అయిన మా అమ్మ గురించి ఎన్ని కవితలు రాసినా తనివి తీరలేదు.

**అమృతం కోసం**
**అర్రులు చాచాలా?**
**అమ్మ మనసులోకి**
**తొంగిచూడు**

అని రాసుకున్నా నా కవిత "అమృతత్వం"లో ఏ డిగ్రీలు లేని అమ్మ, తినిపించే ఆహారంలో ఎంతో శాస్త్రీయత దాగుంది అంటూ రాశాను.

కవిత చదివిన అమ్మ ముసిముసిగా నవ్వుతుంటే ఏనుగెక్కినంత సంతోష మేసింది. పెద్దక్క జయశ్రీ, చిన్నక్క సులోచన ఆశీ:పూర్వక ప్రోత్సాహమం దించేవారు. మా చెల్లెలు విజయశ్రీ కూడా మంచి కవయిత్రి. ఒకరికొకరం విమర్శనాత్మక సలహాలందించుకుంటాం. నా కవిత్వం గురించి మా చెల్లెలు ఒక చక్కని కవిత కూడా రాసింది. మా నలుగురు అక్కాచెల్లెలతో బాటు మా బాబాయి కూతురు శ్రీలత కూడా మాలో ఒకదానిగా కలిసిమెలిసి ఉంటుంది. నేను రాసిన పుస్తకాల ఆవిష్కరణ సభలన్నింటికీ

వచ్చి ముందు వరసలో కూర్చుని చక్కని పుష్పగుచ్ఛంతో ఆత్మీయ కౌగిలితో తన సంతోషాన్ని వ్యక్తపరిచే మంచి అభిమాని. సభలకి వచ్చినా, రాకపోయినా, నా పుస్తకాలనీ చదివి, నిండుమన సుతో ఆశీ:రాభివందనలు అందజేస్తుంది మా పిన్ని శ్రీమతి సుశీల.

అలాగే అత్తింటి వారివైపు నుంచి మా పెద్ద బావగారు కేతవరపు సుబ్రహ్మణ్యం, ఆడపడచు సరోజిని గార్లు నన్ను అమితంగా ప్రోత్సహించిన వారిలో మొదటివారు. మిగతా నలుగురు బావగార్లు, తోడికోడళ్లు కూడా నా రచనా వ్యాసంగానికి ఆనందపడుతూ నా కవితలు ప్రచురణ కాగానే చదివి, వెంటనే ఫోన్‌చేసి తమ సంతోషాన్ని వ్యక్తపరచడమే కాక, నా ప్రతి సాహితీ కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతారు. ఇక మా వారికి అన్నయ్య వరస అయిన ప్రముఖ శిశువైద్య నిపుణులు, ప్రముఖ కవి, పండితులు డా॥పి.యస్. మూర్తిగారి ప్రోత్సాహం నా సాహితీ నావకి దిక్సూచి. ఆయన దగ్గరకెళ్లి కాసేపు కూర్చుని సాహిత్యం గురించి మాట్లాడుకుని వస్తే అది ఒక టానిక్‌లా పని చేస్తుంది. ఎక్కడలేని ఉత్సాహం వస్తుంది.

ఇక గృహసీమలో మా శ్రీవారు నా కవితా వ్యాసంగానికి అంతరాయం కలిగించకుండా, మౌనంగా నా ఎదుగుదలను ప్రోత్సహిస్తూ, అవసరమయినప్పుడు నా వెనువెంట ఉండి నడిపించే అదృశ్య వ్యక్తి, శక్తి.

“అమ్మ” అన్న పిలుపుతో జీవితానికి అర్థాన్నీ, నా భావాలను అక్షర రూపంలో పెట్టడానికి ప్రేరణ, సదా నీవెంట మేమున్నామని చిన్నవాళ్లైనా పెద్దరికం వహించే కూతురు ప్రియాంక, కొడుకు ఫణీంద్ర,నేను అమెరికాలో ఉన్నప్పుడు నా సాహితీ ప్రస్తానాన్ని కొనసాగించేందుకు వెసులుబాటు కల్పిస్తూ నన్ను న్యూజెర్సీలోని సాహితీ సమావేశాలకు దగ్గరుండి తీసుకెళ్లిన మా అల్లుడు శ్రీకాంత్ ఇలా కుటుంబమంతా నా సాహిత్యం పట్ల అభిమానంతో ప్రోత్సాహమిస్తున్నారు. వీరందరికీ నేనెంతో రుణపడి ఉన్నాను.

**60. సాహిత్య జీవితం నుండి మీరు నేర్చుకున్నది?**

**జ.** చాలా! నిర్భీతి, కళాభిరుచి, సునిశిత పరిశీలన, ఆధ్యాత్మికత ఇలా సాహిత్యం వలన చాలా నేర్చుకున్నాను.

**"సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చుని "మొరగదు"**
**తుఫాను గొంతు "చిత్తం" అనడం ఎరగదు**
**పర్వతం ఎవడికీ వంగి "సలాం" చేయదు**
**నేనింతా ఒక పిడికెడు మట్టే కావచ్చు**
**కానీ కలమెత్తితే**
**నాకు ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది"**

అన్న గుంటూరు శేషేంద్రగారి కవిత్వం చదివి, కవినైనందుకు గర్వపడ్డాను. ఇది నాకు బాగా నప్పుతుంది. ఎందుకంటే నా కవిత్వంలో నిర్భీతి, సూటిదనం, స్వేచ్ఛా ప్రియత్వం వుంటుంది.

కవిత్వం రాయడం మొదలు పెట్టినప్పటి నుంచీ, అంతకు ముందు కంటే, ఎక్కువగా సమాజాన్నీ, విభిన్న జీవన రీతులనీ, విభిన్న మనస్తత్వాలనీ, వస్తు సామగ్రినీ పశు పక్ష్యాదులనీ, సునిశితంగా పరిశీలించడం అలవాటయింది.

ప్రపంచంలో వ్యక్తిగా, ఎంత ఎత్తు ఎదిగినా, మనుషుల మధ్య సామరస్య సంబంధాలు, మానవతా విలువలే ఉన్నతంగా నిలబెడతాయి.

విశ్వమానవ శ్రేయస్సు, సామరస్య ధోరణి ప్రతిబింబించే సాహితీ సృజన వల్ల, శారీరక మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుంది. . ఒక్కొక్కసారి ఎందుకో కారణం తెలీకుండానే నిరాశానిస్పృహలు ఆవరిస్తాయి. దాని నుంచి బయట పడడానికి, ఆలోచన చేస్తున్నప్పుడు, 'మహాత్మాగాంధీ' గారి జీవిత చరిత్రలో రాసుకున్న వాక్యాలు. "జీవితంలో ఏ సమస్యకైనా 'భగవద్గీత'లో పరిష్కారం దొరుకుతుందన్న విషయం గుర్తుకొచ్చి "గీత"ను అధ్యయనం చేశాను.

అలా ఆధ్యాత్మికత వైపు దృష్టి మరలి, ఆధ్యాత్మిక సాహిత్యం రాయడం మొదలు పెట్టాను. మనిషి ఎంత సంపాదించినా, ఎన్ని కీర్తి కిరీటాలు అధిరోహించినా, చివరకి ఆధ్యాత్మికంలోకి మారాల్సిందేనన్న సత్యం "సాహిత్యం నాకు నేర్పింది. చివరకు "భగవద్గీత"లోని సారాంశాన్ని 108 శ్లోకాలలో "గీతా మృతం" అనే పుస్తకంలో నాలుగు భాషల్లో వెలువరించాను. "అరిషడ్వర్గాలపై సాధించు విజయం – ప్రపంచమే పాదాక్రాంతం" అని రాసుకున్నాను.

“కవిని కన్నతల్లి, గర్భంబు ధన్యంబు” అన్న జాషువా మాటలు, ఒక్కసారి మా అమ్మను గుర్తుకుతెచ్చాయి. అమ్మ ధన్యమైన జీవి. అయితే ఆమె కడుపున పుట్టినందుకు ధన్యమైంది నేను. జాషువాగారి మాటలు అమ్మను స్ఫురణకు తెచ్చి అమ్మ మీద స్ఫూర్తిమంతమైన కవిత్వాన్ని రాయడానికి ఉపకరించాయి.

**మా అమ్మ గర్భంలో జననం**
**అనేక జన్మల పుణ్యఫలం**
**అమ్మ తినిపించిన గోరుముద్దలు**
**ప్రేమానురాగాలకు పునాదులు.**

ఇలా నేను రాసిన ప్రతీ పుస్తకంలో అమ్మ గురించి ఒక కవిత వుంటుంది. అమ్మ రుణం ఎలాగూ తీర్చుకోలేను. నా కవిత్వంతోనే ఆమె స్మృతికి నివాళు లర్పిస్తాను.

**“తృప్తి చెందనివాడు సప్తద్వీపములనైన**
**జొక్కింబడనే”** *అన్నారు పోతన.*

నిజంగానే ‘తృప్తి’ లేకపోతే జీవితంలో ఎప్పుడూ వెలితిగానే వుంటుంది. తృప్తికి మించిన సౌఖ్యము లేదు.

ఆ తృప్తిని నేను నా వ్యక్తిగతజీవితంలోనూ, సాహితీ జీవితంలోనూ కూడా అనుభవించాను, అనుభవిస్తున్నాను.

నేనసలు కవిత్వం రాస్తానని ఏనాడూ అనుకోలేదు. మనసులో కలిగే భావతుంపరులకు అక్షర రూపమిచ్చాను. కవిత్వంగా రూపుదిద్దుకుంది. సరదాగా రాసుకున్నాను అనుకున్న కవిత్వం, నన్ను విశ్రమించనీక, వెంటాడుతూ, నా రచనా వ్యాపకాన్ని వ్యసనంగా మార్చింది. ఈ సాహితీ యాత్రలో ఎంతో మంది పెద్దపెద్ద కవి పండితులతో పరిచయమయింది.

సాహిత్యమా! నీకు వందనం. నా పదవీ విరమణానంతర జీవితాన్ని చైతన్యవంతంగా, రసాత్మకంగా జీవింపచేస్తున్నందుకు.

**61. మీరు రాయదల్చుకున్నది నిర్భయంగా రాస్తారు కదా! అది ఎలా అబ్బింది?**

**జ.** నాది మొదటినుంచీ ముక్కు సూటిగాపోయే మనస్తత్వం. లౌక్యం తెలీదు. స్వచ్ఛంగా లేని మనుషులతో మెలగలేక పోయేదాన్ని. ఆఫీసులో కూడా రూల్స్ ప్రకారం ఫైల్స్ రాసేదాన్ని. అది ఒక్కొక్కసారి నా కింద స్టాఫ్‌కీ, పై అధికారులకీ కూడా నచ్చేది కాదు. నేను రాసేది రాస్తాను, నచ్చకపోతే మీకు కావలసిన విధంగా రాసుకోండి. కానీ రూల్స్ వ్యతిరేకంగా రాయను అన్న మాట మీద నిలబడేదాన్ని. నా వలన వారికి ఆదాయ మార్గాలు మూసుకుపోతున్నాయని, నన్ను నాన్-ఫోకల్ సీట్లలో వేసేవారు. ఎక్కడేసినా హాయిగా నిర్భీతితో పనిచేసు కుని పోయేదాన్ని.

మనం నిజాయితీగా వుంటే ఎవరికీ భయపడనవసరం లేదని, నాన్న గారు మొదటి నుంచీ చెప్పేవారు. ఆయన అలాగే జీవించారు. మాకూ అదే అలవాటయింది.

అదే పోకడ నా కవిత్వంలో కూడా చోటు చేసుకుంది. తెలుగుభాష అమలులో ప్రభుత్వవైఖరికి విసుగొచ్చి

**"తెల్లోడి రాజ్యం-తెల్లారి ఏళ్లు గడిచినా**
**వాడి భాష మాత్రం- ఇంకా రాజ్యమేలుతోందని"**

ఒక మీటింగులో బాహాటంగా చెప్పా. ఇటీవల "సభలకు వెళ్లాలంటే-నిరు త్సాహంగా వుంటోంది" అంటూ ఒక కవిత రాశా. అది చదివిన చాలామంది మా మనసులోనూ అదే భావముంది, కానీ ఇంత నిర్భయంగా బయటపెట్ట లేకపోయాము- మీ ధైర్యానికి జోహారు అంటూ ఫోన్లు చేశారు.

**62. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, అలాగే జ్ఞానపీఠ అవార్డులు స్త్రీలకు వచ్చిన సందర్భం అతిస్వల్పం. ఎందుకంటారు?**

**జ.** ఈ అవార్డుల గుట్టు అందరికీ తెలిసిందే! మహామహా పండితులైన వారికే, ఈ అవార్డులు రావడానికి సిఫారసులు అవసరమవుతున్నాయి. విద్వత్తుతో బాటు, లాబీయింగ్, సిఫారసులు కూడా ఉంటేనే జ్ఞానపీఠ కానీ, సాహిత్య అకాడమీ అవార్డులుకానీ వస్తాయి. స్త్రీలు, కుటుంబపరంగా బాధ్యతలు నిర్వర్తి స్తూనే, సాహితీ సృజన చేస్తారు. అవార్డుల కంటే,

జనం మెచ్చే సాహిత్యం అందునా స్త్రీవాద సాహిత్యంపై దృష్టికోణం వుంటుంది. స్త్రీలకు అవార్డులు రావడానికి, సిఫారసులు చేసేవారు తక్కువ. అయితే ఇటీవలే డా॥ కాత్యాయనీ విద్మహేకి, సాహిత్య అకాడమి పురస్కారం రావడం స్త్రీలందరికీ గర్వకారణం.

**63. మీరు ప్రాచీన కవుల్లో ఎవరిని ఇష్టపడతారు ఎందుకు? ప్రాచీన కవులలో ఎవరిష్టం అంటే ఏం చెప్తారు?**

**జ.** నన్నయలాగా తిక్కన రాయలేదు. తిక్కన లాగా, పోతన రాయలేదు. ఎవరి కవితారీతులు, వ్యక్తపరిచే తెలుగు తేనీయరీతులు వారివే.

**"ఎరుక గలవారి చెరితలు గరచుచు**
**సజ్జనుల గోష్టి కదలక ధర్మంబెరగుచు,**
**నెరిగినదానిని మరువక అనుష్టించునది**
**సమంజసబుద్ధిన్"**

సజ్జన గోష్టి, ధర్మాన్ని తెలుసుకుని దాన్ని ఆచరించడమే ఆధ్యాత్మికత అంటూ నన్నయ రాసిన తేనెలూరే తెలుగు పద్యమూ ఇష్టమే!

**"ఒరులేయవి ఒనరించిన**
**నరవర అప్రియము తనమనంబునకగు దా**
**నొరులకు నవి సేయకునికి**
**పరాయణము పరమధర్మ పదములకెల్లన్**

అంటూ ధర్మాల్లోకెల్లా పరమ ధర్మము–మనక ప్రియమైన దానిని తిరిగి ఇతరులకు చేయకుండా ఉండటమే! అన్న ధర్మసూక్ష్మాన్ని తెలియచేసిన తిక్కన కవిత్వమన్నా ఇష్టమే!

**చేతులారంగ శివుని పూజింపడేని**
**నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని**
**దయము సత్యంబులోనుగా తలపడేని**
**కలుగనేటికి తల్లుల కడుపుచేటు**

దయ, సత్యము కలిగి వుండని వాని జీవితం తల్లులకి కడుపు చేటు అంటూ మనిషి ఎలా ఉండాలో బోధించిన పోతన కవిత్వమన్నా ఇష్టమే!

అలతి అలతి పదాలలో అందమైన భావాలను పదిలపరిచారు ప్రాచీన కవులు.

రామాయణ కావ్యాన్ని, తెలుగువారి ఇంట కల్పవృక్షంగా నాటిన విశ్వ నాథ వారి కవిత్వమన్నా ఇష్టమే!

విశ్వనాధ సత్యనారాయణ గారి దగ్గరకి ఒక పండితుడు వచ్చాడు. వారి మధ్య సంభాషణలో విశ్వనాధవారు ఆయన్ని అడిగారుట.

**ప్ర. "నన్నయ గొప్పవాడా? తిక్కన గొప్పవాడా? అని.**

జ. "నన్నయ మొదటగా మహాభారతాన్ని తెనిగించాడు కదా! ఆయనే గొప్ప వాడన్నాడుట, కాదు తిక్కన అన్నారుట విశ్వనాధవారు.

**ప్ర. మళ్లీ తిక్కన గొప్పవాడా? శ్రీనాధుడు గొప్పవాడా? అనడిగారుట.**

జ. మరి తిక్కనే కదా అని అన్నారట ఆయన. కాదు శ్రీనాధుడు అన్నారట విశ్వనాథ్

**ప్ర. మళ్లీ శ్రీనాధుడు గొప్పవాడా. నేను గొప్పవాడినా? లేక నువ్వు గొప్పవాడివా? అనడిగారంట**

జ. ఆ పండితుడికి, ఏది చెబితే ఏం గొడవో అని భయమేసి "అయ్యా ఈ తికమకలు నాకర్థం కావడంలేదు. దయచేసి దీంట్లో అంతరార్థమేమిటో మీరే శెలవివ్వండి అన్నారట. అప్పుడు విశ్వనాధ అన్నారుట నన్నయ, తిక్కన, శ్రీనా ధుడు, విశ్వనాధ కన్నా నువ్వే గొప్పవాడివి అన్నారట,

అయనకి నోటమాట రాక చూస్తుండిపోయారట. అప్పుడు విశ్వనాధ అన్నారుట. "నన్నయ" గొప్పవారు కాదు, ఎందుకంటే ఆయన తెలుగు కవిత్వం ఆస్వాదించ లేదు, రచించాడు అంతే. ఎందుకంటే ఆయనకు ముందు అంతా సంస్కృతమే కదా! తిక్కన ఎందుకు గొప్పవాడంటే, నన్నయ కవిత్వం చదివాడు కనుక. శ్రీనాధుడు, కవిత్రయం

రాసిన తెలుగు కవిత్వం చదివాడు. వీళ్లందరి కవిత్వాలు చదివిన నేను గొప్పవాడిని. మా అందరి తెలుగు సాహిత్యం చదివిన నువ్వు గొప్పవాడివి – ఇందులో తికమక ఏమి లేదు. ఇంతమంది కవిత్వం చదువుతున్న తెలుగు వారుందరు గొప్పవారే అన్నారుట.

**64. ఆధునిక కవులలో ఎవరి రచనలంటే ఇష్టం? ఎందుకు!**

**జ.** ఆధునిక కవులలో నేను బాగా ఇష్టపడేది ఒకరు దేవులపల్లి కృష్ణశాస్త్రి రెండోవారు శ్రీశ్రీ. ఇద్దరివీ విభిన్న దృక్పథాలు. ఒకరిది భావ కవిత్వం ఇంకొకరిది అభ్యుదయ కవిత్వం

తెలుగు కవితా సరస్వతికి ఆభరణం కృష్ణశాస్త్రి గారి కవిత్వం. భావ కవితను లాలించి పాలించి, పోషించి జనహృదయాలకు అంకితం చేసిన మహానుభావుడు కృష్ణశాస్త్రిగారు. మనుషులలోని భావోద్వేగాలనూ, హృదయ స్పందనాలనూ మల్లెలనూ. కోయిల పాటతో జతచేసి, మాలలు అల్లి జనహృద యాలను ఊయలలూగించిన భావకవి.

ప్రకృతి అందాలకు పరవశించి ''ఆకులో ఆకునై'' అని రాసాడు. ఘనాఘనసుందరా అంటూ భక్తి భావగీతాలు రాశాడు.

ఆకు కదలికకు పరవశం, గాలి సవ్వడికి తన్మయత్వం, మల్లె సౌరభానికి ఉప్పొంగిపోయే కవిత్వం మనకందించిన ఆంధ్రాషెల్లీ కృష్ణశాస్త్రి గారి కవిత్వం ఎప్పుడు విన్నా, ఏదో తీయని లోకాల్లో విహరిస్తూన్నట్టుంటుంది.

ఇక “కవిత్వం అంటే ఓ తీరనిదాహం” అన్నారు శ్రీశ్రీ. సాధించిన దానివల్ల ఒకింత సంతోషం కలిగినా, “సాధించిన దానితో సంతృప్తి చెంది అదే విజయమకనుకుంటే పొరపాటోయి” అన్న శ్రీశ్రీ భావం నాకొక మంత్రోపదేశం.

శ్రీశ్రీ ప్రజాస్వామ్య భావాలను కవిత్వంలో ప్రవేశపెట్టాడు. మనిషి కేంద్రబిందువుగా కవితాగానం చేశాడు. విశ్వజనీన ప్రతీకల్ని బలంగా చెప్పడం వలన ‘మహాప్రస్థానం’ శ్రీశ్రీ మహాకవిత్వమై, ప్రజల హృదయాలలో శ్రీశ్రీ అనగానే ''మహాప్రస్థానం'' గుర్తుకొచ్చేంతగా ముద్ర వేసుకుపోయింది.

కవిత్వంలో ఒక కొత్త శైలిని, అభ్యుదయవాదాన్నీ ప్రవేశపెట్టి నేటి తరాన్ని ప్రభావితం చేసి కాదేదీ కవితకనర్హం అంటూ కవితావస్తువును పరివ్యాప్తం చేసిన శ్రీశ్రీ అంటే నాకభిమానం.

భావాంబర వీధిలో విహరింపచేసి మనోల్లానం కలిగించే కృష్ణశాస్త్రి గారి కవిత్వం, అభ్యుదయ పథంలో నడిపిస్తూ చైతన్యస్ఫూర్తి రగిలించే శ్రీశ్రీ కవిత్వం ఇద్దరి రచనలూ నాకు ఇష్టమైనవే.

ఇప్పుడొస్తున్న నూతన ప్రక్రియల రూపశిల్పులైన సుగమ్‌బాబు, ఎన్. గోపీగారు, నిరంతర సాహితీ దీక్షపరులైనా డా॥ తిరునగరి గార్ల కవిత్వం కూడా నాకిష్టం. ఎందుకంటే ఈ ప్రక్రియలు ఎందరినో కవులుగా మార్చాయి.

**65. మీరు ఎక్కువగా ఇష్టపడి చదివిన పుస్తకాలేమిటి? అవి ఎందుకు ఇష్టం?**

**జ.** నేను చాలా ఇష్టపడే పుస్తకం రామాయణం. పద్మశ్రీ పుల్లెల రామచంద్రుడు గారు రాసిన "వాల్మీకిరామాయణం", జ్ఞానపీఠ పురస్కార గ్రహీత విశ్వనాథ సత్యనారాయణగారి "రామాయణ కల్పవృక్షం", "మల్లెమాల రామాయణం" "ఆధ్యాత్మక రామాయణం" ,ఇంగ్లీషులో ఫేమస్ రైటర్ "అమిష్" రాసిన "సియాన్ ఆఫ్ ఇక్ష్వాకు" (రామచంద్ర సీరీస్) పుస్తకాలు చదివాను.

రాముడి కథే కదా ఇన్నిసార్లు చదవడమేమిటి? ఎందుకంటే రామాయణంలో నవ రసాలు వున్నాయి. ఒకసారి మొదలు పెడితే ఏకబిగిన చదివించే ఉత్కంఠ భరితం, రామాయణం. ఈ మధ్య మనం తరచుగా "సకల మానవ సౌభ్రాతృత్వం" "ఆత్మగౌరవం" "సామాజిక స్పృహ" "మానవతావాదం" "జాతీయవాదం" అనే పదాలు వింటున్నాం. అత్యున్నతమైన ఈ ఆదర్శాలన్నీ రామాయణంలో వున్నాయి. రామాయణం గురించి అనేక వ్యాఖ్యానాలూ, వాదాలు, చర్చలూ, వాదోపవాదాలు వచ్చాయి. మనం రామాయణం చదువుతే, వాల్మీకి, రాముణ్ణి మానవుడిగానే చిత్రించాడు. మనిషిలో వుండే అన్నిరకాల సహజ లక్షణాలన్నీ రాముడిలో, ఇతర పాత్రలలో చూపించాడు. ప్రపంచ సాహిత్యంలో రామాయణానికి ఒక ప్రత్యేకం వుంది. మనిషి తానొక ఉత్తమవ్యక్తిగా, కుటుంబంలో ఉత్తమ సభ్యుడిగా, మంచి కొడుకుగా, మంచి సోదరుడిగా, మంచి మిత్రుడుగా, చివరకు మంచి శత్రువుగా ఎలా జీవించవచ్చో చెబుతుంది రామాయణ కావ్యం.

వ్యక్తిత్వ వికాసం, పాజిటివ్‌థింకింగ్, ఇవన్నీ కూడా మనసుకు హత్తు కునే విధంగా రామాయణం చెబుతుంది. ఇవన్నీ పాశ్చాత్యులకు ఇటీవల కాలంలో తెలిసిన

విషయాలు. ఇవన్నీ మనదేశంలో కొత్తగా కనిపెట్టలేదు. రామాయణంలో నిక్షిప్తమైన విషయాలే. మన యువత, ఈ విషయాలను తెలుసుకోవాలి. ఒకసారి రామాయణం చదివితే, "కమ్యూనికేషన్ స్కిల్స్, రోల్ మోడల్, పాజిటివ్‌థింకింగ్" ఇలా ఎన్నో విషయాలు తెలుస్తాయి. శ్రీ రాముడికి తెల్లారితే పట్టాభిషేకం అనుకున్నారందరూ. కానీ మరునాడు, దశరథుడు రాముడిని అరణ్యవాసానికి వెళ్లమని ఆదేశించాడు. అప్పుడు లక్ష్మణుడు ఆగ్రహంతో తండ్రి మాటను ధిక్కరించమని అన్న గారైన రాముడితో అంటాడు.

రాముడు లక్ష్మణుడితో "ఈ రోజు నాకు పట్టాభిషేకమని చెప్పినవారూ మన తండ్రిగారే. కానల కేగమని చెప్పినది వారే! కనుక దీంట్లో తండ్రి గారి తప్పులేదనీ, అంతా కాలమహిమ అని" చాలా ప్రశాంతంగా లక్ష్మణుడికి చెప్పి తండ్రి ఆజ్ఞ శిరసా వహించడానికి బయలుదేరతాడు.

దీనివలన మనం, సంతోష దుఃఖాలను సమభావంతో చూడాలని, సుఖానికి పొంగిపోక, దుఃఖానికి కుంగిపోక సంయమనం పాటించాలని తెలుసుకుంటాం.

రాముడు అడవికి బయలుదేరుతూ తల్లి కౌసల్య ఆశీస్సుల కోసం వచ్చినప్పుడు కౌసల్య రాముడితో అంటుంది "రామా ఎట్టి పరిస్థితులలోనూ ధర్మాన్ని అతిక్రమించకు, అనుకూల పరిస్థితులలో ధర్మంగా ప్రవర్తించడం తేలిక కానీ నీవు వెళ్లేది అడవికి, అక్కడ వుండే వ్యతిరేక పరిస్థితులలో కూడా నువ్వు ధర్మాన్ని విడిచిపెట్టకు – అదే ధర్మాచరణమంటే"అని రాముడికి ఉద్బోధిస్తుంది.

ఇది నాటికీ, నేటికీ, ఏనాటికీ చెక్కుచెదరని ధర్మసూత్రం. ఈనాటి తల్లిదండ్రులు, పిల్లలను పెద్ద చదువులకుగానీ, ఉద్యోగాలకుగానీ, కొత్త ప్రదేశాలకు, విదేశాలకూ పంపేటప్పుడు చెప్పవలసిన ఆణిముత్యాల్లాంటి మాటలు.

రామాయణంలో దాంపత్యబంధం ఎంతో బాగా చిత్రీకరించారు. దాంపత్య సంబంధం, కుటుంబ జీవతంలో శాంతికిమూలం. ఈ రోజున నాగరికతకు పరాకాష్ట అనుకుంటూ చిన్నచిన్న విషయాలకే భార్యాభర్తలు విడిపోవడం జరుగుతోంది. ఈనాటికీ భార్యాభర్తలను దీవించేటప్పుడు "సీతారాములల్లే వర్ధిల్లండి" అని దీవిస్తారు వారి దాంపత్యబంధం అటువంటిది.

సీతాపహరణానంతరం, ఒక వ్యక్తిగా సీత కోసం రాముడు విలపించాడు, కానీ ధర్మపాలనకోసం, ఒక రాజుగా సీతను కానలకంపాడు. ఇది నేటి పాలకులందరూ తెలుసుకోవలసిన విషయం. న్యాయంగా పరిపాలించాలంటే, బంధుప్రీతి పనికిరాదని తెలియ చేస్తుంది ఈ సంఘటన.

హనుమంతుడు లంకలో సీతాదేవి దుఃఖాన్ని పోగొట్టడానికి "మరణిస్తే ఏముంది? జీవించి ఉన్నట్లైతే ఎప్పటికైనా మంచిని చూస్తాము" అంటూ ఆమెను ఆశావాదం వైపు మళ్లిస్తాడు. నిరాశాంధకారంలో కొట్టు మిట్టాడుతూ ఆత్మ హత్యలకు పాల్పడే యువతకు జ్ఞానబోధ, పాజిటివ్‌థింకింగ్ వైపు ఆలోచింప చేసే ఉపదేశ మంత్రం ఇది.

హనుమంతుడు లంకకు చేరడానికి నూరు యోజనాల దూరం సము ద్రాన్ని లంఘించాలి. తనబలం తనకు తెలియదు. కానీ రామకార్యం కోసం సముద్ర లంఘనం కావించాలని సంకల్పించాడు. మధ్యలో ఎన్ని అడ్డంకులు వచ్చినా, లక్ష్యంవైపునకు దూసుకుపోయాడు.

ఇది ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే విషయం. చిన్నపెద్దా, యువత అందరూ కూడా, ఒక లక్ష్యం సాధించాలంటే, ముందు సంకల్పం ఉండాలి, ఎన్ని అవాంతరాలు వచ్చినా అధిగమిస్తూ, లక్ష్యం వైపునకు దూసుకుపోవాలి. నేడు మనం వింటున్న "పర్సనాలిటీ డెవలప్‌మెంట్" "అఛీవింగ్ గోల్" అన్నీ రామాయణంలోని సుందరకాండలో వున్నాయి.

అలాగే హనుమంతుడు లంకలో సీత జాడ కనుక్కుని ఆ శుభవార్త రామునికి చేరవేసేటప్పుడు ఆతృతగా ఎదురుచూస్తున్న రాముడికి "చూసాను సీతను" అని చెప్పాడు. అంతే కానీ "సీతను చూశాను" అనలేదు. 'సీత' అన్నమాట ముందు వినపడగానే ప్రాణాలు పోయేటంత ఆతృతగా వున్నాడు రాముడు. "చూసాను" అన్న మాట వినగానే ప్రాణం నిలబడింది ఆయనకు. ఒక చిన్న మాట ఎంతటి ఓదార్పు నిచ్చిందీ! అదే 'గుడ్ కమ్యూనికేషన్ స్కిల్' ఇప్పుడు ప్రతి ఒక్కరూ కమ్యూనికేషన్ స్కిల్స్ కోసం స్పెషల్ కోచింగ్ క్లాసులకి వెడుతున్నారు.

ఇలాంటి విషయాలు రామాయణంలో కోకొల్లలుగా కనిపిస్తాయి. ఇవన్నీ, దేశ కాల, జాతి, మత, కుల భేదాలేవీ లేకుండా ప్రతీ మనిషికీ ఉపకరించే సన్మార్గ దారిదీపాలు.

ప్రపంచ వ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న సామాజిక రుగ్మతలకూ, నైతిక పతనానికీ ఔషధ గుళికలు రామాయణంలో చాలా వున్నాయి.

రామాయణం చదివితే, వ్యక్తి తనను తాను చక్కదిద్దుకోనడమే కాకుండా, కుటుంబాన్నీ చక్కదిద్దుకోగలుగుతాడు. అప్పుడు సమాజమూ, దేశమూ, ప్రపం చమూ వాటంతటవే చక్కబడతాయి

"మ్యాన్ ఈజ్ ఎ సోషల్ యానిమల్" అని అరిస్టాటిల్ అన్నాడు. "మ్యాన్ ఈజ్ ఎ ఫెరోషియస్ యానిమల్" అని థామస్ హొబ్బెస్–బ్రిటిషు తత్వవేత్త అన్నాడు. ఈ రెండు విషయాలూ సత్యమే. ఈ రెండు ప్రవృత్తులకూ మూల కారణం ఒకటుంది అది మనిషిలోని స్వార్థపరత్వం.

మనిషిలో సహజంగా వున్న ఈ స్వార్థ పరత్వాన్ని అణిచి వేయాలంటే, మనిషి మనసును మార్చే మంచి మార్గదర్శనం కావాలి. ఈ సన్మార్గ దర్శనం మంచి మనసులో, పాజిటివ్‌మైండ్‌తో రామాయణ పఠనం ద్వారా లభ్యమవు తుంది.

ఎంతమంది ఎన్నిరకాలుగా క్రిటిసైజ్‌చేసినా, నేటి మన భారతీయ సమాజం– రామాయణ ప్రామాణికంగానే సాగుతున్నది. మనం చెప్పేనీతి సూత్రాలన్నీ రామాయణంలోనివే.

తండ్రి మాట జవదాటకూడదు, ఇంటికి పెద్దవాడికి బాధ్యతలు ఎక్కువ. తమ్ముళ్లు అన్నను గౌరవించాలి. వదినగారు తల్లి లాంటిది. భార్య భర్తను అను సరించాలి స్నేహం చేస్తే ప్రాణప్రదంగా చూసుకోవాలి, ఆడినమాట తప్ప కూడదు, కుండెడు పాలల్లో ఒక్క విషపు చుక్కపడినా పాలన్నీ విషమయినట్టు, వంద మంచి గుణాలున్నా, పరస్త్రీ వ్యామోహం అనే ఒక్కటి చాలు, దుర్మార్గుడిగా జమ కట్టడానికి. ఇవన్నీ ఈనాటికీ మన సమాజంలో చెలామణీలో వున్న నీతి సూత్రాలే.

నేటి సమాజంలో వున్న మానవతావాదం, జాతీయవాదం, స్త్రీవాదం వగైరా వాదాలు.. సామాజిక స్పృహ, విశ్వజనీనం, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం...ఒకటేమిటి అన్నీ రామాయణంలో ఉన్నాయి.

ఎక్కడికో వెళ్లి డబ్బు ఖర్చుపెట్టుకుని పర్సనాలటీ డెవలప్‌మెంట్ క్లాసుల కెళ్లక్కరలేదు. రామాయణం ఒక్కసారి చదివితే చాలు.

నవరసాలు రమ్యంగా చిత్రీకరించబడి వ్యక్తిత్వ, సామాజిక, విశ్వజనీన మైన రామాయణం నాకిష్టమైన పుస్తకం. ఒక్కొక్క కవి రుచి ఒక్కోరకంగా రసరమ్యంగా వుంటుంది. ఆస్వాదించిన కొద్దీ రుచి అధికమవుతుంది.

**66. భావ కవిత్వం పై మీ భావన ఏమిటి?**

**జ.** వ్యవహారిక భాషలో, లలితమైన పదాలతో ప్రకృతితో మమేకమై, పండిత పామరులను ఆహ్లాదపరిచేదే భావకవిత్వం. రాబర్ట్ ఫ్రాస్ట్, విలియం వర్డ్స్ వర్త్ వంటి కవుల కలాల నుండి ఉద్భవించిన "రొమాంటిక్ పొయిట్రీ" తెలుగు సాహిత్యంలో భావ కవిత్వమయింది. తెలుగులో భావ కవి అనగానే గుర్తుకొచ్చే కవి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు. కవిత్వ భాషలో సౌందర్యాన్ని, సున్నిత భావోద్వేగాలను, ప్రకృతికీ, చెట్లకీ, పూలకీ, ఆకులకీ, నీలిమేఘాలకీ అన్వయిస్తూ, పాఠకుల మనసుల్లో మల్లెలమాల లూగించారు కృష్ణశాస్త్రిగారు. భావాంభర వీధిలో ఓలలాడించారు.

**67. అభ్యుదయ, విప్లవ కవిత్వాలపట్ల మీ అభిప్రాయం?**

**జ.** అభ్యుదయ,విప్లవకవిత్వాలు రెండూ కూడా ప్రజాశ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని రాశావే!. కడుపుమండిన కవి, తన ఆగ్రహావేశాలను అభ్యుదయ భావజాలం ఉపయోగిస్తూ రాసినా, దానితో తపన చల్లారక, వ్యవస్థ మీద విరుచుకు పడుతూ రాసినదే విప్లవ కవిత్వం. ఈ రెండూ కూడా కమ్యూనిష్టు భావ జాలన్నుంచి ఉద్భవించినవే. ఆకలి, పేదరికం, దోపిడీ, ఒకవర్గంపై మరోవర్గ ఆధిపత్య ధోరణి విప్లవ కవిత్వానికి బీజాలు వేసింది.

**68. ప్రస్తుతం దేశంలో కవులు, రచయితపై భౌతికదాడులు జరుగుతున్న నేపథ్యంలో అనేకమంది సాహిత్య అకాడమీ అవార్డులను తిరిగి ఇచ్చివేస్తున్న సందర్భమొకటి నెలకొని ఉంది. దీనిని మీరు ఎలా చూస్తారు?**

**జ:** దేశంలో కవులు, రచయితలపై దాడులు జరగడం, చివరకు హత్యలు కూడా జరిగిన సంఘటనలను ఖండించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. నిరసన తెలియ

జేయడంలోనూ ఎటువంటి తప్పులేదు. అయితే నిరసన తెలియ జేసే క్రమంలో వారి సాహిత్యానికి గుర్తింపుగా వచ్చిన అవార్డులను తిరిగి ఇవ్వడమనేది అర్థంలేని చర్యగా నేను భావిస్తాను. ఈ జరిగిన, జరుగుతున్న సంఘటనలకు సాహిత్య అకాడమీకి ఎట్టి బాధ్యతా లేదు. కవుల స్వేచ్ఛకు సాహిత్య అకాడమీ ఎప్పుడూ అడ్డుకట్టవేయలేదు. మరీ ముఖ్యంగా గమనించవలసిన విషయమేమిటంటే సాహిత్య అకాడమీని నడిపించేది కవులు, రచయితలే. దీన్ని మరిచిపోకూడని విషయం.

**69. మనం చెప్పదలచుకున్నది ఆసాంతం ఏ ప్రక్రియలో అయితే చెప్పగల మంటారు?**

**జ.** " కవిత రసాత్మక కావ్యం". మర్రి విత్తనమంత కవిత్వంలో మహావృక్షమంత భావాన్ని చెప్పవచ్చు. ఈ ప్రక్రియ చాలా శక్తివంతమైంది. ఆధునిక కవితాశైలి సామాన్య ప్రజల సంభాషణా స్థాయిలో వుండి, ఎక్కువ మంది పాఠకులను ఆకర్షించేశక్తి, ఆలోచింపచేసే శక్తి కలది. పద్య గద్య, గేయ, మాత్ర ఛందస్సులలో, సాంప్రదాయక లేదా ఆధునిక కవితా రీతులైన వచన లఘు రూపాలతో అలరారే తెలుగు కవిత తీపిదనం, కవి తన భావ శబలతను బట్టీ, అనంత భావాన్ని అల్పాక్షరాలలో చెప్పదలచుకున్నది ఆసాంతం చెప్పగలడు. నాలుగు పాదాల చిరుకవితలో, కవి సమర్ధ వంతంగా ఆకాశమంత భావాన్ని ఇముడుస్తూ రసానందం కలిగించగలడు.

**బండరాయిని సైతం కరిగించగల శక్తి కవిత్వానిది.**

**చెట్లనిండా పూలు**
**కొన్నిమాత్రమే**
**దేవునిపాదాలచెంత**
**అర్హత దైవేచ్ఛ.**

నాలుగు పాదాలే అయినా అనంతమైన ఆధ్యాత్మిక భావన ఇమిడివుంది ఇందులో చెట్లు ఎన్నో పూలు పూస్తాయి. కొన్ని చెట్టునే ఎండిపోతాయి, కొన్ని కిందరాలి పోతాయి, కొన్ని జడలోకి వెడతాయి. చివరకు దేవుడి పాదాల చెంత చేరేవి కొన్ని మాత్రమే! ఇది మనిషి జీవితానికి వర్తిస్తే, ఎంతో ఆధ్యాత్మికత నిబిడీకృతమైవుంది. ఇలా లఘు కవితా రూపంలో ఎంతటి భావాన్నైనా ఇమడ్చవచ్చు.

జనంలో చైతన్యం రావాలన్నా, ఒక సంఘటన పట్ల స్పందన, కానీ ఉద్యమ స్ఫూర్తి కానీ, కవిత్వం నుండే మొదట ఉద్భవిస్తుంది. ఇందులో వాదాలు, సిద్ధాంతాలు ఆదర్శాలు అన్నీ ఇమిడిపోతాయి.

భాషకూ, అందమైన పదబంధం, అత్యున్నత భావం కలిసి కవితా రూపం సంతరించుకుంటుంది.

**"అనుభావాగ్ని లోంచి పుట్టిన అగ్ని సంకేతం,**
**సాహితీ కంఠాభరణం, ఎన్నటికీ వన్నె తరగని**
**కవితాభరణం" అన్నారు శ్రీశ్రీ.**

కథ, నవల, నాటకం ఏ ప్రక్రియ అయినా కవిత్వం చెప్పగలిగే స్పష్టత, సంపూర్ణత భావపరంగా అందించలేవు. భావాన్ని గాఢంగా చెప్పగల శక్తి, నైపుణ్యం కవితలోనే సాధ్యమవుతుంది.

**70. సాహిత్యంలో నేడు సామాజిక న్యాయం ఎంతవరకు ప్రతిఫలిస్తుం దంటారు?**

**జ.** అక్షరానికి ఉన్నబలం మరిదేనికీ లేదు. సాహిత్యకారులు సామాజిక బాధ్యతను, తమ కలంలో నింపుకుని స్వేచ్ఛా, సామాజిక న్యాయం ప్రతిఫలించే విధంగా రచనలు సాగిస్తున్నారు. నేటి సాహిత్యం ఆర్థిక, సామాజిక, వర్గ, లింగవివక్షతలపై ఖడ్గంగా కలాన్ని సంధిస్తోంది. సామాజిక చైతన్యం ప్రతిఫలించే సాహిత్యం నాలుగు కాలాలపాటు నిలబడగలుగుతుంది.

**71. చాలామంది కవులు దు:ఖాలనీ, వేదనలనీ తను కవిత్వంలో కుప్పలు తెప్పలుగా నింపేస్తుంటారు. అది ఎంతవరకూ సమంజసం? జీవితంలో అనేకానేక సందర్భాలు ఉంటాయి కదా?**

**జ:** నిజమే! జీవితంలో ఎన్నో కోణాలున్నాయి. ఒక్కొక్కళ్లది ఒక్కొక్క దృక్పథం. జీవితాన్ని కొందరు ఆశావాదంగా చూస్తారు. కొందరు నిరాశా వాదంతో చూస్తారు. ఒక సీసాలో సగానికి నీళ్లు ఉంటే, ఆశావాది నాకు తాగడానికి సీసాలో సగం నీళ్లున్నాయి అని తృప్తిపడ్తే, నిరాశావాది నాజీవితంలాగే సీసా కూడా సగం ఖాళీగా ఉందని అనుకుంటాడుట. అలాగే "లోకోభిన్నరుచిః"

ప్రతి మనిషికీ సుఖంలో ఉన్నప్పుడు ఎవరూ గుర్తుకు రారు. దుఃఖంలో ఉన్నప్పుడు పంచుకునేందుకు ఎవరైనా దొరుకుతారేమోనని చూస్తాడు. కవి కూడా అంతే. తన జీవితంలోని చేదు అనుభవాలనీ, విషాద సంఘటనలనీ పంచుకునేందుకు కవిత్వాన్ని ఆసరా చేసుకుంటాడు. గుండెలోని బాధల్ని దింపుకునేందుకు మంచి కవిత్వం వస్తుంది. మన పెద్దవాళ్లు చెబుతారు సంతోషం వస్తే నలుగురితో పంచుకోమనీ, దు:ఖం వస్తే ఒంటరిగా దుఃఖించమనీ. కానీ నిజానికి దు:ఖాన్ని లోపలే దాచుకుంటే దావానలంలా అది హృదయాన్ని దహించి వేస్తుంది. ఆ దావానలం కవిత్వరూపంలో వెలువడి మనస్సుకి కొంత ఉపశమనం కలుగుతుంది.

ఒక కవిత చదివినప్పుడు మనసుకి ఉల్లాసం, ఒక స్పందన, ఒక చైతన్యం లాంటిది కలిగితే చాలా హాయిగా అనిపిస్తుంది. ఆరోజంతా ఆ భావం మనల్ని ఉత్సాహంగా ఉంచుతుంది. అదే వేదనాభరిత కవిత్వం చదివినప్పుడూ ఆలోచన చేస్తాం కానీ అది మనసును కుదిపేసి, అశాంతిగా, చికాకుగా ఉంటుంది.

కవి అన్నవాడు జీవితంలోని అన్ని పార్శ్వాలు రాయాలి. వేమన సమాజంలోని విభిన్న జీవిత సంఘటనల ఆధారంగా రాశాడు. గుర్రం జాషువా తన జీవితంలోని చేదు సంఘటనల ఆధారంగా కవిత్వం రాశాడు. వారి వారి జీవితంలో అనుభవించిన, గమనించిన అంశాలే సాధారణంగా కవిత్వంలో ప్రతిబింబిస్తాయి. స్త్రీలు రాసే కవిత్వంలో చాలా మటుకు కుటుంబపరమైన సమస్యలు, వరకట్న బాధలు అస్తిత్వ పోరాటాలు, స్త్రీలపై అత్యాచారాలు ఇలాంటివి ఎక్కువగా ఉంటాయి. యదార్థ విషయాలనూ, సమకాలీన సమస్యలను ఎత్తిచూపుతూ, పరిష్కారమేమిటంటే ప్రశ్నించే కవిత్వం స్త్రీల కవిత్వంలో ఉంటాయి.

ఇక్కడ ఒక చిన్న సంఘటన స్ఫురణకు వచ్చింది. నేను సచివాలయంలో పనిచేస్తున్నప్పుడు, “చేతన సాహితీ సంస్థకు” అధ్యక్షురాలిగా ఉండి, నెలకొక సాహితీ కార్యక్రమము చేసేవాళ్లం.  ఆ కార్యక్రమానికి ముందు, సచివాలయ కవుల చేత కవిసమ్మేళనము నిర్వహించేవాళ్లం. ఒకసారి ఈ సభకు, డా॥యం. కాంతారావు ఐపిఎస్,గారిని ముఖ్య అతిధిగా పిలిచాం. కార్యక్రమంలో ఏమేమి ఉంటాయని వారడిగితే, ముందుగా కవిసమ్మేళనం ఉంటుందని చెప్పాను. అప్పుడు కాంతారావుగారు “అమ్మా మీ

స్త్రీలు రాసే కవిత్వంలో ఏడుపులు, పెడబొబ్బలు ఉంటాయి. మగవాళ్లని దుయ్యబడుతూ ఉంటారు. ఆఫీసు ఫైళ్లల్లోనూ అవేఉంటాయి. కొంచెం రిలాక్స్ అవుదామని ఇలాంటి సభలకు వస్తే ఇక్కడా అవే సమస్యలు. మీ బాధలు నేనర్థం చేసుకోగలను. కానీ సాహితీసభలకు వచ్చినప్పుడు, ఆహ్లాదకరమైన కవిత్వం వింటే హాయిగా ఉంటుంది. మీ కవిత్వంలో వర్తమాన సంఘటనలు ఉన్నా వాటిలో కొన్ని మంచి విషయాలు కూడా ఉంటాయి కదా? వాటిని గురించి రాయండి. పొద్దున్నే లేచి ఆరుబయట కూచుంటే కోయిల కూస్తూ ఉంటుంది. సూర్యుడు తూరుపు దిక్కు నుంచి పైకి లేస్తుంటాడు. పక్షులు కిచకిచలాడుతూ ఆహారవేటకు బయలుదేరతాయి. పని వాళ్లు ఇంటి ముందు కళ్లాపి చల్లిముగ్గులేస్తుంటారు. ఇటువంటి దృశ్యాలు చూస్తూ కవిత్వం రాయండి. మంచి ఆహ్లాదకర కవిత్వం వస్తుంది అంటూ తన మనసులోని కవితాత్మక భావాలను బయటపెట్టారు. ఆరోజుకి ఆ కార్యక్రమం ముగిసింది. అప్పటివరకూ నేను కూడా చాలా స్త్రీవాద కవితలు రాశాను. మరుసటిరోజు నేను ఉదయం నిద్రలేవగానే కాంతారావుగారి మాటలు గుర్తుకొచ్చి, వెంటనే పనిలోకి దూరకుండా కాఫీ కప్పు తీసుకుని ఆరుబయట గట్టుమీద కూర్చుని, కాఫీ ఒక్కొక్క చుక్కా ఆస్వాదిస్తూ చుట్టుపక్కల దృశ్యాలు వీక్షించాను. కాఫీ కప్పు పక్కన పెడదామని చూసేసరికి నేను కూర్చున్న గట్టుకున్న చిన్న పగులులోంచి, చిన్న మొక్క ఒకటి తొంగిచూస్తోంది. నారు పోసినవాడు నీరు పొయ్యడా అన్నట్టు ఒక్క చుక్క నీరుకూడా లేని ఆ గట్టులోంచి మొలిచిన ఆ చిరుమొక్కను చూస్తే ఆశ్చర్యమనిపించింది. నిజంగానే తెలతెలవారుతున్న ఆ దృశ్యం చాలా మనోహరంగా అనిపించింది. ప్రతిరోజూ ఆ మొక్కని చూసి అది ఎదుగుతున్న విధానం చూసి నవ్వుకునేదాన్ని. నా కాఫీ తాగడం అవగానే లోపలికెళ్లి దానికి కాసిని నీళ్లు పోద్దామని అనుకునేదాన్ని. కానీ లోపలకెళ్లగానే సంసార భవబంధాల్లో ఆ విషయం మర్చిపోయేదాన్ని. ఒకరోజు యధాలాపంగా, ఆ చెట్టువంక చూసేసరికి దానికి గులాబీరంగులో చిన్నపూవు పూసింది. పిసరంత ఆ మొక్కకి పూసిన ఆ గులాబిరంగు పువ్వును చూడగానే ఆశ్చర్యం ఆనందం రెండూ కలిగాయి. పెరట్లో ఉన్న గులాబీ మొక్కలకు టీపొడి వేసి, ఉల్లిపొట్టు వేసి, ఎరువు వేసి నీళ్లు పోస్తుంటే ఒక పువ్వు పూయగానే మురిసిపోతుంటాను. అలాంటిది ఒక్క చుక్క నీరు కూడా పోయని ఆ కలుపు మొక్కకి ఎంత అందమైన పూవు పూసిందీ?

ఆ స్పందనతో, స్ఫూర్తితో "కలుపుగులాబి" అనే కవితను రాసి కాంతారావుగారికి చూపించాను. చాలా బావుంది. "చూడు ఇది చదువుతుంటే ఎంత ఆనందంగా ఉందో!" అన్నారు. ఈ ప్రశ్నకి జవాబుగా ఈ సంఘటన సమంజసంగా ఉందనుకుంటున్నాను.

**72. నేటి సమాజానికి ఎలాంటి కవిత్వం అవసరమంటారు?**

**జ:** సాహిత్య లక్షణం, సమాజానికి హితం కలిగించడం, "హితస్య సాహిత్యం" అన్న నిర్వచనం ప్రకారం, సాహిత్యం సమాజానికి మేలు కలిగించేది. సాహిత్యం నిత్య చైతన్య స్రవంతి. ప్రాచీన సాహిత్యం నుండి నేటి ఆధునిక కవిత్వం వరకూ సమాజోద్ధారణకు, సమాజహితానికీ కవిత్వం కృషి చేస్తూనే ఉంది. నన్నయ, పాల్కురికి సోమనాధుల సాహిత్యం నుండి నేటి రెక్కలు, నానీలు, హైకూలు ఇలా ప్రతీ సాహిత్య రీతులు ఆలోచింపచేసే విధంగా ఉన్నాయి.

అయితే నేటి సమాజానికి ప్రజల వాడుక భాషలో, పదునైన కవిత్వం అవసరం. సామాజిక సమస్యలపై దిశానిర్దేశం చేసే విధంగా ఉండాలి. మనిషికి ఓదార్పులా ఉండాల. జీవితంలోని అన్ని పార్శ్వాలనీ స్పృశిస్తూ నిరాశ నిస్పృహలో ఉన్నప్పుడు ఉపశమనంగా, ఉత్తేజపరిచే విధంగా హక్కులకోసం పోరాడే ఉద్యమ స్ఫూర్తి కలిగిన కవిత్వం నేటి సమాజానికి అవసరం.

**73. నేటి సాహిత్యంలో వచన కవితకు ఇస్తున్న ప్రాధాన్యం పద్య కవిత్వానికి కవులు ఇస్తున్నట్లు లేదు! కారణం ఏమిటంటారు?**

**జ:** మొదట పద్యకవిత్వమే రాజ్యమేలింది! అయితే అది సామాన్యునికి చేరువకాలేకపోవడం వల్ల కావచ్చు, దాని ప్రాధాన్యం తగ్గుతూ వచ్చింది. అయినా కొన్ని విషయాలు పద్యకవిత్వంలో చెపితేనే బాగుంటుంది. తక్కువగానైనా నేటికి పద్యాన్నే రాస్తున్నవారూ ఉన్నారు. కానీ భావాన్నంతా, చెప్పదలుచుకున్నదంతా చెప్పడానికి వచన కవితకే ఎక్కువ సౌలభ్యముంది. అందుకే మొదట పద్యం రాసినవారు కూడా వచన కవితా మార్గం పట్టారు.

**74. కవిత్వం రాయడానికి నిర్దుష్టమైన, నిబంధనలు ఏమైనా ఉన్నాయా?**

**జ:** కవిత్వం రాయడానికి నిర్దుష్టమైన నిబంధనలు ఉంటాయనుకోను. కవిత్వం మొదటి లక్షణం జనరంజనం. కవి స్వేచ్ఛాజీవి. నిజజీవితంలో చేయలేని పనులు, అనలేని మాటలు, కవి తన కవిత్వంలో రాయగలడు. రాజకీయ నాయకులు చేసే అకృత్యాలనూ అవినీతి పనులను, ప్రత్యక్షంగా ఖండించలేకపోయినా కవిత్వంలో దుయ్యబట్టగలడు కవి. ఆ రకంగా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురాగలడు. కవులు ఏ అంశంపైనైనా రాయచ్చు. కవిత్వం రాసే క్రమంలో కవితావస్తువు, భావ ప్రకటన ముఖ్యం. కవి సామాజికుడు కనుక, సజీవంగా సమాజంలోని వ్యక్తుల చుట్టూ సంచరిస్తూ ఉంటాడు కనుక తనచుట్టూ ఉన్నవాళ్లను ప్రభావితం చేస్తున్న అంశాల మీద రాయకుండా ఉండలేదు. ఎంచుకున్న కవితా వస్తువును జనంలోకి తీసుకెళ్లే క్రమంలో ఇది ప్రజలకు ఎంతవరకూ ప్రయోజనకరమో, లేదా తట్టి లేపే విధంగా ఉన్నదా, లేదా అన్నది బేరీజు వేసుకుంటూ శిల్పానికి కూడా ప్రాధాన్యత ఇస్తూ రాస్తే అది మంచి కవిత్వంగా మన్ననలందుకుంటుంది. కవిత్వం అంతిమ లక్ష్యం జనహృదయాలను ఆకట్టుకోవడమే! 'రవిగాంచనిచో కవిగాంచును' అన్నారు. కవిత్వంలో వాస్తవికతతో పాటు కాల్పనికత కూడా కలిస్తే చదివించే గుణం కలిగి జనరంజకంగా ఉంటుంది.

### 75. నేడు వస్తున్న కవిత్వం ఎలా ఉంటున్నది?

**జ:** నేడు వస్తున్న సాహిత్యంలో స్పష్టత, సూటిదనం ఉంటోంది. సామాజిక ఆవేదన, భావ సంఘర్షణ భిన్న కవితా వస్తుసేకరణ, భిన్న కవిత్వ రీతులతో పాఠకులను అలరిస్తోంది. అయితే ఈవిధానంలో కవిత్వం వాక్యాలను విడదీసినట్టుగా వుంటోంది. వస్తువుకు మాత్రమే ప్రాధాన్యత ఉంటోంది. శిల్పం తక్కువగా ఉంటున్నది.కవిత్వానికి వస్తువుతో బాటు శిల్పం కూడా కలిస్తేనే చిక్కని చక్కని రసార్ద్రవంతమైన కవిత్వం వెలువడగలదు. అలా అని ఉత్తమ రచనలు రావడం లేదని కాదు. ఉత్తమ రచన, వ్యక్తిగత రచనాశక్తిని బట్టి ఉంటుంది.

### 76. కథా సాహిత్యం, నవలా సాహిత్యంపై మీకెలాంటి అభిప్రాయాలున్నాయి. అలాగే సాహిత్యంలో వాటి స్థానం ఏమిటి?

**జ.** ఆధునిక సాహిత్యంలో వచన సాహిత్య ప్రక్రియలు అనేకానేకాలుగా విస్తరిం చాయి.

అందులో కథ, నవల లాంటి ప్రక్రియలు సముచిత స్థానాన్ని కలిగి, సమాజాన్నీ, మానవ జీవితాన్నీ, అనుభవాలనూ అనేక కోణాలనుంచి స్పృశిస్తూ పాఠకులను ప్రోది చేసుకుంటూనే ఉన్నాయి. తమస్థానాన్ని పదిల పరచుకుంటు న్నాయి.

జీవితంలో ఒక కోణాన్ని లోతుగా విశ్లేషిస్తుంది కథ. జీవితంలోని విభిన్న కోణాలు, విభిన్న మనస్తత్వాలు విభిన్న విధానాలు అక్షరీకరిస్తుంది నవల.

కథాసాహిత్యం కన్నా నవలా సాహిత్యానికి కొంత ఆదరణ తగ్గింది. ఒకప్పుడు వార పత్రికల్లో వచ్చే కథలకోసం, సీరియల్‌గా వచ్చే నవలల కోసం ఎదురుచూసేవాళ్లం. వచ్చేవారం ఏమవుతుందో అన్న ఉత్కంఠత ఉండేది. కానీ ఇప్పుడు కథలు, నవలలు చదివే పాఠకులు టి.వి. కార్యక్రమాలు చూడటంలో నిమగ్నమయ్యారు. అంతేకాకుండా, వార మాసపత్రికలన్నీ అంతర్జాలంలో పెడుతున్నారు. ఆ రకంగా కొంతమంది పాఠకులను పదిలపరుచుకుంటున్నారు పత్రిక యాజమాన్యాలు. కథలో కానీ, నవలలో కానీ, సమాజంలోని వ్యక్తులనూ, రకరకాల మనస్తత్వాలనూ, జీవన విధానాలనూ, చెప్పాలనుకున్నది అక్షర దృశ్యాలుగా చూపించే అవకాశం వుంది.

రాజకీయాల మీద, సినిమాల మీద ఉన్నంత మక్కువ సాహిత్యం మీద లేకపోవడం వలన, కథా, నవలా సాహిత్యాల పట్ల కొంత ఆదరణ తగ్గింది.

**77. మీరు ఎలాంటి కథలను, నవలలను ఇష్టపడతారు? ఎందుకు?**

**జ.** నేను ఎక్కువగా విజ్ఞానం, వినోదం కలగలిసిన సాహిత్యాన్ని అస్వాదిస్తాను. మనోవిజ్ఞాన భావన, వ్యక్తిత్వ ఉదాత్తీకరణ, ఆత్మన్యూనతా భావాన్ని అధిగమించడం, మానియాలు, ఫోబియాలు పాత్రలలో ప్రవేశపెట్టి, వాటిని అధిగమించిన తీరుతెన్నుల ద్వారా, పాఠకులకు ఒక సందేశమిచ్చే కథలను, నవలలను ఇష్టపడతాను. అలాంటివి చదవడం వలన, ఆ రకమైన ఆలోచనలు, ఎలా దూరం చేసుకోవచ్చు. దానికి సైంటిఫిక్ రీజనింగ్ తెలుసుకోవడం వలన మానసిక ప్రశాంతత కలుగుతుంది. లేదా వేరొకరికి చెప్ప గలుగుతాము. "నవీన్" గారి "అంపశయ్య" నవలలో యువత భావోద్రేకాలను చదవడం వలన, మన పిల్లల్లో వస్తున్న మార్పులను అర్థం చేసుకుని మన ఆలోచన దృక్పథంలో మార్పు తెచ్చుకునే అవకాశం వుంటుంది. అలాగే యండమూరి వీరేంద్రనాథ్‌గారి నవలలన్నీ

విజ్ఞానం వినోదంతో బాటు, వ్యక్తిత్వ వికాసం, మనో విశ్లేషణ, ఫోబియాలు వాటినుంచి బయటపడే మార్గాలు, సైన్స్ అన్నీ వుంటాయి. తులసి, తులసిదళం చదివి ఆయన సాహిత్యం గురించి అపోహలు చాలా వచ్చాయి. కానీ "వెన్నెల్లో ఆడపిల్ల", "డబ్బు టు ద పవర్ ఆఫ్ డబ్బు", "విజయానికి అయిదు మెట్లు", "చెంగల్వ పూదండ" మొదలైన నవలలు విజ్ఞానం వినోదం దిశగా ఉంటాయి. యద్దనపూడి సులోచానారాణిగారి నవలల్లో, ఊహలు, అనుబంధాలు, మనోవికాసం వుండి, చదువుతున్నంత సేపూ మనోల్లాసం కలుగుతుంది. ఒక్కక్కరిశైలి ఒక్కొక్కరకంగా వుండి మనసును రంజింప చేస్తుంది.

**78. మంచి కథకు, మంచి నవలకు ఉండాల్సిన లక్షణాలేమిటి?**

**జ:** తీరైన నడక, ఆలోచింపజేసే ముగింపు కథకు కానీ, నవలకు గానీ ఉండవలసిన లక్షణాలు. ఏమి చెప్పాలనే దానితో బాటు ఎలా చెబుతున్నామన్నది కూడా ముఖ్యం. ఎలా చెప్పారన్నదే శైలి. అది సరిగ్గా వుంటేనే కథ రక్తికడుతుంది. కథకానీ, నవలకానీ వాస్తవికతకి కొంత కాల్పనికత జోడించి, చదివించే గుణం కలిగి ఉండాలి. కేవలం ఉత్సుకతే కాకుండా జీవిత చిత్రణ ఉండాలి. మనచుట్టూ ఉన్న సమాజానికి చెంది మనం మాట్లా డుకునే భాషలో, ప్రత్యేకమైన శైలిని కలిగి ఉండాలి. ఈ మూడు రకాలు కూడా రచన ప్రక్రియలలో అది కవితకానీ, కథగానీ, నవలగానీ ఉంటేనే దానికి పరిపూర్ణత చేకూరినట్లు.

పాఠకుడు రచయిత కన్నా ఏమాత్రం తెలివితక్కువ వాడు కాదని గుర్తుంచుకోవాలి. కొత్త విషయాలను ఏమన్నా చెబుతాడేమోనని రచనలో వెదుకుతాడని, తెలిసిన విషయాలైనా, ముగింపు ఏమన్నా కొత్తగా ఉంటుందా అని చూస్తారని తెలుసుకోవాలి.

**79. జానపద సాహిత్యం గురించి మీ ఆలోచన ఏమిటి?**

**జ:** జానపద సాహిత్యం మౌఖిక సాహిత్యం. కష్టజీవులు శ్రమతోచకుండా పాడుకునేందుకు వీలుగా కట్టుకున్న పాటలు, చెప్పుకున్న కథలు తెలుగు సాహిత్యానికి మూలాలుగా నిలిచాయి. జనసామాన్యానికి చేరువుగా ఉంటుంది. పల్లెల్లో ప్రతి సందర్భానికీ సంబంధించిన పాటలు ఉంటాయి. జానపదులు విద్యాగంధంలేని వారైనా వారి పాటల్లో జీవితానుభవం హెచ్చుగా కనపడుతుంది.

**80. 1965 ప్రాంతంలో ఉద్యమంలా వచ్చిన దిగంబర కవిత్వంపై మీ అభిప్రాయం?**

**జ:** స్వాతంత్ర్యానంతరం తెలుగు సాహిత్యంలో అనేక మార్పులు ఉద్యమాలు వచ్చాయి. నూతన వ్యవస్థ ఏర్పడాలనే తలంపే ఉద్యమ సాహిత్యానికి ఊపిరి. 1965లో ప్రారంభమైన దిగంబర కవిత్వం ఆ కోవకు చెందినదే. నిరంకుశం, నిర్లక్ష్యం, చీకటి విలువలు, అరాచకంపై అసమ్మతి ప్రకటిస్తూ, సమాజంలోని స్తబ్దతను తీసివేయడమే లక్ష్యంగా దిగంబర కవిత్వం ఆవిర్భవించింది.

నిఖిలేశ్వర్ (యాధవరెడ్డి) నగ్నముని (ఎం.హెచ్. కేశవరావు) చెరబండ రాజు (బద్దం భాస్కరరెడ్డి) జ్వాలాముఖి (వీర రాఘవాచార్యులు) మహాస్వప్న (కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు) భైరవయ్య (మన్‌మోహన్ సహాయ్)లు దిగంబర కవులుగా 1965లో దిగంబర కవితోద్యమం ప్రకటించారు. 1965, 1966, 1968 సంవత్సరాలలో వరుసగా మూడు కవితా సంపుటాలు వెలువరించారు. మానవత్వపు విలువలు పెరగాలంటూ, మానవుడే సమాజ నిర్మాణానికి మూల పురుషుడని, మార్పు అతడితోనే రావాలని దిగంబర కవుల రచనలు సాగాయి.

అయితే వీరి కవిత్వంలో అశ్లీల పదజాలాన్ని ఉపయోగించారు. దిగంబర కవుల పరిభాషలో చెప్పాలంటే ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే చెరబడుతుంటే ప్రజలను అవినీతిపరులుగా మారుస్తుంటే జ్వలించే కోపాగ్నిలోంచి ఉద్భవించిన పదజాలమే కవిత్వంలో ప్రతిబింబించిందని వారి సమర్థన. ఫ్రాన్స్‌లో క్యూబిజం, డాడాయిజమ్, ఇటలీలో ఫ్యూచరిజమ్, జర్మనీలో ఎక్స్‌ప్రెషనిజమ్ లాగా భారతదేశంలో దిగంబర కవిత్వం, విలువలను విధ్వంసం చేసే ఉద్యమాలుగా కవితారంగంలో వేళ్లూనుకున్నాయి. ఏ ఇజపు ప్రభావం వారిపై లేదని దిగంబర కవులు చెప్పినా, విధ్వంసక దృష్టి వీరి కవిత్వంలో కనిపిస్తుంది. దిగంబర కవిత్వం 1965లో ఒక సునామీలా వచ్చి 1971 వరకు కొనసాగి, తరువాత తుఫాను తరువాత ప్రశాంతతలా చల్లబడిపోయింది.

గుండెలు రగిలిపోయాయంటూ గుండీలు తీసుకుని నగ్నంగా కవిత్వం చెప్పడం కన్నా. గాంధీగారి సిద్ధాంతమయిన ఒక చెంపకొడితే రెండో చెంప చూపించితే అవతలివాడు అవాక్కయినట్టు, చేదుమందునైనా తీయని గుళికలో ఇస్తే కూడా పనిచేస్తుంది. మనిషిలో

మార్పు రావాలన్న దిగంబర కవుల లక్ష్యం, సాంప్రదాయ అభ్యుదయ కవిత్వం ద్వారా కూడా సాధించవచ్చు.

**81. నేడు సాహితీ సంస్థల తీరు ఎలా ఉంటున్నది?**

**జ:** సాహిత్యాన్ని కాపు కాస్తున్నది సాహితీసంస్థలే. ఈ సంస్థలే లేకపోతే సాహితీకారులెవరూ వెలుగులోకి రాలేరు. ఎంతోమంది సాహితీకారులను, వారు రాసిన కృతులను, ఆవిష్కరణ సభల ద్వారా సాహితీ ప్రియులకు పరిచయ చేస్తున్నాయి. సాహితీ కార్యక్రమాలకైతే సభకు జనం పలచగా ఉంటారని, ముందుగా సాంస్కృతిక కార్యక్రమాలు పెట్టి జనసమీకరణ కోసం పాటుపడుతున్నారు.

మంచి సాహిత్యం రాసిన సాహితీకారులను గుర్తించి పురస్కారాలు ప్రదానం చేస్తున్నాయి. అయితే కొన్ని సాహితి సంస్థలు కవుల దగ్గర సన్మాన ఖర్చులు తీసుకుని సన్మాన సభలు నిర్వహిస్తున్నాయి. కొన్ని సంస్థలు కవితా పోటీలు నిర్వహించి, పురస్కారాలిస్తామని, కవితలు పంపమని కవితలు పంపడానికి ఎంట్రీ ఫీజు కలెక్ట్ చేసి బహుమతులుగా ఒక సర్టిఫికేట్ ఇచ్చి పంపుతున్నాయి.

ఇలాంటి సాహితీ సంస్థల్లో వ్యాపార దృక్పధం ఉంటోంది. ఏది ఏమైనా సాహితీకారుల సాహిత్యాన్ని ప్రపంచానికి తెలిసేట్టు చేసేది సాహితీ సంస్థలే. ఏ వ్యవస్థలో అయినా మంచీ చెడులున్నట్టే సాహితీ సంస్థలు నడుస్తున్న తీరులో కూడా కొంత సాహితీ సేవ కొంత వ్యాపార దృక్పధం రెండూ ఉన్నాయి.

**82. తెలుగు భాష మాట్లాడే రాష్ట్రం రెండు ప్రాంతాలుగా విడిపోవడంపై మీ స్పందన?**

**జ:** ఎవరైనా స్వాగతించాల్సిందే. కలిసి ఉండి, దగాపడ్డామన్న భావన తెలంగాణా ప్రజల నరనరాల్లో జీర్ణించుకుపోయింది. మా అపార్టుమెంటులో తెలంగాణవాళ్లూ, ఆంధ్రవాళ్లూ, తమిళలు, హిందీవాళ్లూ అందరూ ఉన్నారు. అందరం కలిసిమెలిసి ఉండేవాళ్లం. అన్ని రకాల పండుగలు కలిసిమెలిసి చేసుకొని ఆనందించేవాళ్లం. బోనాలు పండుగకు పెద్దమైసమ్మ గుడికి వెళ్లేవాళ్లం. సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు చేసుకుని పేరంటాలకు వెళ్లేవాళ్లం. తమిళ ఉగాదికీ పొంగల్ చేసి అందరికీ పంపేవాళ్లు. ఏ పండగ వచ్చినా, ప్రతి ఇంటికీ రకరకాల ప్రసాదాలు, పిండివంటలు వచ్చేవి. మా పిల్లలిద్దరూ అమెరికాలో

ఉండటం వలన ఇంట్లో నేనూ మా వారూ ఉంటాం. మా వారికి షుగర్ ఉండటం స్వీట్స్ ఏమీ తినేవారు కారు. నా ఒక్కదానికోసం చేయాలంటే ప్రత్యేకంగా చేసుకోవాలనిపించేది కాదు. అందుకని మా ఫ్లాట్లో వాళ్లు మీకొక్కరికీ ఏం చేసుకుంటారు? మేము పంపిస్తాము అంటూ ఒకరు పాయసం, ఒకరు బొబ్బట్లు, పులిహోర, వడ ఇలా తలా వొకటి తెచ్చి మా టేబుల్ మీద పెట్టి వెళ్లేవాళ్లు. నేను నా వంతుగా వారికి చిన్న చిన్న గిఫ్ట్లు పంపేదాన్ని. ఇలా ప్రాంతీయ భేదాలు లేకుండా కలిసిమెలిసి ఉండేవాళ్లం.

ప్రత్యేక తెలంగాణా కోసం ఉద్యమం చాలా ఉధృతంగా, ప్రజలు ఆత్మాహుతులు చేసుకుంటున్నప్పుడు ప్రజలలో అసహనం ద్వేషం ఎక్కువయింది. మా అపార్ట్మెంటు వాతావరణంలో కూడా అది కనబడింది. అంతకు ముందు దాకా ఎంతో కలివిడిగా ఉన్నవాళ్లం, ఒకరికొకరు ఎదురుపడితే, మొహమాటపు నవ్వులు నవ్వి పని ఉందంటూ తప్పించుకు తిరగడం మొదలయింది.

ఇది చాలా ఇబ్బందికర వాతావరణంగా ప్రతి ఒక్కరూ బాధపడ్డారు. కానీ ఎవరివాదం వారిది. అమెరికా, లండన్ ఇంకా ఇతర దేశాలలో ఉన్న తెలుగువారి మధ్య కూడా ఈ చిచ్చు రగిలింది. ఒక్క తాటి మీద నిలిచిన తెలుగు సంఘాలలో విభేదాలు వచ్చాయి. అమెరికాలో ఉన్న మా పిల్లలిద్దరూ ఫోన్ చేసి "అమ్మా! మనమెక్కడివాళ్లం? ఆంధ్రానా?తెలంగాణానా? హైదరాబాదు తెలంగాణదే కదా! అంటూ చాలా ఆందోళనతో మాట్లాడారు. త్యాగధనుల పోరాట ఫలితంగా ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణా ప్రజలు కన్న కలలు సాకారమయ్యాయి. కలిసి ఉండి నిత్యం ఒకరినొకరు దూషించుకోవడం కన్నా, అన్నదమ్ముల్లా విడిపోయి ఎవరి సంస్కృతీ, సాహిత్యాలను తమదైన ప్రత్యేకతను, ఉనికిని వారు పదిలపరచుకోవడం ఆహ్వానించదగ్గ విషయం. తరువాత మా అపార్టుమెంటులో కూడా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని, తెలుగువారందరం ఒక్కటే, ఎవరి ప్రాంత గొప్పదనాన్ని వారు కాపాడుకుంటూ ఇదివరకటిలా కలిసిమెలిసి ఉందామని నిర్ణయించుకున్నాం. రాష్ట్రాలు వేరయినాకానీ, తెలుగువారందరూ ఒకటే! తెలుగుదనం ఒకటే అనుకుని మళ్లీ అందరం హాయిగా ఉన్నాం.

**83. భాషాభివృద్ధి విషయంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరు ఎలా ఉంటున్నదంటారు?**

**జ:** భాషాభివృద్ధి దిశగా ప్రభుత్వం, అధికార భాషా సంఘాన్ని ఏర్పరచి భాషాభివృద్ధి చేస్తున్నామంటూ చేతులు దులిపేసుకుంటోంది. అధికార భాషా సంఘానికి చైర్మన్‌లుగా చాలా పెద్ద పెద్ద సాహితీవేత్తలు పనిచేశారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడక ముందు వరకు మండలి బుద్ధప్రసాద్ గారు క్యాబినెట్ మంత్రి హోదాలో అధికార భాషా సంఘానికి సేవచేశారు. వీరి కింద ఒక సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ, తనిఖీ అధికారులు తదితర ఉద్యోగులు ఉన్నారు. ముందుగా తెలుగుభాషలోనే పరిపాలన సాగించాలని దానికోసం, ప్రభుత్వంలోని ఒక్కొక్క శాఖకు సంబంధించిన పదకోశాలను తయారుచేశారు. చాలామటుకు ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో రావడానికి దానికి సంబంధించిన పదాలను ఇంగ్లీషు నుంచి తెలుగులోకి తర్జుమా చేశారు.

ఈ భాషా సంఘం తెలుగులో ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించడానికి తీసుకోవలసిన చర్యల గురించి, తెలుగుభాష అమలు గురించి మాత్రమే పనిచేసే పరిధిలో ఉంది. అయితే ఒక్కొక్క చైర్మన్ వచ్చినప్పుడు తెలుగుభాష అమలు, అభివృద్ధితో బాటు, ఇతర కార్యకలాపాలను కూడా నిర్వహిస్తూ వచ్చారు. మాతృభాషా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం, భాషా పురస్కారాలను ప్రకటించడం లాంటివి ఈకోవకు చెందినవి. ఈ పురస్కారాలిచ్చేటప్పుడు దాంట్లో మళ్లీ రాజకీయం, కులాల సంస్కృతీ ప్రబలిపోయింది.

తెలుగుభాషాభివృద్ధికోసం ప్రభుత్వం కంటి నీటి తుడుపు వ్యవహారంగా, మొక్కుబడిగా అధికారభాష సంఘానికి కొంత బడ్జెట్ కేటాయించి చేతులు దులుపుకుంటున్నది. జిల్లాల నుంచి వచ్చే ఉత్తరాలు తెలుగులోనే సచివాలయానికి వస్తాయి. దానికి సమాధానం రాసే నోటు ఫైలు ఇంగ్లీషులో పై అధికారికి పంపుతారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దాకా ఇంగ్లీషులోనే సంతకాలు అయి తిరిగి వచ్చేవి. కార్యదర్శి హోదాలో ఉన్న ఐఏఎస్ అధికారులందరికి తెలుగు వచ్చు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికొచ్చిన ఐఏఎస్ అధికారులకు కూడా తెలుగు వస్తుంది. ఐఏఎస్ ట్రైనింగ్‌లో ఉండగానే, వారిని ఏ రాష్ట్రానికి పోస్టింగ్ ఇస్తున్నారో, అక్కడి భాషలో తర్ఫీదు ఇస్తారు. కాబట్టి, ఇతర రాష్ట్రాల అధికారులకు కూడా తెలుగు వస్తుంది. తమాషా ఏమిటంటే తెలుగు అధికారులు ఇంగ్లీషులో సంతకం పెడితే, తెలుగేతర అధికారులు, పి.ఎల. చేత ఫైల్ చదివించుకుని,

తెలుగులో సంతకం పెట్టేవారు. వారికున్న చిత్తశుద్ధి తెలుగుభాషమీద మన అధికారులకు లేదు. సచివాలయంలో తెలుగుభాషను అమలుచేయడానికి అధికార భాషా సంఘం కనీసం హాజరు పుస్తకంలో, తెలుగులో సంతకం చేయమని ఉత్తర్వులు ఇవ్వవలసిన అగత్యం ఏర్పడింది. ఉత్తర్వులను అమలు చేయమంటూ ఉద్యోగులందరికీ సర్క్యులర్ పంపేవారు. కొన్ని రోజులు పెట్టేవాళ్లు. తర్వాత షరామామూలే.

ప్రభుత్వానికి కానీ, ప్రభుత్వాధికారులకు కానీ, తెలుగుభాష పట్ల మక్కువ గానీ, దీని అమలు పట్ల చిత్తశుద్ధి కానీ లేదు. అంతా మొక్కుబడి వ్యవహారమే! తెలుగు భాషకు ప్రాచీన హోదా కోసం పోరాడి తెచ్చుకున్నాం. అంతటితో అయిపోయింది. సాధించాల్సిందేదో సాధించేసామని, సంబరాలు చేసుకుని, చతికిలబడ్డారు.

నాకు ఒక సంఘటన ఇప్పటికీ గుర్తుంది. వెంగళరావుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రవీంద్రభారతిలో ఉగాది ఉత్సవాలు ప్రభుత్వం జరుపుతోంది. ఆ సభకు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ గారిని ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వెంగళరావుగారు మాట్లాడుతూ ఈ ఉగాది నుంచి తెలుగు భాషాభివృద్ధికి కృషిచేయాలని, ప్రభుత్వ కార్యకలాపాలన్నీ తెలుగులోనే జరపాలనీ, ప్రభుత్వం నిర్ణయం తీసుకుందనీ, మొట్టమొదటగా గ్రామస్థాయి నుంచీ తెలుగు అమలు చేస్తున్నామనీ చెప్పారు. చప్పట్లతో సభ మారుమోగింది. తెలుగుకు మహర్దశ మొదలయిందని వక్తలు మాట్లాడారు. విశ్వనాథ వారి స్పందన తెలియచేయమని అడిగినప్పుడు, విశ్వనాథగారు తన సన్మానానికి కృతజ్ఞతలు చెప్పి, వెంగళరావు గారిని సంబోధిస్తూ "నీకు ధైర్యం ఉంటే తెలుగు అమలుని గ్రామస్థాయి నుంచీ కాదు సచివాలయం నుంచి ప్రారంభించు. ఇక్కడ నుంచి వెళ్లిన ఉత్తర్వులకు గ్రామస్థాయి నుంచి తెలుగులోనే సమాధానాలు వస్తాయి. భాషను ఉద్ధరిస్తున్నామంటూ, పిరికితనంగా గ్రామం నుంచీ ఎందుకు, గ్రామస్థాయిలో రాతకోతలన్నీ ఎలాగూ తెలుగులోనే ఉంటాయి. సచివాలయం నుంచే తెలుగులో కార్యకలాపాలు నిర్వహించు" అంటూ చురకలంటించారు. ఆనాడు ఉన్న పరిస్థితి ఈ నాటికీ అలాగే ఉంది. ఎంతసేపూ జిల్లాలకు గ్రామాలకూ వెళ్లి తెలుగు అమలు గురించి, తనిఖీలు నిర్వహించడం తప్పితే, సచివాలయంలో సంపూర్ణంగా తెలుగు ఈనాటికీ అమలులో లేదు. మన భాషమీద మనవాళ్లకే అభిమానం లేదు. ఈనాటికీ సచివాలయానికి వెళ్లి తెలుగులో మాట్లాడితే

చిన్నచూపు. ఆంగ్లమున సంభాషించిన వినయం చూపు" అన్న చందాన ఉంది మన ప్రభుత్వ తీరు. భాషాభిమానమే లేనప్పుడు భాషాభివృద్ధి గురించి మాట్లాడేదేముంటుంది!

**84. ఆంధ్రాప్రాంతం నుండి వస్తున్న కవిత్వానికీ, తెలంగాణా ప్రాంత కవిత్వానికి ఏమైనా తేడా ఉందా?**

**జ:** డా॥సి.నారాయణరెడ్డిగారు ఒక పాటలో అన్నారు. "వచ్చిండన్నా, వచ్చాడన్నా వరాల తెలుగు ఒకటేనన్నా"అని. ఇప్పుడు తెలుగుజాతి రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తరువాత తెలుగుజాతి మనది,నిండుగ వెలుగు జాతి మనది చరణాలను 'తెలుగుజాతి మనది రెండుగ వెలుగు జాతి మనది' అని ఇటీవల ఒక సభలో చమత్కరించారు. ఆంధ్రుల సంస్కృతీ సాంప్రదాయాలకూ, తెలంగాణా సంస్కృతీ సాంప్రదాయాలకూ భాషలో, జీవనవిధానంలో చాలా తేడాలున్నాయి. అలాగే కవిత్వరీతుల్లో కూడా తేడాలున్నాయి. తెలంగాణా కవిత్వంలోని తెలుగు ఉర్దూ పదాలు సమ్మిళితాలు కనిపిస్తాయి. ఆంధ్రాప్రాంతపు సాహిత్యం కంటే తెలంగాణా సాహిత్యంలో ఉద్యమపోకడలు బాగా ఉంటాయి.

నిజానికి భారతదేశంలో హిందీ తర్వాత అత్యధికులు మాట్లాడే భాష తెలుగు భాష. తేనెలొలికే తెలుగు భాషను ప్రాంతీయ భేదాలతో దిగజార్చు కోకుండా తెలుగుభాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటగలగాలి. తెలుగు భాషకు ప్రాచీన హోదా దక్కడానికి ఎంతో ప్రయాసపడి ఉద్యమించి దక్కించుకున్నాం. ప్రాచీన భాషగా తమిళ, కన్నడ, భాషలకు గుర్తింపు లభించినప్పుడు వెంటనే దానికి కార్యాలయ భవనాన్నీ, భాషా సాహిత్యాల పని మొదలుపెట్టాలి. తెలుగుభాషకు ప్రాచీన హోదా ఇస్తూ, వందకోట్లను మంజూరుచేసి, కార్యాలయ భవనానికి స్థలం చూపించమంటే, ఇప్పటివరకూ చూపించలేకపోయారు. ఇది ప్రభుత్వానికి, భాష పట్ల ఉన్న నిర్లక్ష్యత తెలుపుతోంది.

అదేం చూశారు ఇది చూడమన్నట్టు ఇంతలో రాష్ట్రం రెండు ముక్కలుగా విడిపోయింది. ఇప్పుడు దీని గురించి పట్టించుకునే నాధులే కరువయ్యారు. పిల్లి మెళ్లో ఎవరు గంట కడతారన్న రీతిలో ఉన్నాయి రెండు ప్రభుత్వాలు.

పొరుగు రాష్ట్రాల వారు మనల్ని చిన్నచూపు చూడకుండా ఉండాలంటే, తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు, కేంద్రనిధులను సముచితంగా పంచుకొని రెండు రాష్ట్రాల్లో

భాషాభివృద్ధికి నడుం కట్టాలి. మనలో మనకి ఎన్ని విభేదాలున్నా పొరుగు భాషవాళ్లు మనల్ని చిన్నచూపు చూడకుండా చర్యలు తీసుకోవాలి. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు, భాషాభిమానులు, సాహిత్యకారులూ ఒక్కటై ప్రాచీన భాషగా గుర్తింపబడిన తెలుగు భాష గొప్పదనాన్ని వైభవాన్ని నినదిస్తూ రెండు ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలి. యాసలు వేరైనా తెలుగు భాష సొగసును, పరిమళాన్ని ప్రపంచ సాహిత్యంలో పదిలపరచుకోవాలి.

### 85. సాహిత్యం సమాజాన్ని ఏమైనా మారుస్తుందా?

**జ:** సాహిత్యం సమాజాన్ని మారుస్తుందనే చెప్పాలి. ఆనాటి గురజాడ సాహిత్యం సమాజంలో ఎంత మార్పు తీసుకువచ్చిందో అనుభవైక వైద్యమే! ఆరోజుల్లో సమాజోద్ధరణ బాధ్యత, తమ భుజస్కంధాల మీద వేసుకున్నవారు గురజాడ, కందుకూరి వీరేశలింగం పంతులు తమ సాహిత్యంలో బీజం వేశారు. "దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్న" అన్న గురజాడ దేశభక్తి కవిత్వం జనాన్ని మంత్రముగ్ధులని చేసింది. సాహిత్యం రాత్రికి రాత్రే సమాజాన్ని మార్చి వేస్తుందని చెప్పలేం. పరిణామ క్రమంలో మార్పు సంభవం.

స్వాతంత్ర్య సముపార్జనలో సాహిత్యం చాలా పెద్ద పాత్ర నిర్వహించింది. కవులు ఉద్వేగభరితమైన కవిత్వంతో పాటలతో ప్రజలను చైతన్యవంతులను చేసి స్వాతంత్ర్య సమరంలో ప్రతీ ఒక్కరూ పాలు పంచుకునే విధంగా చేసింది. స్త్రీ వాద కవిత్వం వలన స్త్రీలు ప్రభావితులై, నేడు అన్నిరంగాలలో ముందంజ వేస్తూ దేశాభివృద్ధిలో ఇతోధిక పాత్ర నిర్వహిస్తున్నారు. చలం సాహిత్యంలో కొంత విశృంఖలత ఉన్నా ఆయన రచనల్లోని స్త్రీవాదం స్త్రీల పీడననీ, ఆమె యంత్రం కాదనీ, ఆమెకు ఆలోచనా సామర్థ్యం ఉందనీ రచనలు చేయడం వలన, స్త్రీలను చైతన్యశీలురుగా ఆ దృక్పథం వైపు ఆలోచించే విధంగా చేసింది. ఆ పరంపర కొనసాగిస్తూ రంగనాయకమ్మ ఓల్గా లాంటి వారు రచనలు చేశారు. వంటింటికే పరిమితమైన ఆనాటి స్త్రీ, నేడు పురుషులతో సమానంగా, ఇంకా చెప్పాలంటే ఒక ఆకు ఎక్కువగానే నిరూపించుకుంటోంది. అవకాశాలు అందుకుంటోంది. ఒక ఆకు ఎక్కువ అని ఎందుకన్నానంటే  స్త్రీ ఇంటా బయటా కూడా సమర్థించుకుంటుంది. ఇలా స్త్రీలు సాహిత్యం ద్వారా ప్రభావితమై తమ అస్తిత్వాన్ని నిరూపించుకుంటున్నారు. అలాగే శ్రీశ్రీ గారి రచనల ద్వారా ముఖ్యంగా మహాప్రస్థానం వల్ల ప్రభావితులై అభ్యుదయవాదులుగా చాలా మంది మారారు. తెలంగాణా ఉద్యమ సందర్భంగా వేలాది మంది కవులు తమ

కలాలకు పదునుపెట్టి ప్రజలను చైతన్యవంతులను చేశారు. గద్దర్, చెరబండరాజు గార్ల ఉద్యమస్ఫూర్తి కవిత్వం పాటలు ప్రత్యేక తెలంగాణా స్ఫూర్తిని ప్రజాబాహుళ్యానికి తీసుకువెళ్లాయి. సమాజాన్ని చైతన్యవంతం చేసి, ఉద్యమింపచేసి ప్రత్యేక తెలంగాణా సాధించుకునేందుకు తోడ్పడింది.

తెలంగాణానే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఏ ఉద్యమానికైనా సమాజాన్ని ఆలోచింపచేసేదిగా,చైతన్య పరిచేదిగా కవిత్వం ప్రముఖపాత్ర వహించింది. రోజురోజుకూ సంకుచితత్వం,స్వార్థం, ఈర్ష్యా అసూయలు, మనిషిలోని పశుత్వ లక్షణాలు, హింస మొదలైనవి విపరీతంగా పెచ్చు పెరిగిపోతున్న సమా జంలో మార్పు తీసుకు వచ్చేందుకు ఆధ్యాత్మిక సాహిత్యం దోహదపడుతోంది. ఆధ్యాత్మికత అంటే నిత్యం పూజలు, పునస్కారాలు చేయడం కాదు. మనిషి ఎలా జీవించాలి, ఓ రకంగా తన ప్రవర్తన ఎలా మార్చుకోవాలి. దానవత్వ ధోరణి నుంచి మానవత్వ ధోరణిని ఎలా అలవరచుకోవాలి. సమాజంలో మనిషి ఎలా ప్రవర్తించాలి, వీటి గురించి చెప్పేదే ఆధ్యాత్మిక సాహిత్యం.

ద్వాపరయుగంలో వ్యాసమహర్షి రాసిన 'భగవద్గీత' ఈనాటికీ మనిషి మనుగడకు ప్రామాణికంగా ఉందంటే, దానిలో చెప్పిన మనిషి జీవన విధానమే కారణం. గీతలో చెప్పిన విధంగా జీవిస్తూ, దానిలో చెప్పిన ధర్మాలు ఆచరిస్తూ జీవించేవారు చాలామంది ఉన్నారు. వారెవరూ వారి గురించి వారి జీవన విధానం గురించి, వారు పొందుతున్న మానసిక శాంతి గురించి, 'గీత' చదవడం వలన వారిలో వచ్చిన మార్పు గురించి, ఎవరికీ చెప్పరు. చెప్పించరు. కాబట్టి సమాజంలో అంతా చెడు ఉందని భావిస్తూ వాపోతూఉంటారు. జాతిపిత గాంధీ మనసా వాచా, కర్మణా 'గీత'లో చెప్పిన విధంగా కర్తవ్య నిర్వహణకే ప్రాముఖ్యత నిచ్చాడు. అహింసావాదంతో సమాజాన్నీ, దేశప్రజలనూ తను నమ్మిన అహింసావాదంతో నడిపించి స్వాతంత్ర్య సముపార్జన కావించాడు.

గాంధీగారి ఆటోబయోగ్రఫీ చదివిన దేశవిదేశాల్లోని వారు ఎంతో ప్రభావితులై వారి మార్గాన్ని అనుసరించారు. నెల్సన్ మండేలా, ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్ లాంటివారు గాంధీగారి జీవితస్ఫూర్తితో జీవించారు. ఉద్యమాలు నడిపించారు. అలాగే ఇటీవల కీర్తిశేషులైన మాజీ రాష్ట్రపతి, అబ్దుల్ కలాం గారు రచించిన పుస్తకాలు చదివి ఎంతోమంది

యువత ప్రభావితులయ్యారు. 'కలలు కనండి–వాటిని సాకారం చేసుకోండి' అంటూ సాగిన వారి సాహిత్యంతో దేశయువత నేడు నడుం కడుతోంది. 'ద వింగ్స్ ఆఫ్ ఫైర్" అనే వారి జీవిత చరిత్ర పుస్తకం సమాజాన్ని ఆలోచింపచేసే విధంగా, ప్రజలను, ముఖ్యంగా యువతకు స్ఫూర్తిదాయకంగా ఉంది.

యండమూరి వీరేంద్రనాథ్ రచించిన విజయానికి ఐదుమెట్లు, నంబరువన్ కావడం ఎట్లా, లాంటి పుస్తకాలు ఎంతో మందికి స్ఫూర్తి కలిగించాయి. అలాగే ప్రముఖ సైకాలజిస్ట్, బి.వి. పట్టాభిరామ్‌గారి "సూత్రధారులు", "మాటే మంత్రం" లాంటి పాజిటివ్ థింకింగ్, వ్యక్తిత్వ వికాస రచనలు చదివి ఎంతోమంది ప్రభావితమై తమ జీవిత దృక్పధాలను మార్చుకున్నారు. అపజయాలకు కుంగి పోకుండా 'ఆశావాద దృక్పధాన్ని' అలవరచుకున్నారు.

సమాజాన్ని మార్చగలిగే శక్తుల్లో సాహిత్యం అగ్రపాత్ర వహిస్తుందనటంలో సందేహం లేదు. సాహిత్యం సమాజానికి అమృతఫలాలనిస్తుంది. ఆ ఫలాల్లో కొన్ని మంచివి, కొన్ని పుచ్చిపోయినవీ ఉన్నట్టే, సాహిత్యంలో కూడా సమాజం అనుసరించదగ్గ విషయాలు, కొంత వితండ వాదనతో కూడుకున్నవీ ఉంటాయి. మంచి సాహిత్యం కోసం తమకు మార్గదర్శిగా ఉండే సాహిత్యం కోసం సమాజం ఎప్పుడూ ఎదురుచూస్తూనే ఉంటుంది. ఆదరిస్తూనే ఉంటుంది. మారాలని ప్రయత్నిస్తూనే ఉంటుంది.

**86. సాహిత్య ప్రయోజనమంటే అంతిమంగా ఆనందమేనంటే మీరే మంటారు?**

**జ :** సాహిత్యమంటే అక్షర సముదాయం కాదు. సాహిత్యం మనిషి మస్తిష్కంలోకి చొచ్చుకుపోయి మానవతారాగాలు పలికిస్తుంది. రాలిన స్వప్నాలకు కొత్త చిగుళ్లు తొడుగుతుంది. పతనమవుతున్న విలువలపట్ల ఖడ్గంగా మారి ఖండిస్తుంది. జీవిత లక్ష్యాలకు గవాక్షాలు తెరుస్తుంది. విజ్ఞానపు అంచులు దర్శింప చేస్తుంది. ఒంటరి తనంలో ఆత్మీయ స్నేహితునిలా తోడుంటుంది. జీవితం నిస్సారమనుకుని తపన పడుతున్న తరుణంలో ఆధ్యాత్మికతను బోధిస్తూ పరమాత్మను చేరే మార్గం చూపిస్తుంది. మనిషి ఆవేశంగా వుండి, ఉద్రేక పడుతున్నప్పుడూ, ఆ ఉద్రేకం కవిత్వ రూపంలో బహిర్గతమై, ఉపశమనం కలిగిస్తుంది. ఉదయిస్తున్న సూర్యుని కిరణాల వెచ్చదనాన్నీ, పండువెన్నెల పరుస్తున్న

చంద్రుడి చల్లదనాన్నీ ఆహ్లాదంగా కవిత్వీకరించి, ఆ అనుభూతిని అనుభవింపచేస్తుంది సాహిత్యం. మాటలోని శబ్దాన్నీ, మౌనంలోని భావాన్నీ, పాటలోని హాయినీ, పరువంలోని వయ్యారాన్నీ కమనీయంగా దర్శింప చేస్తూ, నవరసాల ననవోన్మేషాన్నీ మనసులోకి ప్రవహింప చేస్తూ మనోవికాసాన్ని, కలిగిస్తుంది సాహిత్యం. అంతిమంగా సాహిత్య ప్రయోజనం ఆనందమే.

**87. సాహిత్యాన్ని పత్రికలు ఏమన్నా ప్రోత్సహిస్తున్నాయంటారా?**

**జ.** సాహిత్యాన్ని పత్రికలు ప్రోత్సహించకపోతే ఇంకెవరు ప్రోత్సహిస్తున్నారు? కొన్ని పత్రికలైతే ప్రత్యేకించి వర్ధమాన రచయితలను ప్రోత్సహించే ఉద్దేశంతోనే నడిపేవి కూడా ఉన్నాయి. అలా అని మొత్తం కొత్తవాళ్లవే వేస్తే చదివే పాఠకలుండరు. అందుకని పాతకొత్తల మేలుకలయికలతో అనేక సాహిత్య పత్రికలు సాహిత్యాన్ని ఇతోధికంగా ప్రోత్సహిస్తున్నాయి. ఒకప్పుడు ఆంధ్రజ్యోతి, నవ్య, ఆంధ్రభూమి, స్వాతి, ఇలా పేరు మోసిన వారపత్రికలు, మాసపత్రికలు వుండేవి వాటిల్లో కవితగానీ కథగానీ పడిందంటే చాలా గొప్పగా వుండేది. కానీ ఇప్పుడు రాసేవారు ఎక్కువయ్యారు. అందరి కోసం పత్రికల అవసరం పెరిగింది. మార్కెట్ లోకి అనేక కొత్తకొత్త, వార,మాసపత్రికలు వచ్చాయి. దాదాపు అన్నిపత్రికలూ, కథా,కవితా పోటీలు పెట్టి మంచి కవిత్వాన్ని ప్రోత్సహిస్తున్నాయి. బహుమతులు ప్రకటిస్తున్నాయి. వార పత్రికలే కాకుండా దిన పత్రికలైన ఆంధ్రప్రభ,నేటినిజం, మొదలైన పత్రికలు, వారానికి ఒకరోజు సాహిత్యం కోసం పేజీలు కేటాయించి రచయితలను ప్రోత్సహిస్తున్నారు. రచయితలు రాసిన పుస్తకాల సమీక్షలను కూడా ప్రచురించి, ఆయా రచయితలు రాసిన పుస్తకాలలోని విశేషాలను సాహితీప్రియులకు తెలియచేస్తున్నారు.

నేను రాసిన అన్ని పుస్తకాల సమీక్షలు వివిధ దిన,వార పత్రికలలో ప్రచురితమయి, అనేక వూళ్లనుండి మీ పుస్తకం గురించి ఫలానా పత్రికలో చదివాము డబ్బుపంపుతాము మాకు పంపమనీ, లేదా మావూరి లైబ్రరీకి ఒక కాపీ పంపించమనీ ఉత్తరాలుగానీ, ఫోన్లు గానీ చేస్తుంటారు.

ఇటీవల నేనురాసిన “గీతామృతం” పుస్తకం సమీక్ష సప్తగిరి, ఆంధ్రప్రభ ఈనాడు, ఆంధ్రప్రదేశ్, నేటినిజం, భావతరంగిణి ఇలా అనేక పత్రికలలో రావడం, అపుడప్పుడు

మారుమూల గ్రామాల నుంచి పుస్తకాలు పంపమంటూ అడగడం జరుగుతోంది. ఇటీవల ఆదిలాబాదు జిల్లాలో ఒకతను ఫోన్‌చేసి, మీ గీతామృతం పుస్తకం ఇంగ్లీషులోకి కూడా తర్జుమా చేశారని దాని సమీక్ష ఆంధ్రప్రభ దినపత్రికలో చూశాము. ఇవాల్టి పిల్లలకి భగవద్గీత గురించి చెప్పాలంటే వాళ్లకి ఇంగ్లీషులో చెబితేనే ఎక్కువ సౌలభ్యంగా వుంటుందనీ, కొంత దాని గురించి వారికి అవగాహన వచ్చిన తరువాత తెలుగులో విశదంగా చెప్పవచ్చునీ, తన అభిప్రాయం తెలిపి ఇటీవల హైదరాబాదు పనిమీద వచ్చి, మాఇంటి అడ్రస్ కనుక్కుని వచ్చి పుస్తకం తీసుకెళ్ళాడు. పిల్లలకి 'గీత' గురించి చెప్పాలన్న అతని తాపత్రయం, ఇంతదూరం వచ్చి పుస్తకం తీసుకెళ్ళడం నాకెంతో ఆనందాన్ని సంతృప్తిని ఇచ్చింది. ఇతను ఒక్కడేకాదు ప్రతిరోజు ముగ్గురు నలుగురు ఫోన్లు చేసి పుస్తకాలు తీసుకెళ్తూ వుంటారు. ఇదంతా పత్రికల ప్రోత్సాహం వల్లనే కదా!

**88. విశ్వనాథ సత్యానారాయణగారి సాహిత్యంపై మీ అభిప్రాయం?**

**జ.** కీ.శే. విశ్వనాథ సత్యనారాయణ గారిని. "మాట్లాడే వెన్నెముక-పాటపాడే సుషుమ్న" అన్నారు శ్రీశ్రీ. ధైర్యసాహసాలు లేకుండా జావకారి పోయే మనిషిని " వీడు ఒట్టి వెన్నెముక లేని మనిషిరా అంటాము. తెలుగువారి ధైర్యసాహసాలు మూర్తీభవించిన మహాకవి విశ్వనాథ గారు. తాను సత్యం అని నమ్మిన దానిని నిర్భయంగా, నిస్సంకోచంగా, సభావేదికల మీద, తన రచనల్లోనూ చాటిన ధైర్యశాలి. అందుకే వారిని శ్రీశ్రీ మాట్లాడే వెన్నెముక అన్నాడు. ఇక శ్రీశ్రీ అన్న రెండవ మాట "పాట పాడే సుషుమ్న. మనందరికీ తెలిసిన విషయమే! " ఇడా, పింగళా నాడుల మధ్యగా ఉంటుంది, ఈ సుషుమ్నా నాడి. దాని ద్వారానే మూలాధార చక్రం నుంచి కుండలినీ శక్తి, సహస్రారచక్రం చేరి బ్రహ్మానందాను భూతిని కలిగిస్తుంది. అందుకే విశ్వనాథ పాటపాడే సుఘుమ్న" అన్నారు శ్రీశ్రీ.

ప్రపంచ ప్రఖ్యాత నాటక కర్త షేక్స్‌పియర్ గొప్ప నాటకాలూ, కవితలూ రాశాడు. మహాకావ్యరచన చేయలేదు. మిల్టన్ మహాకావ్యం రచించినా నవల రాయలేదు. రవీంద్రనాథ్ ఠాగూర్ అనేక సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేశాడు. ఒక మహాకావ్యం తప్ప. కానీ విశ్వనాథ వారి సాహిత్యంలో నవల, కథ, నాట కం, మహాకావ్యం, విమర్శలాంటి సమగ్ర సాహిత్య ప్రక్రియలు వున్నాయి.

విశ్వనాధవారి రచనలు అందరికీ నచ్చక పోవచ్చు. ఏ కవి కవిత్వమైనా అందరికీ నచ్చుతుందని లేదు. అయితే విశ్వనాథ వారి రచనల్లోని మానవీయ కోణాన్ని అందరూ ఒప్పుకొనేవారు. విశ్వనాధవారికి అభిమాన పాఠకులు ఎంత మంది వున్నారో, అంతమంది వ్యతిరేకులు కూడా వున్నారు. అన్యమత ధర్మాలను తిరస్కరించే వాడిగా, ప్రగతి భావ వ్యతిరేకిగా ఆయన గురించి వ్యతిరేక ప్రచారం జరిగింది. విశ్వనాథ విరచిత, "వేయిపడగల"ను, "సహస్రఫణ్" పేర మాజీ భారత ప్రధాని కీ.శే. పి.వి.నరసింహారావుగారు హిందీలోకి అనునదిస్తూ " శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు ప్రగతికి వ్యతిరేకులు కారు. ప్రాచీన సంస్కృతి మీద వారికి గల శ్రద్ధ అంతా ఇంతా కాదు. వారు సాంప్రదాయ బద్ధులైన పిడివాదులు కారు. స్వధర్మరక్షణకు అవిఉద్దేశింపబడ్డాయి. "సహస్రఫణ్"లో అనేక చోట్ల ఈ విషయం గోచరిస్తుంది. విశ్వనాథ సాహిత్యమంతా చైతన్యానికి తిరుగులేని విజయ పతాకాలు" అన్నారు.

"విశ్వనాథ వారి సంప్రదాయం ఎంత ప్రాచీనంగా కనపడుతుందో అంత ఆధునికంగా కనపడుతుంది.

ఇంగ్లీషు సాహిత్యంలో ఆధునిక వైతాళికుడైన "టి.యస్. ఎలియట్ " భారతీయ ఉపనిషత్తులను ప్రపంచశాంతి సూక్తంగా అంగీకరించాడు. అందుకే విశ్వనాథ వారిని "తెలుగు ఎలియట్ " అని ఎలియట్‌ను "ఇంగ్లీషు విశ్వనాధ" అనీ అంటారు.

విశ్వనాథ వారు తన సాహిత్యంలో హిందువుల వివాహం, కుటుంబ వ్యవస్థ, ప్రకృతి ఆరాధన మొదలైన వాటి మీద జరుగుతున్న పరిణామాల్లో వస్తున్న విలువల సంక్షోభం గురించి, గ్రామీణ జీవితంలోని మానవ సంబంధాలను, వివిధ వాదాల మీద తన ప్రతిస్పందననూ మహనీయంగా చిత్రించారు.

విశ్వనాథ అన్ని ప్రక్రియల్లో రచనలు చేసినా, ఆయన తండ్రి ' రాస్తే రామాయణం రాసి చూపించు ' అన్నారట. అందుకే "రామాయణ కల్పవృక్షం" రాశారు. అయితే ప్రతి దానికీ విమర్శకులున్నట్టు, అందరూ రాసిన రామాయణమే కదా ! అని విమర్శించిన వారి నుద్దేశించి :

**"మరల నిదేల రామాయణంబన్నచో**

**ఈ జగత్తు తినుచున్న అన్నమే తినుచున్నది,**

**చేయుచున్న సంసారమే చేయుచున్నది**

**తనదైన బ్రతుకు రుచి తనదిగాన "** అని తాను రామాయణాన్ని తనదైన అనుభూతికోసం రాశానని చెప్పారు. విశ్వనాధవారి రామాయణ కాల్పనికం, తెలుగుదనంతో అలరారుతుంది.

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత ఆచార్య సి. నారాయణరెడ్డి గారు విశ్వనాధ వారి ప్రతిభ గురించి మాట్లాడుతూ "నన్నయ, తిక్కన, శ్రీనాధుడు, రాయులు, పెద్దన, తెనాలి రామకృష్ణుడూ మొదలైన ఆరుగురు కవులు 19వ శతాబ్దిలో విశ్వనాధగా అవతరించారని చెప్పారు.

తాత్విక, ధార్మిక ఆధ్యాత్మికాది విషయాలు తన రచనల్లో ప్రతిబించించడమే కాక, రేడియో నాటికలు, గేయ కావ్యాలు, ఎబ్బలు, విమర్శ నవలలు, నవలికలు, మహాకావ్యాలు, రాసిన సంపూర్ణ సాహితీమూర్తి విశ్వనాధవారు. వారు రాసిన "విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు"లో ఇంగ్లీషు భాషలోని లోపాలను ఎత్తి చూపుతూ, హాస్యం పండిస్తుంది. వేయి పడగలులోని ధర్మారావు పాత్ర నేటికీ సజీవం.

అయితే నేడు మారుతున్న విలువల సమాజంలో విశ్వనాధ ఛాందసుడు, వారి కవిత్వం తిరోగమన కవిత్వమే కానీ అభ్యుదయం కాదనే వాదనలు చాలా వున్నాయి. ఆయనలోని జాతీయతా దృక్పధాన్ని అపార్ధం చేసుకుని ఆధునికతకు, విజ్ఞానానికీ వ్యతిరేకీ అనడం జరిగింది. "భారతదేశంలో ఏమీలేదు చెత్తే" అంటున్న రోజులలో భారతదేశంలో ఏముందో తన సాహిత్యం ద్వారా నిరూపించి చూపించారు విశ్వనాధ సత్యనారాయణ గారు.

మానాన్నగారు మహాకాళివేంకటరావుగారు విశ్వనాధ సత్యనారాయణ గారి శిష్యులు. విశ్వనాధవారి కవిత్వమంటే చాలా ప్రియం నాన్నగారికి. వారి గురించి నాన్నగారు రాసిన పద్యాల్లో సోదాహరణంగా ఒకటి క్రింద ఉదహరిస్తాను.

**చ॥ కవియననీవెగా, కవుల కాంతి కిరీటి స్వరాట్టువీవె, మా**
**నవతర కావ్యాదీధితికి నాట్యతపంచిన కావ్యభాస్కరా**
**కవనము ఆత్మద్రష్టము, ప్రకాశము పెంచు నటించు, భారతీ**
**రవమును నీదు కావ్యముల రంజిప జేసితి విశ్వనాథరో !**

అని తన గురువు గారైన విశ్వనాధుని పాండిత్యాన్ని కీర్తిస్తూ రాసిన పద్యం.

విశ్వనాధ వారికి కూడా తన శిష్యుడైన వేంకటరావు అంటే చాలా అభిమానం. మా తాతగారు మహాకాళి వేంకటేశ్వరరావుగారు, విశ్వనాధ వారు చెళ్ల పిళ్ల వారి శిష్యులు. తాతగారు కూడా మంచి పండితులు. విశ్వనాధ రామాయణ కల్పవృక్షంలోని పద్యాలను కొన్నింటిని మాకు అర్థం చెప్పి బట్టీ కొట్టించారు.

ఒకరోజు విశ్వనాధ సత్యనారాయణగారు మా ఇంటికి విచ్చేసారు. మా తాతగారు కీ॥శే॥ మహాకాళి వేంకటేశ్వరరావుగారిని కౌగిలించుకుని చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకున్నారు. వారికి ఏర్పరిచిన ఉచితాసనం మీద కూర్చున్నాక, నాన్నగారు మా అక్క చెల్లెళ్లు నలుగురిని, మాతమ్ముళ్లని, అమ్మనీ, నానమ్మనీ పరిచయం చేశారు. మేము వారిముందు చేతులు కట్టుకుని రామాయణ కల్పవృక్షంలోని ఆంజనేయుడి స్తుతి “మంగళరూపయ్య”, అన్న పద్యం, ఆంజనేయుడు సీతను చూచి వచ్చినప్పుడు రాముడితో “కాంచితి సీత” అన్న పద్యాన్నీ, ఇంక కొన్ని పద్యాలు వినిపించాము. వారు చాలా సంతోషించారు.

తరువాత ఆయన రామాయణం గురించి చెబుతూ “ఈ రామాయణ కల్పవృక్షం, తెలుగు రామాయణం; ఒక తెలుగు కుటుంబంలో జరిగిన కథలాగా రామాయణం రాశాను. నేను రాసినది, మున్ముందు జనాలకి అర్థం అవుతుందోకాదో, నేను బ్రతికుండగానే నా చేత అర్థం చెప్పించుకోండి” అంటూ గాద్గదిక స్వరంతో చెప్పారు. మాకందరికీ కూడా కళ్లనీళ్లు వచ్చాయి. కవిసామ్రాట్ విశ్వనాధ్ సత్యనారాయణగారు మా ఇంటికి రావడం, వారిముందు మేము పద్యాలు చదవడం, వారి ఆశీర్వచనం తీసుకోవడం నా జీవితంలో మరచిపోలేని మధురానుభూతి.

వారికి జ్ఞానపీఠ అవార్డు వచ్చినప్పుడు విలేకరులు వారి స్పందన కోసం అడిగితే

"అవార్డు ఇవ్వడం కంటే మిరపకాయ ధరలు తగ్గిస్తే ఎక్కువ సంతోషపడేవాడిని" అన్నారుట. అప్పట్లో మిరప ధరలు విపరీతంగా పెరిగిపో యాయట. అంటే అవార్డు వచ్చినా రాకపోయినా నిరామయునిగా ఉండేతత్వం. జ్ఞానపీఠ అవార్డు, కవిసామ్రాట్ బిరుదుల కావు, ఆయన సాహిత్యం ఆయన్ని గొప్పవాడిగా నిలబెట్టింది.

నాకు గుర్తున్నంతవరకూ, వారికి జ్ఞానపీఠ పురస్కారానికి లక్షరూపాయల నగదు బహూకరించారు. తాను దరిద్రంలో వున్నప్పుడు డబ్బు రాలేదు. డబ్బు అవసరం అంతగా లేనప్పుడు డబ్బు వచ్చింది అని చెప్పారు. లక్షలో సగం, తనసొంత వూరిలోని రామాలయ పునరుద్ధరణకు, కొంత దానధర్మాలకూ, కొంత రుణ విముక్తి కోసం వెచ్చించాడని, ఒక్క పైసా కూడా సొంతానికి వాడుకోలేదనీ చెప్పకోగా విన్నాను.

### 89. శ్రీశ్రీసాహిత్యంపై అభిప్రాయం?

**జ:** శ్రీశ్రీ కవిత్వంలో ఒక కొత్త ఒరవడిని ప్రవేశపెట్టాడు. సాంప్రదాయబద్ధమైన కవిత్వధోరణి నుంచి అభ్యుదయ భావజాల కవిత్వం వైపుదృష్టి మరల్చాడు. ఒక తరాన్ని ప్రభావితం చేశాడు. అద్భుతమైన శిల్పం "మరో ప్రస్థానం"లో మనకి కనబడుతుంది. ఎంతోమంది సాంప్రదాయ కవులు సైతం శ్రీశ్రీ మహా ప్రస్థానంలోని శిల్పానికి అబ్బురపడ్డారు. అతని కవిత్వంలోని శబ్దశక్తికి సాంప్రదాయ కవిత్వ ప్రభావమూ, అభ్యుదయ వాదానికి దడాయిజమ్, ఫ్యూచరిజమ్ ఎక్స్‌ప్రెషన్‌నిజాల ప్రభావమూ కనపడతాయి. మంచి కవిత్వం అంటే శ్రీశ్రీ మాటల్లో

**"కదిలించేది**
**పెనునిద్దర వదిలించేది**
**పరిపూర్ణతనిచ్చేది.** మంచి కవిత అంటే పెనునిద్దర వదిలించేది అని కితాబిచ్చారు శ్రీశ్రీ. ఇది ముమ్మాటికీ నిజం. కవితలో పాఠకుడు లీనం కావాలి. చైతన్యం పొందాలి. ఆ దిశగా ఆలోచించాలి. అప్పుడే ఆ కవితకు సార్థకత. శ్రీశ్రీ వర్తమాన, సాంఘిక, సామాజిక అంశాలు, మనిషి నిత్యకృత్యంలో జరిగే సంఘటనల మీద కవిత్వం రాయడం వలన, ఒక కొత్త ఒరవడి ప్రవేశపెట్టడం వలన శ్రీశ్రీ కవిత్వాన్ని చాలామంది ఆస్వాదించారు. ఆహ్వానించారు. "అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల, కుక్కపిల్ల కాదేదీ కవితకనర్హం" అన్న శ్రీశ్రీ మాటలకి

కవితా వస్తువులో వైవిధ్యం, కొత్తదనం చోటు చేసుకున్నాయి. శ్రీశ్రీ మాటలు ఒక మంత్రంలా పనిచేసి ఎంతమందినో ప్రభావితం చేశాయి. నేను కూడా ఈ మాటల మంత్రానికో ప్రభావితురాలనై "సిగ్నల్ లైట్స్", "దుప్పటి", "పిల్లి", "మా అపార్టుమెంట్", "కలుపు గులాబి" లాంటి కవితలెన్నో రాశాను. మేము సైతం కవిత్వం రాయగలమన్న ఉత్సాహం కలిగించి ఎందరినో కవులుగా మార్చిన శ్రీశ్రీని అందుకే మహాకవి అన్నారు. మనిషి తనలోని అలజడిని అక్షరరూపం చేయాలని తపనపడతాడు. కానీ తన దగ్గర తగిన భావజాలం, వ్యక్తీకరణ లేవేమోనని బిడియపడి తన భావాలను అక్షరబద్ధం చేయడానికి బిడియపడతాడు. ఎప్పుడైతే శ్రీశ్రీ మనిషిని కేంద్రబిందువుగా చేసి ప్రజల భాషలో, కవిత్వం రాశాడో, ఎంతో మంది ప్రభావితులై కవితలు రాశారు. మంచి కవులుగా పేరు తెచ్చుకున్నారు.

**90. సాహిత్యం విశ్వశ్రేయస్సును కాంక్షించేదై ఉండాలంటే మీరేమంటారు?**

**జ.** నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో సాహిత్యం విశ్వశ్రేయస్సును కాంక్షించేదిగానే ఉండాలి. ఉంటోంది కూడా. ప్రాంతీయత విశ్వంలో భాగమే కనుక, ప్రాంతీయ శ్రేయస్సుకోరే సాహిత్యం విశ్వశ్రేయస్సు కోరేదే కదా. దేశాల సరిహద్దులను చెరిపి వేసి, ఎల్లలు లేని మానవతా పరిమళాలు వెదజల్లుతూ విశ్వశ్రేయస్సును కాంక్షించే సాహిత్యం ఆహ్వానించదగ్గది.

**91.ఏ ఆశయంతో మీరు కవిత్వం రాస్తారు?**

**జ.** కాలంతో కలిసి నడిచే సాహిత్యం నాది. అభూత కల్పనలకు దూరంగా, చెప్పదలచుకున్నది సూటిగా, పాఠకుడి మనసులోకి చొచ్చుకుపోయే విధంగా రాయడమే నా లక్ష్యం. మానవ సంబంధాలనూ, సమకాలీనతనూ, తాత్వికతనూ, చైతన్య స్పృహను ప్రతిబింబిస్తూ, ప్రజల భాషలో వారి హృదయానికి హత్తుకునే కవిత్వం అందించడమే నా అభిలాష. సమాజంలో, కుటుంబ చట్రంలో మహిళ పొందుతున్న అనుభవాలు, అనుభూతులూ, స్పందనలూ నా రచనల్లో ప్రతిబింబిస్తాయి.

**92. ప్రాచీన సాహిత్యానికీ-ఆధునిక సాహిత్యానికీ గల ప్రధాన తేడా ఏమిటి?**

**జ.** ప్రాచీన సాహిత్యానికీ, ఆధునిక సాహిత్యానికీ తల్లికీ, బిడ్డకు వున్నంత తేడా వుంది.

సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తుంది తల్లి. ఆధునిక పోకడలతో ఉంటుంది బిడ్డ. ప్రాచీన సాహిత్యానికీ ఆధునిక సాహిత్యానికీ వున్నతేడా కూడా అదే. గ్రాంధికమూ, ఛందస్సు, పద్యము ప్రాచీన భాషసొగసులు.ఆధునికత, వాడుక భాష, వచనమూ, ఛందస్సులేని పద్యరూపాలు ఆధునిక సాహిత్య అందమైన పోకడలు. ఆధునిక సాహిత్యం కాలానుగుణంగా రూపాన్ని మార్చు కుంటూ, కొత్త కొత్త ప్రక్రియలతో విస్తృతమవుతూ వస్తోంది. సామాన్యుడు సైతం కవిత్వాన్ని ఆస్వాదిస్తున్నాడు.

**93. మీరు ఏ భావజాలంతో సాహిత్య సృజన చేస్తుంటారు?**

**జ.** ప్రత్యేకించి ఒక భావజాలంతో రాయను. వాదాలు, ఇజాలు, జోలికిపోకుండా స్పందన కలిగిన ప్రతి అంశం మీదా సాహితీసృజన చేస్తాను. కవులు మిగతా జనం కంటే కొంత స్వేచ్ఛాప్రియులు. నా కవిత్వంలో స్త్రీల అస్థిత్వ పోరాటం, భారతీయత, ఆధ్యాత్మికత, సాంప్రదాయ వారసత్వ భావాలు వుంటాయి.

**94. సాహిత్యంపై నేటి యువత దృష్టి కోణం ఎలా వుంటున్నది?**

**జ.** ఆధునిక సాహిత్యం బహుముఖాలుగా విస్తరించింది. కవిత్వంలో అనేక లఘు ప్రక్రియలు ప్రవేశించాయి. ముఖ్యంగా యువకవులను ఈ ప్రక్రియలు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఇదొక కోణమైతే, భాషపట్ల నిర్లక్ష్య ధోరణితో యువత ఉంటున్న సందర్భాలూ లేకపోలేదు. చిన్నతనం నుండి వారికి భాషపట్ల, సంస్కృతి పట్ల మక్కువ కలిగేటట్లు చేయగలిగితే సాహిత్యమైనా, సంస్కృతైనా కలకాలం నిలవగలుగుతుంది.

**95. పట్టణాల్లో ఉంటూ పల్లె సౌందర్యాలను. లేక ప్రపంచీకరణ నేపథ్యంలో పల్లెల్లో జరుగుతున్న విధ్వంసం గురించి కవులు వర్ణించడాన్ని ఎలా చూడా లంటారు?**

**జ.** "రవి గాంచనిచో కవిగాంచును" అన్నారు. కవికి ఎల్లలు లేవు. ప్రతిదీ అనుభవించి రాయాలని లేదు. మద్యపానం మీద కవిత రాయడానికి తాగుబోతు అయివుండాల్సిన అవసరం లేదు. విషయం పట్ల అవగాహన, అధ్యయనం ఉండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో అరచేతిలో ఇమిడిపోతున్న విషయ పరిజ్ఞానం వలన, కవులు పల్లె

సౌందర్యాలనూ, విధ్వంసాలనూ వర్ణించగలుగుతున్నారు. మంటల్లో శశిని తిలకించగలడు, శూన్యంలో పూర్ణతనూ చూడగలడు కవి.

**96. కవి తన కవిత్వంలో ప్రధానంగా మనిషిని కేంద్రంగా చేసుకుని రాయాలంటే మీరేమంటారు?**

**జ.** సమాజంలో మనిషి కేంద్ర బిందువు. మనిషి చుట్టూతా పరిభ్రమించే అనేక అంశాలు, సంతోషం, దుఃఖం, వేదన, సమస్యలు, అస్థిత్వం ఇవే కవిత్వంలో ప్రధానపాత్ర పోషిస్తాయి. సమస్యల వలయాన్ని ఛేధించుకుని, సాధన వైపు దూసుకుపోయే మనిషి సాహిత్యానికి వెన్నెముక.

**97. కవి కత్తి పట్టాలంటారు కొందరు. అలా కాకపోతే నిబద్ధత లేనట్లే నంటారు దీనిపై మీ కామెంట్?**

**జ.** కత్తి పట్టాలనటం సబబు కాదు. అలా ఉంటేనే నిబద్ధత ఉన్నట్టు చెప్పటమూ కరెక్టు కాదు. ప్రాథమికంగా ఏ వ్యక్తికైనా కొన్ని బాధ్యతలుంటాయి. కవి బాధ్యత సాహిత్య సృజనే. సమకాలీన సమాజంలోని అవకతవకలపై కలాన్ని కత్తిగా చేసి పోరాడే బాధ్యత కవికి ఉంటుంది. అటువంటి బాధ్యత నుండి కవి తప్పుకోకూడదు. కవి ఉపన్యాసాలకే పరిమితం కాకుండా, అతని కవిత్వం కూడా ప్రజాచైతన్యపు దిశగా సాగినప్పుడు అతనికి అట్టి నిబద్ధత ఉన్నట్టుగానే భావించాలి. ఏ కవికైనా ఏదో ఒక నిబద్ధత ఉంటూనే ఉంటుంది.

**98. నేడు వచన కవితా ప్రభావం ఎలా వుందంటారు?**

**జ.** మూడు పువ్వులు ఆరుకాయలుగా వుంది. వచన కవితా రూపం, నేటి సాహితీ ప్రపంచాన్ని ఏలుతున్న మంచి ప్రక్రియ. ఇది రకరకాల రూపాలు సంతరించుకుంటూ, కొత్త పోకడలతో నానీలు, రెక్కలు, చుక్కలు, హైకూలు, గజల్స్ లాంటి పేర్లతో పాఠకలోకాన్ని అలరిస్తోంది. కవిత్వమనే మహాసాగరంలో వర్షపు చుక్కల్లాంటి ఈ ప్రక్రియలన్నీ వచన కవితా ప్రాభవాన్ని ఇనుమడింప చేస్తున్నాయి, విస్తృతపరుస్తున్నాయి.

## 99. సినిమా సాహిత్యం పట్ల మీ అభిప్రాయం ఏమిటి?

**జ.** సినిమా పాటల్లో సాహిత్యపు విలువలు పాతసినిమాల్లో బాగుండేవి. ఆత్రేయ, దాశరధి, సి.నా.రె., కృష్ణశాస్త్రిగారి పాటలు అర్ధవంతంగా సన్నివేశానికి అనుగుణంగా చక్కని సాహిత్య విలువలతో వుండేవి. కృష్ణశాస్త్రిగారు మల్లీశ్వరి సినిమాకి రాసిన పాటలన్నీ ఈనాటికీ ఆపాత మధురాలు. ఆత్రేయ మనసు మీద రాసిన " మనసు మూగదే కానీ బాసుంటది దానికి, చెవులుండే మనసుకే వినిపిస్తుందా ఇదీ" సి.నా.రె. రాసిన "ఈ నల్లనిరాళ్లలో ఏకన్నులు దాగెనో", లాంటి పాటల సాహిత్యం నాటికీ, నేటికీ ఏనాటికీ వీనుల విందైనవి. మనసును మరో లోకాలకి తీసుకెళ్లే పాటల సాహిత్యం.

తరువాతి కాలంలో కూడా శంకరాభరణంలోని పాటలు "శంకరా నాద శరీరా", స్వాతిముత్యంలోని" 'లాలీలాలీ' మొదలైనవి పదికాలాలు నిలబడే సంగీత సాహితీ పరిమళాలు.

సిరివెన్నెలనే ఇంటిపేరుగా చేసుకున్న సీతారామశాస్త్రీగారూ. అనంత శ్రీరామ్, జొన్నలగడ్డ నేడు వస్తున్న సినిమాల్లో కూడా సాహిత్యపు విలువలతో కూడిన పాటలు రాస్తున్నారు. అయితే కొన్ని పాటలు బీట్ కోసం రాసినప్పుడు, సాహిత్యపు విలువలు వుండటం లేదు. ఇది వరకు పాటకు ట్యూన్ కట్టేవారు, ఇప్పుడు ట్యూన్‌కి అనుగుణంగా పాట రాస్తున్నారు.

నాటి పాటల్లోని సాహిత్యానికీ, నేటి పాటల్లోని సాహిత్యానికీ, ప్రాచీన కవిత్వానికీ, ఆధునిక కవిత్వానికీ ఉన్నంత తేడా కనపడుతుంది. ఇప్పటి పాటల్లో వాడుక భాష బాగా రావడమే కాకుండా బూతుమాటలతో, తిట్లతో కూడా పాటలు వస్తున్నాయి. అలాగని, అన్ని సినిమాపాటలు అలా వుంటాయని జనరలైజ్ చేయలేము. ఇప్పుడు మళ్లీ ట్రెండ్ మారుతోంది. మంచి సాహిత్యపు విలువలతో కూడిన పాటలు కూడా వస్తున్నాయి.

## 100. చివరగా ఈ ఇంటర్వ్యూపై మీస్పందన తెలియచేయండి?

**జ.** ప్రశ్నే జ్ఞానానికి తాళం చెవి. ప్రశ్న నుండే సమస్తమూ ఉద్భవించాయి. ఇక ఈ ప్రశ్నల విషయానికొస్తే సాహిత్యంలో ఇదొక వినూత్న ప్రక్రియ. కవి తన స్వీయ చరిత్ర రాసుకోవడ మన్నది సాధారణం. కానీ తాను ఒక పేరుమోసిన సాహితీవేత్త అయివుండి,

వేరొక కవి అంతరంగాన్ని ఒడిసి పట్టే విధంగా ప్రశ్నలు వేసి, ఆ కవి యొక్క వ్యక్తిత్వం, జీవితం, సాహిత్యం, అనుభవ, ఆశయాల సమాహారాన్ని ప్రజల ముందుంచే నియోగి గారి ఈ విశిష్ట ప్రయోగం అమోఘం, అసాధారణం.

అలనాడు భారతంలో యక్షుడు ధర్మరాజును అనేక ప్రశ్నలు వేశాడు. దానికి ధర్మరాజు ఇచ్చిన సమాధానాలు మానవాళికి ఈనాటికీ ఎంతో ఉపయోగకరమైనవి. "యక్ష ప్రశ్నలు"గా వినుతికెక్కాయి.

ఈనాడు నియోగి గారు సంధించిన వంద ప్రశ్నలకు కవులిచ్చే సమా ధానాలు కూడా రాబోయే తరాలకు ఉపయుక్తంగా ఉంటాయనడంలో సందేహం లేదు. ఇవి "నియోగి ప్రశ్నలు"గా ప్రసిద్ధమవుతాయి.

రచయితలోని విభిన్న కోణాలను పరిచయం చేసే ఈ వినూత్న ప్రక్రియ ద్వారా నన్ను ప్రశ్నించి, నా హృదయాన్ని ఆవిష్కరింపచేసే సదావకాశాన్నిచ్చిన నియోగి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

# సచివుల మధ్య వికసించిన కవితా సుమం రాజశ్రీ

మాటల్లోనే కాదు చేతల్లోనూ అభ్యుదయాన్ని, ఆధునికతను చూపిస్తున్న మహిళామణి కేతవరపు రాజ్యశ్రీ. రాష్ట్ర పరిపాలనకు గుండెకాయలాంటి సచివాలయానికి తొలిసారిగా బైక్‌పైన, కారుపైన వచ్చి ఇతర ఉద్యోగుల్లో స్వాభిమానాన్ని పెంచిన నిత్య చైతన్య శీలి రాజ్యశ్రీ.

భర్త ముందు పోతే/ సాంఘిక కట్టుబాట్లతో వేధించే బంధువులు/ తానే ముందుపోతే / కాటికి పంపడానికి వంతులు పోయే సంతానం/ అన్నింటినీ భరిస్తూ – అన్నింటినీ అధిగమిస్తూ/ పొలం నుంచి – గగన తలం వరకు / సర్వత్రా తానైన సహస్రావధాని –ఆమె అని సమాజంలో స్త్రీ వ్యక్తిత్వాన్ని సునిశితంగా చెప్పారు ఆమె. ప్రస్తుతం వృత్తి రీత్యా రాష్ట్ర సాధారణ పరిపాలనా విభాగంలో ఉప కార్యదర్శి గా పని చేస్తూ, ప్రవృత్తి రీత్యా సాహిత్య సేవ చేస్తున్నారు. ఎక్కడ కవి సమ్మేళనం జరిగినా ముందుండే రాజ్యశ్రీ లోని సాహితీవేత్తను తట్టిలేపింది ఉగాది కవి సమ్మేళనాలే మరి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.కాం పట్టభద్రురాలైన రాజ్యశ్రీ కుటుంబ నేపథ్యం పూర్తిగా సంగీత, సాహిత్యాలతో ముడిపడివుంది.

తాత మహాకాళి వెంకటేశ్వరరావు విద్వాన్ బిరుదాంకితుడు, కవి, బహుబాషాకోవిదులు. అందులోనూ వెల్లపిల్ల వారి శిష్యుడు. నాన్న వెంకట్రావు కవి, నటుడు, నాటక రచయిత, జ్యోతిష్యాస్తు శాస్త్ర పండితుడు. అమ్మ ప్రభావతి వీణావాద్య విద్వాంసురాలు. ఇలా నాన్న సాహిత్యం, అమ్మ సంగీత నేపథ్యంలో పెరగడం వల్ల రాజ్యశ్రీకి సహజంగానే సంగీత సాహిత్యం అబ్బింది. 1977లో సచివాలయంలో స్టెనోగ్రాఫం



కేతవరపు రాజ్యశ్రీ

గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. సచివాలయ ఉద్యోగుల ప్రోద్బలంతో కవి సమ్మేళనాలలో పాల్గొనడం వల్ల అప్పటి వరకు మనసు పొరల్లో దాగున్న కళ నిద్రలేచింది. సహజంగానే ఉన్న ఆసక్తికి తోడు ఓ వేదిక దొరకడంతో రాజ్యశ్రీకి ఇక వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు.

ఆమె కథల్లో సామాజిక స్పృహ ఉంటుంది, ఆర్తి ఉంటుంది. స్త్రీలు పడే ఇబ్బందులు చెప్పే తీరులో ఒక ఆవేదన తొణికిసలాడుతుంది. అంతేకాదు భావి పౌరుల భవితనీ/ భారతీయ సంస్కృతిని/ కాపాడేది స్త్రీ అనే భరోసా ఉంటుంది. మరో రకంగా అది విడిపించుకోని స్త్రీ బాధ్యతగా పేర్కొంటారు రాజశ్రీ.

స్టెనోగ్రాఫర్‌గా తన ప్రతిభను నిరూపించుకుంటూ ఉద్యోగంలో పదోన్నతులు పొందుతూనే సాహితీవేత్తగా తన కృషిని ఓ వైపు, సమాజసేవ చేస్తూ మరోవైపు బహుముఖీన ప్రజ్ఞను కనబరుస్తున్నారు. 1983లోనూ, 1991లోనూ ప్రైవేటు కార్యదర్శిగా. గెజిటెడ్

## వృత్తి-ప్రవృత్తి

ఉద్యోగిగా పదోన్నతి, 2006లో అసిస్టెంట్ సెక్రెటరీ, 2010లో డిప్యూటీ సెక్రటరీగా పదోన్నతి వచ్చింది. కుటుంబ జీవితానికే మొదటి ప్రాధాన్య తనిచ్చానని, అయినా ఉద్యోగానికి నిర్లక్ష్యంచేయలేదని అంటున్నారు రాజ్యశ్రీ. ఉద్యోగంలో చేరిననాటి నుంచి సాహిత్యసేవ చేస్తున్నప్పటికీ తన తొలి కవిత 'మేఘమాల' 1997లో తేజోప్రభ పత్రికలో వచ్చిందని, తన కవిత ముద్రితమైనప్పటి నుంచి రెట్టించిన ఉత్సాహంతో సాహిత్య సేవలో కొన సాగారు. ఇప్పటి వరకు తన స్వీయ కవితలతో 'చిరుసవ్వడులు', గుండె చప్పుళ్ళ', 'ఊహల వసంతం' అనే మూడు పుస్తకాలను, 'కవితా చేతన', 'చేతన కథాఝరి' రెండు కథా సంకలనాలను, 'గృహ హింస చట్టం – మహిళకు రక్షణ కవచం' అనే అవగాహన గ్రంధాన్ని తన స్వీయ ప్రతిభతో వెలువరించారు. ప్రవృత్తిని వృత్తితో కలిపి పనిచేస్తే వృత్తిని ఆహ్లాదంగా, ఉత్సాహంగా చేయగలుగుతామని, వృత్తిని ప్రేమిస్తామని రాజ్యశ్రీ అంటున్నారు. తన రచనల్లో స్త్రీవాదాన్ని ప్రతిబింబిస్తూనే సమాజ హితాన్ని అభిలషిస్తారు. సమాజంలోని అసమానతలు రూపుమాపాలని కోరుకుంటారు. చిన్నప్పటి నుండి అభిమాన కథానాయకుడు అక్కినేని నాగేశ్వరరావు చేతుల మీదుగా సన్మానం అందుకోవడం జీవితంలో మరుచిపోలేని విషయం అంటారు రాజ్యశ్రీ. సచివాలయంలో మహిళా ఉద్యోగుల సంక్షేమానికి కూడా ఆమె ఎంతో కృషి చేసారు. ఉదాహరణకు మహిళల కోసం గైనకాలజిస్టుని సచివాలయ డిస్పెన్సరీలో ఏర్పాటు చేయడం,స్త్రీలకోసం యోగా, మెడిటేషన్ క్లాసులు నిర్వహించడం, ఉద్యోగినులకోసం ప్రత్యేకంగా కంప్యూటర్ శిక్షణాతరగతులు నిర్వహించడంతో పాటు సదస్సులు ఏర్పాటు చేశారు. ప్రసూతి సెలవును 4 నెలలకు పెంచడానికి చేసిన కృషిలో విజయం సాధించారు. జంట నగరాలలోని ప్రముఖ సాంస్కృతిక సంస్థలన్నింటివే సన్మానాలు అందుకున్న రాజ్యశ్రీ భవిష్యత్తులో మరెన్నొ సాహితీ శిఖరాలు అందుకోవాలని ఆభిలషిద్దాం.

◆ ముచ్చు అశ్వథకుమార్ రెడ్డి

**మా చిరునామా:**
**శ్రమ,కేరాఫ్ వార్త,జాతీయ దినపత్రిక**
**నం. 396, లోయర్‌టాంక్‌బండ్ రోడ్,**
**హైదరాబాద్. 500080.**

# 'చేతనా'ఝరి - రాజ్యశ్రీ

...మహిళా చైతన్యం గురించి, ... గురించి మాట్లాడే వారే ...మహిళా సాధికారతకు ఎప్ప...ంగా ఏ మాత్రం చేయూత ...ప్రశ్నిస్తే చాలా మంది నుంచి ...జవాబు దొరకదు. దశాబ్దాలు ...త్ర్యం వచ్చి ఆరున్నర దశా... మహిళా హక్కుల కోసం అంతర్జాతీయంగా చట్టాలు



అంతంత మాత్రమే అం...

...న్ని రంగాల్లో అనేకానేక ...మించి ముందుకు వెళుతు ...పంచంలో కష్టాలు, నష్టాలు ... వైపు గృహహింస, మరో వైపు సమాజంలో ముఖ్యంగా కార్యాలయాల్లో, ఉద్యోగ, వ్యాపార కేంద్రాల్లో సైతం వేధింపులు, సాధింపులు తప్పడం లేదు అని తన ఆవేశాన్నీ, ఆక్రోశాన్నీ కవితా రూపంలో జ్వలింప చేస్తారు రాజ్యశ్రీ.

అయితే స్త్రీల సహనం, ఓర్పు అశక్తతలు కావని, శక్తి అవే ఆయుధాలని గ్రహించి ఎన్ని కష్టాలు ఎదురైనా ఎన్ని నష్టాలు భరించవలసి వచ్చినా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ముందుకు సాగినప్పుడే మహిళా విజయం సాధ్యం అంటారామె.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలంటే బహుముఖ్యంగా ఎదగాలని చెప్పే రాజ్యశ్రీ వృత్తిరీత్యా ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ప్రభుత్వ ఉప కార్యదర్శి, ప్రవృత్తి రీత్యా కవితా సేద్యం చేస్తు న్నారు. వారు సాంస్కృతిక, సాహిత్య పిపాసి. రచనా వ్యాసంగాన్ని అసిధారా వ్రతంగా స్వీకరించారు.

**పర్యావరణ చైతన్యం**

రాజ్యశ్రీ చేతన సచివాలయ సాహితీ వేదిక అధ్యక్షురాలిగా అక్కినేని అమలచే పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సును నిర్వహించారు. ఆమె ప్రతి సంవత్సరం ఇటువంటి సదస్సును నిర్వహించటమే కాక చలన చిత్ర ప్రదర్శన, మొక్కల పంపిణీ, ప్లాస్టిక్‌ను మాని బట్ట సంచీ తీసుకువెళ్ళే అలవాటును ప్రోత్సహిస్తున్నారు.



**కవితా సేద్యం**

ఆమె 'చేతన' సచివాలయ సారస్వత వేదికకు అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ఆమె 'స్త్రీవాద రచనలు అపోహలు' అంశంపై అబ్బూరి ఛాయాదేవితో ప్రసంగం, యుద్దనపూడి నవలలపై ఇష్టాగోష్టి, వివాహ వ్యవస్థ సామాజిక విలువలు అంశంపై సత్యవాణి ప్రసంగం, మౌఖిక సాహిత్యంలో మానవీయత అంశంపై గోరేటి వెంకన్న ప్రసంగం నిర్వహించారు.



**సేవావ్రతి**

రాజ్యశ్రీ ఆంధ్రప్రదేశ్ సచివాలయ మహిళా సంక్షేమ సంఘ వ్యవస్థాపక కార్యదర్శిగానే కాక, సంఘ మిత్ర లయనెస్ క్లబ్‌కు పూర్వాధ్యక్షురాలుగా, సంఘమిత్ర వృద్ధాశ్రమానికి పూర్వకార్యదర్శిగా సేవలందిస్తున్నారు.

**మహిళా ఉద్యోగుల సంక్షేమ దిశగా...**

ఉద్యోగినుల కోసం ప్రత్యేకంగా కంప్యూటర్ శిక్షణ తరగతులు, ఆర్థిక పురోగతిలో ఉద్యోగినుల పాత్ర అంశంపై సెమినార్లు, మహిళల కోసం ప్రత్యేక గైనకాలజిస్ట్ వైద్య సేవలు, వారికి యోగ, మెడిటేషన్ తరగతులు, ప్రసూతి సెలవును నాలుగునెలలు పెంచడం, ఉద్యోగినుల మనోవికాసానికి ఆటల పోటీలు, ఆత్మవిశ్వాసం కల్గించటానికి విశేష కృషి చేశారు.

**గృహహింసకు చెల్లు చీటీ**

గృహహింస చట్టం గురించి సరైన అవగాహన కల్గిస్తూ అది మహిళా రక్షణకు ఎలా కవచంలా ఉపయోగపడేదీ పుస్తక ప్రచురణ ద్వారా చైతన్యం రాజ్యశ్రీ కల్పించారు.

**విధులకు గుర్తింపు:**

రాజ్యశ్రీకి క్లబ్ ఆఫ్ హైదరాబాదు, సనత్‌నగర్ వారిచే డెడికేటెడ్ సర్వీసు అవార్డు 1995లో లభించింది.ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగినీ సంక్షేమ సంఘం వారి దశాబ్ది ఉత్సవాలలో సంఘ వ్యవస్థాపక కార్యదర్శిగా డా॥ అక్కినేని నాగేశ్వరరావు, శ్రీమతి జయసుధ గారిచే 2004లో, దూరదర్శన్ కేంద్రం హైదరాబాదు వారిచే ఉగాది కవి... సత్కారం లభించాయి. సిలి... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృ... నిర్వహించిన అన్నమాచార్య ... నార్చనలో పాల్గొన్నందుకు 2... బుక్‌లో పేరు, ప్రశంసాపత్రం, ...ళ్లు" పుస్తకావిష్కరణ సందర్భ... సంస్థ వారిచే 2009లో సత్కా... నేని నాగేశ్వరరావుగారిచే సన్మా...



అంతర్జాతీయ మహిళా ... స్కరించుకుని సచివాలయ ఉ... సంఘ స్థాపక కార్యదర్శిగా... నందుకు మార్చి 8.2001న ... గాయి.

ఆంధ్రప్రభ 6-3-2012

సుబ్రమణ్యం, భాను, ... సంగీత లహరి కార్యక్రమాలు జరిగాయి.

# నిశితమైన దృష్టిగల రచయిత్రి రాజ్యశ్రీ

**వివేకనగర్, మార్చి 6 (కెఎన్ఎన్) :** తన చుట్టూ ఉన్న సమాజాన్ని లోతుగా అర్థం చేసుకొని, మధ్యతరగతి, బడుగు వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తీసుకొని ప్రముఖ రచయిత్రి, కవయిత్రి కేతవరపు రాజ్యశ్రీ అనేక రచనలు చేశారని, ఆమె రచనల్లో వాస్తవిక సంఘటనలు కనిపిస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య, శ్రీ త్యాగరాయగాన సభ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కళాసుబ్బారావు కళావేదికలో ప్రముఖ రచయిత్రి, కవయిత్రి, ఆధ్యాత్మికవేత్త కేతవరపు రాజ్యశ్రీ రచనలపై సమాలోచన సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నేటి నిజం వారపత్రిక సంపాదకులు బైసదేవదాసు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ఉన్న అన్ని ప్రక్రియలలో రాజ్యశ్రీ రచనలు చేశారని అన్నారు. రెక్కలు, నానీలు ఈ సాహితీ ప్రక్రియలలో ఆమె అనేక కవితలు రాశారని ఆయన పేర్కొన్నారు. రాజ్యశ్రీలో పుష్కలమైన భావావేశం, భావనా పటిమ, భావావిష్కరణ సామర్థ్యం, సాను భూతితో కూడిన సామాజికావగాహన, శబ్ద ప్రయోగం పట్ల శ్రద్ధ ఉందని దేవదాసు అన్నారు. ఆమె కవితలు ఆలోచనాత్మకంగా ఉంటాయని, ఆయన పేర్కొన్నారు. ఆమె మరపురాని సత్యాలే కవితా ప్రపంచమని, ఆ ప్రపంచంలో రాజ్యశ్రీర ధన్యజీవి అని దేవదాసు కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ రాజ్యశ్రీ కవితలు, కథలు చదువుతుంటే అన్ని సావనాజిరాంశాల మీద అభిప్రాయాన్ని సూటిగా అర్థం చేసుకోగలమని అన్నారు. వచన కవితలు, మినీ కవితలతో పాటు రాజ్యశ్రీ పలు కథలు కూడా రాశారని సుబ్బారావు అన్నారు. ప్రముఖ కవి డాక్టర్ పోచుకాచి మాట్లాడుతూ రాజ్యశ్రీర ఇప్పటి వరకు ఎనిమిది కవితా సంపుటాలు వెలుగులోకి తీసుకొచ్చారని అన్నారు. గృహహింస చట్టం తీసుకొని పుస్తకంగా ఆమె రాశారని, పర్యావరణ పరిరక్షణ మీద కూడా ఆమె పుస్తకం రాశారని ఆయన పేర్కొన్నారు. నిర్వాహక సంస్థ పక్షాన రచయిత్రి రాజ్యశ్రీని అతిథులు సత్కరించారు. రాజ్యశ్రీ తాను రాసిన రచనలు గురించి మాట్లాడారు. కళాదీక్షితులు, రచయిత్రి శైలజా మిత్ర, రచయిత్రులు మౌనశ్రీ మల్లిక్, పెద్దూరి వెంకటదాసు వీరంతా రాజ్యశ్రీ రచనలు గురించి సోదాహరణ ప్రసంగాలు చేశారు. సంస్థ అధ్యక్షుడు కవిభూషణ్ లంకా వెంకట సుబ్రహ్మణ్యం, కార్యదర్శి భాను, సమన్వయకర్త విజయకుమార్ సభలో పాల్గొన్నారు.





## ఉద్యోగ పర్వంలో వినూత్న 'చేతన'

నేడు చేతన...

## 'గుండెచప్పుళ్లు' గ్రంథావిష్కరణోత్సవం





రచయిత్రి రాజ్యశ్రీ

హైదరాబాద్, మేజర్‌న్యూస్ సిటీబ్యూరో: సచివాలయంలోని ఉద్యోగుల సాహితీ, సాంస్కృతిక ప్రోత్సాహక సంస్థ అయిన చేతన

## ప్రేమకు ప్రతీక మాతృమూర్తి

'ఆంధ్రప్రభ' దినపత్రిక సంపాదకుడు పి.విజయబాబు





## 'కేతవరపు రాజ్యశ్రీ గొప్ప సాహితీవేత్త'



కేతవరపు రాజ్యశ్రీని సన్మానిస్తున్న పోతుకూచి, బైసదేవదాసు తదితరులు

చిక్కడపల్లి, మార్చి 6 (ఆన్‌లైన్): కేతవరపు రాజ్యశ్రీ గొప్ప సాహితీవేత్త అని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ పోతుకూచి సాంబశివరావు అన్నారు. శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య, త్యాగరాయగానసభ సంయుక్త ఆధ్వర్యంలో కేతవరపు రాజ్యశ్రీ రచనల సమాలోచన సభ మంగళవారం రాత్రి కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పోతుకూచి మాట్లాడుతూ రచయిత్రిగా, కవయిత్రిగా సాహితీ క్షేత్రంలోని అన్ని ప్రక్రియలను స్పృశించి సాహితీ మూర్తిగా ఎదిగిన రాజ్యశ్రీ మరిన్ని ఆధ్యాత్మిక రచనలు చేయాలని అభిలషించారు. కార్యక్రమంలో నేటి నిజం సంపాదకులు బైస దేవదాసు, సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, గానసభ అధ్యక్షుడు కళాదీక్షితులు, సాహితీ వేత్తలు శైలజా మిత్ర, మౌనశ్రీ మల్లిక్, పెద్దూరి వెంకటదాసు, భాను, లంకా వెంకటసుబ్రమణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యశ్రీని ఘనంగా సన్మానించారు.

# రాజ్యశ్రీ 'వెన్నెల మెట్లు' సంపుటి ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి, తదితరులు

**వివేక్‌నగర్, న్యూస్‌టుడే:** కేతవరపు రాజ్యశ్రీ గృహిణిగా, ప్రభుత్వ ఉన్నతాధికారిగా, కవయిత్రి-రచయిత్రిగా, సచివాలయం సారస్వత వేదిక- 'చేతన' తదితర సంస్థల క్రియాశీలక కార్యవర్గ సభ్యురాలుగా బహుబాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తోన్న విశిష్ట వ్యక్తని రెవెన్యూ (దేవాదాయ) శాఖ ముఖ్య కార్యదర్శి డా. కె.వి.రమణ ప్రశంసించారు. 'రెక్కలు' వచన కవితా ప్రక్రియలో రాజ్యశ్రీ రాసిన కవితల సంపుటి 'వెన్నెల మెట్లు' ఆవిష్కరణ, అంకిత ... భావాలను పదాడంబరం, సంక్షిప్తతల వంటివి లేకుండా అందంగా అందించా ... సహ అతిథి 'రెక్కలు' కవితా ప్రక్రియ రూపశిల్పి, ప్రఖ్యాత కవి ఎం.కె.సుగమ్ ...

# అక్షర నికేతనం – కేతవరపు రాజ్యశ్రీ 'అక్షర కేతనం'

"అక్షరంబువలయు కుక్షి జీవనులకు/ నక్షరంబు జిహ్వ కిక్షురసము/ అక్షరంబు తన్ను రక్షించుగావున/ నక్షరంబు లోకరక్షితంబు"

సృష్టిలోని సమస్త ప్రాణి కోటి నుండి, మనిషిని వేరు చేసేదీ, ఆలోచనా పరుడిగా మార్చేదీ, మేధావిగా నిలబెట్టేదీ జ్ఞాన పూరితమైన అక్షరమే. మానవ జాతి చారిత్రక పరిణామంలో మనిషికి ఉన్నత సంస్కృతిని, ఉత్కృష్ట నాగరికతని నేర్పిందీ అక్షరమే. అక్షరం మనిషిని మనీషిని చేసి మహా మనిషిగా మార్చే మంత్రదండం. మనిషిలోని ... అభివందనీయం, అభినందనీయం. ఇంకా అక్షరాన్ని నానా రకాల వర్ణించారు కవయిత్రి.

'అక్షరం అమ్మలా ప్రేమిస్తుంది. నాన్నలా వ్యక్తిత్వాన్నిస్తుంది. అక్షరం వినమ్రత నేర్పిస్తుంది, తలెత్తుకు బ్రతకడమూ నేర్పిస్తుంది. మనసు గాయానికి పైపూత, అక్షరమిచ్చే చేయూత. మనసులోని దిగుళ్ళకి ఓదార్పు మంత్రాలు అక్షరాలు. నా అన్నవాళ్ళందరూ వదిలేసినా, మిత్రుడిలా ఓదారుస్తుంది అక్షరం' అని కవయిత్రి క్షరం కాని అక్షరానికి అక్షర ...

# 'నీలోకి నువ్వు' ఆధ్యాత్మిక ప్రసంగం

శ్రీత్యాగరాయగానసభ, మేజర్‌న్యూస్ : శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య, అశోక్ నగర్ సాంస్కృతిక సంక్షేమ సంఘంల సంయుక్త ఆధ్వర్యంలో అశోక్‌నగర్ పార్కు సంక్షేమ సంఘం భవనంలో ప్రముఖ రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ 'నీలోకి నువ్వు' అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేసి ఆహూతులకు ఆధ్యాత్మిక సౌరభాలను పంచారు. జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఛైర్మన్ జి. వెంకటరెడ్డి, అశోక్‌నగర్ సాంస్కృతిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు సి.జె. శాస్త్రిలు అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా, కీలక ప్రసంగ కర్తగా రాజ్యలక్ష్మి మనిషి తనసులాను పరిశీలించుకోవాలని, మన తప్పులను మనం ఒప్పుకోవాలని, పవిత్రమైన జీవితం గడుపుతూ సామాజిక సేవస్తూ మానవ సేవే మాధవ సేవగా భావించాలని, సమాజంలో ప్రజ్వరిల్లుతున్న వివిధ రకాల కాలుష్యవాతావరణంలో చిన్నారులను రక్షించేది కేవలం ఆధ్యాత్మిక చింతనే అని అన్నారు. సంస్థ కార్యదర్శి సభకు స్వాగతం పలుకగా, అధ్యక్షులు లంకా వెంకట సుబ్రహ్మణ్యం కార్యక్రమ సారథిగా నిలచారు. ఈ సందర్భంగా ప్రసంగకర్తకు ఆత్మీయ సత్కారం జరిపారు.



ప్రసంగ కర్త రాజ్యశ్రీని సత్కరిస్తున్న దృశ్యం

# విశిష్ట ప్రయోగం గీతామృతం



గీతామృతం సంపుటిని ఆవిష్కరిస్తున్న దృశ్యం

**కల్చరల్‌రిపోర్టర్ :** ఆంధ్ర, ఆంగ్ల భాషల్లో ఒకే సంపుటి గీతార్ధసారాన్ని గీతామృతంగా చిన్నిచిన్ని కవితల్లో రచించి విశిష్ట ప్రయోగం చేశారని ప్రముఖ సాహితీ పండితుడు ఆచార్య తిరుమల శ్రీనివాసాచార్య ప్రశంసించారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సోమవారం మానస ఆర్ట్స్ థియేటర్స్ ప్రముఖ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో కేతవరపు రాజ్యశ్రీ రచించిన గీతామృతం ఆంధ్ర అంగ్ల కవితా సంపుటి ఆవిష్కరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాసా చార్యులు సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. తెలుగులో భగవద్గీతపై వ్యాఖ్యానాలు రచన శైలిలో గతంలో ఎన్నో వచ్చాయన్నారు. కవితా రూపంలో రాజ్యశ్రీ శ్లోకాలను అనువదించటం విశేషమన్నారు. అధ్యక్షతవహించిన సాహితీవేత్త డాక్టర్ ఎం.సులోచన మాట్లాడుతూ రాజ్యశ్రీకి తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం ఉందన్నారు. సులభ శైలిల్లో భాషా పదాలను ఉపయోగించారని ఆయన వివరించారు. కవి ఎంకె.సుగమ్ బాబు గ్రంథాన్ని సమీక్షించారు. వేదికపై గీతా మృతం ఆంధ్ర అంగ్ల సంపుటిని లాంఛనంగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణ రచయిత్రి రాజ్యశ్రీ అంకితమిచ్చారు. రఘుశ్రీ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

## సచివాలయంలో పదవీ విరమణ సందర్భంగా హితుల–స్నేహితుల వీడ్కోలు













## సచివాలయ ఉద్యోగినీ సంక్షేమ సంఘ వ్యవస్థాపక కార్యవర్గ సభ్యులతో

